
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 173
శుక్రవారం 8-3-2024
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'


కోటప్పకొండ సర్వం సిద్ధం
శివరాత్రి సందర్భంగా తిరునాళ్లకు లక్షలాదిగా తరలిరానున్న భక్తులు -14లో


ప్రతి రంగంలో ప్రతిభ
మహిళా దినోత్సవ సందర్భంగా ప్రత్యేక కథనం - 11లో


370 రద్దుతో ప్రజలకు స్వేచ్ఛ
ఆర్టికల్ 370 రద్దు తర్వాత అభివృద్ధిలో జమ్మూకశ్మీర్ నూతన శిఖరాలకు చేరుకుంటోందని ప్రధాని మోదీ అన్నారు.
వివరాలు 6లో ▸


30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిస్తాం
తాము అధికారంలోకి వస్తే కేంద్రంలో ఖాళీగా ఉన్న 30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ నేత రాహుల్ చెప్పారు.
వివరాలు 6లో ▸



బీజేపీలో చేరిన గంగోపాధ్యాయ్
కలకత్తా హైకోర్టు జడ్జి పదవికి రాజీనామా చేసిన జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ్ గురువారం కాషాయ కండువా కప్పుకున్నారు.
వివరాలు 6లో ▸


ప్రగతి దిశగా బాలికా చదువు
వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే బాలికల సంఖ్య భారీగా పెరిగింది.
వివరాలు 5లో ▸


పొత్తుపై నేడు స్పష్టత!
- అమిత్ షా, నడ్డాలతో చంద్రబాబు, పవన్ భేటీ
- తామడిగిన సీట్లు ఇవ్వాల్సిందేనన్న బీజేపీ అగ్రనేతలు
- ఏ షరతులైనా అంగీకరించి పొత్తు ఖరారుకు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రయత్నం
- 8–10 లోక్‌సభ, 15–20 అసెంబ్లీ స్థానాలు ఇస్తేనే పొత్తుకు సై
- త్వరలోనే ఏపీ అభ్యర్థుల జాబితాకు బీజేపీ ఆమోదం

10లో

వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం పార్లమెంట్ సమన్వయకర్తగా సింహాద్రి చంద్రశేఖర్
10లో


అనకాపల్లి జిల్లా పిసినికాడలో నిర్వహించిన 'వైఎస్సార్ చేయూత' సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

'చేయూత' పండుగ
మహిళా దినోత్సవ వేళ అక్కచెల్లెమ్మలకు సాయాన్ని అందించడం ఎంతో సంతోషాన్నిస్తోంది: అనకాపల్లి సభలో సీఎం వైఎస్ జగన్

- నాడు 18.36% ఎన్‌పీఏలతో ఛిన్నాభిన్నమైన పొదుపు సంఘాలకు మనం ఊపిరి పోశాం
- నేడు 99.83 శాతం రికవరీతో మన సంఘాలు దేశంలోనే నంబర్ 1
- చంద్రబాబు, దత్తపుత్రుడు మేనిఫెస్టోతో మరోసారి మోసాలకు తయారు
- 2014లో 8 హామీలిచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చకుండా దారుణంగా మోసగించారు
- ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ తెస్తామంటూ.. కాల్‌మనీ, సెక్స్ రాకెట్స్ తెచ్చారు
- వారి పేరు చెబితే మోసాలు.. మన ప్రభుత్వాన్ని తలచుకుంటే సంక్షేమం గుర్తొస్తాయి
- నాడు – నేడు పాలనలో వ్యత్యాసానికి పదేళ్ల మీ బ్యాంక్ స్టేట్‌మెంట్లే తిరుగులేని సాక్ష్యం
- వైఎస్సార్ చేయూతతో 26,98,931 మంది లబ్ధిదారులకు రూ.5,060.49 కోట్లు సాయం
- మాట నిలబెట్టుకుంటూ నాలుగో విడత సాయాన్ని జమ చేసిన సీఎం వైఎస్ జగన్
- 14 రోజుల పాటు పండుగ వాతావరణంలో 'చేయూత' కార్యక్రమాలు

2లో



4 రోజుల్లో 850 ఎకరాలా!
ఐఎంజీ భారత్‌తో ఒప్పందంపై సీబీఐ విచారణ జరిపిస్తారా? మమ్మల్నే ఆదేశించమంటారా?



- తెలంగాణ సర్కార్‌కు ఆ రాష్ట్ర హైకోర్టు ప్రశ్న.. వారం గడువు
- 2003 నాటి చంద్రబాబు ప్రభుత్వాన్ని తప్పుబట్టిన కోర్టు
- ఆపద్ధర్మ ప్రభుత్వంలో 400 ఎకరాలకు సేల్ డీడ్ చేస్తారా?
- ఖరీదైన ప్రాంతంలో వేల కోట్ల విలువైన భూములను కారు చౌకగా ధారాదత్తం చేస్తారా?
- గతంలో ఏ కంపెనీకీ 4 రోజుల్లోనే వందల ఎకరాలు అప్పగించినట్టుగా, ఖర్చులు, బిల్లుల మాఫీకి అంగీకరించినట్టుగా చూడలేదు
- అసలు ఐఎంజీ భారత్‌కు ఏ అంతర్జాతీయ కంపెనీతో సంబంధాలు లేవు
- ఆ కంపెనీకి గతంలో క్రీడా రంగంలో అనుభవం లేదు
- ప్రజా ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకునే వైఎస్ ప్రభుత్వం ఆ భూములు వెనక్కి తీసుకుంటూ చట్టం చేసింది
- పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదు..ఆ ఒప్పందాన్ని ఏ రకంగానూ సమర్థించలేం
- 18 ఏళ్ల సుదీర్ఘ విచారణ తర్వాత చీఫ్ జస్టిస్‌తో కూడిన ధర్మాసనం తీర్పు
- ఐఎంజీ భారత్ పిటిషన్ కొట్టివేత

12లో

ముద్రగడతో వైఎస్సార్‌సీపీ నేతల భేటీ
10లో
పార్టీలోకి సాదరంగా ఆహ్వానించాం: ఎంపీ మిథున్‌రెడ్డి
ముద్రగడకు సీఎం జగన్ సముచిత స్థానం కల్పిస్తారు


అగ్రిగోల్డ్ బూచి... ప్రత్తిపాటి భూముల లాలూచీ
14లో
సెటిల్‌మెంట్ కింద 6.19 ఎకరాలు హస్తగతం
ఆ భూముల అటాచ్‌మెంట్‌కు ప్రభుత్వ నిర్ణయం
సీఐడీకి అనుమతినిచ్చిన హోం శాఖ

అడ్డగోలు అప్పులు దాచేసి ముష్టి లెక్కలు!
- అమరావతి బాండ్లంటూ చంద్రబాబు అలవోకగా చేసిన అప్పు రూ.5,000 కోట్లు
- ఆ బాబు చేసిన అప్పు రూ.ఐదు వేల కోట్లైతే వడ్డీలకే రూ.4,900 కోట్లు కట్టాలి
- ఇప్పటిదాకా కట్టిన వడ్డీలు రూ.1,400 కోట్లు.. తప్పనిసరి గుదిబండపై 'కాగ్' ఆందోళన
- ఇప్పుడు పరిమితంగానే అప్పులు.. మానవ వనరులపై పెట్టుబడికి ప్రాధాన్యం
- విద్య, వైద్యం, పారిశ్రామిక పురోగతిపై నిధులను వెచ్చిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఏపీ అప్పులు అట్టడుగునే ఉన్నాయని పలు దఫాలు ప్రకటించిన కేంద్రం, ఆర్బీఐ


ఫ్యాక్ట్ చెక్

- రామోజీ సొంత లెక్కలతో రాష్ట్ర ప్రభుత్వంపై పదేపదే దుష్ప్రచారం
- కేంద్రం, ఆర్బీఐ, కాగ్ గణాంకాలు, వివరణలు తనకు పట్టవంటూ లెక్కలేనితనం

14లో


ప్రాణాలతో బయటపడడం అద్భుతమే
- జైలులో దుర్భర జీవితం అనుభవించా.. తప్పుడు కేసులో ఇరికించి అరెస్టు చేశారు
- ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా ఆవేదన.. నాగపూర్ సెంట్రల్ జైలు నుంచి విడుదల

6లో

'వెలిగొండ'ంత అక్కసు
- నీ బాబువల్ల కానిది జగన్ చేశాడనేగా నీ ఏడుపు రామోజీ?
- వెలిగొండ ప్రాజెక్టుకు వ్యయం చేసిన నిధులను మింగేసిన చంద్రబాబు
- పనులు చేయకుండానే కాంట్రాక్టర్లకు రూ.630.57 కోట్లు చంద్రబాబు దోచిపెట్టారని తేల్చిన కాగ్
- కానీ, ప్రతి పైసాను సద్వినియోగం చేసుకుని సొరంగాలను పూర్తిచేసిన సీఎం వైఎస్ జగన్



- వాటిని జాతికి అంకితం చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్న రామోజీ
- ఆయకట్టుకు నీళ్లిచ్చే ఆస్కారమేలేదంటూ విషం చిమ్మిన ఈనాడు

ఫ్యాక్ట్‌చెక్
10లో

కుల్దీప్ ఫటాఫట్.. ఓపెనింగ్ ధనాధన్!
ఐదో టెస్టులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 218 పరుగులకే కుప్పకూలింది. కుల్దీప్ యాదవ్ ఐదు వికెట్లు తీయగా.. అశ్విన్‌కు 4 వికెట్లు దక్కాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఒక వికెట్ నష్టానికి 135 పరుగులు చేసింది.
13లో

చెప్పారు.. చేసిచూపించారు..


- కాంట్రాక్టు ఉద్యోగుల కలను సాకారం చేసిన సీఎం జగన్.. వీరి సర్వీసును క్రమబద్ధీకరిస్తామని 2019 ఎన్నికల సమయంలో హామీ
- ఇచ్చిన హామీని నెరవేరుస్తూ క్రమబద్ధీకరణకు శ్రీకారం.. వైద్యశాఖలో 1,924 మందిని రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు జారీ
- కాంట్రాక్టు ఉద్యోగుల ఎన్నో ఏళ్ల కలను నెరవేర్చారన్న సచివాలయ ఉద్యోగుల సంఘం

2లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

స్వయం ఉపాధికి ఊతం



ఉండటానికి సొంత ఇల్లు తప్ప మాకు ఆస్తి, పాస్తులు అంటూ పెద్దగా ఏమీ లేవు. సామాన్య మధ్యతరగతి కుటుంబం మాది. మా ఆయన బతుకు తెరువుకోసం వేరే ప్రాంతానికి వలస వెళ్లి అక్కడ రోజువారీ కూలి పనులు చేస్తూ తద్వారా సంపాదించిన డబ్బుల్ని మాకు పంపించేవారు. దానికి తోడు శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం కేశపురం గ్రామంలో నేను టైలరింగ్ చేస్తూ ఆ వచ్చే ఆదాయంతో ఇద్దరు పిల్లలను పెంచి పెద్దచేశాను. దినదినగండంగానే మా బతుకు సాగింది. కుమార్తెకు పెళ్లి చేసి పంపించేయగా... కొడుకు చదువుకుంటున్నాడు. ఏదైనా సొంతంగా వ్యాపారం చేసుకోవాలని భావించినా మాకు ఏ ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందేది కాదు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత బ్యాంకు ద్వారా లక్ష రూపాయలు రుణం, స్త్రీనిధి నుంచి మరోలక్షరూపాయలు తీసుకుని కుట్టుమెషీన్ కొనుగోలు చేసి, ఇంట్లో రెడీమేడ్ దుస్తులు తెచ్చి వ్యాపారం మొదలు పెట్టాను. మహిళలకు అవసరమైన అలంకరణ వస్తువులు అమ్మకం చేపట్టాను. ప్రస్తుతం వ్యాపారం, ఆదాయం బాగుంది. నాకు వైఎస్సార్ ఆసరా ద్వారా పదివేలు చేతికందింది. జగనన్న చేదోడు పథకం ద్వారా ఏటా పది వేల రూపాయల వంతున అందుతోంది. మా అబ్బాయికి విద్యా దీవెన కూడా అందింది. మా కుటుంబం నిలదొక్కుకునేందుకు తోడ్పడిన ముఖ్యమంత్రి జగన్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– తెలుకల మంజుల, కేశపురం
(మద్దిలి కేశవరావు, విలేకరి, ఇచ్ఛాపురం రూరల్)

మెరుగుపడిన బతుకులు



మాది పేద కుటుంబం. నాకు ఇద్దరు ఆడబిడ్డలు. మా మావయ్య వెంకట్రావు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం యాళ్లవానగరువులో మాతోనే ఉంటారు. నా భర్త వరప్రసాద్ ప్రైవేట్ స్కూల్ డ్రైవర్. చాలీ చాలని జీతంతో ఇద్దరు పిల్లలతో జీవనం సాగించడం కష్టంగా ఉండేది. పాఠశాలలు ప్రారంభిస్తే నోటుపుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, ఇతర ఖర్చుల కోసం నా భర్త జేబు చూసుకునేవారు. వారం వారం కట్టుబడి కింద చీటీలు తీసుకునేవారం. జగనన్న నవరత్నాల పథకాలు అమలు చేసిన తరువాత మాకు ఆర్థిక భరోసా లభించింది. ఇప్పుడు నా ఆడబిడ్డ ప్రణతి యాళ్లవానిగరువు ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. అమ్మ ఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు వస్తున్నాయి. నాకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఏడాదికి రూ.12వేలు చొప్పున, సున్నా వడ్డీ పథకం ద్వారా మరో రూ.3వేలు అందుతున్నాయి. మా మావయ్య వెంకట్రావుకు వైఎస్సార్ పింఛన్ కానుక అందుతోంది. ఇప్పుడు మా బతుకులు బాగుపడ్డాయి. జగనన్న ఓ అన్నలా నా కుటుంబాన్ని ఆదుకున్నారు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– గోగి బుజ్జి, యాళ్లవానిగరువు
(కొంతేటి శాంతారావు, విలేకరి పాలకొల్లు అర్బన్)

ఇటు జగనైతే అటూ జగనే: మంత్రి గుడివాడ



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: సీఎం జగన్‌ను ఎదుర్కోవాలంటే ఎదురుగా కూడా జగనే ఉండాలని పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు. ఆయన గుంపును చూసి భయపడే రకం కాదని, భయం అనేది ఆ రక్తంలోనే లేదన్నారు. గురువారం అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడలో నిర్వహించిన వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అక్కచెల్లెమ్మలకు రూ.2,77,000 కోట్లకు పైగా నేరుగా లబ్ధి చేకూర్చిన నాయకుడు ప్రపంచంలో బహుశా ఇంకెవరూ ఉండరన్నారు. అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్తగా భరత్‌ను నియమించడంపై స్పందిస్తూ అందరి తలరాతలు భగవంతుడు రాస్తే తన తలరాత జగన్ రాస్తారని చెప్పారు.

ఆరు పథకాలు అందుకున్నా..



నవరత్నాల పథకాల్లో ఆరు పథకాలతో లబ్ధి పొందా. వైఎస్సార్ చేయూత సాయం, లోన్‌తో జీడితోట కౌలుకు తీసుకున్నా. రెండో విడత డబ్బుతో పాడిగేదెలు కొనుక్కున్నా. మూడో విడత డబ్బుతో రేకుల షెడ్డు నిర్మించుకున్నా. వైఎస్ఆర్ ఆసరా కూడా వచ్చింది. నా కోడలికి ఇల్లు మంజూరు అయింది. నేను 4 సెంట్ల భూమి కొనుక్కున్నా. గతంలో చీపురు పుల్లలు కోసుకొచ్చి జీవనం గడిపిన నాకు పలు పథకాలు అందాయి. కాలు విరిగితే ఆరోగ్యశ్రీలో చికిత్స ఉచితంగా పొందా.

– రమణమ్మ, లబ్ధిదారు, రామచంద్రపాలెం, కోటవురుట్ల మండలం, అనకాపల్లి జిల్లా

కుటుంబానికి అన్నీ ఇస్తున్నారు..



ఆవులు కొనుగోలు చేసి నెలకు రూ. 20 వేలు సంపాదిస్తున్నా. ఆసరా కింద రూ.62 వేలు రావడంతో కుట్టు మిషన్ కొనుక్కుని మరింత ఆదాయం పొందుతున్నా. సేంద్రీయ కూరగాయలు పండించుకుంటూ ఎకరా వరి సాగు చేస్తున్నా. ఏడాదికి రూ. లక్ష ఆదాయం వచ్చింది. వ్యవసాయానికి పెట్టుబడి మీరే ఇస్తున్నారు. రైతుభరోసా అందుతోంది. నాకు మొత్తం రూ.1,90,000 వచ్చాయి. మా అమ్మకు ఫింఛన్ ఇస్తున్నారు. మా కుటుంబానికి అవసరమైన ప్రతిదీ అందిస్తున్నారు.

– వెంకటలక్ష్మి, లబ్ధిదారు, గండివరం, చీడికాడ మండలం, అనకాపల్లి జిల్లా.



అనకాపల్లి జిల్లా పిసినికాడలో జరిగిన సభలో మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు

చేయూత పండుగ

మహిళా దినోత్సవ వేళ అక్కచెల్లెమ్మలకు సాయాన్ని అందించడం ఎంతో సంతోషాన్నిస్తోంది: అనకాపల్లి సభలో సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అక్కచెల్లెమ్మల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా మనందరి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, మహిళా దినోత్సవం ముందు రోజు 'వైఎస్సార్ చేయూత' ద్వారా ఆర్థిక సాయం అందించడం ఎంతో సంతోషం కలిగిస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. మహిళా సాధికారత పట్ల ఇంత చిత్తశుద్ధి చూపిన ప్రభుత్వం దేశ చరిత్రలోనే మరొకటి లేదన్నారు. 45 – 60 ఏళ్ల వయసున్న మహిళలకు నాలుగో విడత ఆర్థిక సాయం అందించే వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన అనకాపల్లి జిల్లాలోనే నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ఆర్థిక సాయంతో ఎదిగిన మహిళలంతా తమ విజయగాథలను వివరిస్తూ రానున్న 14 రోజుల పాటు సచివాలయాలవారీగా కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు – దత్తపుత్రుడు గతంలో మేనిఫెస్టోలో అక్కాచెల్లెమ్మలకు ఇచ్చిన ఏ వాగ్దానాన్నీ అమలు చేయలేదని మండిపడ్డారు. వారి పేరు చెబితే 8 రకాల మోసాలు, దగా గుర్తురాగా మన ప్రభుత్వం పేరు చెబితే సంక్షేమం గుర్తుకొస్తుందన్నారు. చంద్రబాబును చూస్తే విశ్వసనీయతలేమి గుర్తుకొస్తుందని, దత్తపుత్రుడి పేరు చెబితే వివాహ వ్యవస్థకే కళంకం తెచ్చేలా కార్లను మార్చినట్లు భార్యలను మార్చే వ్యవహారం గుర్తుకొస్తుందని విమర్శించారు. వారిని నమ్మితే కాటేసే పాముని నమ్మినట్టేనని, తినేసే పులిని ఇంటిని తెచ్చుకోవడమేనని హెచ్చరించారు. ప్రతి ఇంటికీ మేలు చేసిన మీ బిడ్డకు మీరే స్టార్ క్యాంపైనర్లుగా నిలిచి మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ చేయూత నాలుగో విడత కింద రాష్ట్రవ్యాప్తంగా 26,98,931 మంది అక్కచెల్లెమ్మలకు రూ.5,060.49 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించే కార్యక్రమాన్ని గురువారం అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడలో సీఎం జగన్ ప్రారంభించారు. ఆయన ఏమన్నారంటే..

14 రోజులు పండుగ వాతావరణంలో..

మహిళా సాధికారతకు గుర్తుగా రాష్ట్రవ్యాప్తంగా 14 రోజుల పాటు పండగ వాతావరణంలో నిర్వహించే వైఎస్సార్ చేయూతలో ప్రజా ప్రతినిధులందరూ పాలుపంచుకుంటారు. అక్కచెల్లెమ్మలకు జరిగిన మంచి, వారి జీవితాలు ఎలా బాగుపడ్డాయి? అనే స్ఫూర్తిదాయక కథనాలను ప్రతి సచివాలయం, ప్రతి మండలంలో చర్చించుకునేలా తెలియచేయాలని ప్రతి అక్కనూ, చెల్లెమ్మనూ కోరుతున్నా. 45 ఏళ్లు పైబడిన అక్కచెల్లెమ్మలు ఎలా బతుకుతున్నారు? వారికి తోడుగా ఉండేందుకు ఏం చేస్తే బాగుంటుందనే ఆలోచనను గత ప్రభుత్వాలు చేయలేదు.



వైఎస్సార్ చేయూత చెక్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

మాట ఇచ్చిన చోటే...

అత్యంత బాధ్యతగా వ్యవహరించే 45 – 60 ఏళ్ల వయసు అక్క చెల్లెమ్మల చేతిలో డబ్బులు పెడితే వారే కాకుండా ఆ కుటుంబాలన్నీ బాగుపడతాయని మనస్ఫూర్తిగా ఆలోచన చేశాం. క్రమం తప్పకుండా ఏటా రూ.18,750 చొప్పున వారి చేతిలో పెట్టి జీవనోపాధి మార్గాలు చూపిస్తూ ముందుకు సాగుతున్నాం. చేయూత ద్వారా మొత్తం రూ.75 వేలు ఆర్థిక సహాయం చేస్తానని ఇదే జిల్లాలోని మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడులో నాడు చెప్పా. ఆ మాటను నిలబెట్టుకుంటూ ఇవాళ్టితో నాలుగు విడతల్లో రూ.75 వేలు అందిస్తూ ఇదే అనకాపల్లి జిల్లాలో కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉంది.

ఇంటిని నిలబెడుతూ..

ప్రతి అక్కచెల్లెమ్మ సొంత కాళ్లపై నిలబడేలా క్రమం తప్పకుండా చేయూత సాయంతోపాటు బ్యాంకు రుణాలు ఇప్పిస్తూ అమూల్, ఐటీసీ, పీ అండ్ జీ, రిలయన్స్, హిందుస్తాన్ లీవర్ తదితర కంపెనీలతో అనుసంధానించి తోడ్పాటునిస్తున్నాం. ప్రభుత్వం ఏటా రూ.18,500 చొప్పున ఇస్తోంది కాబట్టి కంపెనీలు, బ్యాంకులు కూడా వారికి అండదండలు అందించాయి. 1.69 లక్షల మంది అక్కచెల్లెమ్మలు కిరాణా షాపులు నిర్వహిస్తుండగా 85,630 మంది వస్త్ర వ్యాపారాలు చేస్తున్నారు. 3,80,466 మంది గేదెలు, ఆవులు కొనుగోలు చేశారు. 1,34,514 మంది మేకలు కొనుగోలు చేశారు. 88,923 మంది ఆహార ఉత్పత్తులకు సంబంధించిన వ్యాపారం చేస్తుండగా మరో 3,98,422 మంది వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారాల్లో ఉన్నారు. ఇంకో 2,59,997 మంది రకరకాల వ్యాపారాలతో సొంత కాళ్లపై నిలబడ్డారు. 16,55,991 మంది అక్క చెల్లెమ్మలు ఏదో ఒక వ్యాపారం చేస్తూ నెలకు కనీసం రూ.6 వేల నుంచి రూ.10 వేలు సంపాదించుకుంటూ కుటుంబానికి తోడుగా ఉంటున్నారు.

నాలుగు విడతల్లో రూ.19,189 కోట్లు..

ఒక్క వైఎస్సార్ చేయూత పథకం ద్వారానే 58 నెలల వ్యవధిలో 33,14,916 మంది అక్కచెల్లెమ్మలకు రూ.19,189 కోట్లు నేరుగా వారి ఖాతాల్లోకి పంపించాం. ఎక్కడా లంచాలు, వివక్ష లేదు. వారికి ఒక మంచి తమ్ముడిగా, అన్నగా ఇంత గొప్ప అవకాశం ఇచ్చిన దేవుడికి రుణపడి ఉంటా. నవరత్నాల పథకాల ద్వారా మరో రూ.29,588 వేల కోట్ల మేర లబ్ధి పొందారు. ఇదే 33 లక్షల మంది అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాలను చూస్తే మరో రూ.56,188 కోట్ల మేర కూడా మంచి జరిగింది. మహిళా పక్షపాత ప్రభుత్వంగా నా అక్కచెల్లెమ్మలు సంతోషంగా ఉండాలని, విద్య, ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారతతో గొప్పగా ఎదగాలని ప్రతి అడుగూ ముందుకు వేశాం. గతంలో ఎప్పుడైనా ఇలా మంచి జరిగిందా? అని ప్రతి ఒక్కరూ ఆలోచన చేయమని కోరుతున్నా. నామినేటెడ్ పోస్టులు, కాంట్రాక్టుల్లో 50 శాతం చట్టం చేసి మరీ వారికి రిజర్వేషన్ కల్పించిన తొలి ప్రభుత్వం ఇదే. గత ప్రభుత్వానికి ఇలా మేలు చేసిన చరిత్రే లేదు. అమ్మ ఒడితోపాటు జగనన్న విద్యా దీవెనతో పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ అందిస్తున్నాం. వసతి దీవెన మొదలు కల్యాణమస్తు, షాదీ తోఫా వరకు ప్రతి పథకంలోనూ వారి ఖాతాలకే డబ్బులను జమ చేసి పారదర్శకంగా వ్యవహరిస్తున్నాం.



సీఎం జగన్‌పై పూలవర్షాన్ని కురిపిస్తున్న మహిళలు

నాడు ఛిన్నాభిన్నం.. నేడు నెంబర్ వన్..

వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ ద్వారా పొదుపు సంఘాలకు మనం మళ్లీ ఊపిరి పోశాం. నాడు చంద్రబాబు రుణమాఫీ మోసానికి పొదుపు సంఘాలన్నీ ఏకంగా 18.36 శాతం ఎన్‌పీఏలు, ఔట్ స్టాండింగ్‌లుగా చిన్నాభిన్నమయ్యాయి. ఇవాళ ఎన్‌పీఏలు కేవలం 0.17 శాతం మాత్రమే ఉన్నాయి. ఏకంగా 99.83 శాతం రుణాల రికవరీతో మన పొదుపు సంఘాలు దేశంలోనే నంబర్ 1 స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ చేయూత ద్వారా నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలకు నాలుగేళ్లలో ఏకంగా రూ.19,190 కోట్లు మీ బిడ్డ ప్రభుత్వం అందించింది. కాపు, ఈబీసీ అక్కచెల్లెమ్మలకు ఏటా రూ.15 వేలు చొప్పున ఆర్థిక పటిష్టతకు తోడ్పాటు ఇస్తున్నది కూడా మీ బిడ్డ ప్రభుత్వమే. అక్కచెల్లెమ్మలను మోసం చేసిన చరిత్ర చంద్రబాబుదైతే ప్రతి అడుగులో అండగా నిలిచిన ఘనత మనది. గతానికి, ఇప్పటికి తేడా చూడమని కోరుతున్నా.

మహిళల పేరిట 31 లక్షల ఇళ్ల పట్టాలు..

సొంతిల్లు లేని పేదింటి అక్క చెల్లెమ్మల పేరిట ఏకంగా 31 లక్షల ఇళ్ల స్థలాలు అందచేశాం. అందులో 22 లక్షల ఇళ్లు నిర్మిస్తున్న ప్రభుత్వం కూడా మనదే. ఇది దేశ చరిత్రలో ఎప్పుడూ జరగని విశేషం. చంద్రబాబు ప్రభుత్వంలో కనీసం ఒక్కరికైనా ఒక్క సెంటైనా ఇచ్చారా అంటే ఇచ్చింది సున్నా. తొలిసారిగా అక్కచెల్లెమ్మల రక్షణ కోసం సచివాయాల్లో మహిళా పోలీసును నియమించాం. దిశ యాప్, భద్రత కోసం దిశ పోలీస్ స్టేషన్లు, దిశ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు.. ఇలాంటి వ్యవస్థను తెచ్చింది మీ బిడ్డ ప్రభుత్వమే. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలో ఏకంగా 50 శాతం వరకు మన ఇరుగు పొరుగు చెల్లెమ్మలే సేవలందిస్తున్నారు.

పదేళ్ల బ్యాంక్ స్టేట్‌మెంట్ చూడండి..

చంద్రబాబు పాలనకు మన పాలనకు వ్యత్యాసం కళ్లకు కట్టినట్లు తెలియాలంటే గత పదేళ్లుగా మీ బ్యాంకు స్టేట్‌మెంట్లను తీసుకుని ఒక్కసారి పరిశీలించండి. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో మీ అకౌంటుకు వచ్చింది ఒక్క రూపాయి అయినా కనిపిస్తుందా? అదే మీ బిడ్డ పాలనలో ఎన్ని లక్షలు మీ ఖాతాల్లోకి వచ్చాయో మీరే గమనించండి. లక్షాధికారులైన మహిళల జాబితాలో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో ఉందని ఇటీవల కేంద్రం కూడా చెప్పింది. మేనిఫెస్టోలో హామీలలో 99% అమలు చేసి మరోసారి ఆశీస్సులు కోరుతున్న ప్రభుత్వం మనదే. ఈ 58 నెలల కాలంలో మీ ఇంటికి మంచి జరిగితే మీ బిడ్డకు మీరే స్టార్ క్యాంపెయినర్లుగా ముందుకు రావాలని కోరుతున్నా. చెడిన వ్యవస్థను మార్చడం కోసం మీ బిడ్డ అడుగులు ముందుకు వేస్తూ ప్రయాణం చేస్తున్నాడు. మీ బిడ్డ ఒక్కడే ఆ పని చేయలేదు. దేవుడి దయ, మీ చల్లని ఆశీస్సులు ఉంటేనే సాధ్యం.

బాబు – దత్తపుత్రుడు 8 మోసాలివిగో..

చంద్రబాబు పేరు చెబితే మోసాలు, వంచన, పొదుపు సంఘాలకు చేసిన దగా గుర్తుకొస్తుంది. విశ్వసనీయత లేని మనిషి గుర్తుకొస్తాడు. దత్తపుత్రుడి పేరు చెబితే వివాహ వ్యవస్థకే ఓ కళంకం. ఓ మాయని మచ్చగా గుర్తుకొస్తుంది. కార్లు మార్చినట్లు భార్యలను మార్చేది ఈ విలువలు లేని దత్తపుత్రుడేనని గుర్తుకొస్తుంది. 2014లో చంద్రబాబు – దత్తపుత్రుడు కలసి ఫొటోలు దిగి సంతకాలు పెట్టి మేనిఫెస్టోలో ఏం వాగ్దానాలిచ్చారో ఒకసారి గుర్తు చేసుకుందామా?

- రూ.14,205 కోట్ల పొదుపు సంఘాల రుణాలన్నీ మొదటి సంతకంతోనే రద్దు చేస్తామన్నారు. అక్కచెల్లెమ్మలు బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం అంతా విడిపిస్తామని వాగ్దానాలు చేశారు. అప్పట్లో టీవీల్లో ఒక అడ్వర్టైజ్‌మెంట్ వచ్చేది. ఒక చెయ్యి మెడలో తాళిబొట్టు లాగేది. ఇంకో చేయి వచ్చి పట్టుకుని.. బాబు వస్తున్నాడు, బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపిస్తాడని హామీలు గుప్పించారు.
- ప్రతి ఇంటికీ ఏటా 12 గ్యాస్ సిలిండర్లపై రూ.1,200 సబ్సిడీ, ఐదేళ్లలో రూ.6 వేల సబ్సిడీ ఇస్తామని 2014 మేనిఫెస్టోలో వారిద్దరూ హామీ ఇచ్చారు.
- మహిళల రక్షణ కోసం ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామన్నారు.
- ఆడబిడ్డ పుట్టగానే రూ.25 వేలు డిపాజిట్ చేస్తామని వాగ్దానం చేసి మహాలక్ష్మి అని అమ్మవారి పేరు కూడా పెట్టారు.
- మొదటి సంతకంతో బెల్ట్ షాపులు రద్దు చేస్తామన్నారు.
- పండంటి బిడ్డ అనే పథకం పేరుతో పేద గర్భిణీ స్త్రీలకు రూ.10 వేలు ఇస్తామన్నారు.
- బడికి వెళ్లే ప్రతి ఆడపిల్లలకు సైకిళ్లు, ప్రతి అక్కచెల్లెమ్మకు స్మార్ట్ ఫోన్ ఉచితంగా ఇస్తామన్నారు.
- మహిళా పారిశ్రామికవేత్తల కోసం 'కుటీర లక్ష్మి' అనే వాగ్దానం చేశారు.

కాల్ మనీ సెక్స్ రాకెట్లు..

2014 ఎన్నికల వాగ్దానాల్లో ఒక్కటైనా చంద్రబాబు, దత్తపుత్రుడు అమలు చేశారా? పొదుపు సంఘాల రుణాలు తీర్చకుండా మోసగించారు. అప్పటి దాకా అమల్లో ఉన్న సున్నా వడ్డీ పథకాన్ని సైతం అక్టోబర్ 2016 నుంచి రద్దు చేశారు. అక్క చెల్లెమ్మల బంగారాన్ని బ్యాంకులు వేలం వేస్తుంటే చంద్రబాబు చోద్యం చూశారేగానీ ఆదుకోవాలన్న మనసురాలేదు. గ్యాస్ సిలిండర్ల మీద ఐదేళ్లలో రూ.6 వేలు సబ్సిడీ ఇస్తామని నమ్మించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ సెల్ ఏర్పాటు చేయకపోగా విజయవాడలో కాల్ మనీ సెక్స్ రాకెట్లు నడిపించారు. మీకు తెలిసిన ఏ ఒక్కరికైనా ఆడబిడ్డ పుడితే ఒక్క రూపాయి అయినా డిపాజిట్ చేశారా? అమ్మవారి పేరుతో వాగ్దానాలు చేసి మోసగించి వీరిద్దరూ ఈ రోజు మహాశక్తి అనే కొత్త మోసానికి తెరతీస్తున్నారు. బెల్ట్ షాపులను రద్దు చేయకపోగా ఎక్కడ పడితే అక్కడ ప్రోత్సహించడం మరో మోసం. అవ్వాతాతలకు చివరి 2 నెలలు మాత్రమే పెన్షన్ పెంచడం మరో గజ మోసం. ఎన్నికలు వచ్చినప్పుడే చంద్రబాబుకు బీసీలు గుర్తుకొస్తారు. బాబు, దత్తపుత్రుడు 2014లో బీసీలకు ఏకంగా 143 వాగ్దానాలు చేసి నెరవేర్చింది మాత్రం ఏకంగా పెద్ద సున్నా.

చెప్పారు.. చేసిచూపించారు

సాక్షి, అమరావతి/లబ్బీపేట (విజయవాడ తూర్పు): మరో ఎన్నికల హామీని సీఎం జగన్ నెరవేర్చారు. చంద్రబాబు చేతిలో దగాపడ్డ కాంట్రాక్టు ఉద్యోగుల డిమాండ్‌పట్ల అధికారంలోకి వచ్చాక సానుకూలంగా స్పందిస్తానని ప్రతిపక్ష నేత హోదాలో జగన్ ఇచ్చిన హామీని అమలుచేశారు. ఆ మాటను నెరవేరుస్తూ వారి జీవితాల్లో ప్రభుత్వం వెలుగులు నింపింది. 2014 జూన్ 2 నాటికి నియమితులై ఇప్పటివరకూ కొనసాగుతున్న కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీస్‌ను రెగ్యులరైజేషన్ చేస్తూ గతేడాది ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వైద్య, ఆరోగ్య శాఖలో 1,924 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ గురువారం ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు వేర్వేరుగా రెండు ఉత్తర్వులిచ్చారు. వచ్చే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వీరి క్రమబద్ధీకరణ అమల్లోకి వస్తుందని వాటిల్లో పేర్కొన్నారు. కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాల్లో చేరిన తేదీల ఆధారంగా 'ఇంటర్ సే' సీనియారిటీ వస్తుందన్నారు. ఉద్యోగులు విధుల్లో చేరిన తేదీలు ఒకటే ఉన్నట్లైతే పుట్టిన తేదీల ఆధారంగా సీనియారిటీ వస్తుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులరైజేషన్ జరిగినట్లు భవిష్యత్తులో బయటపడితే నియామకం రద్దవుతుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల కలను సాకారం చేసిన సీఎం జగన్

వీరి సర్వీసును క్రమబద్ధీకరిస్తామని 2019 ఎన్నికల సమయంలో హామీ
ఇచ్చిన హామీని నెరవేరుస్తూ క్రమబద్ధీకరణకు శ్రీకారం
వైద్యశాఖలో 1,924 మందిని రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు జారీ
కాంట్రాక్టు ఉద్యోగుల ఎన్నో ఏళ్ల కలను నెరవేర్చారన్న సచివాలయ ఉద్యోగుల సంఘం

యుద్ధప్రాతిపదికన చర్యలు..

గతేడాది జూన్‌లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కేవలం కేబినెట్‌లో నిర్ణయం తీసుకుని వదిలేయకుండా చిత్తశుద్ధితో ఈ ప్రక్రియను సీఎం జగన్ ప్రభుత్వం అడుగులు ముందుకేసింది. యుద్ధప్రాతిపదికన ఏపీ రెగ్యులరైజేషన్ ఆఫ్ సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్–2023 చట్టాన్ని తీసుకొచ్చింది. నిజానికి.. క్రమబద్ధీకరణ పేరిట గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు కాంట్రాక్టు ఉద్యోగులను దగాచేశారు. సర్వీసు రెగ్యులరైజేషన్ కోసం ముగ్గురు మంత్రుల బృందాన్ని నియమిస్తూ 2014 సెప్టెంబరులో ఉత్తర్వులు జారీ చేసి, 2019 వరకూ ఐదేళ్లపాటు సమావేశాల పేరుతో సాగదీసింది. చివరికి.. సుప్రీంకోర్టు తీర్పును బూచిగా చూపిస్తూ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ సాధ్యం కాదని వెల్లడించింది. అప్పట్లో ప్రతిపక్ష నేత హోదాలో ప్రజాసంకల్పయాత్ర చేస్తున్న వైఎస్ జగన్‌ను కాంట్రాక్టు ఉద్యోగులు కలిసి తమ గోడును చెప్పుకున్నారు. వీరికి చేయూతగా నిలుస్తూ రెగ్యులరైజేషన్ అంశాన్ని 2019 ఎన్నికల మేనిఫెస్టోలో సైతం ఉంచారు. ఎన్నికల అనంతరం.. రెగ్యులరైజేషన్ అంశంలో మానవతా దృక్పథంతో సీఎం జగన్ వ్యవహరించారు. తొలుత 2014కు ముందు ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం ఎక్కువమంది ఉద్యోగులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుండటంతో వీలైనంత ఎక్కువ మందికి మేలుచేస్తూ 2014 జూన్ రెండో తేదీకి ముందు నియమితులై, ప్రస్తుతం కొనసాగుతున్న కాంట్రాక్టు ఉద్యోగులందరికీ లబ్ధిచేకూర్చారు.

ఏపీ ఎన్‌జీఓ సంఘం హర్షం..

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం జీఓ ఇవ్వడంపై ఏపీ ఎన్‌జీఓ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ శివారెడ్డి, సీహెచ్. పురుషోత్తమనాయుడు హర్షం వ్యక్తంచేశారు. శివారెడ్డి మాట్లాడుతూ.. ఇతర శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియను కూడా త్వరగా పూర్తిచేయాలని కోరారు.

ఎన్నో ఏళ్ల కల నెరవేర్చారు..

సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి స్పందిస్తూ.. కాంట్రాక్టు ఉద్యోగుల ఎన్నో ఏళ్ల కలను సీఎం వైఎస్ జగన్ నెరవేర్చారన్నారు. 1,924 మంది ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులివ్వడం హర్షణీయమన్నారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ మొదలైందని, ఈ క్రమంలో ఎన్నికల కోడ్‌తో సంబంధంలేకుండా ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మరోవైపు.. కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్‌కు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య సెక్రటరీ జనరల్ అరవపాల్ కూడా కృతజ్ఞతలు తెలిపారు.

జన్మజన్మలకు రుణం తీర్చుకోలేం



రెగ్యులరైజేషన్‌పై మేనిఫెస్టో ద్వారా 2019 ఎన్నికల్లో సీఎం జగన్ హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేర్చి కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపారు. జన్మజన్మలకు మేం ఆయనకు రుణపడి ఉంటాం. ఆయన చేసిన ఈ మేలును ఎన్నటికీ మరువలేం. గత పాలకులు హామీలిచ్చి మమ్మల్ని మోసంచేస్తే.. ఇచ్చిన మాటపై సీఎం జగన్ నిలబడి మేలుచేశారు.

– కె. రత్నాకర్‌బాబు, ప్రెసిడెంట్ ఏపీ కాంట్రాక్టు ఫార్మాసిస్ట్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్

థ్యాంక్యూ సీఎం



రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరణ ప్రక్రియను కిందటేడాది ప్రారంభించింది. గత పాలకుల మాదిరిగానే సాగదీసి ఎన్నికలకు వెళ్లిపోతారేమో అనుకున్నాను. కానీ, యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. చట్టాన్ని రూపొందించారు. 1,924 మంది ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. ఓ తోబుట్టువుగా సీఎం జగన్ మాకు అండగా నిలిచారు. ఆయన మేలును ఎన్నటికీ మరువలేం. థ్యాంక్యూ సీఎం సర్..

– సుజాత, వైద్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ప్రతినిధి

కాంట్రాక్టు ఉద్యోగుల నిరీక్షణ ఫలించింది



రెగ్యులరైజేషన్ కోసం ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వైద్యశాఖలోని ఉద్యోగుల నిరీక్షణ ఫలించింది. పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల కలను నెరవేర్చిన సీఎంకు రుణపడి ఉంటాం. అందుకు కృషిచేసిన ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి, వైద్య ఆరోగ్యశాఖలోని ఉన్నతాధికారులకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు.

– ఎస్.హేమశిఖరలరెడ్డి, పి.నాగరాజు, ఏపీ గవర్నమెంట్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు

ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి

రాజకీయపార్టీలకు ఎన్నికల సంఘం స్పష్టీకరణ

- షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచే ప్రవర్తన నియమావళి అమలు
- అభ్యర్థులు, ఏజెంట్ల వద్ద రూ.50 వేలకు మించి నగదు ఉండకూడదు
- రూ.10 వేలకు మించి విలువైన వస్తువుల రవాణా నిషిద్ధం
- స్టార్ క్యాంపెయినర్ల దగ్గర రూ. లక్షకు మించి ఉండకూడదు
- లోక్‌సభ అభ్యర్థి గరిష్ట వ్యయం రూ.95 లక్షలు
- శాసన సభ అభ్యర్థి గరిష్ట వ్యయం రూ.40 లక్షలు
- ఎన్నికల వ్యయంపై ప్రత్యేక ఖాతా నిర్వహించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిపై సమగ్ర అవగాహన ఏర్పర్చుకుని, రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల్లో నియమావళిని పాటించాల్సిందేనని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. ఈ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు అనుసరించాల్సిన విధి విధానాలను వివరించేందుకు గుర్తింపు పొందిన అన్ని పార్టీల ప్రతినిధులతో గురువారం రాష్ట్ర సచివాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో అదనపు సీఈవోలు పి. కోటేశ్వర రావు, ఎమ్.ఎస్. హరేంధిర ప్రసాద్, రాజకీయ పార్టీల ప్రతినిధులు అంకంరెడ్డి నారాయణమూర్తి (వైఎస్సార్‌సీపీ), ఎ.రాజేంద్రప్రసాద్ (టీడీపీ), ఐ.కె.అన్నపూర్ణ (బీజేపీ), వె.వి.రావు (సీపీఐ-ఎం) పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఎన్నికల షెడ్యూలు ప్రకటన, ప్రవర్తన నియమావళి అమలు, నామినేషన్ల ప్రక్రియ, వ్యయ పర్యవేక్షణ ఎంతో కీలకమైన అంశాలని చెప్పారు. ఈ అంశాలపై సమగ్ర సమాచారాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ప్రవర్తన నియమావళి అమల్లోకి వస్తుందని తెలిపారు. నోటిఫికేషన్ మాత్రం ఐదారు రోజుల తరువాత వస్తుందన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందని చెప్పారు. ఈ సమయంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళికి లోబడి ప్రవర్తించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మీనా వివరించిన నియమావళిలో ప్రధానాంశాలు..

- ఎటువంటి బహిరంగ కార్యక్రమాలకైనా ముందుగా అనుమతి పొందాలి
- పార్టీలు, ప్రతినిధులు నిర్వహించే అన్ని కార్యక్రమాలను పూర్తి స్థాయిలో వీడియోగ్రఫీ ద్వారా పర్యవేక్షిస్తాం
- కులం, మతం, భాష ప్రాతిపదికన ఓటర్లను ప్రేరేపించడం, ఓట్లు వేయమని అడగడం పూర్తిగా నిషిద్ధం
- అభ్యర్థులు, ఏజెంట్లు, కార్యకర్తలు రూ.50 వేలకు మించి నగదు, రూ.10 వేలకు మించి విలువైన వస్తువులు వాహనాల్లో రవాణా చేయడం నిషిద్ధం
- స్టార్ క్యాంపెయినర్లు రూ. లక్షకు మించి నగదు కలిగి ఉండకూడదు
- పరిమితికి మించి నగదు ఉన్న వాహనాలను, నగదుని సీజ్ చేస్తాం
- ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభం అవుతుంది
- ఎన్నికల్లో పోటీ చేసే లోక్‌సభ అభ్యర్థులు రూ.25 వేలు, శాసన సభ అభ్యర్థులు రూ.10 వేలు నగదు రూపేణాగానీ లేదా ఆర్.బి.ఐ./ట్రెజరీ ద్వారా సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. చెక్కులు, బ్యాంకు డ్రాఫ్టులు అనుమతించం
- ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే సంబంధిత ఆర్వోలు, ఏఆర్వోలు నామినేషన్లు స్వీకరిస్తారు
- నామినేషన్లు వేసేందుకు వచ్చే అభ్యర్థుల వాహనాలను 100 మీటర్ల దూరంలో నిలిపివేస్తాం
- అభ్యర్థితో కలిపి మొత్తం ఐదుగురిని మాత్రమే లోపలకు అనుమతిస్తాం
- ఈ ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేసే ఎన్నికల వ్యయంపై పూర్తి స్థాయిలో నిఘా ఉంటుంది
- ప్రతి లోక్‌సభ అభ్యర్థికి రూ.95 లక్షలు, శాసన సభ అభ్యర్థికి రూ.40 లక్షల మేర వ్యయం చేసేందుకు అనుమతి ఉంటుంది
- ఈ వ్యయాన్ని బహిరంగ సభల నిర్వహణకు, పోస్టర్లు, బ్యానర్లు, వాహనాల వినియోగానికి మాత్రమే ఖర్చు చేయాలి
- ఓటర్లను ప్రభావితం చేసేలా నగదు, బహుమతులు, లిక్కరు, ఇతర వస్తువులు పంపిణీ చేయడాన్ని చట్టవిరుద్ధమైన వ్యయంగా పరిగణిస్తాం
- ఎన్నికల వ్యవయానికి ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా నిర్వహించాలి
- రోజువారీ రిజిస్టరుతో పాటు నగదు, బ్యాంకు రిజిస్టర్లను కూడా తప్పనిసరిగా నిర్వహించాలి

ఈవోడీబీపై కేంద్ర కేబినెట్ కార్యదర్శి సమీక్ష

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (ఈవోడీబీ), ఈజ్ ఆఫ్ లివింగ్‌కు సంబంధించి చేపడుతోన్న చర్యలపై కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ గురువారం ఢిల్లీ నుంచి పలు రాష్ట్రాల సీఎస్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో శాఖల వారీగా నిర్దేశించిన ఇండికేటర్లు సాధించాల్సిన లక్ష్యాలపై చర్చించారు. సమావేశంలో సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీలో పాన్ ఇంటిగ్రేషన్ ప్రక్రియ పూర్తయిందని కేబినెట్ కార్యదర్శికి వివరించారు. రాష్ట్ర రెవెన్యూ,వ్యవసాయ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్ జైన్, గోపాలకృష్ణ ద్వివేది, జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఆ శాఖ కమిషనర్ రాజేశ్వర్‌రెడ్డి, సహకార,మార్కెటింగ్ శాఖ కార్యదర్శి బాబు.ఏ పాల్గొన్నారు.

జగతికి మూలం మహిళే!



మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ గురువారం తిరుపతి జిల్లాలోని తీర ప్రాంతంలోని ఏరూరు గ్రామ సమీపంలోని సిలికా దిబ్బల వద్ద సైకత శిల్పాన్ని రూపొందించారు. మహిళలు జగతికి మూలం అని అలాంటి మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. గ్రామానికి చెందిన పలువురు యువతులు సైకత శిల్పాన్ని సందర్శించారు. - చిల్లకూరు

● ప్రత్యేక హోదా సాధన కోసం ఉద్యమించనున్నట్లు ఏపీసీసీ చీఫ్ షర్మిల చెప్పారు. గురువారం మంగళగిరిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 'ఉద్యమం ఉవ్వెత్తున జరగకపోతే హోదా రాదు. రాష్ట్ర ప్రజలను చంద్రబాబు గొర్రెలను చేశారు. రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోలేదు. హైదరాబాద్‌ను పదేళ్ల ఉమ్మడి రాజధానిగా ప్రకటిస్తే.. అవసరం లేదంటూ ఉరుక్కుంటూ ఏపీకి వచ్చి ఇక్కడ ఏం ఉద్ధరించారు? నేను వ్యక్తిగత రాజకీయాల కోసం ఏపీకి రాలేదు. హోదా, విభజన సమస్యల పరిష్కారం కోసమే ఏపీలో అడుగుపెట్టా' అని షర్మిల చెప్పారు.

పావనీలత కుమార్తెకు ప్రభుత్వం అండ

- అవయవదానంతో నలుగురి ప్రాణాలు కాపాడిన పావనీలత
- ఒంటరైన ఆమె కుమార్తెకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.6 లక్షలు మంజూరు
- జ్యోత్స్నకు చెక్కు అందజేసిన మంత్రి బుగ్గన



జ్యోత్స్నకు చెక్‌ను అందజేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): అవయదానం చేసి నలుగురి ప్రాణాలు కాపాడిన కర్నూలులోని బాలాజీనగర్‌కు చెందిన గజ్జల పావనీలత కుమార్తె జ్యోత్స్నకు వైఎస్ జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరిగా మిగిలిన జ్యోత్స్నకు ముఖ్యమంత్రి సహాయక నిధి కింద రూ.6 లక్షలు మంజూరు చేసింది. ఫిబ్రవరి 5వ తేదీన పావనీలత బ్రెయిన్‌డెడ్ అయ్యి మరణించింది. అంతకుముందు ఆమె భర్త కూడా అనారోగ్యంతో చనిపోయాడు. దీంతో వారి ఏకైక కుమార్తె జ్యోత్స్న అనాథగా మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో జ్యోత్స్నను ఆదుకోవాలంటూ వినతులు రావడంతో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి రూ.6 లక్షలు మంజూరు చేసింది. గురువారం కర్నూలు కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రూ.6 లక్షల చెక్కును జ్యోత్స్నతో పాటు ఆమె తాత వీరప్రతాప్‌రెడ్డికి అందజేశారు. జ్యోత్స్నను బాగా చదివించి జీవితంలో ఉన్నత స్థానంలోకి తీసుకురావాలని వీరప్రతాప్‌రెడ్డికి మంత్రి సూచించారు.

ఇందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్కార్ట్‌తో ఎర్రచందనం స్మగ్లింగ్

- 9 మంది స్మగ్లర్ల ముఠాను పట్టుకున్న పోలీసులు
- 248 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ఎర్రచందనం స్మగ్లింగ్ ముఠాను చూపుతున్న పోలీసులు

ద్వారకా తిరుమల: ఎర్రచందనం స్మగ్లర్లు దుంగలు తరలించడానికి కొత్త కొత్త ఎత్తులు వేస్తున్నారు. దుంగలు ఉన్న వాహనానికి ఎస్కార్ట్ వాహనాలు పెట్టి పోలీసుల కళ్లు గప్పడానికి ప్రయత్నించిన స్మగ్లర్ల వ్యూహాన్ని ఏలూరు జిల్లా పోలీసులు ఛేదించిన ఘటన గురువారం జరిగింది. ఢిల్లీకి అక్రమంగా దుంగలను తరలిస్తున్న 9 మంది ముఠాను ద్వారకాతిరుమల మండలంలోని పంగిడిగూడెం శివారులో అరెస్టు చేశారు. ఒక మినీ కంటైనర్‌ను, రెండు ఎస్కార్ట్ వాహనాలను, 248 ఎర్రచందనం దుంగలు (4.480 టన్నుల)ను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు జిల్లా దాఖిల్‌కు చెందిన అప్పారావు స్వామినాయుడు, ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలం బందంచర్లలోని రైతు వాసిరెడ్డి రామ్మోహన్‌రావు నుంచి టన్ను రూ. 4 లక్షలు చొప్పున 4.480 టన్నుల ఎర్రచందనాన్ని అక్రమంగా కొనుగోలు చేశాడు. ఈ సరుకును ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రేమ్‌సింగ్‌కు స్వామినాయుడు విక్రయించాడు. ప్రేమ్‌సింగ్ రూ. 3 లక్షలతో ఒక మినీ కంటైనర్‌ను కిరాయికి తెచ్చి బందంచర్ల నుంచి ఢిల్లీకి దుంగలను రవాణా చేయడానికి ప్లాన్ వేశాడు. కంటైనర్‌కు ముందు ఒక కారు, వెనుక మరొక కారును ఎస్కార్ట్‌లుగా పెట్టాడు. కంటైనర్‌లో పాత ఇంటి సామాగ్రి కింద ఈ ఎర్రచందనం దుంగలను ఉంచాడు. సమాచారం అందుకున్న భీమడోలు సీఐ బీబీ రవికుమార్, ద్వారకాతిరుమల ఎస్సై జి.సతీష్ వలపన్ని ఆ వాహనాలను పట్టుకున్నారు. ఈ స్మగ్లింగ్ ముఠాలో అప్పారావు స్వామినాయుడు, నెల్లూరు జిల్లాకు చెందిన గుర్రం హరిబాబుతో పాటు మరో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్‌వీకే కుమార్ తెలిపారు.

దోచుకోవడమే మార్గదర్శి వ్యాపార సూత్రం

మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం


సాక్షి, అమరావతి: ప్రజలు, చందాదారులను మరోసారి మోసం చేసేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ సీహెచ్ శైలజాకిరణ్ ప్రయత్నిస్తున్నారని మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం విమర్శించింది. 'మార్గదర్శి చిట్ ఫండ్స్ ఎక్కడా చట్టాలను ఉల్లంఘించడం లేదని శైలజాకిరణ్ పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. చందాదారులను దోచుకోవడమే మార్గదర్శి వ్యాపార సూత్రం. చట్టాలను ఉల్లంఘిస్తూ, చందాదారులను వేధిస్తూ శైలజాకిరణ్ వ్యాపారవేత్తగా ఎదగడం నిజం కాదా..? చందాదారుల సొమ్మును వాడుకుని ఈ స్థాయికి చేరుకున్నది వాస్తవం కాదా..? కనీసం బాధిత చందాదారులు కలిసి తమ ఆవేదన చెప్పేందుకు కూడా ఆమె అవకాశం ఇవ్వడంలేదు. తన తల్లిదండ్రుల వద్ద శైలజాకిరణ్ క్రమశిక్షణతో పెరిగారేమోగానీ, ఆమె చేస్తున్న వ్యాపారంలో ఏమాత్రం క్రమశిక్షణ లేదు. అంతా మోసమే. మహిళా దినోత్సవం సందర్భంగా శైలజాకిరణ్‌కు క్రమశిక్షణ లేని వ్యాపారవేత్త అనే బిరుదు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.' అని మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘ కార్యదర్శి బి.అన్నపూర్ణాదేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏపీజేఏసీ చైర్మన్‌గా శివారెడ్డి



సాక్షి, అమరావతి: ఏపీజేఏసీ చైర్మన్‌గా ఏపీ ఎన్‌జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.వి. శివారెడ్డి ఎన్నికైనట్లు సెక్రెటరీ జనరల్ హృదయ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ చైర్మన్ బండి శ్రీనివాసరావు పదవీ విరమణతో చైర్మన్ స్థానానికి ఖాళీ ఏర్పడిందని పేర్కొన్నారు. విజయవాడ గాంధీనగర్ ఎన్‌జీవో హోమ్‌లో జరిగిన జేఏసీ సమావేశంలో జేఏసీ కార్యవర్గ సభ్యులందరూ కలిసి నూతన చైర్మన్‌ను ఎన్నుకున్నట్లు వివరించారు. డిప్యూటీ సెక్రెటరీ జనరల్‌గా ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. పురుషోత్తమ నాయుడును ఎన్నుకున్నామని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ప్రయోజనాలను పరిరక్షించే దిశగా జేఏసీ కృషి చేస్తుందని నూతన చైర్మన్ శివారెడ్డి వెల్లడించారు. జేఏసీ ప్రతిష్టను ఇనుమడింపజేసి, విశ్వాసాన్ని పొందే విధంగా అన్ని సంఘాలను కలుపుకొని ముందుకు వెళతానని తెలిపారు.

సీఎం జగన్ చిత్రపటానికి రైతుల క్షీరాభిషేకం



జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

కొయ్యలగూడెం: మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసినందుకు కృతజ్ఞతగా ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం రాజవరం గ్రామంలోని ఆర్బీకే వద్ద రైతులు సీఎం జగన్ చిత్రపటానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. సర్పంచ్‌ల చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాజవరం సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు రైతులు పాల్గొని రైతాంగానికి వెన్నెముకగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉందని తెలిపారు.

ఏపీ ఫైబర్‌నెట్‌లో 'వ్యూహం' రిలీజ్

ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ పూనూరు గౌతమ్ రెడ్డి



సాక్షి, అమరావతి: ఏపీ ఫైబర్‌నెట్‌లో ఫస్ట్ డే ఫస్ట్ షోగా తొలిసారిగా అతిపెద్ద సినిమా వ్యూహం రిలీజ్ చేయటం గర్వకారణమని ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ పూనూరు గౌతమ్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైబర్‌నెట్ లిమిటెడ్ ఫస్ట్ డే ఫస్ట్ షో కార్యక్రమంలో భాగంగా విజయవాడ ఏపీఎస్ఎఫ్ఎల్ కార్యాలయంలో వ్యూహం సినిమాను గురువారం విడుదల చేశారు. ఇప్పటివరకు చిన్న సినిమాలు విడుదల చేశామని, ఇకపై పెద్ద సినిమాలను సైతం ఏపీ ఫైబర్ నెట్ ద్వారా విడుదల చేయటానికి కృషి చేస్తామన్నారు. వ్యూహం సినిమా రెండు పార్టులను వరుసగా రెండు రోజులు విడుదల చేస్తున్నామని వాటికి ప్రేక్షకులు ఒక్కో పార్టుకు రూ.120 చెల్లించాల్సింది ఉంటుందన్నారు. నేటి రాజకీయ నాయకుల నిజజీవితాలకు అద్దం మా వ్యూహం అని ప్రముఖ సినీ దర్శకులు రామ్ గోపాల్‌వర్మ (ఆర్జీవీ) అన్నారు. ప్రతి సినిమాకు ఒక లక్ష్యం ఉంటుందని, తన వ్యూహం సినిమాను మాత్రం ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువ చేయడమే తన లక్ష్యమన్నారు. వ్యూహం రెండు పార్టులు, శపథం వెబ్ సీరిస్ రెండు పార్టులు ఏపీ ఫైబర్ నెట్ ద్వారా ఏపీ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అందుకనే శపథం ఆరంభం, శపథం అంతం అనే రెండుపార్టుల వెబ్ సీరిస్‌లను తీసినట్లు చెప్పారు. గురువారం రాత్రి 8 గంటలకు వ్యూహం -1, శుక్రవారం రాత్రి 8 గంటలకు వ్యూహం-2, శపథం వెబ్ సీరీస్ లు కూడా ఏపీ ఫైబర్ నెట్ ప్రేక్షకులకు అందుబాటులో ఉంటాయన్నారు. చిత్ర నిర్మాత దాసరి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్కో ఆర్జీబీ డెలిగేట్‌గా వేండ్ర ఏకగ్రీవ ఎన్నిక

తాడేపల్లిగూడెం రూరల్/భీమవరం (ప్రకాశంచౌక్): ఇఫ్కో రీజినల్ జనరల్ బాడీ (ఆర్జీబీ) డెలిగేట్‌గా డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకట స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని బొమ్మూరు డీసీఎంఎస్ భవనంలో ఈ ఎన్నిక జరిగింది. రీజనల్ బాడీ ఎన్నికల్లో తనను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెంకటస్వామి తెలిపారు. రైతుగా, డీసీఎంఎస్ చైర్మన్‌గా అందిస్తున్న సేవలు గుర్తించి ఇఫ్కో సంస్థ డెలిగేట్‌గా గౌరవించిందన్నారు. ఈ సంస్థ నుంచి రైతులకు అన్ని రకాల సేవలను అందేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సభ్యులుగా ఇద్దరు..

ఆర్జీబీ సభ్యులుగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడేనికి చెందిన వెలిశెట్టి నరేంద్రకుమార్, పెంటపాడు మండలం మౌంజీపాడు గ్రామానికి చెందిన మైలవరపు గోపాలకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారికి వైఎస్సార్ సీపీ నాయకుడు కొట్టు విశాల్ ధ్రువీకరణ పత్రాన్ని తాడేపల్లిగూడెంలో గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ పదవులకు తాడేపల్లిగూడెం ప్రాంతం నుంచి ఇద్దరు ఎన్నిక కావడం విశేషమన్నారు. వారిని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అభినందించారు. ఎన్నికైన వారికి పెంటపాడు మండల జేసీఎస్ కన్వీనర్ మైలవరపు సుబ్బారాయుడు, ఆకుల ధనశేఖర్, కర్రెడ్డి రామకృష్ణ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికి వాసిరెడ్డి పద్మ రాజీనామా

రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి రాజకీయాలు మాట్లాడకూడదనే ఈ నిర్ణయం: వాసిరెడ్డి పద్మ



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికి వాసిరెడ్డి పద్మ రాజీనామా చేశారు. గురువారం విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏపీ జేఏసీ అమరావతి ఉమెన్స్ వింగ్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి వాసిరెడ్డి పద్మ హాజరయ్యారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'రాజ్యాంగబద్ధమైన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవిలో ఉండి రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనడం సరికాదు. అందుకే ఆ పదవికి రాజీనామా చేశాను. ఆ లేఖను సీఎం జగన్‌కు పంపించాను. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం పని చేస్తా. రాష్ట్రంలో మహిళా సాధికారత కోసం సీఎం జగన్ ఎన్నో కార్యక్రమాలు అమలు చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు మహిళా లోకం అండగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈనిర్ణయం తీసుకున్నా. పేద ప్రజలు అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్ సీఎంగా కొనసాగాలి. నా రాజీనామా విషయంలో అధిష్టానానిదే తుది నిర్ణయం' అని చెప్పారు. అంతకుముందు మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వాసిరెడ్డి పద్మ కేక్ కట్ చేసి మహిళా ఉద్యోగులకు తినిపించారు. వివిధ పోటీల్లో గెలిచిన వారికి ఐఏఎస్ అధికారిణి విజయకృష్ణన్‌తో కలిసి వాసిరెడ్డి పద్మ బహుమతులు అందజేశారు. అనంతరం ఏపీ జేఏసీ అమరావతి ఉమెన్స్ వింగ్ సభ్యులు, అధికారులు సంయుక్తంగా వాసిరెడ్డి పద్మ, విజయ్‌కృష్ణన్‌ను ఘనంగా సన్మానించారు.

వన్నియకుల క్షత్రియుల సంక్షేమ భవన్‌కు స్థలం కేటాయింపు

చిత్తూరులో రెండు ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం



స్థలం కేటాయింపు పత్రాలు ఇస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు అర్బన్: వన్నియకుల క్షత్రియుల(వన్నెరెడ్లు) సంక్షేమ భవన్ కోసం చిత్తూరు నగరంలో రెండు ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు స్థలం కేటాయింపు పత్రాలను వైఎస్సార్‌సీపీ చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త ఎంసీ విజయానందరెడ్డి గురువారం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన వన్నియకుల క్షత్రియుల ఆత్మీయ సమావేశంలో ఆ సంఘ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా వన్నియకుల క్షత్రియుల సంఘ నాయకుడు కాశీనాయకర్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా జనాభాలో 33శాతం ఉన్న తమ సామాజిక వర్గానికి చట్టసభల్లో అవకాశం కల్పించాలని రెండు దశాబ్దాల క్రితం అప్పటి సీఎం చంద్రబాబును తాను కోరగా, ఆయన నవ్వి వదిలేశారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం వైఎస్ జగన్ తమ సామాజికవర్గాన్ని గుర్తించి తిరుపతి, కుప్పంలోని వన్నియకుల క్షత్రియులైన సిపాయి సుబ్రహ్మణ్యం, భరత్‌లకు ఎమ్మెల్సీగా పదవులు ఇచ్చి గౌరవించారని తెలిపారు. రాష్ట్రంలోని వన్నియకుల క్షత్రియులు అందరూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.



పురుషుల కంటే స్త్రీల రాజకీయ, పారిశ్రామిక అవసరాలు తక్కువ వాస్తవికమా? ఈ మూర్ఖపు, ఏకపక్ష, ఏకస్వామ్య ఏర్పాటుకు అంతం పలికి, అందరికీ ఓటు హక్కు కల్పించాలి – ప్రతి ఒక్కరినీ పరిగణనలోకి తీసుకునే ఓటుహక్కు. ఏమైనా, ప్రతి మంచి పురుషుడి, మంచి స్త్రీ లక్ష్యం న్యాయమే!

– హెలెన్ కెల్లర్

సాక్షి

శుక్రవారం, 8 మార్చి 2024

ఆలస్యంగా దక్కిన న్యాయం

మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణతో చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద అరెస్టయిన ఢిల్లీ విశ్వవిద్యాలయ అధ్యాపకుడు ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా పదేళ్ల సుదీర్ఘ కారాగారవాసం నుంచి గురువారం నిర్దోషిగా విడుదలయ్యారు. ఇదే అభియోగాలతో ఆయనతోపాటు అరెస్టయిన మరో అయిదుగురికి కూడా విముక్తి లభించింది. ఒకరు విచారణ సమయంలో మరణించారు. అభియోగాలను రుజువు చేయటంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని చెబుతూనే, అసలు తగిన అనుమతులు లేకుండా సాగించిన ఈ కేసు చెల్లుబాటు కాదని బొంబాయి హైకోర్టు నాగపూర్ ధర్మాసనం వ్యాఖ్యానించటం మన నేర న్యాయవ్యవస్థ పనితీరును పట్టిచూపుతోంది. యూఏపీఏ కింద ప్రాసిక్యూషన్ చర్యలు ప్రారంభించాలంటే నిబంధనల ప్రకారం ఉన్నతాధికారుల ముందస్తు అనుమతులు తప్పనిసరి. నిందితులపై పకడ్బందీ సాక్ష్యాధారాలున్నాయని వారు విశ్వసించాకే ప్రాసిక్యూషన్‌కు అనుమతించాలి. కానీ ఈ కేసులో ప్రొఫెసర్ సాయిబాబాను 2014లో అరెస్టు చేయగా ఏడాది తర్వాతగానీ అనుమతులు రాలేదు. ఇతర నిందితులు వాస్తవానికి 2013లోనే అరెస్టయ్యారు. ఈ సంగతి పట్టని మహారాష్ట్రలోని గఢ్‌చిరోలి సెషన్స్ కోర్టు కేసును పరిగణనలోకి తీసుకుని ఈలోగా ఒక సాక్షిని కూడా విచారించింది! చివరకు 2017లో వీరిని దోషులుగా పేర్కొంటూ యావజ్జీవ శిక్ష విధించింది. అటు ప్రభుత్వ యంత్రాంగం సరే... ఇటు న్యాయవ్యవస్థ సైతం ఇంత యాంత్రికంగా పనిచేయటం సరైందేనా? బొంబాయి హైకోర్టు 2022లో ఈ అవకతవకలను గుర్తించి కేసు కొట్టేసింది. కానీ ఆ వెంటనే సుప్రీంకోర్టు ధర్మాసనం మహారాష్ట్ర అప్పీల్‌ను స్వీకరించి బొంబాయి హైకోర్టు తీర్పును నిలుపుదల చేయటం, తిరిగి దీన్ని విచారించాలంటూ ఆదేశాలు జారీచేయటంవల్ల సాయిబాబా తదితరులకు స్వేచ్ఛ లభించటానికి మరికొన్ని నెలలు పట్టింది. ఇలా కనీస సాక్ష్యాధారాలు కొరవడిన, ముందస్తు అనుమతులు తీసుకోని కేసులో నిందితులను పదేళ్లపాటు జైలు గోడలమధ్య బంధించి వుంచారంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇది వ్యవస్థల సమష్టి వైఫల్యం కాదా? ఇందుకు జవాబుదారీతనం వహించాల్సిందెవరు? తెలుగు రాష్ట్రాల్లోనే కాదు... ఈయూ కమిషన్, అమెరికన్ కాంగ్రెస్, ఐక్యరాజ్యసమితి మానవహక్కుల విభాగంలో ఈ కేసు ప్రస్తావనకొచ్చింది. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాల్లోని వివిధ సంస్థల వరకూ అందరికందరూ ఇది అన్యాయంగా బనాయించిన కేసు అనీ, వెంటనే ఉపసంహరించుకోవాలనీ డిమాండ్ చేస్తూ వచ్చారు. టీఆర్ఎస్ సభ్యుడు కె. కేశవరావు 2015లో జీరో అవర్‌లో దీన్ని రాజ్యసభలో ప్రస్తావించే ప్రయత్నం చేశారు. అప్పటి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ కూడా రాశారు. అయినా ప్రయోజనం లేకపోయింది. కనీసం కేసు తేలేవరకూ నిందితులను బెయిల్‌పై విడుదల చేసివుంటే కొంతలో కొంతైనా న్యాయం చేసినట్టయ్యేది. బెయిల్ అనేది హక్కు, తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే జైలుకు పంపాలన్నది మౌలిక న్యాయసూత్రం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఈమధ్యకాలంలో కూడా పదే పదే ఈ సంగతిని గుర్తుచేస్తున్నారు. అయినా ఆచరణకొచ్చేసరికి జరిగేది వేరుగా వుంటోంది.

నిందితులు హింసాత్మక కార్యకలాపాల్లో పాల్గొన్నారని ప్రాసిక్యూషన్ ఆరోపించలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపట్ల విరోధభావాన్ని వ్యాప్తిచేసేందుకు కుట్రపన్నారని తెలిపింది. ఆ విషయంలో సమర్పించిన ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ఇతర పత్రాలువంటి సాక్ష్యాధారాలు అత్యంత బలహీనమైనవని బొంబాయి హైకోర్టు వ్యాఖ్యానించింది. ఏదైనా వెబ్‌సైట్ నుంచి వీడియోలు, ఇతర సమాచారం డౌన్‌లోడ్ చేసుకోవటం దానికదే నేరమెలా అవుతుందన్నది ధర్మాసనం సందేహం. ఫలానా ఉగ్రవాద చర్యకూ, దానికీ సంబంధం వున్నదని నిరూపిస్తే తప్ప ఆ సాక్ష్యానికి ఎలాంటి విలువా వుండదని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ సాయిబాబా అభిప్రాయాలు ఎవరికీ తెలియనివి కాదు. ఆయన వృత్తిరీత్యా ఇంగ్లిష్ అధ్యాపకుడు. కవి, రచయిత కూడా. ఆదివాసీ ప్రాంతాల్లో సహజవనరులను బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో రచనలు చేశారు. అరెస్టయిన సమయానికి విప్లవ ప్రజాస్వామిక వేదిక (ఆర్‌డీఎఫ్) బాధ్యుడు. ఆయన హింసాత్మక కార్యకలాపాల్లో పాలుపంచుకుంటే, విధ్వంసానికి పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చు. కానీ 90 శాతం అంగవైకల్యం వున్న సాయిబాబా మరొకరి సాయం లేనిదే తన పని తాను చేసుకోవటం కూడా అసాధ్యం. బయటకు వెళ్లాలంటే చక్రాల కుర్చీ తప్పనిసరి. అటువంటి వ్యక్తిని ఉగ్రవాదిగా జమకట్టడం సబబేనా?

కేవలం అసమ్మతిని వ్యక్తం చేయటమే ఒక మనిషిని పదేళ్లపాటు జైల్లోకి నెట్టడానికి కారణం కావటం మనం నమ్మే ప్రజాస్వామిక విలువలను ప్రశ్నార్థకం చేస్తోంది. ఉగ్రవాద చర్యలు సమాజ క్షేమానికి ముప్పుగా పరిణమిస్తాయనటంలో సందేహం లేదు. అటువంటివారిని అదుపు చేయాలంటే యూఏపీఏ వంటి కఠిన చట్టాల అవసరం వుందని ప్రభుత్వాలు భావిస్తే తప్పుబట్టనవసరం లేదు. కానీ మన రాజ్యాంగమే అనుమతించిన సహేతుకమైన అసమ్మతిపై లేనిపోని ముద్రలేసి దాన్ని తుంచివేయాలనుకోవటం, భావప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్లు వేయాలనుకోవటం ఏరకంగా చూసినా సబబు కాదు. ఇప్పుడు సాయిబాబా కోల్పోయిన విలువైన పదేళ్ల కాలాన్ని ప్రభుత్వం వెనక్కివ్వలేదు. కనీసం ఉద్యోగమైనా చేసుకోనివ్వాలి. ఇతర క్రిమినల్ కేసుల మాట అటుంచి యూఏపీఏ వంటి దారుణ చట్టాలకింద అరెస్టయి నిర్దోషులుగా తేలినవారికైనా తగిన పరిహారం చెల్లిస్తే కాస్తయినా ఉపశమనం ఇచ్చినట్టవుతుంది. పాలకులు ఆలోచించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** బ.త్రయోదశి రా.8.15 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** శ్రవణం ఉ.8.34 వరకు, తదుపరి ధనిష్ట, **వర్జ్యం:** ప.12.20 నుండి 1.48 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.37 నుండి 9.25 వరకు తదుపరి ప.12.35 నుండి 1.23 వరకు, **అమృతఘడియలు:** రా.9.23 నుండి 10.53 వరకు, మహాశివరాత్రి.

సూర్యోదయం : 6.18
సూర్యాస్తమయం: 6.04
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సాధికారత ఇంకెంత దూరం?

ప్రతి ప్రజా పోరాటంలోనూ మహిళలు ఎన్నో త్యాగాలు చేశారు. అయినా తమకు న్యాయంగా రావాల్సిన హక్కులు, అధికారాలను ఇప్పటికీ సంపూర్ణంగా అందుకోలేకపోతున్నారు. అన్ని అర్హతలున్నా పురుషులతో సమానంగా అవకాశాలు ఇవ్వని లింగ వివక్ష ఏదో రూపంలో కొనసాగుతూనే ఉంది. బాధితుల తరఫున వేసే ప్రశ్నని నేరంగా చూసే పరిస్థితులే ఇంకా కొనసాగుతున్నాయి. స్త్రీ దేహాల చుట్టూ అవరించివున్న దుర్భ్రమలు పోవాలి. మహిళల శకం మొదలయ్యేలా సంస్థాగత చర్యలు చేపట్టాలి.

పరువు, ప్రతిష్ఠ – స్త్రీల భద్రత



కె. ఎన్. మల్లీశ్వరి

ఇటీవల ఝార్ఖండ్ పర్యటన కోసం వచ్చిన ఒక విదేశీ మహిళ సామూహిక అత్యాచారానికి గురైన విషయం అనేక చర్చలకి దారితీసింది. బాధితుల తరుపున వేసే ప్రశ్నని నేరంగా చూసే కర్మభూమి మనది. ఈసారి బాధ్యతని జాతీయ మహిళా కమిషన్ చైర్ విమన్ రేఖా శర్మ తీసుకున్నారు.

అర్ధరాత్రి, అటవీ ప్రాంతంలో గుడారం వేసుకుని పడుకున్న స్పానిష్, బ్రెజిలియన్ జంటమీద ఏడుగురు వ్యక్తులు దాడిచేసి వారిని కొట్టి, కత్తి చూపి చంపుతామని బెదిరించి, వారి విలువైన వస్తువులు దోచుకుని, మహిళని సామూహికంగా రేప్ చేశారు. ఆసియా పాత్రికేయ రంగంలో పదిహేనేళ్లుగా పని చేస్తున్న డేవిడ్ జోసెఫ్ వోలోజ్కో అనే జర్నలిస్ట్ తన అనుభవాల మేరకి భారతదేశంలో విదేశీ మహిళలు ఒంటరిగా ప్రయాణించడం మంచిది కాదని చెప్పాడు.

ఇది వైరల్ అయి రకరకాల కామెంట్స్ మొదలయ్యాయి. అందులో రేఖా శర్మ వేసిన రీట్వీట్– జాతీయ మహిళా కమిషన్ వైఖరిని స్పష్టం చేసింది. 'ఇటువంటి ఘటనల మీద మీరెప్పుడైనా పోలీసు రిపోర్ట్ ఇచ్చారా? ఒకవేళ ఇవ్వకపోతే మీరు పూర్తిగా బాధ్య తారహితమైన మనిషి. కేవలం సోషల్ మీడియాలో రాసుకుంటూ దేశ పరువుని తీయాలనుకోవడం మంచిది కాదని' హితవు పలికారు. పాతకాలపు సినిమాల్లో, సాహిత్యంలో స్త్రీలమీద అత్యాచారం జరిగిన ఘటనలు చూపించాల్సి వచ్చినపుడు కొన్ని విచిత్రాలు జరిగేవి. 'ప్రాణం కన్నా మానం విలువైనదని' చెప్పి ఆ స్త్రీపాత్రని చంపేయడమో, జీవితాంతం కుళ్ళి కుళ్ళి చావమని సూచించడమో లేదా అత్యాచారం చేసినవాడు పెద్దమనసు చేసు కుని పెళ్లికి సిద్ధపడడమో చూపించేవారు. పరువు ప్రతిష్ఠలన్నీ స్త్రీల శరీర శీలం చుట్టూ కమ్ముకుని ఉంటాయనీ, శీలంపోతే పరువుపోతుందనీ నమ్మేవారు కనుక మూతముప్పిడి వ్యవహారాలు నడిచేవి. కాలం మారింది. స్త్రీల మీద లైంగికహింస తగ్గకపోయినా, కనీసం అత్యాచారాన్ని ఎలా చూడాలన్న దృష్టికోణంలో కొన్ని మార్పులయితే వచ్చాయి. అత్యాచారానికి గురైన ఆ విదేశీ మహిళ కూడా, 'వారు నన్ను చంపకుండా వదిలి పెట్టారు. థాంక్ గాడ్' అన్నది. దాడికి గురైన వాస్తవం తప్ప ఇందులో పరువు గోల లేదు.

భారతదేశంలో విదేశీ స్త్రీలకే కాదు, స్వదేశీ స్త్రీలకి కూడా రక్షణ లేకపోవడం వాస్తవం. ఇటువంటి వర్తమానం ఉన్నచోట భారత మహిళల భద్రత కన్నా దేశపరువు గురించి ఆలోచించే రేఖా శర్మ లాంటివారు 'కొత్త స్త్రీలు'. వీరు మహిళలని మధ్యయుగాలకి నడిపించుకు వెళ్లగల సమర్థులు.



నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఈ ఘటన అటవీప్రాంతంలో జరిగింది. లైంగికంగా వేధించడం, అత్యాచారం చేయడం వంటి హింసాపద్ధతులని ప్రేరేపించే బైటి ప్రభా వాలకి అక్కడ ఆస్కారం తక్కువ. అటువంటిది మారుమూల ప్రాంతాల్లోకి కూడా కల్చరల్ పొల్యూషన్ వ్యాపించడమనేది జాగ్రత్త పడాల్సిన విషయం. ఈ ఘటనలో ముగ్గురిని అరెస్ట్ చేసి స్టేషన్ కి తీసుకువచ్చి, వారిని చూపించిన తీరుని బట్టి నిందితులు బహుశా స్థానికులు, అట్టడుగువర్గాల వారయ్యే అవకాశం ఉంది. బాధితురాలు విదేశీ మహిళ, అందునా ధైర్యంగా రిపోర్ట్ చేసిన మహిళ అని సంకోచం ఉన్నట్లుంది గానీ లేకపోతే ఈపాటికే 'ఎన్‌కౌంటర్ న్యాయం' డిమాండ్ ఎల్లెడలా వూపు అందుకునేదే. నేరానికి కూడా కులమూ, వర్గమూ ఉంటుంది కనుక, అనువుగా దొరికే నేరస్థుల విషయంలో నేరాన్ని మించిన శిక్షలను విధించి ప్రజాగ్రహాన్ని చల్లార్చే ప్రయత్నం చేస్తారు కనుక, నిందితుల నేరానికి తగినశిక్ష మాత్రమే పడాలన్న మాటని పదేపదే ఇపుడు గుర్తు చేసుకోవాలి.

వ్యాసకర్త ప్రరవే (ఏపీ శాఖ) కార్యదర్శి

త్యాగాలు, కష్టాలు – స్త్రీల పరిస్థితి



రావి ప్రతిభారెడ్డి

స్వాతంత్ర్య పోరాటంలో ఖమ్మం జిల్లా కేంద్రానికి వచ్చిన మహాత్మాగాంధీకి రావి నారాయణరెడ్డి సతీమణి రావి సీతాదేవి తన నగలన్నీ స్వరాజ్య ఉద్యమానికి ఇచ్చేసిన త్యాగం ఒక వైపు ఉంటే... అదే రావి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణా రైతాంగం సాయుధులై పోరాడుతున్న సమయాల్లో అదే సీతాదేవి సాయుధ దళాలకు వంట వార్పు చేసి చేయూతనిచ్చింది. ఇలా రావి సీతాదేవి ఒక్కరే కాదు... ఆనాడు అనేక మంది మహిళలు దేశ స్వాతంత్ర్యం కోసం, తెలంగాణాలో భూర్జువా పాలన కుప్పకూలడం కోసం ఎవరి స్థాయిలో వారు ఎదురొడ్డి పోరాడారు. ఆపై జరిగిన ప్రతి ప్రజా పోరాటాల్లో మహిళల త్యాగాలు ఎన్నో. అయినా మహిళలు తమకు న్యాయంగా రావాల్సిన హక్కులు, అధికారాల విషయంలో ఇప్పటికీ అడుక్కోవాల్సిన పరిస్థితే ఉంది. పనికి సమానవేతనం దక్కకపోవటం, అన్ని అర్హతలున్నా పురుషులతో సమానంగా అవకాశాలు ఇవ్వకపోవడం రూపంలో లింగ వివక్ష కొనసాగుతూనే ఉంది. పని ప్రదేశాల్లో భద్రత కల్పించడంలోనూ, పనికి అనుకూలమైన వాతావరణం పెంపొందించటంలోనూ వెనకబడే ఉన్నాము.

సమాజ వైవిధ్యాన్ని ప్రతిబింబించే సమ్మిళిత నాయకత్వ ఆవశ్యకత కోసం, నిర్ణయాత్మక పాత్రలలో స్త్రీ ప్రాతినిధ్యాన్ని పెంచాలన్న నినాదం ఇంకా నిజం కావాల్సే ఉంది. రాజకీయాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లు పార్లమెంటులో గట్టెక్కినా... అది వచ్చేందుకు ఇంకో ఐదేళ్ల సమయం పట్టనుంది. ఇప్పటికే స్థానిక సంస్థల్లో మహిళల కోటా అమలవుతున్నా, చాలా చోట్ల భార్యల స్థానే భర్తల పెత్తనం సాగుతూనే ఉంది. ఆ దిశగా చట్ట సభల్లోనూ బహునాయకత్వం పునరావృతం కాకుండా, మహిళల స్వయం నిర్ణయాధికారం దిశగా అన్ని స్థాయిల్లో కార్యాచరణ మొదలు కావాల్సి ఉంది.

స్త్రీ నిర్ణాయక శక్తిగా మారాలంటే చదువు ముఖ్యం. చదువు కావాలంటే ఆర్థిక భారం తప్పనిసరి. దీంతో అట్టడుగు వర్గాల్లో అమ్మాయిని చదువు మాన్పించి పనులకు పంపటం ఇంకా సాగుతూనే ఉంది. ఉదాహరణకు తెలంగాణలో నారాయణ పేట జిల్లా మహిళల అక్షరాస్యత లెక్కలే ఇందుకు నిదర్శనం. ఇక్కడ పనికి వెళ్లే బాలికల సంఖ్య దేశంలోనే ఎక్కువగా ఉండటం విచారకరం. ఒక్క నారాయణ పేటలోనే కాదు, పేదరికం ఉన్న అన్ని ప్రాంతాల్లో పాఠశాల చదువు మధ్యలో మానేస్తున్న బాలికల సంఖ్య భారీగా ఉంటోంది. దీంతో ప్రతి అమ్మాయి కలలు, ఆకాంక్షలకు భిన్నంగా వాళ్ల జీవితాలు దారి మళ్లుతున్నాయి.

ఇక మహిళలపై నేరాల విషయానికి వస్తే, బాధితుల సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉంది. మహిళ ఇంటినుంచే బయటకు వస్తే ముంచుకొచ్చే ఆపద, ఇప్పుడు ఇంట్లో ఉన్నా సోషల్ మీడియా రూపంలో ఆమెను బజారుపాలు చేస్తోంది. మహిళలపై జరిగే సైబర్ నేరాలు, ఇతర నేరాల విషయంలో ప్రత్యేక కోర్టులు పెట్టి త్వరితగతిన విచారణలు నడిపి నిందితులకు శిక్ష, బాధితులకు ఊరట నివ్వాలన్న కార్యాచరణ సైతం అమలు కావటం లేదు. ఇలా ఒక్కటా, రెండా... అన్నింటా మహిళలకు ఆశించిన రక్షణ, మద్దతు ఇంకా అందని ద్రాక్షగానే ఉంది. వారి త్యాగాలు, కష్టాలకు తగిన గుర్తింపు రావటమే లేదు. ప్రపంచంలోని అనేక దేశాలు సమాన అవకాశాలు కల్పిస్తూ సమగ్రమైన, సాధికారికత కలిగిన సమాజం దిశగా ముందుకువెళుతున్న డిజిటల్ యుగంలో భారత దేశంలోనూ మహిళలకు కొత్త శకం ప్రారంభించే దిశగా నిజమైన కసరత్తు జరగాలి. అందుకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజునే మరో అడుగు ముందుకు పడాలి.

వ్యాసకర్త తెలంగాణా రైతాంగ అమరవీరుల ట్రస్ట్ సభ్యురాలు

సాధారణ మహిళలు సృష్టించిన చరిత్ర



మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 2024లో స్త్రీ పురుష సమానత్వం కోసం పెట్టుబడిని పెట్టమని పిలుపునిచ్చింది ఐక్యరాజ్యసమితి. నినాదాలు ఎంత గొప్పగా ఉన్నా ఆచరణ ఉంటేనే మార్పు వస్తుంది.

సాధారణ మహిళలు సృష్టించిన అసమాన్య చరిత్ర మహిళా దినోత్సవానికి నాంది పలికింది. పారిశ్రామికీకరణ మొదట్లో 19వ శతాబ్దం ఆరంభంలో ఇటలీ, ఇంగ్లాండ్, పోలండ్, రష్యా వంటి వివిధ దేశాల నుండి అమెరికాకు వలస వచ్చినవారు పరిశ్రమలలో పని చేస్తుండేవారు. కనీస సౌకర్యాలు లేకుండానే అతి తక్కువ వేతనంతో రోజుకు 15 గంటలు పని చేస్తుండేవారు. యూనియన్ చేసే సమ్మెలలో కూడా మగవారి డిమాండ్లనే పరిష్కరించేవారు. దీనితో 1820ల కాలంలోనే మహిళలు యూనియన్లుగా సంఘటితమవడం మొదలు పెట్టారు. 1857 మార్చి 8న పెద్ద సంఖ్యలో మహిళలు కవాతు చేశారు. పది గంటల పనిదినం, పురుషులతో సమాన హక్కులు, కనీస సౌకర్యాలను డిమాండ్ చేశారు. పోలీసుల లాఠీచార్జిని, కిరాయి రౌడీల దౌర్జన్యాన్ని ఎదుర్కొన్నారు.

1900లో అంతర్జాతీయ మహిళా దుస్తుల శ్రామిక యూనియన్ ఏర్పడి మార్చి 8న మరిన్ని నిరసన ప్రదర్శనలు జరిగాయి. 1908లో 1857 నాటి మార్చి 8 నిరసనను గుర్తు చేసుకుంటూ... పని గంటల తగ్గింపు, మెరుగైన పని పరిస్థితులు, సమాన హక్కులతో పాటు చైల్డ్ లేబర్‌ను నిషేధించాలని ప్రదర్శన చేశారు. 1909లో 20వేల మందితో సుదీర్ఘకాలం పాటు సమ్మె చేశారు. సమ్మె పాక్షికంగా విజయం సాధించింది. కానీ చదువు రాని మహిళలు ఏమి చేయలేరని భావనను ఇది సవాలు చేసింది. వారిలో ఆత్మగౌరవాన్నీ, శక్తినీ నింపింది. ఇదే కాలంలో అమెరికా సోషలిస్టుల మద్దతు వీరికి లభించింది. ఈ పోరాటాలను పరిశీలిస్తూ ఎంతో స్ఫూర్తి పొందిన జర్మన్ కమ్యూనిస్టు నాయకురాలు క్లారా జెట్కిన్ ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్టమైన రోజున ప్రపంచవ్యాప్తంగా మహిళలు తమ డిమాండ్ల కోసం ఒత్తిడి తెచ్చేందుకు కేంద్రీకరించాలని 1910లో 'కోపెన్ హెగెన్'లో జరిగిన రెండవ కాన్ఫరెన్స్‌లో ప్రతిపాదించింది. 17 దేశాలకు చెందిన 100 మంది మహిళా ప్రతినిధులు దీనిని ఏక గ్రీవంగా ఆమోదించారు. అప్పటినుంచి సోషలిస్టు పార్టీ పిలుపు నందుకొని మరిన్ని దేశాలలో మార్చి 8న మహిళా సమస్యలపై నిరసన కార్యక్రమాలు జరిగాయి.

1912లో గౌరవప్రదమైన జీవితం కోసం 'మాకు రొట్టెలే కాదు గులాబీలు కావాలి' అంటూ ప్లకార్డ్స్ పట్టుకొని ప్రదర్శన చేశారు. 'బ్రెడ్ అండ్ రోజెస్' పాట మార్చి 8 కవాతు గీతం అయింది. 1917లో రొట్టె, శాంతి కోసం డిమాండ్ చేస్తూ జరిపిన మహిళా దినం రష్యా విప్లవాన్ని ఒక మలుపు తిప్పింది. సోషలిస్టు దేశాలలో మొదటగా ఈ డిమాండ్లను పరిష్కరిస్తూ మార్చి 8న సెలవు దినంగా ప్రకటించారు. 1975లో ఐక్యరాజ్యసమితి మార్చి 8ని 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'గా జరపాలని ప్రకటించింది.

శ్రామిక మహిళలు చేసిన పోరాట ఫలితాలు ఆఫీసుల్లో పనిచేసే కొద్ది మంది మహిళలకే దక్కాయి. రాజకీయ పార్టీలు మహిళలను ఓటుబ్యాంకుగా మాత్రమే చూస్తూ ఎన్నికల ముందు వాగ్దానాలు చేసి తర్వాత మరచిపోతున్నాయి. తమ సమస్యలపై ప్రశ్నిస్తూ మార్చి 8 స్ఫూర్తితో పోరాడితేనే మహిళల జీవితాలలో మార్పు వస్తుంది.

– రాధ, చైతన్య మహిళా సంఘం

ఇన్ బాక్స్

బేటీకి రక్షణ ఏది?

దేశంలో 'బేటీ బచావో, బడావో' నినాదం వట్టి మాట అయిపోయింది. అందుకు విరుద్ధంగా నానాటికీ ముక్కుపచ్చలారని ఆడపిల్లలు, మహిళలపై అకృత్యాలు పెరిగిపోతున్నాయి. ఎన్సీఆర్బీ రిపోర్ట్ ప్రకారం 2019 లో దేశంలో మహిళలపై అత్యాచారాలూ, ఇతర దాష్టీకాలు 4,05,861 జరిగాయి. ప్రతి రోజూ సగటున 66 అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసినా నిందితులకు కేస్‌లలో శిక్షలు పడింది తక్కువే. 2017లో నమోదైన కేసులలో కేవలం 24 శాతం కేసుల్లో మాత్రమే శిక్షలు పడ్డాయి. నేషనల్ కమిషన్ ఫర్ విమెన్ (ఎన్సీడబ్ల్యూ) ప్రకారం 2021లో మహిళలపై జరిగిన నేరాలపై వచ్చిన ఫిర్యాదులు 2020లో ఉన్న వాటితో పోలిస్తే 46 శాతం ఎక్కువ అని తేలింది. 2024 ఫిబ్రవరి దాక చూసినా నానాటికీ స్త్రీలపై అకృత్యాలు పెరుగుతున్న సత్యం స్పష్టమయ్యింది. చాలా సంఘటనలు రిపోర్ట్ కూడా కావడం లేదు. ఉత్తరప్రదేశ్, ఢిల్లీలు ఈ అకృత్యాల్లో అగ్రభాగాన ఉన్నాయి. ఇక్కడ నేరం చేస్తున్న వారిలో 80 శాతం మందికి ఏదో ఒక రాజకీయ పార్టీ అండ దండలు ఉండడం, ఈ కారణంగా పోలీసులు వారికి మద్దతుగా నిలవడంతో కోర్టులో కేసులు వీగిపోతున్నాయి.

షాహీన్ భాగ్ పోరాటం, మహిళా రెజిలర్లపై బీజేపీ ఎంపీ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా సాగిన పోరు, బిల్కిస్ బానో న్యాయ పోరాటం వంటి వాటి స్ఫూర్తితో ఎక్కడికక్కడ మహిళలు తమకు జరిగిన అన్యాయాలకు వ్యతిరేకంగా తామే ఉద్యమించాలి. వీరికి పురోగామి పురుషులు మద్దతుగా నిలిచి ఆత్మస్థయిర్యాన్ని కలిగించాలి.

తమపై జరిగే అమానవీయ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టడం, నేరస్థులకు శిక్షపడేలా చేయడం వంటివి మహిళా ఉద్యమాల లక్ష్యాల్లో కొన్ని మాత్రమే. నిజానికి ఇలా అకృత్యాలూ, దాడులూ జరగడానికి మహిళను పురుషునితో సమానంగా చూడలేని సంప్రదాయ భారతీయ సమాజంలోని అసమ భావమే కారణం. అందుకే మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో పురుషులతో సమానంగా అవకాశాలు పొందడానికి పోరాటాలు చేయాలి. అవి ఫలించిననాడే మహిళా దినోత్సవ స్ఫూర్తి వెల్లివిరిసినట్టు లెక్క.

– ఎమ్.డి. మునీర్, సీనియర్ జర్నలిస్ట్

పోరాడి గెలిచిన వనితలు



డా॥ నాగసూరి వేణుగోపాల్

విజ్ఞాన శాస్త్ర రంగాల్లో మహిళల భాగస్వామ్యం ఎంత ఉంది అనే ఆలోచన కొత్తది కాదు! మన భారతదేశం వరకు తీసుకుంటే... సైన్సు, టెక్నాలజీ, ఇంజనీరింగ్ వంటి రంగాల్లో విశేష ప్రతిభ కనపరచినవారికి కేంద్రప్రభుత్వం ఇచ్చే 'పద్మ' పురస్కారాలు పొందిన మహిళలు ఆరు దశాబ్దాల కాలంలో సుమారు మూడు శాతం ఉన్నారు. అదే వైద్య రంగానికి వచ్చేటప్పటికి సుమారు 8 శాతం దాకా ఉన్నారు. మరి ప్రపంచ స్థాయిలో పరిస్థితి ఎలా ఉంది? సైన్స్, మెడిసిన్ వంటి రంగాల్లో నోబెల్ బహుమతి పొందిన మహిళలు ఎంతమంది ఉంటారు? మొదటి 12 దశాబ్దాల కాలాన్ని పరిశీలిస్తే వారు సుమారు మూడు శాతాన్ని మించలేదు.

సైన్సు, ఇంజనీరింగ్, టెక్నాలజీ రంగాల కంటే ముందు మెడిసిన్‌కు సంబంధించిన విజ్ఞాన శాస్త్రం విచ్చుకున్నది. భారతదేశపు వైద్య రంగానికి సంబంధించి మద్రాస్ మెడికల్ కాలేజీ చాలా ప్రతిష్ఠాత్మకమైన పాత్రను మొదటి నుంచి పోషించింది. మొట్టమొదటి మూడు సంవత్సరాల ఎల్ఎంఎస్ (లైసెన్షియేట్ మెడిసిన్ అండ్ సర్జరీ) కోర్సులో నలుగురు ఉత్తీర్ణులయ్యారు. అందులో మేరీ స్కార్లీబ్ అనే విదేశీమహిళ కూడా క్వాలిఫై అయ్యారు. అప్పటి నుంచి మన భారతీయ మహిళలు మనదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ వైద్యులుగా డిగ్రీలు పొందుతూ ఆ వృత్తిలో రాణిస్తూ వచ్చారు. 1886లో కాదంబిని గంగూలీ కలకత్తా మెడికల్ కాలేజీలో తొలి వైద్య పట్టా పొందారు. అదే సంవత్సరం ఆనందీబాయి జోషి గ్రాడ్యుయేట్ ఇన్ మెడిసిన్ డిగ్రీని అమెరికాలోని ఫిలడెల్ఫియాలోని 'ఉమెన్స్ మెడికల్ కాలేజీ' నుంచి పొందారు. ఇక వైద్యశాస్త్రంలో ఎమ్‌డీ పట్టా విషయానికి వస్తే 1892లో 'పెన్సిల్వేనియా ఉమెన్స్ మెడికల్ కాలేజ్' నుంచి గురుభాయ్ కర్మార్కర్ అనే మహిళ; తర్వాత రెండేళ్లకు అంటే 1894లో 'లండన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ఫర్ వుమెన్' నుంచి రుక్మాబాయి పొందారు.

వీరి జీవితాలను పరిశీలిస్తే ఒక్కొక్కరిది ఒక్కో పోరాటంతో కూడిన విషాద గీతిక! కాదంబినీ గంగూలీ కోర్సు 1886లో పూర్తిచేసినా పట్టా చేతికి రాలేదు. మెడిసిన్‌లో ఆమె ఫెయిల్ అయ్యింది. దానికి కారణం ఏంటంటే ప్రొఫెసర్ ఆర్.సి. చంద్ర అనే అధ్యాపకుడికి మహిళా విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వడమే ఇష్టం లేదు కనుక.



రుక్మాబాయి



అసిమా ఛటర్జీ



జానకి అమ్మాళ్



కమలా సోహోనీ

ఆనందీబాయి విషయం ఇంకో రకంగా ఉంది. ఆమె 14వ ఏటా తల్లి అయింది, కానీ ఆ పసికందు సరైన వైద్య సదుపాయం లేక బతికి బట్టకట్టలేదు. ఇటువంటి పరిస్థితి తమ గ్రామంలో మరే మహిళకు కూడా ఎదురు కాకూడదు అనే పట్టుదలతో తన భర్త ప్రోత్సాహంతో అమెరికాలోని పెన్సిల్వేనియా ఉమెన్స్ మెడికల్ కాలేజీలో 1886లో వైద్య పట్టాను పొంది, భారతదేశం తిరిగి వచ్చారు. కొల్హాపూర్ సంస్థానంలో రెసిడెంట్ డాక్టర్‌గా ఉద్యోగంలో చేరక ముందే 1887లో క్షయతో కన్నుమూశారు.

రుక్మాబాయి పరిస్థితి మరోలా ఉంది. 11 ఏళ్ళకే ఆమెకు 20 ఏళ్ల దాదాజి భికాజితో పెళ్లయింది. ఆమె భర్త పేదవాడు, విద్యాగంధం ఎరుగనివాడు. పెళ్ళినాటికి అంగీకారానికి వచ్చిన విషయం ఏంటంటే ఆ భర్త చదువుకొని యోగ్యుడై రుక్మాబాయిని అత్తవారింటికి తీసుకువెళ్లాలని. అయితే రుక్మాబాయి రజస్వలయ్యేటప్పటికి దాదాజికి విద్య మీద పూర్తిగా ఆసక్తి లేకుండా పోయింది. రుక్మాబాయి అత్తవారింటికి వెళ్లడానికి తిరస్కరించడం, తద్వారా ఆ రెండు కుటుంబాల మధ్య ఇది ఒక తగాదా గానూ, సమస్యగానూ మారింది. ఆమె లండన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లో 1884లో పట్టా పొందడమే కాకుండా, తర్వాత బ్రెస్సల్స్ నుంచి ఎమ్‌డీ కూడా పొంది వైద్య వృత్తిలో రాణించింది.

ఇక సైన్సు, ఇంజనీరింగ్, టెక్నాలజీ వంటి కోర్సుల్లో మహిళల ప్రవేశం సంగతికొస్తే... మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాలలో బాటనిలో బీఎస్సీ పట్టాను 1921లో జానకి అమ్మాళ్ పొందారు. తర్వాత 10 ఏళ్లకు 1931లో ఆమె అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మిచిగాన్‌లో డీఎస్సీ పొందారు. ఇక బొంబాయి యూనివర్సిటీలో బీఎస్సీ పట్టాను 1933లో కమలా సోహోని; యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ నుంచి రాధా పంత్ 1934లో బీఎస్సీ పట్టా పొందారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ తొలి ఫెలో జానకి అమ్మాళ్. బీఎస్సీ కెమిస్ట్రీ పట్టా పొందిన తొలి భారతీయ మహిళ అసిమా ఛటర్జీ. తొలి పీహెచ్‌డీ పొందిన మహిళ కమలా సోహోని.

ఇంకా విజ్ఞాన శాస్త్ర రంగాల్లో మన దేశంలో మొట్టమొదటి అధ్యాపకుల విషయానికొస్తే రాధా పంత్ 1945లో తొలి ఫ్యాకల్టీ మెంబర్ అయ్యారు. రాజేశ్వరి ఛటర్జీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో యూనివర్సిటీ ఎమ్మెస్ పట్టా పొందిన తొలి మహిళ. సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) సంస్థ నుంచి అవార్డు పొందిన తొలి మహిళ అసిమా ఛటర్జీ.

అయితే మనం అనుకున్నంత సులువుగా వీళ్లంతా ఈ ప్రత్యేకతలు గడించలేదు. ఆ నేపథ్యం చూడాలంటే వారి జీవన పోరాట పథాలను పరిశీలించాలి!

వ్యాసకర్త ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి
మొబైల్: 94407 32392

ఇటు చూడండి

ప్రశ్న ఆమే
జవాబూ ఆమే!
ఈ పితృస్వామ్య లోకంలో
పట్టలేని ఆశాజీవులను
కని పెంచాల్సిన తల్లీ ఆమే!
అడుగులకు మడుగులొత్తకున్నా
అందలాలెక్కించకున్నా
అందరూ సమానమనే
ఇంగితాన్ని నేర్పని సమాజానికి
తరగని సవాల్ కూడా ఆమే!

– డాక్టర్ కొండపల్లి నీహారిణి



ఆమె...

ప్రపంచంలో
ప్రేమ పలు రూపాల్లో పలు పాత్రల్లో
కనిపించే బలమైన బంధం
ప్రతి ఒక్కరి బతుకులో
కొండంత గొప్పగా
ఊహించని ఆధారం
కోరని వరంగా కురిసే ఆనందం
అమ్మ, అక్క, చెల్లి, భార్య
పాత్ర ఏదైనా జీవితంలో
ఘనమైన ప్రేమకు 'ఆమె' నిజరూపం.

– శ్రీ సాహితి



ఎక్కడ స్త్రీలు పూజలందుకుంటారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని పురాణాలు చెబుతున్నాయి. అందుకేనేమో.. స్త్రీవాద రచయిత చలం తన రచనల్లో.. 'స్త్రీకి శరీరం ఉంది.. దానికి వ్యాయామం ఇవ్వాలి.. ఆమెకు మెదడు ఉంది.. దానికి జ్ఞానం ఇవ్వాలి.. ఆమెకు హృదయం ఉంది.. దానికి అనుభవం ఇవ్వాలి..' అని ఉన్నతంగా చెప్పారు. 'ముదితల్ నేర్వగరాని విద్యగలదె.. ముద్దారగ నేర్పించినన్.' అన్నారో కవి. ఆచరణకొచ్చేసరికి అతివల మాటకు విలువిచ్చే నేతలెందరుంటారు? వారికి సమున్నతంగా రాజకీయ పదవులు ఇచ్చి గౌరవించే నాయకులు ఎందరుంటారు?మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం 'నేనున్నా..' అని మహిళాలోకాన్ని అన్నింటా ముందు వరుసలో నిలిపి, ఊహలకు ఆచరణ రూపమిచ్చిన ధైర్యశాలి. అచ్చమైన మహిళా పక్షపాతి. కందుకూరి, గురజాడల ఆదర్శ బాటసారి.

మన మహిళల రాజసం

'నేను ఒక స్త్రీని కాబట్టి నన్ను ఎవరు ఎదగనిస్తారు.. అన్నది ప్రశ్న కాదు. ఆత్మ విశ్వాసం ఉన్న నన్ను ఎవరు ఆపగలుగుతారు.. అన్నది ప్రశ్న.' ప్రముఖ రచయిత్రి, తత్వవేత్త అయిన్ ర్యాండ్ చెప్పిన ఈ మాటలకు అర్థం ఈ రోజు మన రాష్ట్రంలో కళ్లెదుటే కనిపిస్తోంది. అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతున్న ప్రతి మహిళలోనూ కన్పిస్తున్న ఆత్మవిశ్వాసమే అందుకు నిదర్శనం. రాష్ట్రంలో సామాజిక సాధికారత సాధించడానికి 2019 మే 30న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వేదిక నుంచే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. రాజకీయ, విద్య, ఆర్థిక, మహిళా సాధికారత ద్వారా సామాజిక సాధికారత సాధించడానికి రచించిన ప్రణాళికను 58 నెలలుగా చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారు. కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకూ పదవుల్లో సింహభాగం వాటా ఇచ్చి పరిపాలనలో భాగస్వామ్యం కల్పించడం ద్వారా రాజకీయ సాధికారత సాధించారు. అదే ఒరవడిలో అమ్మ ఒడి, ఆసరా, చేయూత వంటి పథకాల అమలుతో తరుణీమణులకు చేయూతనిచ్చి ఆర్థిక సాధికారత సాధించారు. విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాల ద్వారా విద్యా సాధికారత, మహిళా సాధికారతకు బాటలు వేశారు. ఆ అవకాశాలను అందిపుచ్చుకున్న మహిళలు సాధికారత సాధించారు. ప్రధానంగా మహిళా రాజకీయ సాధికారతలో దేశంలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది.

సాక్షి, అమరావతి

మహిళా రాజకీయ సాధికారతలో మనమే నంబర్ వన్

- దేశ చరిత్రలో తొలిసారిగా ఎస్సీ మహిళను హోంమంత్రిగా నియమించిన సీఎం వైఎస్ జగన్
- శాసనమండలి చరిత్రలో డిప్యూటీ చైర్‌పర్సన్‌గా తొలిసారి మైనార్టీ మహిళకు అవకాశం
- కేబినెట్‌లో నలుగురికి అవకాశం.. హోం, వైద్యారోగ్య, మహిళా శిశు సంక్షేమం వంటి కీలక శాఖల అప్పగింత
- సర్పంచి, మండల పరిషత్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్.. మునిసిపల్ చైర్‌పర్సన్, మేయర్ పదవుల్లో మహిళలకు అగ్రతాంబూలం
- నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ చేస్తూ చట్టం
- 1,356 రాజకీయ నియామక పదవుల్లో 688 మహిళలకే
- ఇలా మహిళలకు పదవుల కల్పన రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి

కేబినెట్ నుంచి స్థానిక సంస్థల దాకా..

కేబినెట్ నుంచి స్థానిక సంస్థల వరకూ పదవుల్లో మహిళలకు సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేశారు. దేశ చరిత్రలో హోంమంత్రిగా తొలిసారి ఎస్సీ మహిళ మేకతోటి సుచరితను నియమించారు. శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్‌గా ముస్లిం మహిళను ఎంపిక చేశారు. మండలి చరిత్రలో ముస్లిం మహిళను డిప్యూటీ చైర్ పర్సన్‌గా నియమించడం ఇదే తొలిసారి. మంత్రివర్గంలో నలుగురు మహిళలు తానేటి వనిత, కేవీ ఉషాశ్రీ చరణ్, విడదల రజిని, ఆర్కే రోజాలకు స్థానం కల్పించారు. హోం, వైద్యారోగ్య, మహిళా శిశుసంక్షేమం వంటి కీలక శాఖలు వారికి అప్పగించి పరిపాలనలో భాగస్వామ్యం కల్పించారు. రాష్ట్ర తొలి చీఫ్ సెక్రటరీగానూ, ఆ తర్వాత రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నీలం సాహ్నిని నియమించారు.

- రాష్ట్రంలో 13 జెడ్పీ చైర్‌పర్సన్ పదవుల్లో ఏడుగురు (54 శాతం) మహిళలకు అవకాశం ఇచ్చారు.
- 26 జెడ్పీ వైస్ చైర్‌పర్సన్‌లలో 15 మంది (58 శాతం) మహిళలకు పదవీయోగం కల్పించారు.
- 12 మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ పోస్టులు, 24 డిప్యూటీ మేయర్ పదవులు.. మొత్తంగా 36 పదవుల్లో.. 18 అంటే 50 శాతం పదవులు మహిళలకు ఇచ్చారు.
- మొత్తం మునిసిపల్ కార్పొరేషన్లలో 671 మంది కార్పొరేటర్లు ఉంటే.. అతివలకే 54 శాతం అంటే 361 పదవులు దక్కాయి.
- 75 మునిసిపాలిటీలకు ఎన్నికలు జరిగితే వాటిలో 73 చోట్ల వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. వాటిలో 45 మంది.. అంటే 64 శాతం మహిళలే చైర్‌పర్సన్లు.
- ఈ మునిసిపాలిటీల్లోని 2,123 వార్డు మెంబర్లలో 1,161 మంది.. అంటే 55 శాతం ప్రమదలకే దక్కేట్లు చేశారు.
- సర్పంచి పదవుల్లో 57 శాతం, ఎంపీటీసీల్లో 54 శాతం, మండలాధ్యక్షుల్లో 53 శాతం, జెడ్పీటీసీల్లో 53 శాతం ముదితలకే దక్కేలా చర్యలు తీసుకున్నారు.
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన దాదాపు 2.65 లక్షల వలంటీర్ ఉద్యోగాల్లో 53 శాతం వనితలనే నియమించారు. ఇంకా దాదాపు 1.34 లక్షల మంది గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో.. 51 శాతం వనితలే ఉన్నారు.

చరిత్రాత్మక చట్టం చేసి మరీ పదవులు

నామినేటెడ్ పదవులు, నామినేషన్ విధానంలో ఇచ్చే కాంట్రాక్టు పనుల్లో 50 శాతం ఇంతులకు ఇచ్చేలా సీఎం జగన్ ఏకంగా చట్టం చేశారు.

దేశ చరిత్రలో నామినేషన్ పదవుల్లో, పనుల్లో 50 శాతం నారీమణులకు రిజర్వేషన్ చేస్తూ చట్టం చేసి మరీ న్యాయం చేయడం ఇదే తొలి సారి. ఆ చట్టంలో పేర్కొన్న దాని కంటే నామినేటెడ్ పదవుల్లో 51 శాతం పదవులు పడతులకే ఇచ్చారు.

మొత్తం 1,154 డైరెక్టర్ పదవుల్లో 586 పదవులు ప్రమదాలోకానికే ఇచ్చారు. రాష్ట్రంలో 202 మార్కెట్ యార్డు చైర్మన్ పదవుల్లో 102 మహిళలకే ఇచ్చారు. అంటే మొత్తంగా 1,356 రాజకీయ నియామక పదవుల్లో 688, అంటే అక్షరాలా 51 శాతం తరుణీమణులకే కేటాయించారు.

ప్రగతి దిశగా

బాలికా చదువు



పాఠశాలల్లో ప్రత్యేక సదుపాయాలు

- నూరు శాతం టాయిలెట్లు ఏర్పాటు
- 9.74 లక్షల మంది కౌమార బాలికలకు 'స్వేచ్ఛ' ప్యాడ్స్ పంపిణీ
- రక్తహీనత నివారణకు వైద్య పరీక్షలు, మాత్రల పంపిణీ
- అమ్మ ఒడి ఊతం.. కమ్మటి భోజనం
- పాఠశాలల్లో పెరిగిన బాలికల సంఖ్య

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాల అంటే బాలికలకు గతంలో ఓ నరకం.. చదువుకుందామని ఆశ ఉన్నా సదుపాయాలు ఉండేవి కావు. కనీసం టాయిలెట్ కూడా లేని దుస్థితి. కౌమార దశ బాలికల పరిస్థితి మరీ దారుణం. దాంతో చాలామంది 8 లేదా 9 తరగతిలోనే చదువు మానేసేవారు. అత్యధిక బాలికల డ్రాప్ అవుట్స్ కూడా ఈ తరగతుల్లోనే ఉండేవి. ఈ సమస్యను గుర్తించిన సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం బాలికలు చదువుల ఆకాంక్షను నెరవేర్చేందుకు అవసరమైన సదుపాయాలను కల్పించింది. ప్రతి ప్రభుత్వ పాఠశాలలోను నాడు–నేడు ప్రాజెక్టులో 100 శాతం నిరంతర నీటి సరఫరాతో టాయిలెట్లు, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకునేందుకు ప్రత్యేక గదిని అందుబాటులోకి తెచ్చింది. స్కూలు స్థాయిలోనే వారి ఆరోగ్యంపైనా దృష్టిపెట్టి, రక్తహీనత ఉన్న బాలికలకు ఫోలిక్ ఐరన్ మాత్రలను అందిస్తోంది. ఏటా కౌమర దశ బాలికలు 9.74 లక్షల మందికి 'స్వేచ్ఛ' పేరిట శానిటరీ న్యాప్‌కిన్స్‌ను ఇస్తోంది. ఈ తరహా సేవలు నూరుశాతం అందిస్తున్న రాష్ట్రాల్లో దేశంలో ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. ఫలితంగా గత నాలుగేళ్లుగా బడుల్లో బాలికల సంఖ్య పెరిగింది. ఉత్తీర్ణతలోనూ వారు ముందున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్స్ సాధనలోనూ బాలురు కంటే బాలికలే ముందున్నారు.

బాలికలకు నూరు శాతం సదుపాయాలు

పాఠశాల స్థాయిలో డ్రాప్ అవుట్స్‌కు ప్రధాన కారణం టాయిలెట్లు, గతంలో పట్టణాల్లోని కొన్ని ప్రభుత్వ బడుల్లో మాత్రమే అరకొరగా ఉండేవి. దాంతా విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు చాలా ఇబ్బంది పడేవారు. టాయిలెట్ల సదుపాయం లేని చోట్ల కౌమర బాలికలు తమ చదువుకు స్వస్తి పలికేవారు. రాష్ట్ర ప్రభుత్వం మనబడి నాడు–నేడు ప్రాజెక్టు ప్రారంభించి ప్రతి పాఠశాల, జూనియర్ కళాశాలలోను టాయిలెట్ల నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం 49,293 ప్రభుత్వ స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో నీటి సరఫరాతో టాయిలెట్లు అందుబాటులోకి వచ్చినట్టు కేంద్ర ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. 45,137 పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక గది, టాయిలెట్లు ఉన్నట్టు ప్రకటించింది. ఫలితంగా బాలికల డ్రాప్ అవుట్స్ తగ్గిపోవడమే గాక చేరికలు పెరిగాయి. 2018–19 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో బాలికల సంఖ్య 18,80,591 మంది ఉంటే 2023–24లో 19,26,724 మందికి పెరిగింది. డ్రాప్ అవుట్స్ కూడా 2018–19లో 16.37 శాతం నుంచి 2023–24 నాటికి 12 శాతానికి తగ్గిపోయింది. దీంతో పాటు బాలికల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) గణనీయంగా పెరిగింది.

'స్వేచ్ఛ'గా చదువుకునేలా..

దేశంలో 23 శాతం బాలికలు రుతుక్రమ సమయంలో పాఠశాలలు, కళాశాలలకు దూరంగా ఉంటున్నారని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలోనూ ఇదే పరిస్థితి ఉండేది, పాఠశాల స్థాయిలో అధిక డ్రాప్ అవుట్స్‌కు ఇదే కారణంగా ఉండేది. బాలికల డ్రాప్ అవుట్స్‌కు కారణమవుతున్న రుతుక్రమ ఇబ్బందులను పరిష్కరించేందుకు 2020–21 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం 'స్వేచ్ఛ' పథకాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఏడు నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న కిశోర బాలికలకు నెలకు 10 చొప్పున ఏడాదికి 120 శానిటరీ ప్యాడ్స్‌ను పంపిణీ చేస్తోంది. ఏడాదికి 12 కోట్ల ప్యాడ్స్‌ను బాలికలకు ఉచితంగా అందిస్తున్నారు. 10,144 పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లోని 9,74,121 మంది కౌమార బాలికలకు వీటిని అందిస్తోంది. ఇప్పుడు బాలికల డ్రాప్ అవుట్స్ తగ్గాయి. చదువుపై దృష్టి పెట్టడంతో ఫలితాల సాధనలోనూ బాలురను మించిపోయారు.

అమ్మఒడి .. జగనన్న గోరుముద్ద

చిన్నారుల చదువుకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సీఎం జగన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన పథకం అమ్మ ఒడి. ప్రభుత్వంతోపాటు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏటా రూ.15 వేలు క్రమం తప్పకుండా ప్రభుత్వం అందజేస్తోంది. దీనివల్ల విద్యార్థుల హాజరు గణనీయంగా పెరిగింది. దీనికి తోడు రోజుకొక మెనూతో మధ్యాహ్న భోజనం చక్కగా అమలవుతోంది.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి

సాక్షి, అమరావతి: దేశంలో మహిళలు అన్ని రంగాల్లో విశేష ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తూ రాణిస్తున్నారని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గుంటూరు జిల్లా మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డీఆర్‌డీవో, ఇస్రో వంటి సంస్థల విజయాల్లో మహిళలు ప్రధాన భూమిక పోషించారన్నారు. మహిళలకు అన్ని సందర్భాల్లో అందుబాటులో ఉండే విధంగా ఆధునిక టెక్నాలజీతో ప్రవేశపెట్టిన దిశ మొబైల్ అప్లికేషన్‌ను స్వల్ప వ్యవధిలోనే 1.3 కోట్ల మందికిపైగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం ఒక గొప్ప విషయమన్నారు. ఆరు సార్లు హిమాలయ పర్వతాలను అధిరోహించిన అకౌంట్స్ విభాగం జేఏవో పద్మావతిని అభినందించి రూ.25 వేలు నగదు బహుమతిని అందించారు. ఆమె ఎవరెస్ట్ అధిరోహించడానికి అవసరమైన వైద్య పరీక్షలు, ఇతర సౌకర్యాల కల్పనకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. సీఐడీ, ఎఫ్‌ఎస్‌ఎల్, సాంకేతిక విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబర్చిన మహిళా సిబ్బందికి డీజీపీ బహుమతులు ప్రదానం చేశారు. అదనపు డీజీ (శాంతి–భద్రతలు) బాగ్చి, అదనపు డీజీ (సీఐడీ) సంజయ్, డీఐజీ రాజకుమారి పాల్గొన్నారు.

ఐక్యరాజ్య సమితిలో రాష్ట్ర మహిళల వాణి

ఉమెన్స్ డే సదస్సుకు కర్రి జయశ్రీ, నారమల్లి పద్మజ

మహిళా సంక్షేమానికి సీఎం జగన్ చేపడుతున్న చర్యలను వివరిస్తామని వెల్లడి

సాక్షి, అమరావతి: న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సభ్యురాలు కర్రి జయశ్రీ రెడ్డి, మహిళా, శిశు సంక్షేమ సలహాదారు నారమల్లి పద్మజకు అవకాశం లభించింది. యుఎన్ ఉమెన్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాల్లో జయశ్రీ, పద్మజ ఏపీ ప్రజల వాణిని విన్పించనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో గత 58 నెలలుగా ఏపీలో మహిళా సాధికారతకు జరిగిన కృషిని వివరిస్తామని జయశ్రీ, పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మహిళల స్థితిగతులపై ఈ నెల 11 నుంచి 22 వరకు ఐక్యరాజ్య సమితి మహిళా విభాగం 68వ విస్తృత స్థాయి సదస్సు నిర్వహిస్తోందన్నారు. ఈ సదస్సులో ప్రభుత్వాలు, ఐక్యరాజ్య సమితి అనుబంధ విభాగాలు, ఎన్‌జీవోల నుంచి భారీ సంఖ్యలో ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. అమ్మ కడుపులో బిడ్డ నుంచి పండు ముసలి వరకు రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అందిస్తున్న అనేక పథకాల గురించి వివరించనున్నట్టు వారు తెలిపారు. ప్రతి దశలో మహిళల సమగ్ర అభివృద్ధి కోసం ఎంతో శ్రద్ధతో సీఎం జగన్ చేపడుతున్న కార్యక్రమాలపై డాక్యుమెంటరీని సమర్పిస్తామని వివరించారు. అన్నలా ఆదరించే నాయకత్వం ఉన్న సమాజాల్లో మహిళలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యా సాధికారతలతో పాటు 'దిశ' ద్వారా భద్రత కూడా ఎంతగా లభిస్తోందో తెలియజేస్తామన్నారు. అమ్మ ఒడి వంటి స్కీమ్‌ను మిగతా సమాజాలు కూడా అనుసరించాలని కోరతామన్నారు. వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, చేయూత వంటి అనేక కార్యక్రమాలను మహిళలే కేంద్రంగా అమలు చేస్తున్న తీరును ప్రపంచానికి తెలియజేస్తామని చెప్పారు. 31 లక్షల ఇళ్ల పట్టాల పంపిణీ, 22 లక్షల ఇళ్ళ నిర్మాణం వంటి అంశాలను సదస్సులో వివరించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.



కర్రి జయశ్రీరెడ్డి



నారమల్లి పద్మజ

నమ్మించి ముంచేశారు

ఆందోళన బాట పట్టిన టీడీపీ శ్రేణులు

- గుంతకల్లుల్లో గుమ్మనూరు వద్దంటూ ర్యాలీ
- తంబళ్లపల్లిలో జయచంద్రారెడ్డి కారుపై రాళ్లదాడి
- నిడదవోలులో దుర్గేశ్‌కు నిరసన సెగ
- పిఠాపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ లేఖలు దహనం
- కోవూరు తెరపైకి వేమిరెడ్డి

సాక్షి, గుత్తి/పెద్దతిప్పసముద్రం/నిడదవోలు/పిఠాపురం/నెల్లూరు: నమ్ముకున్న వారిని నట్టేట ముంచుతున్న చంద్రబాబు తీరుపై టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన బాట పడుతున్నాయి. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తుండడంతో ఇంతవరకు పార్టీని అంటిపెట్టుకున్న తాము అంటరానివారైపోయామని ఆశావహులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా నేతల అనుచరవర్గాలు దీన్ని జీర్ణించుకోలేక రోడ్డెక్కి నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల విధ్వంసాలు చోటు చేసుకుంటున్నాయి. ఇది ఆయా ప్రాంతాల్లో ఉద్రిక్తతలకు దారి తీస్తోంది.

గుమ్మనూరుకు సీటిస్తే ఓడిస్తాం

మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంకు గుంతకల్లు టీడీపీ టికెట్ ఇస్తే డిపాజిట్లు రాకుండా ఘోరంగా ఓడిస్తామని టీడీపీ శ్రేణులు హెచ్చరించాయి. గురువారం సాయంత్రం అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గంలోని గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాలకు చెందిన మాజీ ఎమ్మెల్యే జితేందర్ గౌడ్ వర్గీయులు గుత్తిలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి గాంధీ, రాయల్, ఎన్టీఆర్ సర్కిళ్ల వరకు ర్యాలీ చేశారు. 'గుమ్మనూరు వద్దు, జితేందర్ గౌడ్ ముద్దు', 'ఆలూరులో పనికి రాని చెత్త గుంతకల్లులో పనికి వస్తుందా', 'పేకాట, మద్యం గుమ్మనూరు మాకొద్దు' అంటూ నినాదాలు చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ... గుమ్మనూరు జయరాంకు గుంతకల్లు ఎమ్మెల్యే సీటు ఇస్తే డిపాజిట్లు రాకుండా దారుణంగా ఓడిస్తామన్నారు. రౌడీ భావజాలమున్న గుమ్మనూరుకు సీటు ఇస్తే ప్రశాంత వాతావరణం దెబ్బతింటుందని పేర్కొన్నారు. 35 సంవత్సరాల పాటు జితేందర్ గౌడ్ కుటుంబం టీడీపీకి సేవలు చేసిందని, అలాంటి కుటుంబాన్ని పక్కన పెట్టి పేకాట నిర్వాహకుడు గుమ్మనూరుకు ఎలా సీటు కేటాయిస్తారని ప్రశ్నించారు.

టి.సదుంలో ఉద్రిక్తత

అన్నమయ్య జిల్లా తంబళ్ళపల్లి నియోజకవర్గంలోని టీడీపీలో విభేదాలు భగ్గుమంటున్నాయి. మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌కే అసెంబ్లీ టికెట్ దాదాపుగా ఖరారైందని అనుకుంటున్న సమయంలో రాజకీయ అరంగేట్రానికి తెర లేపిన జయచంద్రారెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడంతో శంకర్ వర్గీయులు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. చంద్రబాబు ఏకపక్ష నిర్ణయంపై పునరాలోచించి ప్రజాదరణ ఉన్న శంకర్‌కు టికెట్ కేటాయించాలని కోరుతూ ఆయన అనుచరులు ఇటీవల రోడ్డెక్కి నిరసనలకు దిగారు. తాజాగా గురువారం టి.సదుంలో జయచంద్రారెడ్డి ఇంటింటా ప్రచారానికి రావడంతో ఆగ్రహంతో ఉన్న ఓ వ్యక్తి జయచంద్రారెడ్డి కారు అద్దాలను పగులగొట్టాడు. దీంతో కొంతసేపు గ్రామంలో ఘర్షణ నెలకొంది. ఎస్‌ఐ రవీంద్రబాబు ఇరు వర్గాలను చెదరగొట్టారు. దీనిపై ఫిర్యాదు చేయడానికి జయచంద్రారెడ్డి నిరాకరించారు. ఆయన వెంట ప్రచారం చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో ఆలయంలో పూజలు నిర్వహించి వెనుదిరిగారు.



గుంతకల్లులో భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

నిడదవోలులో ఆందోళన

పొత్తులో భాగంగా జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్‌కు నిడదవోలు టికెట్ కేటాయిస్తున్నారనే ప్రచారంతో టీడీపీ వర్గాలు భగ్గుమంటున్నాయి. తాజాగా గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిడదవోలు పట్టణంలో ఆందోళన చేపట్టారు. నిడదవోలు పట్టణం, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు మద్దతుగా ప్లకార్డులతో పాదయాత్ర చేపట్టారు. గణేష్ చౌక్ సెంటర్, గణపతి సెంటర్ మీదుగా యర్నగూడెం రోడ్డులోని టీడీపీ పట్టణ కార్యాలయం వరకూ పాదయాత్ర నిర్వహించారు. శేషారావు నాయకత్వం వర్ధిల్లాలి, శేషారావు జిందాబాద్, నిడదవోలు గడ్డ – శేషారావు అడ్డా అంటూ నినదించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ, నిడదవోలు టికెట్ శేషారావుకు కాకుండా బయటి వ్యక్తులకు ఎవరికిచ్చినా మూకుమ్మడి రాజీనామాలకు వెనుకాడబోమని హెచ్చరించారు. టీడీపీ అధిష్టానం పునరాలోచించుకోవాలని సూచించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రాచమళ్ళ శ్రీనివాస్, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కారింకి సాయిబాబు, పార్లమెంటరీ అధికార ప్రతినిధి బుగ్గే శివరామకృష్ణశాస్త్రి, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల టీడీపీ అధ్యక్షులు వెలగన సూర్యారావు, సింహాద్రి రామకృష్ణ, అతికాల శ్రీను తదితరులు నాయకత్వం వహించారు.

పిఠాపురంలో అసమ్మతి సమావేశం

చంద్రబాబుకే క్లారిటీ లేదు.. ఇంక మా భవిష్యత్తుకేం గ్యారెంటీ ఇస్తాడు' అంటూ కాకినాడ జిల్లా పిఠాపురంలో టీడీపీ వర్గాలు ఆందోళనకు దిగాయి. బాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ లేఖలను తగులబెట్టారు. తనకు టికెట్ నిరాకరించి, జనసేనకు కేటాయిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌వీఎస్‌ఎన్ వర్మకు సమాచారం అందడంతో.. టీడీపీ వర్గాలు గురువారం పిఠాపురంలో ఆందోళనకు దిగాయి. ఇప్పటికే ఇరుపార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న పరిస్థితిలో వర్మకు టికెట్ నిరాకరించడంతో టీడీపీలో ఒక్కసారిగా ఆగ్రహ జ్వాలలు చెలరేగాయి. స్థానిక టీడీపీ కార్యాలయంలో సమావేశమై స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దింపుతామని హెచ్చరించారు. అధిష్టానం నిర్ణయం మార్చుకోపోతే మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తామని, సానుకూల నిర్ణయం ప్రకటించేంత వరకూ టీడీపీ జెండాలను సైతం పట్టుకునేది లేదని చెప్పారు. రాజీనామాలకు సంతకాలు సేకరించారు. వర్మ మాట్లాడుతూ 'నేనేమన్నా నేరం చేశానా? నా ఆస్తులు అమ్ముకుని రాజకీయం చేశాను' అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. తాను చేసిన సేవను గుర్తించి చంద్రబాబు తనకే అవకాశం ఇస్తారని ఆశిస్తున్నానన్నారు. టీడీపీ కౌన్సిలర్ అల్లవరపు నగేష్ మాట్లాడుతూ, పిఠాపురం వర్మ అడ్డా అని, దానిని వేరేవారికి కేటాయించడానికి ఎవరికీ హక్కు లేదని వ్యాఖ్యానించారు.

కోవూరులో పోలంరెడ్డి కుటుంబం కుతకుత

కోవూరు టికెట్ విషయంలో రెండు దశాబ్దాల కాలంగా టీడీపీని నమ్ముకున్న పోలంరెడ్డి కుటుంబానికి చంద్రబాబు హ్యాండిచ్చారు. ఇటీవలే పార్టీ ఫిరాయించిన వేమిరెడ్డి కుటుంబానికి కోవూరు సీటు ఖరారు చేసేందుకు రెడీ అయ్యారు. దీంతో పోలంరెడ్డి వర్గం మండిపడుతోంది. నిన్నటి వరకు సీటు తనదేనంటూ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పార్టీ వ్యవహారాల్లో మునిగితేలారు. ఇటీవల పార్టీ అధినేత పర్యటనల సమయంలో చేతిచమురు కూడా వదిలించుకుంటున్నారు. ఈ తరుణంలో చంద్రబాబు కోవూరు సీటు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి ఖరారు చేస్తున్నట్లు లీకులిచ్చారు. మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కోవూరు టీడీపీలో కీలకనేతగా ఉన్నారు. మూడు సార్లు టీడీపీ తరుపున పోటీ చేసి రెండుసార్లు విజయం సాధించారు. పోలంరెడ్డికి అనారోగ్యం కారణంగా మూడేళ్ల క్రితం తన రాజకీయ వారసుడిగా తనయుడు దినేష్‌రెడ్డికి పార్టీ బాధ్యతలు అప్పగించారు. పార్టీ అధిష్టానం కూడా దినేష్‌రెడ్డిని ప్రోత్సహించింది. ఈ క్రమంలో సీటు విషయంలో చంద్రబాబు పేచీ పెట్టడంతో దినేష్‌రెడ్డి రాజకీయ జీవితం సందిగ్ధంలో పడింది. ఆత్మ గౌరవం దెబ్బతిన్నదంటూ పార్టీ ఫిరాయించిన ఎంపీ వేమిరెడ్డి భార్యకు కోవూరు సీటు ఖరారు చేస్తుండడంపై పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. పార్టీ ఫిరాయించి వచ్చిన వారికి అందలం ఎక్కించడం వెనుక కేవలం డబ్బుమూటలే పనిచేస్తున్నాయని ఆ పార్టీ నేతలే బహిరంగంగా చెప్పుకుంటున్నారు.



నిడదవోలులో మాజీ ఎమ్మెల్యే శేషారావుకు మద్దతుగా మహిళల ర్యాలీ

ఆర్టికల్ 370 రద్దుతో ప్రజలకు స్వేచ్ఛ

జమ్మూకశ్మీర్ హాయిగా ఊపిరి పీల్చుకుంటోంది

- ఈ ఆర్టికల్‌పై కాంగ్రెస్ పార్టీ దేశాన్ని తప్పుదోవ పట్టించింది
- ప్రధాని మోదీ మండిపాటు
- జమ్మూకశ్మీర్‌లో రూ.5,000 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం

శ్రీనగర్: ఆర్టికల్ 370 రద్దు తర్వాత అభివృద్ధిలో జమ్మూకశ్మీర్ నూతన శిఖరాలకు చేరుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధికి అడ్డుగోడగా మారిన ఈ ఆర్టికల్‌ను రద్దు చేశాక ప్రజలకు స్వేచ్ఛ లభించిందని, జమ్మూకశ్మీర్ హాయిగా ఊపిరి పీల్చుకుంటోందని చెప్పారు. గురువారం జమ్మూకశ్మీర్‌లో మోదీ పర్యటించారు. దాదాపు రూ.5,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. వాటిని జాతికి అంకితం చేశారు. జమ్మూకశ్మీర్‌లో కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 1,000 మంది యువతకు నియామక పత్రాలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. వివిధ రంగాల్లో విజయాలు సాధించిన మహిళలు, రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. 'చలో ఇండియా గ్లోబల్ డయాస్పోరా క్యాంపెయిన్', 'దేఖో అప్నా దేశ్ పీపుల్స్ చాయిస్ టూరిస్టు డెస్టినేషన్ పోల్' అనే రెండు నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం శ్రీనగర్‌లోని బక్షీ స్టేడియంలో 'వికసిత్ భారత్-వికసిత్ జమ్మూకశ్మీర్' బహిరంగ సభలో ప్రసంగించారు. ఆర్టికల్ 370పై కాంగ్రెస్ పార్టీ జమ్మూకశ్మీర్ ప్రజలనే కాకుండా మొత్తం దేశాన్ని తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ఈ ఆర్టికల్ రద్దయ్యాక జమ్మూకశ్మీర్ సంకెళ్లు తెగిపోయాయని అన్నారు. అద్భుతమైన శ్రీనగర్ ప్రజల్లో ఈరోజు తాను కూడా ఒకడినైనందుకు గర్వంగా ఉందని వ్యాఖ్యానించారు. ఈ రోజు తాను ప్రారంభించిన ప్రాజెక్టులు జమ్మూకశ్మీర్ ప్రగతిని మరింత వేగవంతం చేస్తాయని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారత్ అనే స్వప్నం సాకారం కావాలంటే జమ్మూకశ్మీర్ అభివృద్ధి చెందాలని స్పష్టం చేశారు. ఇక్కడి ప్రజలంతా తన కుటుంబ సభ్యులేనని చెప్పారు.



మీ కుటుంబ సభ్యులను పంపించండి

భారతదేశానికి కిరీటం లాంటి జమ్మూకశ్మీర్‌లో పర్యాటకం, వ్యవసాయ రంగాల్లో ప్రగతికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని మోదీ ఉద్ఘాటించారు. జమ్మూకశ్మీర్ కేవలం ఒక ప్రాంతం కాదని, ఇది మన దేశానికి శిరస్సు లాంటిదని చెప్పారు. తలెత్తుకొని నిలబడటం అభివృద్ధికి, గౌరవానికి గుర్తు అని పేర్కొన్నారు. ఈ ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. 'చలో ఇండియా' కార్యక్రమంలో భాగంగా ప్రవాస భారతీయులు తమ కుటుంబాల నుంచి కనీసం ఐదుగురిని జమ్మూకశ్మీర్ పర్యటనకు పంపించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజలకు మోదీ మహాశివరాత్రి, రంజాన్ శుభాకాంక్షలు ముందస్తుగా తెలియజేశారు. 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేశాక ప్రధానమంత్రి కశ్మీర్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలపై ఆయన ఎలాంటి ప్రకటన చేయలేదు.



మోదీతో కశ్మీర్ యువకుడి సెల్ఫీ

జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాకు చెందిన యువకుడు నజీమ్ నజీర్ కల నెరవేరింది. సాక్షాత్తూ మోదీతో అతడు తన ఫోన్‌లో సెల్ఫీ తీసుకున్నాడు. అంతేకాదు నజీర్‌ను మోదీ తన స్నేహితుడిగా సంబోధించారు. గురువారం శ్రీనగర్‌లోని బక్షీ స్టేడియంలో ఈ సంఘటన జరిగింది. నజీర్ తేనెటీగల పెంపకం, తేనె వ్యాపారం చేస్తున్నాడు. మంచి లాభాలు ఆర్జిస్తున్నాడు. దీంతో ప్రధాని మోదీతో సమావేశమయ్యే అవకాశం లభించింది. నజీర్ గురించి తెలుసుకున్న మోదీ అతడిని అభినందించారు. మీతో సెల్ఫీ తీసుకోవాలని నజీర్ కోరగా మోదీ అంగీకరించారు. ఈ సెల్ఫీని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. మిత్రుడు నజీర్‌తో సెల్ఫీ దిగడం మరిచిపోలేని జ్ఞాపకం అని పేర్కొన్నారు. తేనె వ్యాపారంతో నజీర్ తీపి విప్లవం తీసుకొచ్చాడని ప్రశంసించారు.



జైలు నుంచి విడుదలయ్యాక భార్య వసంతతో మీడియా సమావేశంలో సాయిబాబా

ప్రాణాలతో బయటపడడం అద్భుతమే

జైలులో దుర్భర జీవితం అనుభవించా

- తప్పుడు కేసులో ఇరికించి అరెస్టు చేశారు
- ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా ఆవేదన
- నాగపూర్ సెంట్రల్ జైలు నుంచి విడుదల

నాగపూర్: జైలు నుంచి ప్రాణాలతో బయటపడతానని ఏనాడూ అనుకోలేదని ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా(54) చెప్పారు. సజీవంగా బయటకు రావడం నిజంగా అద్భుతమేనంటూ భావోద్వేగానికి గురయ్యారు. జైలులో శారీరకంగా, మానసికంగా ఎన్నో బాధలు అనుభవించానని చెప్పారు. అక్కడ జీవితం అత్యంత దుర్భరమని పేర్కొన్నారు. మావోలతో సంబంధాల కేసులో బాంబే హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా గుర్తిస్తూ మంగళవారం తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఆయన గురువారం నాగపూర్ సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. జైలు నుంచి చక్రాల కుర్చీలో బయటకు వచ్చారు. ఈశాన్య భారతదేశంలో గిరిజనుల హక్కుల కోసం పోరాడుతున్నందుకే తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. తప్పుడు కేసులో ఇరికించి అరెస్టు చేశారని సాయిబాబా అన్నారు.

జైలులోనే ప్రాణాలు పోతాయనుకున్నా..

''నా ఆరోగ్యం క్షీణించింది. ఎక్కువసేపు మాట్లాడలేకపోతున్నాను. మొదట చికిత్స తీసుకోవాలి. ఆ తర్వాతే మాట్లాడగలను. త్వరలో డాక్టర్లను కలిసి చికిత్స తీసుకుంటా. విలేకరులు, లాయర్లు కోరడం వల్లే ఇప్పుడు స్పందిస్తున్నా. జైలులో నాకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. అత్యంత కఠినమైన, దుర్భర జీవితం అనువించా. చక్రాల కుర్చీ నుంచి పైకి లేవలేకపోయా. ఇతరుల సాయం లేకుండా సొంతంగా టాయిలెట్‌కు కూడా వెళ్లలేని పరిస్థితి. ఇతరుల సాయం లేనిదే స్నానం కూడా చేయలేపోయా. జైలులోనే నా ప్రాణాలు పోతాయని అనుకున్నా. ఈరోజు నేను ఇలా ప్రాణాలతో జైలు నుంచి బయటకు రావడం అద్భుతమే చెప్పాలి. నాపై నమోదైన కేసులో సాక్ష్యాధారాలు లేవని ఉన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. చట్టప్రకారం ఈ కేసు చెల్లదని స్పష్టం చేసింది. నాకు న్యాయం చేకూర్చడానికి ఇంతకాలం ఎందుకు పట్టింది? నాతోపాటు నా సహచర నిందితులు పదేళ్ల విలువైన జీవితాన్ని కోల్పోయారు. ఈ జీవితాన్ని ఎవరు తిరిగి తీసుకొచ్చి ఇస్తారు? జైలుకు వెళ్లినప్పుడు ఆరోగ్యంగానే ఉన్నాను. అప్పుడు పోలియో మినహా ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవు. కానీ, ఇప్పుడు గుండె, కండరాలు, కాలేయ సంబంధిత వ్యాధుల బారినపడ్డాను. నా గుండె ప్రస్తుతం కేవలం 55 శాతం సామర్థ్యంతో పని చేస్తోంది. డాక్టర్లే ఈ విషయం చెప్పారు. నాకు పలు ఆపరేషన్లు, సర్జరీలు చేయాలని అన్నారు. కానీ, ఒక్కటి కూడా జరగలేదు. జైలులో సరైన వైద్యం అందించలేదు. పదేళ్లపాటు నాకు అన్యాయం జరిగింది. ఆశ ఒక్కటే నన్ను బతికించింది. ఇకపై బోధనా వృత్తిని కొనసాగిస్తా. బోధించకుండా నేను ఉండలేను'' అని ప్రొఫెసర్ సాయిబాబా స్పష్టం చేశారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తారా? అని మీడియా ప్రశ్నించగా, భారత రాజ్యాంగాన్ని 50 శాతం అమలు చేసినా సరే సమాజంలో అనుకున్న మార్పు వస్తుందని బదులిచ్చారు. సాయిబాబా సొంత ఊరు ఆంధ్రప్రదేశ్‌లోని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణం సమీపంలోని జనుపల్లె. ఆయన పాఠశాల, కళాశాల విద్య ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే కొనసాగింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్నత విద్య అభ్యసించిన ఆయన అక్కడే ప్రొఫెసర్ అయ్యారు.

మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగించినప్పుడు

బీజేపీ ఎక్కడుంది?

- హత్రాస్‌లో అత్యాచార బాధితురాల్ని తగలబెడితే ఏం చేశారు?
- బిల్కిస్ బానో ఉదంతంలో స్పందించరెందుకు ?
- మోదీ 'సందేశ్‌ఖాలీ' మాటలకు ధీటైన జవాబిచ్చిన దీదీ

కోల్‌కతా: 'సందేశ్‌ఖాలీ' తుపాను ధాటికి పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోతుందని, నారీశక్తి ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో టీఎంసీని గద్దె దింపుతుందని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలకు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీటైన జవాబిచ్చారు. రాష్ట్రంలో మహిళలకు తమ ప్రభుత్వం అండగా నిలబడిందని పునరుద్ఘాటించారు. దేశంలోనే మహిళలకు అత్యంత భద్రమైన రాష్ట్రం తమదేనని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒకరోజు ముందే గురువారం కోల్‌కతాలో 'మహిళా హక్కులే మాకు ముఖ్యం' పేరిట చేపట్టిన పాదయాత్రలో మమత ముందు నడిచారు. ఆమెను వందలాది మంది మహిళలు, పార్టీ కార్యకర్తలు అనుసరించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ బీజేపీపాలిత రాష్ట్రాల్లో మహిళలపై జరిగిన అకృత్యాలపై మమత విమర్శలు ఎక్కుపెట్టారు. '' సందేశ్‌ఖాలీపై బీజేపీ దేశానికి తప్పుడు సందేశాలు పంపుతోంది. బెంగాల్‌లో మహిళలకు రక్షణ లేదంటూ నిన్న ఇక్కడికొచ్చి లెక్చర్లు దంచేసిన మోదీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలు అకృత్యాలకు బలైనప్పుడు ఎందుకు మౌనం వహించారు?'' అని నిలదీశారు. ''మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగించినపుడు ఈ బీజేపీ ఏం చేసింది?. ఉత్తరప్రదేశ్ హత్రాస్‌లో అత్యాచారం చేసి మృతదేహాన్ని బలవంతంగా తగలబెడితే బీజేపీ సర్కార్ ఏం చేసింది?. గుజరాత్‌లో సర్వం కోల్పోయిన బిల్కిస్ బానోకు దక్కిన న్యాయమెంత?'' అని ప్రశ్నించారు. 'నిజానికి దేశంలో మహిళలకు అత్యంత భద్రమైన రాష్ట్రం బెంగాల్' అని ప్రకటించారు.

ఎక్కడ పోటీచేసినా ఓడిస్తాం

గురువారం బీజేపీలో చేరిన కలకత్తా హైకోర్టు మాజీ జడ్జి అభిజిత్ గంగోపాధ్యాయ్‌నూ మమత విమర్శించారు. '' తన తీర్పుల ద్వారా బెంగాల్‌లో వేలాది మంది యువత నుంచి ఉద్యోగాలు లాక్కున్నారు. వారు మిమ్మల్ని క్షమించరు. మీ తీర్పుల విశ్వసనీయతపై ఇప్పుడు సందేహాలు నెలకొన్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఏ నియోజకవర్గం నుంచి పోటీచేసినా సరే మిమ్మల్ని ఓడించి తీరతాం' అని అన్నారు. '' పింటూ బాబు(బీజేపీ) ఆగ్రహంతో ఊగిపోయినా సరే బెంగాల్‌లో మీ విభజన రాజకీయాలు నడవనివ్వను. బెంగాల్‌కు 450కిపైగా బృందాలను పంపిన పింటూ బాబు.. మహిళలను లైంగికంగా వేధించి నగ్నంగా ఊరేగించిన మణిపూర్‌కు ఒక్క బృందాన్ని కూడా పంపలేదు' అని మమత గుర్తుచేశారు. 'బీజేపీపాలిత యూపీలో మహిళలపై దారుణ అత్యాచారాలు జరుగుతున్నాయి. మణిపూర్‌లో మహిళలు రేప్‌కు గురై, అగ్నికి ఆహుతైన ఉదంతంలో అక్కడి బీజేపీ సర్కార్ సిగ్గుతో తలదించుకోవాలి' అని మమత ఆగ్రహం వ్యక్తంచేశారు. ' సందేశ్‌ఖాలీ ఘటనను తీవ్రంగా ఖండించాల్సిందే. టీఎంసీ కార్యకర్తలు బాధ్యతులుగా తేలితే అరెస్ట్ చేసేందుకు ఏమాత్రం వెనుకాడను' అని ఆమె స్పష్టంచేశారు. పాదయాత్రలో సందేశ్‌ఖాలీ ప్రాంతానికి చెందిన 200కుపైగా మహిళలు పాల్గొన్నారు.



గురువారం కోల్‌కతాలో జరిగిన ర్యాలీలో సీఎం మమత

టీఎంసీలో చేరిన బీజేపీ ఎమ్మెల్యే

కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పశ్చిమబెంగాల్‌లో బీజేపీకి గట్టి దెబ్బ తగిలింది. కాషాయ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ముకుట్ మణి అధికారి గురువారం అధికార టీఎంసీలో చేరారు. నదియా జిల్లా రాణాఘాట్ దక్షిణ్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన అధికారి గురువారం కోల్‌కతాలో జరిగిన టీఎంసీ ర్యాలీలో సీఎం మమతా బెనర్జీతోపాటు పాల్గొన్నారు. సిట్టింగ్ ఎంపీ జగన్నాథ్ సర్కారుకే మళ్లీ రాణాఘాట్ టిక్కెట్ ఇవ్వాలన్న బీజేపీ అధిష్టానం నిర్ణయంపై అసంతృప్తితో పార్టీ మారారు. ప్రజల కోసమే పనిచేసే పార్టీ టీఎంసీ, అందుకే పార్టీలో చేరానని చెప్పారు. ముకుట్ మణి అధికారి తమ పార్టీలో చేరారని టీఎంసీ తెలిపింది. దీంతో, 2021లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాక టీఎంసీలో చేరిన బీజేపీల సంఖ్య ఎనిమిదికి చేరింది.

బీజేపీలోకి కేరళ కాంగ్రెస్ నేత

న్యూఢిల్లీ: కేరళ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ దిగ్గజ నేత కె.కరుణాకరన్ కుమార్తె పద్మజా వేణుగోపాల్ బీజేపీలో చేరారు. కాంగ్రెస్‌కు సమర్థవంతమైన నాయకత్వం లేదని ఈ సందర్భంగా ఆమె అన్నారు. బీజేపీ కేరళ ఇన్‌చార్జి, కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ సమక్షంలో ఆమె కాషాయ కండువా కప్పుకున్నారు. అనంతరం బీజేపీ నేతలతో పద్మజ మీడియాతో మాట్లాడారు. తన సమస్యలపై కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలకు వివరించేందుకు ఎన్నిసార్లు ప్రయత్నించినా కనీసం అపాయింట్‌మెంట్ కూడా దొరకలేదన్నా రు. గతంలో తన తండ్రి కరుణాకరన్ సైతం ఇలాంటి అనుభవాన్నే ఎదుర్కొన్నారని ఆమె తెలిపారు.

కేజ్రీవాల్‌కు మళ్లీ సమన్లు

న్యూఢిల్లీ: మద్యం విధానం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణకు రావాలంటూ ఈడీ పంపిన నోటీసులను పట్టించుకోని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు కోర్టు మరోసారి సమన్లు జారీ చేసింది. విచారణకు రావాలంటూ జనవరి 12, 31వ తేదీలతోపాటు ఫిబ్రవరి 14వ తేదీన పంపిన 4 నుంచి 8 వరకు సమన్లపై కేజ్రీవాల్ స్పందించలేదంటూ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టులో పిటిషన్ వేసింది. విచారణ చేపట్టిన జడ్జి దివ్యా మల్హోత్రా ఈ నెల 16వ తేదీన తమ ఎదుట హాజరు కావాలంటూ కేజ్రీవాల్‌కు నోటీసులు జారీ చేశారు.

బీజేపీలో చేరిన గంగోపాధ్యాయ్

కోల్‌కతా: కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి పదవికి రెండు రోజుల క్రితం రాజీనామా చేసిన జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ్ గురువారం కాషాయ కండువా కప్పుకున్నారు. కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ ప్రాంతంలో ఉన్న బీజేపీ కార్యాలయం వద్ద గంగోపాధ్యాయ్‌కు ఘన స్వాగతం లభించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ ఆయనకు బీజేపీ జెండా అందజేశారు. రాష్ట్రంలో టీఎంసీ పాలనను అంతం చేయడమే తమ లక్ష్యమని అభిజిత్ ఈ సందర్భంగా అన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు

డీఏ 4 శాతం పెంపు

- పెన్షనర్లకు సైతం డీఆర్ మరో 4 శాతం
- 50 శాతానికి చేరిన డీఏ, డీఆర్



మంత్రి గోయల్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర మంత్రివర్గ సమావేశం గురువారం జరిగింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యాన్ని(డీఏ), పెన్షనర్లకు కరువు సహాయాన్ని(డీఆర్) బేసిక్ పే/పెన్షన్‌పై మరో 4 శాతం పెంచింది. ప్రస్తుతం డీఏ/డీఆర్ 46 శాతం ఉంది. తాజా పెంపుతో ఇది 50 శాతానికి చేరింది. పెంచిన భత్యం ఈ ఏడాది జనవరి 1 నుంచే అమల్లోకి వస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. దీనివల్ల కోటి మందికిపైగా ఉద్యోగులకు, పెన్షనర్లకు లబ్ధి చేకూరుతుందని తెలియజేసింది. ఉద్యోగులకు డీఏ అదనపు వాయిదా సొమ్ము, పెన్షనర్లకు కరువు సహాయం(డీఆర్) సొమ్ము ఈ ఏడాది జనవరి 1 నుంచి చెల్లించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ధరలు పెరగడంతో ఉద్యోగులకు, పెన్షనర్లకు డీఏను 50 శాతానికి పెంచినట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ఈ పెంపు వల్ల ఖజానాపై ప్రతిఏటా రూ.12,869 కోట్ల భారం పడనుంది. 2024 జనవరి నుంచి 2025 ఫిబ్రవరి వరకు ప్రభుత్వం రూ.15,014 కోట్లు చెల్లించనుంది. డీఏ పెంపుతో ఉద్యోగులకు ఇతర భత్యాలు, గ్రాట్యుటీ సైతం పెరుగుతాయి. డీఏ/డీఆర్ కాకుండా ఇతర భత్యాల పెంపు కారణంగా ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.9,400 కోట్ల భారం పడుతుంది. ఏడో కేంద్ర వేతన కమిషన్ సిఫార్సుల ప్రకారమే డీఏ/డీఆర్‌ను కేంద్రం పెంచింది.

ఉజ్వల రాయితీ గడువు పెంపు

ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద పేద మహిళలకు వంట గ్యాస్ సిలిండర్లపై రూ.300 చొప్పున ఇస్తున్న రాయితీ గడువును కేంద్రం మరో ఏడాది పెంచింది. వాస్తవానికి ఈ గడువు ఈ ఏడాది మార్చి 31న ముగియనుంది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే 2024–25 ఆర్థిక సంవత్సరంలోనూ రాయితీని వర్తింపజేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ప్రతిఏటా 12 సిలిండర్లకు ఈ రాయితీ వర్తిస్తుంది.

ముడి జనపనారకు మరో రూ.285

ముడి జనపనారకు కనీస మద్దతు ధరను కేంద్రం మరో రూ.285 పెంచింది. దీనివల్ల క్వింటాల్ ముడి జనపనార ధర రూ.5,335కు చేరుకుంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఈ కనీస మద్దతు ధర వర్తిస్తుంది.

రూ.10,037 కోట్లతో 'ఉన్నతి'

ఈశాన్య రాష్ట్రాల్లో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగాల సృష్టికి ప్రోత్సాహం ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన కొత్త పథకం 'ఉన్నతి'కి కేబినెట్ ఆమోదం తెలియజేసింది. ఈ పథకం రూ.10,037 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో పరిశ్రమలు స్థాపించే పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాలు ఇస్తారు. 2034 మార్చి 31 దాకా ఈ పథకం అమల్లో ఉంటుంది.

రూ.10,372 కోట్లతో కృత్రిమ మేధ

ఐదేళ్ల పాటు అమలు చేసే ఇండియా కృత్రిమ మేధ(ఏఐ) మిషన్‌కు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ఈ మిషన్‌కు ప్రభుత్వం రూ.10,373 కోట్లు కేటాయించింది. ఈ మిషన్‌లో భాగంగా 10,000 జీపీయూ సూపర్ కంప్యూటింగ్ కెపాసిటీని అందుబాటులోకి తీసుకొస్తారు.

మళ్లీ వయనాడ్ నుంచే రాహుల్

40 మంది పేర్లను ఖరారు చేసిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే 40 మంది అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ(సీఈసీ) గురువారం రాత్రి ఖరారు చేసింది. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఈసారి కూడా కేరళలోని వయనాడ్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సీఈసీ ఢిల్లీలో సమావేశమైంది. 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించి 60 లోక్‌సభ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘంగా చర్చించారు. ఢిల్లీ, కర్ణాటక, కేరళ, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, సిక్కిం, త్రిపుర, నాగాలాండ్, మణిపూర్, మేఘాలయా, లక్షద్వీప్‌కు సంబంధించి పలు స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేశారు. సీఈసీ సమావేశంలో ఖర్గే, సోనియా గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. కేరళలో తమ పార్టీ 16 స్థానాల్లో పోటీ చేయబోతోందని కాంగ్రెస్ నేత వి.డి.సతీశన్ చెప్పారు. తమ మిత్రపక్షాలకు 4 స్థానాలు కేటాయించామన్నారు. ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భుపేష్ బఘేల్ రాజ్‌నంద్‌గావ్ నుంచి, మాజీ మంత్రి తామ్రధ్వజ్ సాహూ మహాసముంద్ నుంచి పోటీ చేయనున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అభ్యర్థిత్వం సైతం ఖరారైంది. రాహుల్ గాంధీ వయనాడ్‌తో పాటు ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నుంచి పోటీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. రాయ్‌బరేలీ నుంచి ఈసారి ప్రియాంకాగాంధీ పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. 2019 నాటి ఎన్నికల్లో అమేథీ నుంచి ఓడిపోయిన రాహుల్ గాంధీ వయనాడ్‌లో గెలిచిన సంగతి తెలిసిందే. తొలి జాబితాను త్వరలో అధికారికంగా విడుదల చేస్తామని కాంగ్రెస్ వెల్లడించింది.

రాహుల్ 'యువ న్యాయ్'

- మేమొస్తే 30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీచేస్తాం
- అప్రెంటిస్‌షిప్ హక్కు చట్టం తెచ్చి యువతకు శిక్షణనిచ్చి ఉద్యోగాలిస్తాం
- శిక్షణలో రూ.1 లక్ష వార్షిక స్టైపండ్
- రాహుల్ గాంధీ హామీల వర్షం



జైపూర్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పలు నూతన హామీలను ప్రకటించారు. గురువారం భారత్ జోడో న్యాయ్ యాత్ర మధ్యప్రదేశ్‌లో పూర్తిచేసుకుని రాజస్థాన్‌లో అడుగుపెట్టిన సందర్భంగా బాంసవాడా పట్టణంలో ఏర్పాటుచేసిన సభలో రాహుల్ హామీల జల్లు కురిపించారు. ''మేం అధికారంలోకి వస్తే కేంద్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న 30 లక్షల ఉద్యోగాలను మొట్టమొదట భర్తీచేస్తాం. డిగ్రీ, డిప్లొమా చేసి ఖాళీగా ఉన్న పాతికేళ్లలోపు యువతకు అప్రెంటిస్‌షిప్ కింద శిక్షణ ఇప్పించి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు వచ్చేలా చూస్తాం. అప్రెంటిస్ కాలంలో వారికి సంవత్సరానికి రూ.1 లక్ష స్టైపండ్ అందిస్తాం. ప్రభుత్వ ఉద్యోగాల ప్రవేశ పరీక్షా పేపర్ల లీకేజీ ఉదంతాలు పునరావృతంకాకుండా కఠిన చట్టం తీసుకొస్తాం. తాత్కాలిక ఉద్యోగాలు చేసుకునే గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పిస్తాం. యువత ఏర్పాటుచేసే అంకుర సంస్థల తోడ్పాటు కోసం రూ.5,000 కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తాం'' అని రాహుల్ అన్నారు. యువతకు ఇచ్చిన ఈ ఐదు హామీలకు రాహుల్ 'యువ న్యాయ్'గా అభివర్ణించారు. '' డ్రైవర్, గార్డ్, డెలివరీ బాయ్ ఉద్యోగాలు చేసే గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పిస్తూ రాజస్థాన్‌లో ఇప్పటికే చట్టం తెచ్చారు. ఇదే తరహా చట్టాన్ని దేశమంతటా అమలుచేస్తాం. ఔట్‌సోర్సింగ్ విధానానికి స్వస్తిపలికి ప్రభుత్వ రిక్రూట్‌మెంట్ పరీక్ష విధానంలో ప్రమాణాలను పటిష్టంచేస్తాం. లీకేజీలకు తావులేకుండా కఠిన చట్టం తెస్తాం' అని అన్నారు. '' ఢిల్లీ చలో ఉద్యమ బాటలో పయనిస్తున్న రైతాంగానికి మేలు చేకూర్చేలా పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తాం. కులగణన చేపడతాం'' అని రాహుల్ అన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల నుంచి న్యాయం కోరడం కూడా నేరమేనని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లో మహిళల రేప్, ఆత్మహత్యలను ప్రస్తావిస్తూ రాహుల్ విమర్శించారు.

ముంపు అంచున

అగ్రరాజ్యం



- అమెరికాలోని 24 తీర నగరాలు మునిగిపోయే ప్రమాదం
- 2050కల్లా అనూహ్యస్థాయిలో పెరగనున్న సముద్ర మట్టాలు

భూతాపోన్నతి, కాలుష్యం, కార్చిచ్చులు అన్నీ కలిసి ధ్రువపు మంచును వేగంగా కరిగించేస్తున్నాయి. కొత్తగా వచ్చిచేరిన నీటితో సముద్ర మట్టాలు అమాంతం పెరిగి తీరప్రాంతాలను తమలో కలిపేసుకోనున్నాయి. ఇలా సముద్రమట్టాల పెరుగుదలతో ముంపు ముప్పును అమెరికాలోని 24 తీరప్రాంత నగరాలు ఎదుర్కోనున్నాయని తాజా అధ్యయనం ఒకటి ప్రమాదఘంటికలు మోగించింది. ఇప్పటికైనా తేరుకోకపోతే అనూహ్యంగా పెరిగే సముద్రమట్టాలను ఆపడం ఎవరితరమూ కాదు. అమెరికాలోని ప్రభావిత 32 తీరనగరాలకుగాను 24 నగరాల వెంట సముద్రమట్టం ప్రతిసంవత్సరం 2 మిల్లీమీటర్ల మేర పెరుగుతోంది. వీటిలోని 12 నగరాల్లో అయితే అంతర్జాతీయ సముద్రమట్టాల సగటు పెరుగుదల రేటును దాటి మరీ జలాలు పైపైకి వస్తున్నాయి. వీటికితోడు ఈ నగరాల్లోని ప్రతి 50 మంది జనాభాలో ఒకరు దారుణమైన వరదలను చవిచూడక తప్పదని తాజా అధ్యయనం హెచ్చరించింది. ఈ పరిశోధన తాలూకు సమగ్ర వివరాలు జర్నల్ 'నేచర్'లో ప్రచురితమయ్యాయి. గ్లోబల్ వార్మింగ్ దెబ్బకి వాతావరణంలో అనూహ్య ప్రతికూల మార్పులు సంభవిస్తున్నాయి. పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా తరచూ హీట్‌వేవ్‌లు, కరువులు సంభవించి, కార్చిచ్చులు చెలరేగి సగటు ఉష్ణోగ్రతలను అంతకంతకూ పెచ్చరిల్లుతున్నాయి. దీంతో ధృవాల వద్ద హిమానీనదాలు గతంలో కంటే వేగంగా కరిగిపోతున్నాయి. దీంతో అమెరికా, భారత్‌సహా పలు ప్రపంచదేశాల తీరప్రాంతాలకు ముంపు ప్రమాదం హెచ్చిందని అధ్యయనకారులు ఆందోళన వ్యక్తంచేశారు.

ముంపు అవకాశమున్న 32 నగరాలు

బోస్టన్, న్యూయార్క్ సిటీ, జెర్సీ సిటీ, అట్లాంటిక్ సిటీ, వర్జీనియా బీచ్, విల్మింగ్టన్, మేర్టల్ బీచ్, చార్లెస్టన్, సవన్నా, జాక్సన్‌విల్లే, మయామీ, నేపుల్స్, మొబిల్, బిలోక్సీ, న్యూఓర్లీన్స్, స్లైడెల్, లేక్ చార్లెస్, పోర్ట్ ఆర్థర్, టెక్సాస్ సిటీ, గాల్వెస్టన్, ఫ్రీపోర్ట్, కార్పస్ క్రిస్టీ, రిచ్‌మండ్, ఓక్లాండ్, శాన్ ఫ్రాన్సిస్కో, సౌత్ శాన్ ఫ్రాన్సిస్కో, ఫాస్టర్ సిటీ, శాంటాక్రూజ్, లాంగ్ బీచ్, హటింగ్టన్ బీచ్, న్యూపోర్ట్ బీచ్, శాండియాగో

మరిన్ని వరదలు

2050 సంవత్సరంకల్లా అమెరికా తీరప్రాంతాల వెంట సముద్రం దాదాపు 0.30 మీటర్లమేర పైకి ఎగిసే ప్రమాదముంది. దీంతో జనావాసాలను సముద్రపు నీరు ముంచెత్తి జనజీవనం అస్తవ్యస్తం కానుంది. సముద్రపు నీటితో కుంగిన నేలలు, రోడ్లు ఇలా ప్రజారవాణా వ్యవస్థ మొత్తం దెబ్బతిననుంది. కొన్ని ప్రాంతాలు మరింతగా కుంగిపోయే ప్రమాదముందని గణాంకసహితంగా అధ్యయనం పేర్కొంది. వచ్చే 30 సంవత్సరాల్లో ప్రతి 35 ప్రైవేట్ ఆస్తుల్లో ఒకటి వరదల బారిన పడి నాశనమయ్యే అవకాశముంది. గత అంచనాలను మించి విధ్వంసం తప్పదని అధ్యయనం హెచ్చరించింది. మట్టం పెరగడంతో లక్షలాది మంది తీరప్రాంత ప్రజల జీవనం ప్రశ్నార్థకంగా మారనుంది. అమెరికాలో 109 బిలియన్ డాలర్లమేర ఆస్తినష్టం సంభవించవచ్చని ఓ అంచనా. ఈ అధ్యయనంలో పంజాబ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ వారి బృందం సైతం పాలుపంచుకుంది. అమెరికా తీరప్రాంతంలో ముంపును ఎదుర్కోనున్న ప్రాంతాల అంచనా గణాంకాలను సిద్ధంచేసింది. 'నక్షత్రాలు నేలరాలితే ఏం చేయగలం?. చిన్నపాటి వర్షం కూడా పడవ వేగంగా మునగడానికి ప్రబల హేతువు కాగలదు. అలాగే తీరాల వెంట మట్టాలు పెరిగితే కలిగే విపత్తులు, విపరిణామాలు దారుణంగా ఉంటాయి' అని ఈ అధ్యయనంలో పాలుపంచుకున్న శాస్త్రవేత్త రాబర్ట్ నెకొలస్ ఆందోళన వ్యక్తంచేశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 8 । మార్చి । 2024


నాలుగేళ్ల డిగ్రీ కోర్సు వద్దంటూ గురువారం బెంగళూరు ఫ్రీడంపార్కులో విద్యార్థుల ధర్నా


బాంబు పేలుళ్ల సూత్రధారులను అరెస్టు చేయాలని ఫ్రీడంపార్కులో జనాందోళన

దారిద్ర్య దుఃఖ దహనాయ నమశ్శివాయ



శివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. గురువారం బెంగళూరు మురుగేశపాళ్యలో బృహత్ పరమేశుని విగ్రహం వద్ద విదేశీయుల సందడి. కేఆర్ పూల మార్కెట్లో పూల విక్రయాలు


మైసూరులోని గురుకుల ఆలయంలో 101 శివలింగాల ఏర్పాటు.


త్రినేశ్వర ఆలయానికి బంగారు శివుని ముఖం తరలింపు

న్యూస్‌రీల్

మొబైల్‌ఫోన్ల రికవరీ


ఫోన్లతో పోలీసులు

మైసూరు: నగరంతో పాటు జిల్లాలో చోరీలకు గురైన 100 మొబైల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని సొంతదారులకు అప్పగించారు. జిల్లా ఎస్పీ సీమా లాట్కర్, అదనపు ఎస్పీ బీఎస్ నందిని ఆధ్వర్యంలో విచారణ జరిపి ఫోన్లను రికవరీ చేశారు. వీటి విలువ సుమారు 18 లక్షలు ఉంటుందని తెలిపారు.

దొంగ అరెస్టు..

నంజనగూడుకు చెందిన షారూఖ్ ఖాన్ అనే దొంగ సమీపంలోని సిందువళ్ళి గ్రామం గేట్ వద్ద నున్న వర్క్‌షాపు సట్టర్ పగులగొట్టి రూ. 1.48 లక్షల విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లాడు. రూరల్ పోలీసులు దొంగను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ. 5 లక్షల విలువైన రెండు ఆటోలు, 1 టాటా ఏస్, 3 బైకులను సీజ్ చేశారు.

యాసిడ్‌పై నియంత్రణ: హోం మంత్రి

యశవంతపుర: రాష్ట్రంలో యాసిడ్‌ను నిషేధించాలని భావిస్తున్నట్లు హోంమంత్రి పరమేశ్వర తెలిపారు. గురువారం బెంగళూరులో నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ యాసిడ్‌ను కొందరూ దుర్వినియోగం చేస్తున్నారు. మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. అందరికీ యాసిడ్ అమ్మకూడదని డీజీపీ అలోక్ మోహన్ రెండు రోజుల్లో అధికారులు, పరిశ్రమల యజమానులకు లేఖ రాస్తారని మంత్రి తెలిపారు. దక్షిణ కన్నడ జిల్లా కడబ కాలేజీలో ముగ్గురు పీయూసీ విద్యార్థినులపై యాసిడ్ దాడి కేసులో కేరళకు చెందిన అబీన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

హనుమ జెండా గొడవ, ఎంపీపై కేసు

యశవంతపుర: ఉత్తర కన్నడ జిల్లా భట్కళ తాలూకా తెంగినగుండి బీచ్ సర్కిల్‌లో బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే ఎగురవేసిన హనుమ జెండాను గ్రామ పంచాయతీ అధికారులు తొలగించారు. హిందూ కార్యకర్తలతో కలిసి ఎంపీ జెండాను ఎగురవేసి అక్కడే సావర్కర్ బోర్డును కూడా ఏర్పాటు చేశారు. అనుమతి లేదంటూ అధికారులు ఆగమేఘాలపై హనుమ జెండా, బోర్డును తీసేశారు. ఎంపీతో పాటు 21 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటైంది.

కుంచెబైలు కేసులో.. నలుగురు దోషులు



యశవంతపుర: బాలికను వేశ్యావాటికలోకి నెట్టిన కేసులో చిక్కమగళూరు పోక్సో ప్రత్యేక కోర్టు తల్లితో పాటు నలుగురిని దోషులుగా ప్రకటించింది. శృంగేరిలో జరిగిన ఈ సంఘటనలో 53 మంది నిందితులు ఉండగా, 49 మందికి కేసు నుంచి విముక్తి కలిగించి, సల్మాన్ అభి, బాలిక తల్లి గీతా, గిరీశ్, దేవిశరణ్ అనే నలుగురికి శిక్ష విధించారు. వివరాలు.. గీతకు కూతురు ఉండగా, ఆమె పడుపువృత్తి చేయాలని సల్మాన్‌అభి, గిరీశ్, దేవిశరణ్‌లతో కలిసి ఒత్తిడి చేసింది. బాలికను హింసించి ఒప్పించారు. 2020 సెప్టెంబర్ నుంచి 2021 జనవరి వరకు బాలికతో శృంగేరి తాలూకా కుంచెబైలులో వ్యభిచారం చేయించారు. శృంగేరి గ్రామీణ పోలీసులకు తెలిసి మైనర్ బాలికను కాపాడి, మొత్తం 53 మందిని అరెస్ట్ చేశారు. కుంచెబైలు కేసుగా ఇది అప్పట్లో సంచలనం సృష్టించింది. విచారించిన చిక్కమగళూరు పోక్సో కోర్టు తల్లి సహా నలుగురిని దోషులుగా తేల్చింది. శిక్షను ఈ నెల 11న శిక్షను ఖరారు చేస్తామని జడ్జి ప్రకటించారు.

రిటైరైన అధికారికి ఉద్యోగం

- సీఎం ఆదేశాలు గాలికి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో ఎంతోమంది ప్రతిభావంత యువత ఉద్యోగాలు కావాలంటున్నారు. వారి గోడు పట్టించుకోరు కానీ, రిటైరైన అధికారికి పిలిచి మళ్లీ కొలువు ఇస్తారు. ఈ బాగోతం రాయచూరు జిల్లాలో నెలకొంది. ఏడాది క్రితం జిల్లా జడ్పీ ఇంజనీరింగ్ డివిజన్‌లో ఈఈగా పనిచేసి రిటైరైన గణపతి సక్రే ను ఇక్కడి జడ్పీ అధికారులు కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించారు. రాష్ట్ర స్థాయి అధికారులకు చెప్పకుండా, 2023 మేలో నెలకు రూ.60 వేల వేతనంతో ఉద్యోగంలో నియమించారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి రజనీష్ గోయల్ జనవరి 9న జిల్లాధికారులకు, జెడ్పీ సీఈఓలకు పదవీ విరమణ పొంది, కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించిన అధికారులను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆరు నెలల క్రితం సీఎం సిద్దరామయ్య కూడా ఇటువంటి ఆదేశాలను ఇచ్చారు. కానీ జడ్పీ ఉన్నతాధికారులు ఆయనను కొనసాగించడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

జల సంక్షోభం


ఆర్ఆర్ నగరలో నీటి ట్యాంకరు కోసం బిందెలతో నిరీక్షణ


నీటి కొరతపై గురువారం బెంగళూరు భారతీనగరలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన

- బెంగళూరులో నీటి కోసం హాహాకారాలు
- వేసవి ఆరంభంలోనే తీవ్ర ఇబ్బంది
- వర్క్ ఫ్రం హోంకు కంపెనీల సూచనలు

బనశంకరి: కరువు వాతావరణం వల్ల కొద్ది రోజులుగా రాజధాని బెంగళూరు నగరాన్ని నీటి కొరత పీడిస్తోంది. అది ఇప్పుడు మరింత తీవ్రమైంది. అపార్టుమెంట్లలో, మురికివాడల్లో ఎక్కడ చూసినా నీటి కోసం హాహాకారాలు సాగుతున్నాయి. నగరానికి నీరందించే నదులు, చెరువులు, బోర్లు ఎండిపోయి నీటికి కటకట నెలకొంది. హోటళ్లు, రెస్టారెంట్లు, పరిశ్రమలు, అలాగే ఐటీ, బీటీ కంపెనీలకు కూడా నీటి కొరత తాకింది. దీంతో పలు ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రం హోం చేయాలని ఉద్యోగులకు చెబుతున్నాయంటే పరిస్థితి అర్థమవుతుంది. నీటి కోసం నగరంలో నిరసనలు కూడా మొదలయ్యాయి.

నీటి వాడకంపై నిబంధనలు..

అపార్టుమెంట్లు, హాస్టళ్లలో వాహనాలు కడగడం, ఈత కొలనులకు నీటిని నింపరాదని నిర్వాహకులు చెబుతున్నారు. యూజ్ అండ్ త్రో వస్తువులను ఎక్కువగా వాడాలని సూచించారు. కొన్ని వసతి సముదాయాల్లో నివాసులకు నీటి వినియోగం 20 శాతం తగ్గించాలని చెప్పారు. ట్యాంకర్ల నీరు సకాలంలో రావడం లేదు. నీటి సమస్యను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. నీటిని వృథా చేయరాదని, లేని పక్షంలో కొరత ఉధృతం అవుతుందని చాలా మంది ఇళ్ల యజమానులు తెలిపారు.

సొంతూళ్లకు వెళ్లాలని ప్లాన్

బెంగళూరులో అపార్టుమెంట్లలో నివాసం ఉండే కొందరు ఐటీ ఉద్యోగులు వేసవి ముగిసేవరకూ సొంతూర్లకు వెళ్లాలని ఆలోచనలో ఉన్నారు. మళ్లీ వర్క్ ఫ్రం హోం ద్వారా పనిచేసి నీటి సమస్యలను అధిగమించాలని అనుకుంటున్నారు. పిల్లలకు పరీక్షలు జరుగుతుండటంతో చాలా కుటుంబాలు నగరంలోనే ఉంటున్నాయి. పరీక్షలు అయిపోగానే ఏప్రిల్ ప్రారంభం నుంచి చాలామంది ఐటీ ఉద్యోగులు సొంత ఊళ్ల నుంచి డ్యూటీలు చేయడానికి నిర్ణయించారు. నీటి ఇబ్బందులు కొన్ని ఐటీ కంపెనీలు కూడా ఇంటి నుంచి పనిని కొనసాగించాలని భావిస్తున్నాయి.

పరిమితంగా వాడాలి..

ప్రజలు నీటిని పరిమితంగా వాడడం నేర్చుకోవాలని, వారానికి ఒకసారి వాషింగ్‌మెషిన్ వినియోగించడం, వాటర్ ఫిల్టర్ల నుంచి వృథాగా వచ్చే నీటిని సేకరించి ఇంటి అవసరాలకు వాడడం, బాత్‌రూంలో నీటి పొదుపు చర్యలు ముఖ్యమని అపార్టుమెంట్ల సమాఖ్య మాజీ అధ్యక్షుడు హెచ్‌ఎం.నాగరాజ్ తెలిపారు.

నీటిని దుర్వినియోగం చేయొద్దు..

బెంగళూరు తూర్పు భాగంలో ట్యాంకర్ల నీటిపై ఆధారపడిన అపార్టుమెంట్లలో నీటి సమస్య తీవ్రంగా ఉంది. నీటి దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలి. అందుబాటులో ఉన్న నీటిని పరిమితంగా వాడుకోవాలని ఇప్పటికే సూచించామని అపార్టుమెంట్ల సంఘం అధ్యక్షుడు విక్రమ్ రై అన్నారు. నీటి ట్యాంకర్ల ధరలు తగ్గాలని అన్నారు.

పరిశ్రమలకు తిప్పలు..

నీటి కొరత పరిశ్రమలపై పడింది. నీరు అవసరమైన కర్మాగారాలకు ఒకటి రెండు వారాల నుంచి సమస్య ఎక్కువగా ఉంది. దీంతో నిర్వహణా భారం 5–10 శాతం పెరుగుతుందని ఫిక్కి వర్గాలు తెలిపాయి. మరోవైపు నీటి సమస్యపై బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడుతూ నగరంలో చాలా ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి ఉంది, పరిశ్రమలు, కట్టడ నిర్మాణాలకు శుద్ధిచేసిన నీటిని వాడాలని సూచించాలి.

అన్ని రంగాల్లో దేశం పురోగమనం : గవర్నర్

యశవంతపుర: సాంకేతిక పరిజ్ఞాన రంగంలో దేశం అద్భుతమైన ప్రగతిని సాధించినట్లు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ అన్నారు. గురువారం బెళగావిలో విశ్వేశ్వరయ్య సాంకేతిక వర్సిటీ 23వ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశం రోదసీ రంగంలో గణనీయమైన అభివృద్ధి కనబరిచిందన్నారు. ఐటీ, ఇంటర్నెట్ రంగంలో దూసుకుపోతోందన్నారు. సాంకేతికంగా విద్యారంగంలో, మానవ వనరులతో పాటు ప్రతి రంగంలో ప్రగతిని అందుకోవాలని సూచించారు. సాంకేతిక రంగం తేజస్సుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోహదం చేయాలన్నారు. ఈ సందర్భంగా డిగ్రీ, పీజీ పట్టభద్రులకు పట్టాలను బహూకరించారు.

ట్రయల్ బ్లాస్ట్‌పై భయం వద్దు

మండ్య: కృష్ణరాజసాగర జలాశయం (కేఆర్‌ఎస్)కు 25 కిలోమీటర్ల పరిధిలో ప్రయోగాత్మక పేలుళ్లను జరపడంపై ఎవరూ భయపడరాదు. ప్రజలు, రైతుల సంక్షేమం కోసమే ఈ నిర్ణయమని వ్యవసాయ శాఖ మంత్రి ఎన్.చలువరాయ స్వామి అన్నారు. ట్రయల్ బ్లాస్ట్‌ను రైతు సంఘాలు అడ్డుకోవడం తెలిసిందే. దీంతో గురువారం మండ్య జడ్పీ హాల్‌లో ట్రయల్ బ్లాస్ట్, మై షుగర్ ఫ్యాక్టరీ గురించి రైతు సంఘాలతో సమావేశం జరిపారు. మంత్రి మాట్లాడుతూ ట్రయల్ బ్లాస్ట్ అనేది కోర్టు ఆదేశం. పేలుళ్లు జరపాలన్న కోరిక నాకు లేదు. అందరినీ ఒప్పించి దీనిని నిర్వహిస్తామని తెలిపారు.

బళ్లారిలో ఎన్‌ఐఏ తనిఖీలు

సాక్షి బళ్లారి: బెంగళూరు పేలుడు కేసులో విచారణకు ఎన్‌ఐఏ బృందాలు బళ్లారికి వచ్చాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు బళ్లారిలో వివిధ ప్రాంతాల్లో పరిశీలించినట్లు తెలుస్తోంది. ఎన్‌ఐఏ బృందంతో పాటు తుమకూరు పోలీసులు కూడా వచ్చినట్లు పోలీసులు తెలిపారు. తుమకూరులో తనిఖీ చేసిన తర్వాత నేరుగా బళ్లారి బస్టాండ్‌లో పరిశీలన చేశారు. బాంబ్ బ్లాస్టు నిందితుడు తుమకూరు బస్టాండ్ నుంచి బళ్లారి బస్టాండ్‌కు వచ్చి అక్కడ నుంచి మంత్రాలయం, గోకర్ణలకు బస్సులో వెళ్లినట్లు నిర్ధారించారు.

ప్రియునితో కలిసి హనీట్రాప్ దందా

యశవంతపుర: మహిళ అక్రమ సంపాదన కోసం ప్రియునితో కలిసి హనీ ట్రాప్ దందాకు పాల్పడుతున్నట్లు బెంగళూరు జ్ఞానభారతి పోలీసుస్టేషన్‌లో మహిళ భర్త, కాంట్రాక్టర్ ఫిర్యాదు చేశారు. త్వరగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మహిళ ప్రియునితో కలిసి ఉల్లాల ఉపనగర ఐదో మెయిన్‌రోడ్డులో బాడుగ ఇంటిని తీసుకుంది. అక్కడకు కాంట్రాక్టర్‌ను తీసుకెళ్లి ప్రైవేట్ వీడియోలు తీశారు. తరువాత డబ్బులు కావాలని డిమాండ్ పెట్టారు. లేదంటే వీడియోను పోర్న్ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేస్తామని బెదిరించారు. అలాగే ఈ జంట యువకులను దారి తప్పిస్తున్నట్లు ఫిర్యాదులో తెలిపారు. తనకు ప్రాణ భయం ఉన్నందున రక్షణ కల్పించాలని భర్త పోలీసులను కోరాడు.

ఆ పల్లెపై బుల్లెట్ల వర్షం


గ్రామంలో పడిన తూటాలు


బుల్లెట్లు చూపిస్తున్న గ్రామస్తులు

- ఇళ్లమీద, వాహనాల మీద ఎగిరివచ్చి పడుతున్న వైనం
- పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నుంచి రాక

దొడ్డబళ్లాపురం: వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం..ఆ గ్రామంపై బుల్లెట్ల వర్షం కురుస్తోంది. ఇళ్లమీద, వాహనాల మీద, మనుసుల మీద ఎక్కడబడితే అక్కడ బుల్లెట్లు వచ్చి పడుతున్నాయి. దేవనహళ్లి తాలూకా నీలేరి గ్రామంలోకి బుల్లెట్లు దూసుకువస్తున్నాయి. నీలేరికి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నుండి ఈ బుల్లెట్లు వచ్చి పడుతున్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు. శిక్షణ సమయంలో కాలుస్తున్న తూటాలు నేరుగా వచ్చి గ్రామంలో ఎక్కడబడితే అక్కడ పడుతున్నాయి. దీంతో శబ్దానికి, బుల్లెట్లకు గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. పోలీస్ శాఖకు, జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం పోలీస్ శిక్షణాలయాన్ని అక్కడి నుండి వేరే ప్రాంతానికి మార్చాలని గ్రామస్తులు డిమాండు చేస్తున్నారు. లేదంటె సెంటర్ ముందు ఆందోళన చేస్తామని తెలిపారు.

యువతికి రూ.9 లక్షలు ఆన్‌లైన్ మోసం

తుమకూరు: తుమకూరు నగరంలోని చిక్కపేటకు చెందిన పీజే పవిత్ర నాగు అనే యువతిని సైబర్ దొంగలు రూ. 9.26 లక్షలు మోసం చేశారు. వివరాలు.. పవిత్రను మోసగాళ్లు వాట్సాప్ ద్వారా పరిచయం చేసుకొన్నారు. వెబ్‌సైట్ల లింకులు పంపి యాడ్సు కు రేటింగ్ ఇస్తే డబ్బులు చెల్లిస్తామని నమ్మబలికారు. మొదటిసారి ఆమె ఖాతాలోకి రూ. 203 డిపాజిట్ చేశాడు. అలా ఆమెకు నమ్మకం కుదిరిన తరువాత తమ వద్ద పెట్టుబడి పెడితే కొన్ని రోజుల్లోనే భారీగా లాభాలు వస్తాయని మభ్యపెట్టారు. నిజమేననుకున్న ఆమె గత నెల 26 నుంచి 29 వరకు మొత్తం రూ. 9. 26 లక్షలను వారి ఖాతాల్లోకి బదిలీ చేసింది. ఇక అంతే, ఒక్క రూపాయి కూడా తిరిగి రాలేదు. బాధితురాలు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, జిల్లాలో తరచూ సైబర్ మోసగాళ్ల చేతిలో సామాన్యులే కాదు, విద్యావంతులు కూడా మోసాలకు గురవుతూ లక్షలాదిగా నష్టపోతున్నారు.

మైసూరు జట్కా బండ్లకు ప్రోత్సాహం


కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎంపీ

మైసూరు: కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖల సహకారంతో శ్రీచాముండేశ్వరి దేవాలయం అభివృద్ధి మండలి, టాంగా హెరిటేజ్ స్కీంతో పాటు వివిధ అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. కలెక్టర్ కే.వి రాజేంద్ర మాట్లాడుతూ నగరంలో విస్తృతంగా జట్కా బండ్ల స్టాండ్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. జట్కా ప్రియులకు అనుకూలం చేసి, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. ఎంపీ ప్రతాపసింహ తదితరులు పాల్గొన్నారు.

బాంబు పెట్టి, బస్సులో పరార్


బస్సులో వెళ్తున్న నిందితుడు (వృత్తంలో)


నిందితుని రేఖాచిత్రం

- కెఫె పేలుడు కేసులో మరిన్ని చిత్రాలు లభ్యం
- బస్సులు మారుతూ పొరుగు రాష్ట్రానికి పయనం

సాక్షి, బెంగళూరు: బెంగళూరు కెఫేలో బాంబు అమర్చిన తరువాత నిందితుడు బీఎంటీసీ వోల్వో బస్సులో వెళ్లాడు. ఉదయం 11.41 గంటలకు కెఫేలో బాంబు ఉన్న బ్యాగును వదిలి నడిచివెళ్లాడు. కుందలహళ్లి నుంచి కాడుగోడికి వెళ్లే వోల్వో బస్సు ఎక్కాడు. కేఏ 01 ఎఫ్ 4517 నంబర్ కలిగిన వోల్వో బస్సు ఎక్కాడు. బస్సులో సీసీ కెమెరా ఉండడం గమనించి అక్కడ కూర్చొంటే తాను దొరికిపోతాననే భయంతో డ్రైవర్ వద్ద పక్క సీటులో కూర్చొన్నాడు. బస్సులో అతడు కంగారుగా ఉన్నట్లు సీసీ కెమెరాలలో రికార్డయింది. తరువాత హుడి వద్ద ఉన్న ప్రార్థన మందిరంలో నిందితుడు దుస్తులను మార్చుకుని టోపీని వదిలేసినట్లు గుర్తించారు. ఆ టోపీని ఎన్‌ఐఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు బీదర్‌కు వెళ్లే బస్సును నిందితుడు ఎక్కాడు. సాయంత్రం 4.30 గంటలకు తుమకూరు కళ్లంబెళ్ల టోల్, ఐదు గంటలకు శిరాను బస్సు దాటి వెళ్లింది. బస్సు బళ్లారికి చేరుకోగానే నిందితుడు అక్కడ దిగినట్లు అధికారులు గుర్తించారు. అక్కడి నుంచి బీదర్ లేదా భట్కళకు వెళ్లి, అక్కడి నుంచి కేరళ, లేదా మహారాష్ట్రకు ఉంటాడని అనుమానిస్తున్నారు.

చిత్రకారునిచే ఊహాచిత్రం విడుదల..

రామేశ్వరం కెఫేలో బాంబు పెట్టి వెళుతున్న వ్యక్తి చిత్రాల సీసీ కెమెరా చిత్రాలను పోలీసులు విడుదల చేయగా సోషల్ మీడియాలో వ్యాప్తి చెందాయి. నగరానికి చెందిన శ్రీహర్ష అనే చిత్రకారుడు ఈ చిత్రాల ఆధారంగా నిందితుని రేఖాచిత్రాన్ని గీశాడు. వాటిని ఎన్‌ఐఏ, బెంగళూరు నగర పోలీసు ఎక్స్ ఖాతాలకు ట్యాగ్ చేశారు. ఈ చిత్రాలు విచారణ సంస్థలకు ఉపయోగపడవచ్చునని తెలిపాడు.

త్వరలోనే పట్టుకుంటాం: హోంమంత్రి

తుమకూరు: బెంగళూరులో హోటల్లో బాంబు పేలుడు కేసును అతి త్వరలోనే ఛేదిస్తాం, బాంబు పెట్టినవారిని అరెస్టు చేస్తామని హోం మంత్రి జీ.పరమేశ్వర్ అన్నారు. తుమకూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. సీసీబీ, ఎన్‌ఐఏ సహా 8కి పైగా పోలీసు బృందాలు గాలిస్తున్నాయని, అతడు ఏ మూలన ఉన్నా కూడా పోలీసులు వదిలిపెట్టరని అన్నారు. ఈ కేసులో ఇంకా ఎవరినీ అరెస్టు చేయలేదని, నలుగురు అనుమానితులను విచారించి వదిలేసినట్లు తెలిపారు.

నీటిసంపులో పడ్డ చిన్నారి

- సమయస్ఫూర్తితో రక్షించిన ట్రాఫిక్ పోలీసు

దొడ్డబళ్లాపురం: నీటిసంపులో పడి ప్రాణాపాయంలో ఉన్న చిన్నారిని ట్రాఫిక్ ఎస్సై సమయస్ఫూర్తితో రక్షించిన సంఘటన బెంగళూరులోని బీఈఎల్ లేఔట్‌లో చోటుచేసుకుంది. బ్యాడరహళ్లి పీఎస్ పరిధిలోని బీఈఎల్ లేఔట్‌లోని ఒక ఇంటి ముందు ఆడుకుంటున్న రెండున్నరేళ్ల చిన్నారి తెరిచి ఉంచిన నీటి సంపులోకి పడిపోయింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న బ్యాటరాయనపుర ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్సై నాగరాజు చిన్నారి అరుపులు విని వెంటనే సంపులోకి దిగి చిన్నారిని ప్రాణాలతో కాపాడాడు. కొన్ని క్షణాలు ఆలస్యమైనా చిన్నారి ప్రాణాలతో దక్కేది కాదు. అస్వస్థతకు గురైన చిన్నారిని వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స అందించిన వైద్యులు చిన్నారి ప్రాణాలకు ప్రమాదం లేదని తెలిపారు. పోలీసు సమయస్ఫూర్తికి చిన్నారి తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. బెంగళూరు ట్రాఫిక్ పోలీసు ఎక్స్ పేజ్‌లో ఇందుకు సంబంధించి ఫొటోలతో పాటు పోస్టు చేసారు.

అమ్మాయిపై మూకుమ్మడి అఘాయిత్యం

తుమకూరు: జాతరకు వస్తున్న అమ్మాయిపై దారుణం చోటుచేసుకుంది. తుమకూరు సిద్దగంగ మఠం సమీపంలోని బండేపాళ్య వద్ద సోమవారం 17 ఏళ్ల అమ్మాయిపై దుండగులు లైంగికదాడికి పాల్పడడం సంచలనం సృష్టించింది. వివరాలు.. బాలిక తన స్నేహితురాలితో కలిసి సిద్ధగంగ మఠంలో జరుగుతున్న జాతరకు వెళుతోంది. ఈ సమయంలో అలసిపోయి మార్గమధ్యలో చెట్టుకింద కూర్చున్నారు. ఇంతలో కొందరు యువకులు వారిని వీడియో తీశారు, సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదిరించి బాలికను బైక్‌పై ఇంటికి తీసుకెళ్లి ఇద్దరు అత్యాచారం చేశారు. తరువాత ఆమెను తిరిగి మఠం వద్ద వదిలేశారు. స్నేహితురాలు ఆమెను ఆసుపత్రిలో చేర్పించింది. ఆసుపత్రిలో అమ్మాయి వాంగ్మూలం తీసుకున్న పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ఒక నిందితుడిని అరెస్టు చేశారు.



క్లుప్తంగా

జాతీయ విపత్తుగా పరిగణించాలి



వినతిపత్రాన్ని సమర్పిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో 2023–24వ సంవత్సరంలో నెలకొన్న కరువును కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేఆర్ఎస్ డిమాండ్ చేసింది. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద వినతిపత్రాన్ని సమర్పించిన అనంతరం జిల్లా సంచాలకుడు వీరేష్ మాట్లాడారు. కరువు సహాయక పనులు చేపట్టాలని, నరేగ పనులకు ప్రాధాన్యత కల్పించాలని, పశువులకు పశుగ్రాసం, తాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రాన్ని సమర్పించారు.

రైలు కింద పడి ఉద్యోగి ఆత్మహత్య



మృతి చెందిన వెంకప్పనాయక్

రాయచూరు రూరల్: నగరంలో గురువారం ఓ ప్రభుత్వ ఉద్యోగి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడిని నగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న వెంకప్పనాయక్(60)గా గుర్తించామని, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని, మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం రిమ్స్ కళాశాలకు తరలించినట్లు తెలిపారు.

సిరిధాన్యాలతో ఆరోగ్యం

కంప్లి: పోషకాలు అధికంగా ఉన్న సిరిధాన్యాలను వాడటం వల్ల ఆరోగ్యం అభివృద్ధి చెందుతుందని ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ క్షేత్ర యోజనాధికారి ఎంఎ హాలప్ప తెలిపారు. తాలూకాలోని రామసాగర గ్రామంలో ఏర్పాటు చేసిన సిరిధాన్యాల వినియోగంతో లబ్ధిపై శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు.

కేవైసీ అప్‌డేట్ సాకుతో రూ.4.40 లక్షల వంచన

హుబ్లీ: కేవైసీ అప్‌డేట్ సాకుతో ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకొని రూ.4.40 లక్షలను బదలాయించుకొని వంచించిన ఘటన గురువారం వెలుగు చూసింది. ధార్వాడ విద్యాగిరి రంగారావు దేశాయి బాధితుడు. కేవైసీ అప్‌డేట్ చేయక పోతే మీ బ్యాంక్ ఖాతా బంద్ అవుతుందని గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ చేసి ఆ మేరకు ఖాతా వివరాలు సేకరించి ఓటీపీ తీసుకొని రూ.4.40 లక్షలను తమ ఖాతాలోకి బదలాయించుకొని మోసగించినట్లు బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు తెలిపారు.

మోదీ ప్రధాని కావాలని బైక్ యాత్ర



యాత్ర చేపట్టిన సాధ్వి మాతా రాజ్యలక్ష్మి

రాయచూరు రూరల్: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మూడోసారి కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి పదవిని అలంకరించాలంటూ తమిళనాడుకు చెందిన సాధ్వి మాతా రాజ్యలక్ష్మి బులెట్ యాత్రను చేపట్టారు. గురువారం నగరంలో ఎమ్మెల్యే, జిల్లా బీజేపీ అధ్యక్షుడు శివరాజ్ పాటిల్ స్వాగతం పలికి ఆమెను సన్మానించారు. దేశ వ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో 21 వేల కి.మీ. ప్రయాణించి ప్రచారం చేపట్టారు. ఆమె యాత్ర సురక్షితంగా సాగాలని ఆకాంక్షించారు.

పోకిరీల దాడిలో యువకుడికి గాయాలు



యువకుడిపై దాడి చేస్తున్న పోకిరీలు

హుబ్లీ: వాణిజ్య నగరి హుబ్లీలో పోకిరీల బెడద మళ్లీ మొదలైంది. చిన్న కారణానికి ప్రజలతో ఘర్షణ పడి గొడవ పడటం ఇటీవల సాధారణమైంది. అలాంటి ఓ ఘటన బుధవారం అర్ధరాత్రి వేళ చోటు చేసుకుంది. స్థానిక మంటూరు రోడ్డు గాంధీ ఏకతా కాలనీలో ఓ యువకుడిని పోకిరీల గుంపు రాయితో కొట్టి దాడి చేసి పరారైంది. ఘటనలో గైబుఖాన్ అకిమ్ అనే యువకుడు గాయపడ్డాడు. మణికంఠ, సాహిల్, మరొకరు కలిసి గంజాయి తాగిన మైకంలో గైబుఖాన్‌తో అకారణంగా గొడవకు దిగారు. యువకుడిపై రాయితో దాడి చేసినట్లు బాధితుడు బెడ్డిగేరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడికి కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఈ దాడి దృశ్యాలను స్థానికుడు తన మొబైల్‌లో రికార్డు చేయడంతో వైరల్ అయ్యాయి.


శివపూజకు శివాలయాలు సిద్ధం

- సర్వాంగ సుందరంగా ముస్తాబు
- జోరుగా పూజాసామగ్రి కొనుగోళ్లు

కోలారు: శివరాత్రిని పురస్కరించుకుని నగరంతో పాటు తాలూకాలోని అన్ని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. నగరంలోని ప్రసిద్ధ ప్రసన్న సోమేశ్వరస్వామి ఆలయం, దక్షిణ కాశీ అంతరగంగ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, బసవేశ్వర ఆలయం, కాళికాంబ కమటేశ్వర ఆలయాలను శివరాత్రి సందర్భంగా సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తాలూకాలోని వక్కలేరి మార్కండేశ్వర ఆలయం, కేజీఎఫ్ తాలూకాలోని కోటిలింగేశ్వర స్వామి ఆలయం, ముళబాగిలు ఆవణి రామలింగేశ్వర స్వామి ఆలయం తదితర ప్రసిద్ధ ఆలయాల్లో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలు ఆలయాల్లో శివరాత్రి జాగరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పలు ఆలయాల్లో రాత్రంతా వివిధ పూజలు నిర్వహిస్తున్నారు.

పూలు, పండ్ల వ్యాపారాలు జోరు

శివరాత్రి పండుగను పురస్కరించుకుని ఉదయం నుంచి నగరంలో పూలు, పండ్ల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. పండుగ నాడు ధరలు పెద్దగా పెరగక పోవడంతో కొనుగోలుదారులు ఉత్సాహంగా కొనుగోలు చేశారు. మల్లెపూలు కిలో రూ.800, కనకాంబరాలు కిలో రూ.1000, రోజాలు రూ.200, చేమంతులు రూ.250, ఊటీ



కేజీఎఫ్ తాలూకా కమ్మసంద్రలోని కోటిలింగ క్షేత్రం

రోజాలు కిలో రూ.250, బంతిపూలు కిలో రూ.100, మిక్స్ పూలు కిలో రూ.200లకు విక్రయించారు. అరటి పండ్లు కిలో రూ.80, దానిమ్మ కిలో రూ.180, పుచ్చకాయలు కిలో రూ.30, ఆపిల్ కిలో రూ.250, ఆరెంజ్ కిలో రూ.150, చెరకు గడ ఒకటి రూ.50ల ప్రకారం విక్రయించారు. నగరంలోని దొడ్డపేటె, పాతబస్టాండు, పూల మార్కెట్, ఎంజీ రోడ్డు తదితర ప్రాంతాలలో జోరుగా వ్యాపారాలు జరిగాయి.

శివరాత్రికి కోటిలింగ క్షేత్రం ముస్తాబు

కేజీఎఫ్: శివరాత్రి ఉత్సవాలకు కమ్మసంద్ర కోటిలింగ క్షేత్రం అన్ని విధాలుగా సిద్ధమైంది. ఆలయంలో 24 గంటల పాటు విశేష పూజలను నిర్వహించనున్నారు. 48 ఏళ్ల క్రితం స్థాపించిన ఆలయంలో 90 లక్షలకు పైగా శివలింగాలను ఇంతవరకు ప్రతిష్ఠించారు. ఇదివరకు శివలింగాలను ప్రతిష్ఠించిన వారు కోటిలింగ క్షేత్రానికి వచ్చి తాము ప్రతిష్ఠించిన శివలింగానికి ప్రత్యేక పూజలను నిర్వహించడం విశేషం. శివరాత్రి సందర్భంగా కోటిలింగ క్షేత్రానికి జిల్లా, రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్ర, తమిళనాడుల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం బ్రహ్మ రథోత్సవం, విశేష పూజ, హోమ హవనాలను, కోలాటం, హరికథ, శివభజనలను నిర్వహిస్తారని ఆలయ పాలనాధికారి కేవీ కుమారి తెలిపారు.



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



గెనుసు గడ్డలు కొనుగోలు చేస్తున్న దృశ్యం



చెరకు గడలను కొనుగోలు చేస్తున్న దృశ్యం

కన్నడ బోర్డులు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చిక్కబళ్లాపురం: జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో నామ ఫలకాలు తప్పనిసరిగా 60 శాతం కన్నడలోనే ఉండాలని జిల్లా కలెక్టర్ పి ఎన్ రవీంద్ర తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో అధికారుల సమావేశంలో మాట్లాడుతూ...ఇతర భాషలకు సంబంధించి 40 శాతం మించరాదన్నారు. బ్యాంకులు, ఇతర కార్యాలయాలలో వ్యవహారాలు కన్నడలోనే జరగాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రకాశ్ నిట్టాలి, ఏడీసీ తిప్పేస్వామి, కన్నడ సాంస్కృతిక శాఖ ఏడీ మనిషా తదితరులు పాల్గొన్నారు.

వేశ్యావాటిక నిర్వాహకుల అరెస్ట్

మైసూరు: వేశ్యావాటిక కేంద్రంపై విజయ నగర పోలీసులు దాడి చేసి నలుగురు యువతులను రక్షించి, 13 మంది పురుషులను అరెస్ట్ చేశారు. నగరంలోని విజయనగర వాటర్ ట్యాంక్ వద్ద ఒక రెసిడెన్సీలో వేశ్యావాటిక నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న ఒడనాడి సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు దాడి చేసి నిర్వాహకులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

తుమకూరులో కొత్త బస్సులు షురూ

తుమకూరు: తుమకూరు నగరంలో ఉన్న కేఎస్ఆర్‌టీసి బస్టాండులో గురువారం సుమారు 15 కొత్త అశ్వమేధ కేఎస్ఆర్‌టిసి బస్సులను హోం మంత్రి. జీ. పరమేశ్వర్, మంత్రి కే.ఎన్.రాజన్నలు ప్రారంభించారు. కేఎస్ఆర్‌టిసి కార్పొరేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎస్. ఆర్. శ్రీనివాస్ బస్టాండులో నుంచి కొత్త బస్సును నడిపారు. ప్రయాణికులకు సౌలభ్యం కోసం అదనపు బస్సులను కొనుగోలు చేసినట్లు పరమేశ్వర్ చెప్పారు. ఇందులో 8 బస్సులు బెంగళూరు- తుమకూరు మార్గంలో సంచరిస్తాయని తెలిపారు.

పాక్ నినాదాల కేసులో మరో నిందితుడు అరెస్టు



మహమ్మద్

దొడ్డబళ్లాపురం: విధానసౌధలో పాకిస్తాన్‌కు మద్దతుగా జిందాబాద్‌లు పలికిన 4వ నిందితుడిని పోలీసులు అరెస్టు చేసారు. మహమ్మద్ షఫి నాశిపుడి అరెస్టైన నిందితుడు. గత ఫిబ్రవరిలో 27న విధానసౌధలో రాజ్యసభ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి నాసిర్ హుసేన్ విజయోత్సవ సందర్భంగా ఆయన మద్దతుదారులు పాకిస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేసిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అధికారపార్టీ కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేసింది. ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు ఆధారంగా పోలీసులు ఎట్టకేలకు ఇప్పటికే ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా తాజాగా మరో నిందితుడిని అరెస్టు చేసారు. రెండు వారాలపాటు నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తూ కోర్టు ఆదేశించింది.

మట్టి తరలింపు అరికట్టాలని డిమాండ్

గంగావతి: తాలూకాలోని సంగాపుర గ్రామ సమీపంలోని లక్ష్మీనారాయణ చెరువులో నుంచి అక్రమంగా సారవంతమైన మట్టిని తరలించడాన్ని అరికట్టాలనే డిమాండ్‌తో ప్రజా సంక్షేమ సమితి నేత బసవరాజ్ మేగళమని ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీనారాయణ చెరువులో ఏర్పడిన పూడికలో సారవంతమైన మట్టిని అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులు జిల్లా, ఇతర జిల్లాల వారు ఇప్పటికే వేలాది ట్రిప్పులు తీసుకెళ్లారన్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లినా వారు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికైనా



అధికారికి వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ఇలాంటి మట్టిని తహసీల్దార్ నేతృత్వంలో రెవెన్యూ శాఖ వారు కాపాడి టెండర్ ద్వారా మట్టిని ఆ ప్రాంత రైతులకే అందజేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

త్రినేత్రుడికి నేడు స్వర్ణ ముఖం అలంకరణ

మైసూరు: మైసూరు నగరంలోని అంబా విలాస ప్యాలెస్ ఆవరణంలో మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం త్రినేశ్వర స్వామికి బంగారు ముఖం అలంకరించనున్నారు. 11 కిలోలు ఉన్న ఈ బంగారు ముఖాన్ని మైసూరు ట్రెజరీ నుంచి ప్రత్యేక బందోబస్తు ద్వారా తీసుకువచ్చారు. మైసూరు మహారాజు జయచామరాజేంద్ర ఒడెయార్ కానుకగా ఇచ్చిన ఈ బంగారం ముఖాన్ని ప్రతి సంవత్సరం మహాశివరాత్రి రోజును త్రినేశ్వర స్వామికి అలంకరించి పూజలు చేయడం ఆనవాయితీ.

రూ. 831 కోట్లతో మైసూరు బడ్జెట్

మైసూరు: రూ. 831 కోట్లతో మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) 2024–25కు సంబంధించి వార్షిక బడ్జెట్‌ను రూపొందించారు. గురువారం ప్రాధికార అధ్యక్షుడు మరిగొడ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో కమిషనర్ జీటీ దినేశ్‌కుమార్ రూ. 831 కోట్ల బడ్జెట్‌ను సమర్పించారు. రూ. 831 కోట్ల బడ్జెట్‌లో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ. 825 కోట్ల ఖర్చు చేసే విధంగా బడ్జెట్‌ను రూపొందించారు. దీంతో రూ. 6 కోట్లు మిగులు బడ్జెట్‌ను చూపించారు.

ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి భూమిపూజ

కృష్ణరాజపురం: మహాదేవపుర పరిధిలోని హూడి హరిదాచార పాళ్య, దొడ్డ కన్నళ్లి వార్డుల్లో ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి స్థానిక మహాదేవపుర ఎమ్మెల్యే మంజుల లింబావలి గురువారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. మూడు ఆరోగ్య కేంద్రాలకు రూ. 2.40 కోట్ల వ్యయం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీబీఎంపీ ఇంజినీర్లు, ఆరోగ్య అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

చింతామణి: పట్టణంలోని ఆంజనేయ రెడ్డి కల్యాణ మంటపంలో గురువారం రాత్రి మంత్రి సుధాకర్ సహకారంతో శ్రీ విద్యాగణపతి సేవా ట్రస్టు, ఒక్కలిగర సంఘం, సప్తగిరి ఆస్పత్రి బెంగళూరు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వందలాది మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. లక్ష్మీనారాయణరెడ్డి, కృష్ణమూర్తి, శివణ్ణ, చౌడప్ప, ప్రకాష్, జయరాంరెడ్డి, వనజాక్షి పాల్గొన్నారు.

ఆల్మట్టి డ్యాం నుంచి నీరు విడుదల



ఆల్మట్టి నుంచి నీరు విడుదల చేసిన దృశ్యం

రాయచూరు రూరల్: రాష్ట్రంలో సరైన వర్షాలు కురువక పోవడంతో ఉత్తర కర్ణాటకలో జల క్షామంతో పాటు తాగునీటి ఎద్దడి, విద్యుత్ కొరత నివారణకు ఆల్మట్టి డ్యాం నుంచి 4 టీఎంసీల నీటిని విడుదల చేశారు. బెళగావి ప్రాంతీయ కార్యదర్శి ఆదేశాల మేరకు బుధవారం డ్యాం నీటి విడుదలకు శ్రీకారం చుట్టినట్లు ఇంజినీర్ బసవరాజ్ తెలిపారు. రాయచూరు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం(ఆర్టీపీఎస్), యరమరస్ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం(వైటీపీఎస్)ల నుంచి రాష్ట్రానికి 45 శాతం మేర విద్యుత్‌ను సరఫరా చేసే యూనిట్లలో ఉత్పత్తి సామర్థ్యం పెంపు కోసం ఈ నీటిని విడుదల చేశామన్నారు.

కరువు నివారణలో సర్కార్ విఫలం

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి సిద్దరామయ్య కరువు సహాయక పనులు చేపట్టడంలో పూర్తిగా విఫలం అయ్యారని విధాన పరిషత్ చీఫ్ విప్ రవికుమార్ ఆరోపించారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కరువు నివారణకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగ పరచుకోవడంలో విఫలమైందన్నారు. 7408 గ్రామాలు, 1115 వార్డులు, 90 తాలూకాల్లో నీటి ఎద్దడి నెలకొందని, ఇందుకోసం రూ.68 కోట్లు విడుదల చేసినా ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేదన్నారు. పైగా నిధుల కోసం కేంద్రం వైపు వేలెత్తి చూపడం తగదన్నారు. సీఎం, మంత్రివర్గ సహచరులు తమ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు.

పథకాలపై ప్రచారం అవసరం

గంగావతి: ప్రధాని మోదీ అమలు చేసిన పథకాల గురించి త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మహిళలకు విస్తృత ప్రచారం చేపట్టాలని లోక్‌సభ సభ్యుడి కోడలు మంజుల అమరేష్ కరడి అన్నారు. ఆమె గురువారం కొప్పళ నగరంలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మంటపంలో ప్రధాని మోదీ పాల్గొన్న కార్యక్రమాన్ని టీవీల్లో వీక్షించేందుకు ఏర్పాట్లు చేసిన సందర్భంగా మాట్లాడారు. మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర తన పదేళ్ల అధికార అవధిలో పలు పథకాలను అమలు చేశారన్నారు. కట్టెల పొయ్యాలతో కళ్లు పోగొట్టుకొని అనారోగ్యం పాలవుతున్న మహిళలను కాపాడేందుకు అనిల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్, సిలిండర్ ప్రతి పేద ఇంటికీ అందజేశారని



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ఆమె తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం పలు రకాల సహాయధన పథకాలను అమలు చేశారన్నారు. అందువల్ల మరో సారి నరేంద్ర మోదీని ప్రధానిని చేయాలన్న సంకల్పంతో ప్రతి మహిళా ఓటు వేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

ఘనంగా రథోత్సవం

చింతామణి: తాలుకాలోని పెద్దూరు గ్రామపంచాయతీ పరిధిలోని దిగవకోట గ్రామంలో వెలసిన పురాతన శ్రీ విశ్వేశ్వరస్వామి రథోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేదపండితులు శాస్త్రోక్తంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తుల సమక్షంలో రథోత్సవం నిర్వహించారు.

కోలారు వార్తలు...

చెత్త సేకరణ కేంద్రానికి శ్రీకారం



పురసభ చెత్త సేకరణ కేంద్రం ఇదే



మాట్లాడుతున్న కమిషనర్ సత్యనారాయణ్

శ్రీనివాసపురం: పట్టణంలో తిరిగి ఉపయోగించగలిగే చెత్తను వేయడం కోసం పురసభ ఆధ్వర్యంలో చెత్త సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పురసభ ముఖ్యాధికారి సత్యనారాయణ్ తెలిపారు. గురువారం చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. చెత్త సేకరణలో పౌర కార్మికులతో ప్రజలు సహకరించాలని కోరారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయవద్దన్నారు. పౌర కార్మికులు వచ్చినప్పుడు పురసభ చెత్త సేకరణ వాహనంలోనే వేయాలన్నారు. నగరాన్ని స్వచ్ఛంగా ఉంచడమే పురసభ ముఖ్య ఉద్దేశం అని, స్వచ్ఛతతో ప్రజలను రోగాల బారిన పడకుండా కాపాడవచ్చన్నారు. పురసభ హెల్త్ ఇన్‌స్పెక్టర్ రమేష్ మాట్లాడుతూ చెత్త సేకరణలో ప్రాధాన్యత మేరకు తిరిగి ఉపయోగించ గలిగే చెత్తను వేరు చేసి రీసైక్లింగ్ చేస్తారన్నారు. పట్టణాన్ని శుభ్రతగా ఉంచడంలో పురసభతో ప్రజలు సహకరించాలని కోరారు.

మాతాశిశు మరణాలు అరికట్టరూ

కోలారు: నగరంలోని ఎస్ఎన్ఆర్ జిల్లా ఆస్పత్రిలో మాతా(గర్భిణులు), శిశు మరణాలను తీవ్రంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం పదాధికారులు గురువారం ఆస్పత్రి సర్జన్ డాక్టర్ విజయకుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నారాయణగౌడ మాట్లాడుతూ ఆస్పత్రిలో ఇటీవల గర్భిణులు, బాలింతలు, శిశువుల మరణాలు అధికం అవుతున్నాయన్నారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించడంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అంతేకాకుండా ఆస్పత్రి వద్ద అంబులెన్స్ మాఫియాను అడ్డుకోవాలన్నారు. జిల్లాలోని ఎస్ఎన్ఆర్ ఆస్పత్రిలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం వల్ల ఆస్పత్రిపై జిల్లా ప్రజలు విశ్వాసం కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎ.నళినిగౌడ, వక్కలేరి హనుమయ్య, మంగసంద్ర తిమ్మణ్ణ, నరసింహయ్య పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

కోలారు: తాలూకాలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ సూచించారు. గురువారం నగరంలోని టీపీ సభాంగణంలో నిర్వహించిన టాస్క్‌ఫోర్సు సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో తీవ్ర సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. అధికారులు కార్యాలయాలు వీడి గ్రామాలకు వెళ్లి తాగునీటి సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకోవాలన్నారు. పశువులకు మేత సమస్య ఎదురుకాకుండా చూడాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే తహసీల్దార్, టీపీ ఈఓలను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. ప్రతి గ్రామంలోను తాగునీటి సమస్యల గురించి అధికారులు సమీక్షించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఇవ్వడంతో పాటు ప్రాధాన్యత మేరకు అవసరమైన చోట్ల కొత్తగా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంజునాథ్

బోరుబావులు తవ్వించాలన్నారు. తహసీల్దార్ హర్షవర్ధన్ మాట్లాడుతూ ప్రస్తుతానికి 13 వారాలకు సరిపడా 34 వేల టన్నుల పశువుల మేత నిల్వ ఉందన్నారు. గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి మూడు నెలలకోసారి శుభ్రం చేయాలని సూచించారు. రక్షిత తాగునీటి యూనిట్లు లేని గ్రామాల్లో కూడా యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నగరసభ కమిషనర్ శివానంద తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే బంగారు భవిష్యత్తు

శ్రీనివాసపురం: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎం .శ్రీనివాసన్ తెలిపారు. గురువారం భైరపల్లిలో భైరవేశ్వర విద్యానికేతనలో మాతాపితృ వందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలకు తల్లిదండ్రులు ఆస్తులు ఇచ్చే బదులు వారికి ఉత్తమ విద్యను అందించాలన్నారు. నేడు పెరుగుతున్న శాస్త్ర సాంకేతిక విద్యకు అనుగుణంగా విద్యార్థులు విద్యాభ్యాసం చేయాలన్నారు. కార్యక్రమంలో చిక్కబళ్లాపురం బీజీఎస్ పాఠశాల పాలనాధికారి డాక్టర్ శివరామరెడ్డి, చిక్కబళ్లాపురం శాఖా మఠం పీఠాధిపతి మంగళానంద స్వామీజీ, డాక్టర్ రంగారావు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం

కేజీఎఫ్: జేడీఎస్, బీజేపీ మైత్రిపై పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని, ఇరు పార్టీల ఉమ్మడి అభ్యర్థి విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని జేడీఎస్ నాయకులు తెలిపారు. గురువారం జేడీఎస్ నాయకుడు సురేష్‌కుమార్ నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ తాలూకా అధ్యక్షుడు దయానంద్ మాట్లాడుతూ కేజీఎఫ్ శాసనసభ పరిధిలో లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థికి అత్యధిక ఓట్లు వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఇప్పటికే నగర, గ్రామీణ ప్రాంతాల్లో కార్యకర్తల అభిప్రాయాలను సేకరించారు. కార్యకర్తలందరూ ఉమ్మడి అభ్యర్థి విజయానికి కట్టుబడి ఉన్నారన్నారు. తాలూకాలో జేడీఎస్ పార్టీని మరింత బలపరుస్తామన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని గ్రామీణ స్థాయి నుంచి పటిష్టం చేస్తామన్నారు. నగరంలో జేడీఎస్‌కు పూర్వవైభవం తేవడానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ఫిర్కా స్థాయిలో సమావేశాలు నిర్వహించి పార్టీ కేడర్‌లో శక్తిని నింపుతామన్నారు. జేడీఎస్ నాయకులు పరంధామన్, జీపీకే శ్రీనివాస్, ఎస్.శేఖర్, కాణికరాజ్, దండపాణి, జగన్నాథన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీఎస్ నాయకులు

క్లుప్తంగా

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అప్పుడే ప్రమాదాలు జరగవని ఎమ్మెల్యే సుబ్బారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని దేవరాజు అరసు భవనంలో పోలీసు శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ...చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన, ట్రాఫిక్ నియమాలు పాటించకున్నా ఇబ్బందులు తప్పవని అన్నారు. ఇలాంటి విషయాల్లో తన వద్దకు ఎవరూ రావద్దని అన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు

కృష్ణరాజపురం: నగరంలోని కృష్ణరాజపుర నియోజకవర్గం హోరమావు బ్లాక్‌లోని చళ్ళికెరె వార్డులో బాబుసాబ్ పాళ్యలో హెలాక్షి, హేమారెడ్డి, వినయ్, ప్రదీప్‌రాజు, మద్దతుదారులు బీజేపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ నాయకుడు డి.కే.మోహన్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్, వార్డు అధ్యక్షుడు బాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాద దృశ్యం

గౌరిబిదనూరు: ట్రాక్టర్ కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వాటంకొత్తపల్లి సమీపంలో చోటుచేసుకుంది. మృతుడిని వాటంకొత్తపల్లికి రాజు (45)గా గుర్తించారు. ఇతను గొట్లగుంటె నుండి వాటం కొత్తపల్లికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా ట్రాక్టర్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ రమేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతాం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

గౌరిబిదనూరు: అభివృద్ధి పనులలో నాణ్యత లోపిస్తే అటువంటి కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడుతామని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ హెచ్చరించారు. నగరంలోని ఫస్ట్‌గ్రేడ్ కళాశాల ఆవరణంలో ఆయన అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేసి, తాలూకాలో రూ. 10 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, మంత్రి జమీర్ అహమ్మద్‌తో చర్చించి అలీపురం గ్రామ పంచాయతీని పట్టణ పంచాయతీగా అప్‌గ్రేడ్ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈఈ అనిల్, ఏఈఈ సౌమ్య, ప్రిన్సిపాల్ రమేశ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు సీజ్



తుమకూరు: ఏడాది కాలంగా ఆర్‌సీ లేకుండా తిరుగుతున్న బస్సును ఆర్టీఓ అధికారులు గుర్తించి సీజ్ చేసిన ఘటన తుమకూరు జిల్లా శిర తాలూకా దొడ్డలదమర వద్ద చోటుచేసుకుంది. కే.ఏ. 22 బీ4994 అనే ప్రైవేట్ బస్సు ఆర్టీఓ అనుమతులు లేకుండా తిరుగుతున్నట్లు సమాచారం అందుకున్న ఆర్టీఓ అధికారులు నిఘా పెట్టి బస్సును పట్టుకుని సీజ్ చేశారు. ఎంవీఐ విద్యా విజయ్ ఆధ్వర్యంలో అధికారులు బస్సును పట్టుకున్నారు.

కమిటీ సభ్యుడిగా నియామకం



బొమ్మనహళ్లి: రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఐదు గ్యారెంటీ పథకాలు అమలు చేయడంతో పాటు ప్రజలకు మరింత చేరువ చేయడానికి బెంగళూరు నగరంలోని బీబీఎంపీ పరిధిలో ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ప్రభుత్వం నియమించింది. ఇందులో బొమ్మనహళ్లి హెచ్ఎస్ఆర్ లేఔట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి. వాసుదేవ రెడ్డికి కూడా అవకాశం లభించింది. మరో ఇద్దరిలో బీబీఎంపీ మాజీ మేయర్ మంజునాథ్ రెడ్డితో పాటు ఆనేకల్‌లోని కుద్లుకు చెందిన కేపీసీసీ సభ్యుడు బాలకృష్ణారెడ్డికు స్థానం లభించింది. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డిని కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ అనిల్ రెడ్డి అభినందించారు.

శైవక్షేత్రాల్లో శివరాత్రి శోభ



ఉత్తర కన్నడ జిల్లాలోని గోకర్ణ మహాబలేశ్వరాలయం



దక్షిణ కాశీగా పిలిచే నంజనగూడులోని శ్రీకంఠేశ్వర ఆలయం



బెంగళూరు హెచ్ఏఎల్‌లోని కెంప్‌ఫోర్టు శివాలయం

• ముస్తాబైన ఆలయాలు

బనశంకరి: పరమశివుడికి పరమ పవిత్రమైన మహాశివరాత్రి పర్వదినానికి శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. కర్ణాటకలో శైవక్షేత్రాలు ప్రసిద్ధిచెందగా పురాతన దేవస్థానాలకు నిలయం. విద్యుత్ కాంతులతో ఆలయాలు ప్రత్యేకశోభను సంతరించుకున్నాయి.

ధర్మస్థల మంజునాథ దేవస్థానం

ధర్మస్థలలోని మంజునాథ ఆలయం కర్ణాటకలోని పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా పేరుగాంచింది. మంజునాథుడిని ఒక్కసారైనా దర్శించుకోవాలని ఉవ్విళ్లూరుతుంటారు. దక్షిణ కన్నడ జిల్లాలో ఉంది. కర్ణాటక నుంచి కాక దేశం నలుమూలల నుండి భక్తులు వస్తుంటారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులతో సందడిగా మారుతుంది.

కోలారు కోటి లింగేశ్వరాలయం

ప్రపంచంలోనే అత్యధిక లింగాలు కలిగిన ఆలయం కోటి లింగేశ్వరాలయం. ఇది కోలారు జిల్లాలోని కమ్మసంద్రలో వెలసింది. 108 అడుగుల ఎత్తు కలిగి ఉంది. 35 అడుగుల ఎత్తులో నంది విగ్రహం ఇక్కడ లెక్కించలేని శివలింగాలు మనకు దర్శనమిస్తాయి.

మహాబలేశ్వర ఆలయం గోకర్ణ

కర్ణాటకలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిచెందిన గోకర్ణ మహాబలేశ్వరాలయం. ఇది కర్ణాటకలోని అత్యంత ప్రసిద్ధ శివాలయాల్లో ఒకటిగా పేరుగాంచింది. ఈ ఆలయం ఉత్తర కన్నడ జిల్లా కారవార బీచ్‌లో ప్రవహించే అరేబియా సముద్రం ఎదురుగా ఉంటుంది. ఈ ఆలయంలో ఆత్మలింగం ఉండగా ఎంతో ప్రత్యేకత సంతరించుకుంది. కర్ణాటకలోని ఏడు పవిత్రమైన మోక్ష స్థలాల్లో ఈ ఆలయం ఒకటని చెప్పవచ్చు.

పట్టదకల్లు మల్లికార్జున దేవస్థానం

యునెస్కో రికార్డుల్లో ఉన్న ప్రముఖ పర్యాటక స్థలం పట్టదకల్ హిందూ, జైన దేవస్థానాలకు నిలయంగా ఉంది. ఈ దేవస్థానాల్లో ఒకటైన మల్లికార్జున దేవస్థానం 7–8 శతమానంలో నిర్మించిన పురాతన ఆలయం. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేకపూజలు చేపడతారు.

కేదారేశ్వర దేవస్థానం

త్రికోట శైలిలో నిర్మించిన కేదారేశ్వర దేవస్థానం శివమొగ్గ జిల్లాలో ఉంది. ఈ ఆలయంలో శివ, విష్ణు దేవతలతో కూడిన మూడు ఆలయాలు ఉన్నాయి. ఆరు స్తంభాల సభాంగణంగా ఖ్యాతి గడించింది.

గవిపుర గవిగంగాధరేశ్వర ఆలయం

గవిపుర గవిగంగాధరేశ్వరాలయం పురాతనమైన గుహాలయం. మకర సంక్రాంతి పండుగ రోజు సాయంత్రం సూర్యరశ్మి నందివిగ్రహం కొమ్ముల మధ్య గుండా గంగాధరేశ్వరుడి శివలింగం మీద పడుతుంది. మహాశివరాత్రికి ఇక్కడ భారీ ఎత్తున భక్తులు తరలివస్తారు.

మురుగేశ్‌పాళ్య కెంప్‌ఫోర్ట్ శివాలయం

హెచ్ఏఎల్‌రోడ్డు మురుగేశ్‌పాళ్యలో వెలసిన కెంప్‌ఫోర్ట్ శివాలయం బెంగళూరు మైలురాళ్లలో ఒకటి. ఇది 65 అడుగుల ఎత్తైన శివుడి విగ్రహం. శివరాత్రి సందర్భంగా భక్తులతో పోటెత్తుతుంది.

కాడుమల్లేశ్వర ఆలయం

మల్లేశ్వరం ప్రాంతానికి కాడుమలేశ్వర ఆలయం నుంచి పేరు వచ్చింది. ఇది 17వ శతాబ్దపు శివుడికి అంకితం చేయబడిన ఆలయం. ఈ ఆలయానికి మరో ప్రధాన ఆకర్షణ నందీశ్వరతీర్థం. ఇక్కడ నీరు నంది విగ్రహం నోటి నుంచి నిరంతరం ప్రవహించి శివలింగంపై పడుతుంది. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

కళాసీపాళ్య కోటే జలకంఠేశ్వర ఆలయం

కళాసీపాళ్య కోటే జలకంఠేశ్వర ఆలయం ఇది చోళ రాజవంశానికి చెందినది. ఈ ఆలయంలో జలకంఠేశ్వర, పార్వతి, కైలాసాంతర్ అనే మూడు గర్భగుడులు ఉన్నాయి.

శ్రీకంఠేశ్వర దేవస్థానం నంజనగూడు

నంజుండేశ్వర ఆలయాన్ని శ్రీకంఠేశ్వర ఆలయం అని కూడా పిలుస్తారు. ఇది మైసూరులోని నంజనగూడులో ఉన్న పురాతన హిందూ ఆలయం. నంజనగూడుకు దక్షిణ వారణాసి అని కూడా పిలుస్తారు. శ్రీకంఠేశ్వరుడు ఇక్కడ కొలువై ఉన్నందున ఈ ప్రాంతానికి ఆ పేరు వచ్చిందని చెబుతారు. ఇక్కడ చండికేశ్వరుడు, పార్వతి, నాట్యగణపతి ఇతరులతో కూడిన నారాయణ వంటి అనేక చిన్న ఆలయాలు ఉన్నాయి.

ద్వాదశ జ్యోతిర్లింగ దేవస్థానం

ఉత్తరహళ్లి–కెంగేరి ప్రధాన రహదారిలోని శ్రీనివాసపురలో వెలసిన ద్వాదశ జ్యోతిర్లింగ దేవస్థానం (ఓంకార ఆశ్రమం) మహాశివరాత్రికి ముస్తాబైంది. భక్తులు తరలివచ్చి శివలింగాలకు బిల్వాపత్రం, గంగాజలంతో అభిషేకం నిర్వహిస్తారు.

హలసూరు సోమేశ్వర ఆలయం

బెంగళూరు నగరంలోని హలసూరు సోమేశ్వర ఆలయం సందర్శించడం చాలా గొప్ప అనుభూతి కలిగిస్తుంది. ఇది చోళ కాలానికి చెందినది కాగా బెంగళూరులో పురాతన ఆలయం. మహాశివరాత్రికి ముస్తాబు కాగా ఇక్కడ వివిధ ధర్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఏనుగు బీభత్సం.. పంటలు ధ్వంసం



నష్టపోయిన పంటను చూపిస్తున్న రైతు

దొడ్డబళ్లాపురం: కనకపుర తాలూకాలో అడవి ఏనుగు మరోసారి విధ్వంసం సృష్టించింది. కనకపుర తాలూకా కెబ్బెహళ్లిలో రెండు రోజులుగా అడవి ఏనుగు ఒకటి రాత్రి వేళల్లో పంటలపైపడి పంటలను తొక్కి నాశనం చేస్తోంది. అరటి, కొబ్బరి, మామిడి చెట్లను విరిచేస్తోంది. రాము, లక్ష్మణ్ అనే రైతులు తీవ్రంగా నష్టపోయారు. అడవి ఏనుగులను నియంత్రించడంలో అటవీశాఖ అధికారులు విఫలమవుతుండడం వల్లే ప్రతిసారి ఇలా జరుగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థినికి ప్రశంసాపత్రం



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

తుమకూరు: తుమకూరు జిల్లా శిరా తాలూకా బేవినహళ్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థిని నయన జాతీయ ఆవిష్కార అభియాన్ కార్యక్రమంలో జిల్లా విభాగంలో మొదటిస్థానం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేశారు.

రైల్వే స్టేషన్‌లో వైద్య కేంద్రం ప్రారంభం



వైద్యకేంద్రాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి

తుమకూరు: తుమకూరు నగరంలోని రైల్వే స్టేషన్‌లో అత్యవసర వైద్య సేవల కోసం క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు. గురువారం ఆయన నగరంలోని సిద్దార్థ వైద్యవిద్య కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యవసర వైద్య సేవల క్లినిక్‌ను ప్రారంభించారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళా పురస్కారాలు ప్రదానం



పురస్కార గ్రహీతలతో రవిచంద్రన్, తుషార్‌గిరినాథ్, మాలాశ్రీ, అమృతరాజ్ తదితరులు



డ్యాన్స్ చేస్తున్న మాలాశ్రీ, రవిచంద్రన్

బనశంకరి: మహిళలే స్ఫూర్తి వారు లేనిదే జీవితం వ్యర్థమని కన్నడ నటుడు రవిచంద్రన్ తెలిపారు. బీబీఎంపీ కేంద్ర కార్యాలయంలోని డాక్టర్ రాజ్‌కుమార్ గ్లాస్‌హౌస్ ఆవరణలో బీబీఎంపీ అధికారులు, ఉద్యోగులు క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవం, వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలకు దిట్ట మహిళా పురస్కారాలు రవిచంద్రన్, బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ ప్రదానం చేసి మాట్లాడారు. ఆడపిల్లలు లేనిదే సమాజంలో ఏమిలేదని పురుషుల కంటే మహిళలు శక్తివంతులని అన్నారు. తన తల్లితో ఆత్మీయతతో మహిళలు పట్ల గౌరవం ఏర్పడిందన్నారు. అనంతరం నటి మాలాశ్రీ మాట్లాడుతూ.. మహిళలు తలిస్తే ఏమైనా సాధిస్తారని ఆడపిల్లలు జీవితంలో స్ఫూర్తి అన్నారు. తుషార్ గిరినాథ్ మాట్లాడుతూ బీబీఎంపీలో 50 శాతం మహిళలకు ఉద్యోగాలు ఇచ్చామని పౌర కార్మికుల్లో 80 శాతం మహిళలు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వివిధ రంగాల్లో సేవలందించిన మహిళా ప్రముఖులకు దిట్టమహిళా పురస్కారాలు ప్రదానం చేశారు.

డాన్స్‌తో అలరించిన మాలాశ్రీ, రవిచంద్రన్

మహిళా దినోత్సం కార్యక్రమంలో కన్నడ నటులు మాలాశ్రీ, రవిచంద్రన్ కన్నడ పాటలకు స్టెప్పులతో ఆహుతులను అలరించారు. మాలాశ్రీ, రవిచంద్రన్ డ్యాన్సులతో సభికుల్లో జోష్ నింపారు. కార్యక్రమంలో బీబీఎంపీ ఉద్యోగులు క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు అమృతరాజ్, రాష్ట్ర ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు సీఎస్.షడక్షరి, ఐఏఎస్ అధికారులు మానీశ్‌మౌద్గిల్, స్నేహల్, సూరళ్లర్ వికాస్‌కిశోర్, డాక్టర్ హరీశ్, మంజునాథస్వామి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా జర్నలిస్టులకు సన్మానం



పురస్కారాలతో మహిళలను సన్మానించిన దృశ్యం

బొమ్మనహళ్లి: ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభను చాటుతున్నారని విశ్రాంత ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, మాజీ ఐఏఎస్ అధికారిణి రత్నప్రభ అన్నారు. గురువారం నగరంలోని బెంగళూరు ప్రెస్‌క్లబ్ ఆడిటోరియం సమావేశం హాల్లో కర్ణాటక మీడియా జర్నలిస్ట్ యునియన్ (కేఎంజేయు) 5వ వార్షికోత్సవం, ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలకు సేవారత్న అవార్డు ప్రదానం, మీడియా రంగంలో రాణిస్తున్న మహిళలకు మాధ్యమ సేవా రత్న అవార్డులను అందజేసి మాట్లాడారు. తన 42 ఏళ్ల సర్వీసులో ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అంతర్గత భద్రత విభాగం ఐజీపీ రూపా ముద్గల్ మాట్లాడుతూ... ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మీడియా రంగంలో చాలా తక్కువ మంది ఉన్నారన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు పుణ్యవతి, ప్రతిభారామన్, నీతివేణుగౌడ, విద్యా, అశ్విని, దేవావాడికలను సన్మానించారు. వార్త శాఖ జాయింట్ కార్యదర్శి అనుపల్లవి హొన్నాపుర తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కేఎంజేయు గౌరవాధ్యక్షుడు శివకుమార బెళ్ళితట్టె, అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు మంజునాథ్, ప్రధాన కార్యదర్శి ఎన్.కే. స్వామి. పదాధికారులు మహేంద్ర, బీ.ఎ. లింగరాజు శశికుమార్, సురేష్, నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ నీటి ధరల నియంత్రణ





• సర్కారు ఆదేశాలు

సాక్షి, బెంగళూరు: ఐటీ సిటీలో నీటి కటకట రోజు రోజుకి పెరిగిపోతోంది. దీన్ని ఆసరాగా చేసుకుని ట్యాంకర్ మాఫియా ప్రజలను దోచుకుంటోంది. దీనిపై అనేక ఫిర్యాదులు అందాయి. బీబీఎంపీ అధికారులతో డీసీఎం డీకే శివకుమార్ సమావేశమై ఈ ట్యాంకర్ మాఫియాకు చెక్ పెట్టాలని ఆదేశించారు. ట్యాంకర్లకు నీటి ధరను నిర్ధారించి ఆ మేరకే వసూలు చేయాలని ఆదేశించారు.

ట్యాంకర్ల ధరల వివరాలు ఇలా

- 6 వేల లీటర్ల ట్యాంక్‌కు రూ. 600. ఇది 5 కిలో మీటర్ల దూరానికి వర్తిస్తుంది.
- పది కిలోమీటర్ల దూరం పరిధిలో అయితే 6 వేల లీటర్ల ట్యాంకర్‌కు రూ. 750 చార్జి.
- 8 వేల లీటర్ల ట్యాంకర్‌కు 5 కిలోమీర్లకు రూ. 700. అదే 10 కిలోమీటర్లయితే రూ. 850 ఫీజు.
- 5 కిలోమీటర్లలోపు 12 వేల లీటర్ల ట్యాంకర్‌కు రూ. 1000. 10 కి.మీ అయితే రూ. 1200 చెల్లించాలి. జీఎస్టీ ఇందులోనే కలిపి ఉంటుంది.

3,500 ట్యాంకర్లు ఉంటే..

ఒకవేళ నెలకు అద్దెకు తీసుకుంటే 5 కిలోమీటర్ల లోపల రూ. 510 తీర్మానించింది. 10 కిలోమీటర్ల లోపల అయితే రూ. 650 ధరను నిర్ధారించింది. బెంగళూరులో మొత్తం 3,500 నీటి ట్యాంకర్లు ఉన్నాయి. ఇందులో 219 మాత్రమే రిజిస్టర్ అయి ఉన్నాయి. నిర్ణీత గడువులోగా రిజిస్టర్ చేసుకోకపోతే చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కాగా, ప్రభుత్వం నిర్ణయించిన ధరలను ట్యాంకర్ల యజమానులు పాటిస్తారా? అనేది ప్రశ్న. ఎవరైనా తక్కువ ధరకు అడిగితే ట్యాంకర్ ఖాళీ లేదంటారు. దీంతో గత్యంతరం లేక అడిగినంత ఇచ్చుకోవాలి.

క్రీడాకారులకు సన్మానం



క్రీడాకారులతో శాంతలా భట్ తదితరులు

యశవంతపుర: క్రీడాకారులను పోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్రం ప్రభుత్వం ఖేలో ఇండియా గేమ్స్‌ను ప్రారంభించినట్లు జాతీయ మహిళ మోర్చా కార్యవర్గ సభ్యురాలు శాంతలా భట్ తెలిపారు. గురువారం బెంగళూరులోని బీజేపీ పార్టీ ఆవరణంలో మహిళా మోర్చాచే ఏర్పాటు చేసిన అంతర్జాతీయ క్రీడాకారులకు సన్మాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ దురదృష్టిచే క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించే భాగంలో నేడు అనేక మంది క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించటానికీ ఖేలో ఇండియా అభియాన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. 60 ఏళ్లు పైబడిన 10 మంది మహిళా క్రీడాకారులను బీజేపీ నాయకురాళ్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ భారతీశెట్టి, బీజేపీ రాష్ట్ర మహిళ మోర్చా అధ్యక్షురాలు సీ మంజుల, అభియాన్ సంచాలకురాలు కాంతేశెట్టి, పూర్ణిమాప్రకాశ్, లక్ష్మీ అశ్విన్‌గౌడ, ఆశారావ్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

దంపతుల ఆత్మహత్య కేసులో ముగ్గురు అరెస్టు

హోసూరు: అప్పు మీద అధిక వడ్డీ ఇవ్వాలని బెదిరించడంతో దంపతులు ఆత్మహత్య చేసుకొన్న ఘటన తెలిసిందే. ఈ ఘటనలో ముగ్గురిని హడ్కో పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు హోసూరు సమీపంలోని నల్లూరు ప్రాంతానికి చెందిన వ్యాపారి బాలషణ్ముగం(54), భార్య సుగంధి (50)లు గత అప్పుల బాధ తాళలేక వారం రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నారు. బాలషణ్ముగం హోసూరు బృందావన్‌నగర్ ప్రాంతానికి చెందిన బాలక్రిష్ణన్ (43), రాజీవ్‌కాలనీకి చెందిన సత్యనారాయణ(54), డెంకణీకోట పోతసంద్రంవాసి వెంకటాచలపతి(31) వద్ద రూ. 21 లక్షల అప్పు తీసుకొన్నారు. అధిక వడ్డీ చెల్లించాలని వారు తీవ్రంగా ఒత్తిడి చేయడంతో విరక్తి చెంది దంపతులు ఆత్మహత్య చేసుకొన్నట్లు పోలీసులు తెలిపారు.

వీధికుక్కల పట్టివేత



రామ్‌నగర్‌లో వీధికుక్కలను బంధిస్తున్న సిబ్బంది

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కల గోల ఎక్కువైంది. తరచూ దాడులు చేయడం పెరిగింది. ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో వీధికుక్కలకు సంతాన రహిత శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు కార్పొరేషన్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. మేయర్ ఎస్.ఏ. సత్య, కమిషనర్ స్నేహ ఆదేశాల మేరకు పారిశుద్య శాఖాధికారి ప్రభాకరన్ నేతృత్వంలో గురువారం ప్రాణిమిత్ర అనే సంస్థ సిబ్బంది రామ్‌నగర్ ప్రాంతంలో వీధికుక్కలను బంధించారు. వాటికి పశువైద్యులచే సంతాన రాహిత్య శస్త్ర చికిత్సలు చేసి, కోలుకునే వరకు ఆశ్రయ కేంద్రంలో ఉంచి తరువాత వదిలిపెడతారు. పట్టణంలోని 45 వార్డులలోనూ ఈ ప్రక్రియను నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

కిడ్నాప్ కేసులో యువకుడు అరెస్టు

కెలమంగలం: యువతిని కిడ్నాప్ చేసిన యువకున్ని డెంకణీకోట పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు ధర్మపురి జిల్లా వెల్లిసందై ప్రాంతానికి చెందిన పెరియస్వామి కొడుకు దినేష్ కుమార్ (22). గత రెండు రోజుల క్రితం డెంకణీకోట ప్రాంతానికి చెందిన కళాశాల విద్యార్థినిని కిడ్నాప్ చేసినట్లు బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దినేష్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

క్రిష్ణగిరి: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి ప్రాంతంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. వివరాల మేరకు క్రిష్ణగిరి సమీపంలోని సుండేకుప్పం గొల్లపట్టి గ్రామానికి చెందిన సిలంబరసన్ (22) బుధవారం సాయంత్రం బైక్‌లో పెరియ ముత్తూరు వైపు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనింది. తీవ్ర గాయాలేర్పడిన సిలంబరసన్‌ను మెరుగైన చికిత్స కోసం ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఫలితంలేక మృతి చెందాడు. కే.ఆర్‌పి. డ్యాం పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్ నడుపుతూ బాలుడు..

మాగనూరుపట్టి దగ్గర ప్యారేజాన్ (16) అనే బాలుడు బుధవారం సాయంత్రం ఇంటి ముందు నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను నడిపేందుకు ప్రయత్నించాడు. ట్రాక్టర్ బోల్తా పడడంతో తీవ్ర గాయాలేర్పడిన ప్యారేజాన్ ఆస్పత్రిలో మరణించాడు. సింగారపేట పోలీసులు కేసు నమోదు చేశారు.క్రిష్ణగిరి సమీపంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన లక్ష్మి (80) అనే వృద్ధురాలు హోసూరు– క్రిష్ణగిరి హైవేలో నడిచి వెళ్తుండగా లారీ ఢీకొనడంతో మృత్యువాత పడింది.

ప్లాస్టిక్ కవర్ల ఫ్యాక్టరీలో సోదాలు



కవర్ల తయారీ ఫ్యాక్టరీ

హోసూరు: ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ కవర్ల ఫ్యాక్టరీలో గురువారం కార్పొరేషన్ అధికారులు సోదాలు చేసి పెద్దమొత్తంలో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనపరుచుకొన్నారు. హోసూరులో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా అడ్డుకునే దిశగా రెండు నెలలుగా షాపులు, మార్కెట్లలో అధికారులు దాడులు జరిపి కవర్లను సీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పారిశ్రామిక ప్రాంతంలో ప్లాస్టిక్ కవర్ల తయారీ పరిశ్రమ నిర్వహిస్తున్నట్లు తెలిసి పారిశుద్య శాఖాధికారి ప్రభాకరన్, సిబ్బంది సోదాలు చేశారు. అక్కడ తయారు చేస్తున్న వివిధ రకాల కవర్లను సీజ్ చేశారు. రాజస్థాన్‌కు చెందిన ఫ్యాక్టరీ యజమాని తేజారామ్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భద్రమ్మ దేవికి వెండి నగల వితరణ



నగలతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తళిలో వెలసిన ప్రసిద్ధ గ్రామదేవత భద్రమ్మదేవికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెండి నగలను వితరణ చేశారు. తమిళనాడు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగ రాష్ట్ర కార్యదర్శి, తళికి చెందిన డాక్టర్ భార్గవ్ తన సొంత డబ్బుతో వెండి నగలను తయారు చేయించి ఆలయానికి అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు నగలను స్వీకరించి అమ్మవారికి అలంకరించి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తిమ్మయ్యగౌడ, ఆరాధన, శ్యామలింగం, తేజు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

ముగ్గురు ఆత్మహత్య

క్రిష్ణగిరి, కెలమంగలం: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి, పోచ్చంపల్లి, కెలమంగలం ప్రాంతాల్లో అనారోగ్యంతో బాధపడుతూ వేర్వేరుగా ముగ్గురు ఆత్మహత్య చేసుకొన్నారు. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా కావేరిపట్టణం సమీపంలోని మలయాండహళ్లి ప్రాంతానికి చెందిన మునియప్ప కూతురు జమున (17) అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొంది. కావేరిపట్టణం పోలీసులు కేసు నమోదు చేశారు. పోచ్చంపల్లి సమీపంలోని కురుంబర్‌కొటాయ్ గ్రామానికి చెందిన కూలి కార్మికుడు ధనపాల్ (61) మద్యపానం వల్ల ఖాయిలా పడ్డాడు. దీంతో ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. కెలమంగలం సమీపంలోని ముగళూరు గ్రామానికి చెందిన రవి (30) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. దీంతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు.

ఆశావహంగా పూల ధరలు



హోసూరు పూల మార్కెట్

హోసూరు: నేడు శుక్రవారం శివరాత్రి పండుగ సందర్భంగా హోసూరు పూల మార్కెట్‌లో పూల ధరలు పెరగడంతో రైతులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హోసూరు, డెంకణీకోట, సూళగిరి, అంచెట్టి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పూల సాగు జరుగుతోంది. కొన్నిరోజులుగా గులాబీ, చామంతి, బంతి తదితర పూల ధరలు పడిపోవడంతో రైతులు, మరో వైపు వ్యాపారులు నష్టాలను ఎదుర్కొంటూ వచ్చారు. శివరాత్రికి గిరాకీ పెరిగింది. గత రెండురోజులుగా హోసూరు పూల మార్కెట్‌లో మల్లెలు కేజీ రూ. 600, కనకాంబరం కిలో రూ. 700, చామంతి కిలో రూ. 200, రోజా కిలో 200, సంపంగి కిలో రూ. 120 వరకు ధర పలకడంతో రైతులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు

ఆహ్వానించిన ఎమ్మెల్సీ కవురు, పీవీఎల్



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో కవురు శ్రీనివాస్, పీవీఎల్ నరసింహరాజు

పాలకోడేరు: పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. చేకూరి నరేంద్రరాజు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కుక్కల బాబూరావు, పడమటి శ్రీను, గుబ్బల నాగరాజు, ఎం.బాలాజీ సహా 100 మందికి పైగా కార్యకర్తలకు కవురు శ్రీనివాస్, పీవీఎల్ నరసింహరాజు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూపతి రాజు చంటిరాజు, ఉండి ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ చేకూరి నరేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

17న చిలకలూరిపేటలో టీడీపీ-జనసేన సభ

సాక్షి, అమరావతి: టీడీపీ-జనసేన పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 17న చిలకలూరిపేటలో బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా టీడీపీ-జనసేన పార్టీలు పొత్తు పెట్టుకున్నాయన్నారు. చిలకలూరిపేట సభలో ఉమ్మడి భవిష్యత్ కార్యాచరణ, మేనిఫెస్టోను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రకటిస్తారని చెప్పారు. మాజీ మంత్రి నారాయణ ఇంట్లో సోదాల పేరుతో పోలీసులు దారుణంగా వ్యవహరించారని విమర్శించారు. టీడీపీ-జనసేన సోషల్ మీడియా సిబ్బందిని కేసుల పేరుతో భయపెడుతున్నారన్నారు. బీజేపీ కలిసి వస్తే ముందుకు సాగడానికి అభ్యంతరం లేదన్నారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ కూడా ఢిల్లీకి వెళ్తున్నారని, చంద్రబాబుతో కలిసి బీజేపీ పెద్దలతో చర్చించిన అనంతరం ఓ అభిప్రాయానికి వస్తారని చెప్పారు.

కలసికట్టుగా పోరాడాలి.. లేదంటే వైఎస్సార్‌సీపీదే అధికారం: పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: మనందరం కలసికట్టుగా పోరాటం చేయాల్సిందేనని, లేకపోతే మళ్లీ వైఎస్సార్‌సీపీనే అధికారంలోకి వస్తుందని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చెప్పారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు పవన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమలో సంఖ్యా బలం ఉన్న కులాల్లో ఐక్యత లేకపోవడం వల్లనే వైఎస్సార్‌సీపీ నాయకులకు భయపడుతున్నామన్నారు. పొత్తుల్లో జనసేన ఎన్ని సీట్లు తీసుకోవాలో పవన్‌కు తెలియదా.. అని ప్రశ్నించారు. కొంతమంది పవన్ అక్కడ నిలబడాలి, ఇక్కడ పోటీ చేయాలి అని చెబుతున్నారని అన్నారు. అన్ని సీట్లు తీసుకోవాలి, ఇన్ని సీట్లు కావాలని డిమాండ్ చేయాలన్నవారే చివరకు వైఎస్సార్‌సీపీలోకి వెళ్లిపోతారని వ్యాఖ్యానించారు. తెలుగు జాతిని కుటుంబం అనుకుని వచ్చానని, అండగా నిలబడాలని కోరారు. జనసేన – తెలుగుదేశం ప్రభుత్వం వస్తే తప్పు చేసిన వారు ఎంతటి స్థాయి వ్యక్తి అయినా శిక్షిస్తామని అన్నారు.

వెలిగొండంత అక్కసు..

నీ బాబువల్ల కానిది జగన్ చేశాడనేగా నీ ఏడుపు రామోజీ?

- వెలిగొండ ప్రాజెక్టుకు వ్యయం చేసిన నిధులను మింగేసిన చంద్రబాబు
- పనులు చేయకుండానే కాంట్రాక్టర్లకు రూ.630.57 కోట్లు చంద్రబాబు దోచిపెట్టారని తేల్చిన కాగ్
- కానీ, ప్రతి పైసాను సద్వినియోగం చేసుకుని సొరంగాలను పూర్తిచేసిన సీఎం వైఎస్ జగన్
- వాటిని జాతికి అంకితం చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్న రామోజీ
- ఆయకట్టుకు నీళ్లిచ్చే ఆస్కారమేలేదంటూ విషం చిమ్మిన ఈనాడు



సాక్షి, అమరావతి: ఏ రోగానికైనా మందు ఉంటుందేమోగానీ ఈనాడు రామోజీని పీడిస్తున్న 'కడుపు మంట'కు మాత్రం మందులేదు. నిత్యం ఆయన్ను దహించివేస్తున్న ఆ వ్యాధి రోజురోజుకూ ముదిరిపోతోంది. దాని నుంచి విముక్తి లభిస్తుందన్న ఆశ కూడా కనుచూపు మేరలో కనిపించడంలేదు. ఫలితంగా ఆయన రోజూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. దీంతో.. కొంతలో కొంతైనా ఉపశమనంగా ఉంటుందని ఆయన రోజూ తన క్షుద్ర పత్రిక ఈనాడులో సీఎం వైఎస్ జగన్, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏదో ఒక అశుద్ధ కథనాన్ని వండివారుస్తూ ఉదయం తనివితీరా చూసుకుని తన బాధను చల్లార్చుకుంటున్నారు. తాజాగా.. వెలిగొండ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన జంట సొరంగాలను పూర్తిచేసిన సీఎం వైఎస్ జగన్ బుధవారం వాటిని జాతికి అంకితం చేయడాన్ని రామోజీరావు తట్టుకోలేకపోతున్నారు. చాలా పనులు మిగిలే ఉన్నాయని.. ఆయకట్టుకు నీళ్లిచ్చే ఆస్కారమే లేదంటూ 'వెలికొండంత పెండింగ్' శీర్షికన తన ఆక్రోశాన్ని, కడుపులో పేరుకుపోయిన విషాన్ని గురువారం ఎప్పటిలాగే కక్కేశారు. నిజానికి.. వెలిగొండ ప్రాజెక్టును సీఎం వైఎస్ జగన్ వడివడిగా పూర్తిచేస్తుండటంతో ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లోని దుర్భిక్ష ప్రాంత రైతుల దశాబ్దాల కల సాకారమవుతోంది. దాంతో ఆ ప్రాంత రైతుల్లో సీఎం జగన్‌పై ఆదరణ మరింతగా పెరిగింది. ఇది చంద్రబాబు రాజకీయ ఉనికికే ప్రమాదకరంగా మారడంతో రామోజీరావుకు నిద్రపట్టడం లేదు. ఉన్నది లేనట్లు.. లేనిది ఉన్నట్లు కనికట్టు చేసి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఆయనిలా నానా అవస్థలు పడుతున్నారు.

వెలిగొండను పిండేసిన బాబు..

వాస్తవానికి.. ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 15.25 లక్షల మందికి తాగునీరు అందించడమే లక్ష్యంగా 2004, అక్టోబరు 27న వెలిగొండ ప్రాజెక్టుకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారు. తన హయాంలోనే రూ.3,610.38 కోట్లు ఖర్చుచేసి.. 37.587 కిమీల పొడవైన జంట సొరంగాల్లో 20.333 కి.మీ.ల పనులు.. ఆ ప్రాజెక్టులోనే అంతర్భాగమైన నల్లమలసాగర్‌ను పూర్తిచేశారు. ఇక 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. 2014–19మధ్య ఈ ప్రాజెక్టుకు రూ.1,385.81 కోట్లు వ్యయంచేసినా కేవలం 6.686 కి.మీ.ల మేర మాత్రమే జంట సొరంగాల పనులు చేశారు. కాంట్రాక్టర్లకు ఉత్తినే రూ.630.57 కోట్లు దోచిపెట్టడాన్ని ఇటీవల కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) నివేదిక బయటపెట్టింది. వెలిగొండకు ఖర్చుచేసిన నిధులను చంద్రబాబు మింగేయడంవల్లే ఎక్కడి పనులు అక్కడే మిగిలిపోయాయి.

యుద్ధప్రాతిపదికన సొరంగాలు పూర్తి

ఇక సీఎం వైఎస్ జగన్ రూ.978.02 కోట్లు ఖర్చుచేసి.. అందులో ప్రతి పైసాను సద్వినియోగం చేసుకుని వెలిగొండ జంట సొరంగాల్లో మిగిలిన 10.568 కి.మీ.ల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి, జాతికి అంకితం చేశారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి.. రెండోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక రెండు మూడు నెలల్లోనే నల్లమలసాగర్‌కు కృష్ణాజలాలను తరలిస్తామని ఆయన చెప్పారు. వచ్చే జూలై, ఆగస్టులలో నల్లమలసాగర్‌కు కృష్ణా జలాలను తరలించేలోగా రూ.1,200 కోట్లతో నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తామని స్పష్టంచేశారు. తొలిదశ కింద ఆయకట్టుకు నీళ్లందించడానికి ఎలాంటి అడ్డంకులు లేవు. అలాగే, ప్రాజెక్టును మొత్తం ఒకేసారి పూర్తిచేసి ఆయకట్టు మొత్తానికి ఒకేసారి నీళ్లందించిన దాఖలాలు చరిత్రలో ఎక్కడాలేవు. ఎక్కడైనా ప్రాజెక్టును దశలవారీగా పూర్తిచేస్తూ అయకట్టుకు నీళ్లందిస్తారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులే అందుకు నిదర్శనం. వెలిగొండ ప్రాజెక్టులో కూడా మిగతా పనులను పూర్తిచేసి దశలవారీగా మొత్తం ఆయకట్టుకు నీళ్లందిస్తారు. అసలు వెలిగొండ ఒక్కటే కాదు.. 2022 సెప్టెంబరు 6న నెల్లూరు, సంగం బ్యారేజ్‌లు.. 2023 సెప్టెంబరు 19న హంద్రీ–నీవాలో అంతర్భాగమైనమైన లక్కసాగరం ఎత్తిపోతల.. 2023 నవంబరు 30న గాలేరు–నగరిలో అంతర్భాగమైన అవుకు రెండో టన్నెల్.. 2024 ఫిబ్రవరి 26న హంద్రీ–నీవాలో అంతర్భాగమైన కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిచేసి, జాతికి అంకితం చేసినప్పుడు కూడా రాజగురువు ఇలాగే విషం చిమ్మారు.

175 ఎమ్మెల్యేలు, 25 ఎంపీలు గెలుస్తాం

- 10న జరిగే సిద్ధం సభకు 15 లక్షల మంది వస్తారు
- సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను సభలో సీఎం జగన్ వివరిస్తారు
- ఎన్నికల్లో గెలిచాక ఐదేళ్లపాటు చేపట్టే కార్యక్రమాలు ప్రకటిస్తారు
- ఎవరెన్ని పొత్తులు పెట్టుకున్నా వైఎస్సార్‌సీపీకి నష్టంలేదు
- ఆదాయం పెరిగింది కాబట్టే తలసరి ఆదాయం పెరిగింది
- సభకు వచ్చేవారికి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి వెల్లడి
- నేతలతో కలసి సిద్ధం సభా ప్రాంగణం పరిశీలన



మాట్లాడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి

మేదరమెట్ల: రానున్న ఎన్నికల్లో ఎంతమంది ఎన్ని పొత్తులతో వచ్చినా నష్టంలేదని, 175 ఎమ్మెల్యేలతో పాటు 25 ఎంపీ స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి చెప్పారు. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని పి.గుడిపాడు జాతీయ రహదారి సమీపంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న సిద్ధం సభకు ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. నాలుగవ సిద్ధం సభను భారీఎత్తున విజయవంతం చేయడానికి సర్వ సన్నద్ధమవుతున్నామని చెప్పారు. గత ఐదేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి పనుల గురించి సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివరిస్తారన్నారు. అలాగే వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాక రానున్న ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేయబోతుందనే అంశాలను సీఎం ప్రకటిస్తారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జరిగిన సిద్ధం సభలకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. ఆదివారం జరిగే సిద్ధం మహాసభకు సుమారు 15 లక్షల మంది హాజరవుతారని, వచ్చిన వారందరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వసతులతో ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈసభ విజయవంతం చేసేందుకు బూత్ లెవల్ కమిటీలను కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. సభ నిర్వహించే వంద ఎకరాలకు పక్కన మరో వంద ఎకరాలను కూడా సిద్ధం చేశామన్నారు.

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి..

రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి సాధించిందని చెప్పారు. ఇప్పటికే రామాయపట్నం పోర్టును దాదాపు పూర్తిచేశామని.. తీర ప్రాంతంలో మిగిలిన పోర్టుల పనులు అత్యంత వేగంగా సాగుతున్నాయన్నారు. ఎన్నో పారిశ్రామిక సంస్థలు కూడా రాష్ట్రంలో పెట్టుబడి పెడుతున్నాయన్నారు. ఏపీలో తలసరి ఆదాయం పెరుగుదలకు అభివృద్ధి పనులే కారణం అన్నారు. అభివృద్ధి లేకపోతే తలసరి ఆదాయం పెరగదని చెప్పారు. రాష్ట్రంలో 87 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందజేశామని చెప్పారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం పైగా అమలు చేశామని తెలిపారు. బీసీలకు తెలివితేటలు లేవని, బీసీలు జడ్జిలుగా పనికిరారు అని గతంలో అన్న చంద్రబాబు ఇప్పుడు బీసీ డిక్లరేషన్ అంటే ఎవరూ నమ్మరని చెప్పారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 75 శాతం పదవులు ఇచ్చారని చెప్పారు. వైనాట్ 175 ఎందుకంటున్నామో.. సిద్ధం సభ ద్వారా చూపిస్తామన్నారు. నేషనల్ మీడియా నుంచి కూడా అనేక మంది సిద్ధం సభకు హాజరవుతున్నారని, సిద్ధం సభల గురించి తెలుసుకోవడానికి వారు ఎంతో ఆసక్తితో ఉన్నారన్నారు.

మేనిఫెస్టో సిద్ధం చేస్తున్నాం

రానున్న ఎన్నికల కోసం మేనిఫెస్టో సిద్ధం చేస్తున్నామని విజయసాయిరెడ్డి తెలిపారు. టీడీపీ, జనసేనలు పొత్తుల కోసం వెంపర్లాడే పార్టీలని.. తాము ముఖ్యమంత్రిని చూపించి ఓట్లు అడుగుతున్నామని చెప్పారు. అభ్యర్థులను వేరే చోటికి మార్చినంత మాత్రాన తమ పార్టీకి ఎటువంటి నష్టం లేదన్నారు. మార్చి 13, 14 లేదా 15 తేదీల్లో ఎన్నికల ప్రకటన రావచ్చన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన సిద్ధం టీ షర్టులను విజయసాయిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాపట్ల ఎంపీ నందిగం సురేష్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్, పొన్నూరు ఇన్‌చార్జి అంబటి మురళి, గుంటూరు తూర్పు ఇన్‌చార్జి ఫాతిమా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పొత్తుపై నేడు స్పష్టత!

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష పార్టీల పొత్తుల వ్యవహారంలో శుక్రవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. న్యూఢిల్లీలో గురువారం రాత్రి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో అమిత్ షా నివాసంలో టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. పొత్తులు, సీట్ల సర్దుబాటుపై వీరు చర్చించినట్లు సమాచారం. తమకు 8 నుంచి 10 లోక్‌సభ స్థానాలు, 15 నుంచి 20 అసెంబ్లీ స్థానాలు ఇస్తేనే పొత్తుకు ఓకే చెబుతామని బీజేపీ పెద్దలు కరాఖండిగా చెప్పారని తెలిసింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై శుక్రవారం స్పష్టత రానుంది. గతంలో రెండుసార్లు పొత్తుల విషయంలో బీజేపీ అధిష్టానంతో చర్చలు జరిగినా ఏమాత్రం లాభం లేకపోవడంతో.. వారు విధించే ఏ షరతులైనా అంగీకరించి పొత్తు ఖరారు చేసుకోవాలని టీడీపీ, జనసేన విశ్వప్రయత్నం చేస్తున్నాయి. ఆ రెండు పార్టీల అధ్యక్షులు తమతో పొత్తు విషయంలో ఏ విధంగా అర్రులు చాస్తున్నారు అనే విషయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు బుధవారం జేపీ నడ్డా, అమిత్ షా, బీఎల్ సంతోష్‌ల దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో చంద్రబాబు, పవన్‌లకు ఢిల్లీ నుంచి పిలుపువచ్చింది. దీంతో చంద్రబాబు, పవన్ గురువారం ఢిల్లీ వచ్చారు. రాత్రి 10.20 గంటలకు చంద్రబాబు, 10.35 గంటలకు పవన్ కళ్యాణ్‌లు అమిత్ షా నివాసానికి చేరారు. సుమారు గంటసేపు సమావేశం అయ్యారు. 2018లో ఎన్డీఏ నుంచి టీడీపీ బయటికి వెళ్లిపోయిన తర్వాత విశాఖ, రాజంపేట, రాజమండ్రి, హిందూపురం, తిరుపతి, అరకు, విజయవాడ వంటి లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతంపై తాము ఏ విధంగా ప్రత్యేక దృష్టి సారించామన్న అంశాన్ని బీజేపీ పెద్దలు చర్చల సందర్భంగా చెప్పారు. అందువల్ల తామడిగిన లోక్‌సభ స్థానాలను కేటాయించాలని బీజేపీ అగ్రనేతలు చంద్రబాబు, పవన్‌లకు స్పష్టం చేశారని తెలిసింది.

పెద్దిరెడ్డిని జైలుకు పంపిస్తా

శంఖారావం సభల్లో నారా లోకేశ్

హిందూపురం అర్బన్/మడకశిర: 'నా రెడ్ డైరీలో అక్రమార్కులు, వాళ్లకు చుట్టాలైన వారి పేర్లు రాసుకొన్నా. అందులో మొదటి వ్యక్తి పాపాల పెద్దిరెడ్డి. ఇతను మా చిత్తూరు వాసే. టీడీపీ అధికారంలోకి వస్తే అతన్ని జైలుకు పంపుతా' అని టీడీపీ నేత నారా లోకేశ్ అన్నారు. గురువారం నిర్వహించిన హిందూపురం, మడకశిర, పెనుకొండ శంఖారావం సభల్లో ఆయన మాట్లాడుతూ పెద్దిరెడ్డి చిత్తూరులోని సహజ వనరులన్నీ తినేశారని, ఇప్పుడు హిందూపురంలోనూ అదే పరిస్థితి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి తొత్తులుగా ఉన్న అధికారులపై విచారణ చేయించి జైలుకు పంపుతానని అన్నారు. కాగా, మడకశిరలో సభకు టీడీపీ ఇన్‌చార్జి గుండుమల తిప్పేస్వామి డుమ్మాకొట్టారు. జిల్లాలో టీడీపీకి ఉన్న జెడ్పీటీసీ కూడా హాజరు కాలేదు. పెనుకొండలో బీకే పార్థసారథి వర్గీయులు కనిపించలేదు.

వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం పార్లమెంట్ సమన్వయకర్తగా సింహాద్రి చంద్రశేఖర్

'అవనిగడ్డ' సమన్వయకర్తగా సింహాద్రి రమేష్

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం పార్లమెంట్ సమన్వయకర్తగా ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ నియమితులయ్యారు. అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా సింహాద్రి రమేష్ నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిగినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.

కేన్సర్ వైద్య నిపుణుడిగా చంద్రశేఖర్ ప్రజలకు సుపరిచితులు: పేర్ని నాని

డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ కేన్సర్ వైద్య నిపుణుడిగా ప్రజలకు సుపరిచితులని వైఎస్సార్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకటరామయ్య (నాని) తెలిపారు. ఆయన గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. డాక్టర్ చంద్రశేఖర్ పార్టీలకు అతీతంగా వైద్య సేవలు అందించారని, ఏ పార్టీ వారు ఫోన్ చేసినా స్పందించేవారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గం సమన్వయకర్తగా



మాట్లాడుతున్న పేర్ని నాని. పక్కన సింహాద్రి చంద్రశేఖర్, సింహాద్రి రమేష్ తదితరులు

ఉండాలని, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయమని సీఎం వైఎస్ జగన్ కోరటంతో చంద్రశేఖర్ ముందుకు వచ్చారని చెప్పారు. ఆయన తండ్రి సింహాద్రి సత్యనారాయణ మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా కూడా పని చేశారని తెలిపారు. చంద్రశేఖర్ రాజకీయాల్లోకి రావటం వలన లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోని ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు మంచి జరుగుతుందని చెప్పారు.

ప్రజలకు సేవ చేస్తా: డాక్టర్ చంద్రశేఖర్

తనను వైఎస్సార్‌సీపీ మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గం సమన్వయకర్తగా నియమించడం సంతోషంగా ఉందని డాక్టర్ చంద్రశేఖర్ చెప్పారు. తాను ఇప్పటివరకు ప్రత్యక్ష రాజకీయాల్లో లేనని, ప్రజలకు సేవలందించటానికే ఇప్పుడు రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు.

ముద్రగడతో వైఎస్సార్‌సీపీ నేతల భేటీ

- పార్టీలోకి సాదరంగా ఆహ్వానించాం
- ముద్రగడకు సీఎం జగన్ సముచిత స్థానం కల్పిస్తారు
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంతో గురువారం వైఎస్సార్‌సీపీ నేతలు భేటీ అయ్యారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఆ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు కిర్లంపూడిలోని ముద్రగడ ఇంటికి వెళ్లి కలిశారు. ముద్రగడ పద్మనాభం, ఆయన కుమారులు వీరరాఘవులు (బాలు), చెల్లారావు(గిరి)లతో సమావేశమయ్యారు. అనంతరం తమను కలిసిన మీడియా ప్రతినిధులతో మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభంను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించినట్లు చెప్పారు. ఎటువంటి రాజకీయ ప్రలోభాలకు లొంగకుండా కాపుల కోసం ముద్రగడ నిజాయితీతో ఉద్యమం చేశారని ప్రశంసించారు. అటువంటి నాయకుడిని ఎన్నికల సమయం కావడంతో మద్దతు కోరేందుకు మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించామని తెలిపారు. ముద్రగడకు సీఎం వైఎస్ జగన్ సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తారని చెప్పారు. తమ ప్రతిపాదనపై ఆయన సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నామని మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ వంగా గీత విశ్వనాథ్, వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పార్టీ కో–ఆర్డినేటర్‌లు తోట నరసింహం, దావులూరి దొరబాబు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు జక్కంపూడి గణేష్, కాపు జేఏసీ నాయకులు గౌతుస్వామి, గణేశుల రాంబాబు పాల్గొన్నారు.



ముద్రగడ నివాసంలో మిథున్‌రెడ్డి, కన్నబాబు, ద్వారంపూడి, తోట నరసింహం తదితరులు

అమరావతి ఉద్యమం.. ఓ డ్రామా

1,257వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: 'చంద్రబాబు అండ్ కో బినామీల కోసం సాగుతున్న అమరావతి ఉద్యమం ఓ డ్రామా.. అది ఎల్లో మీడియాలో తప్ప ఎక్కడా కనిపించదు..' అని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ఎద్దేవా చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 1,257వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ కేవలం చంద్రబాబును ఎన్నికల్లో గెలిపించేందుకే కులగజ్జి నాయకులు అమరావతి రాజధాని పేరిట హడావుడి చేస్తున్నారన్నారు. 29 గ్రామాల్లో అమరావతి ఉద్యమానికి ఎలాంటి మద్దతు లేక దీక్షా శిబిరాలు వెలవెలబోతున్నాయని, కులోన్మాద పోకడలను గమనించిన రాజధాని ప్రాంత ప్రజలు వీరిని పూర్తిగా విడిచిపెట్టినప్పటికీ డ్రామా కంపెనీ కొనసాగించడం సిగ్గుచేటని విమర్శించారు. అమరావతిని మాత్రమే రాజధానిగా చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటే బాబుకు ఈ ప్రాంతంలో ప్రజలు ఎందుకు ఓట్లేసి గెలిపించలేదో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. బహుజనులకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీని 175/175 సీట్లలో గెలిపించి తమ సత్తా ఏంటో చూపిస్తామని స్పష్టంచేశారు. నాయకులు మాదిగాని గురునాథం, బి.సలోమీ, పులి దాసు, కొమరవల్లి కిషోర్‌బాబు, బి.సౌమ్య, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

బాబు ప్యాకేజీలో భాగమే ప్రశాంత్ కిషోర్ వ్యాఖ్యలు

- ఆయన వ్యాఖ్యలు రోజూ ఎల్లోమీడియా, చంద్రబాబు గ్యాంగ్ చేసేవే...
- పీకే ఔనంటే కాదని, కాదంటే ఔనని అర్థం చేసుకోవాలి
- తెలంగాణలో బీఆర్ఎస్ గెలుపు పక్కా అన్నాడుగా.. ఏమైంది
- ఒక పీకే వల్ల ఏమీ కావట్లేదనే ఈ పీకేను చంద్రబాబు తెచ్చాడు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఫైర్



సాక్షి, అమరావతి: ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ పూర్తిగా మతిభ్రమించి మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఫైర్ అయ్యారు. తాడేపల్లిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని, బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ పక్కా అని చెప్పిన ప్రబుద్ధుడు ఈ ప్రశాంత్ కిషోరే అని ఎద్దేవా చేశారు. ఆయన ఔనంటే కాదని.. కాదంటే ఔనని అని అర్థం చేసుకోవాలన్నారు. గతంలో ప్రత్యేక విమానంలో లోకేశ్‌తో కలిసి వచ్చి చంద్రబాబును కలిసిన ప్రశాంత్ కిషోర్.. వారిచ్చిన ప్యాకేజీలో భాగంగానే వైఎస్సార్‌సీపీ గెలవడం అసాధ్యం, యువతకు ఉద్యోగాల్లేవు, సొంత కుటుంబ వ్యవహారాల్లోనూ తప్పటడుగులు, ఆయన తప్పిదాలే ప్రతిపక్షానికి శ్రీరామరక్ష.. అంటూ ఇప్పుడు సీఎం జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయడం అని చెప్పారు. పీకే కామెంట్స్ చంద్రబాబు అండ్‌కో, ఎల్లో మీడియా రోజు చేస్తున్నవేనని తెలిపారు. మరో 50 రోజుల్లో జరిగే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి, రెండోసారి సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణస్వీకారం చేస్తారని, అప్పుడు ప్రశాంత్ కిషోర్ దేశం వదిలిపోతారా... అని సవాల్ చేశారు.

లక్షలాది ఉద్యోగాలు కనబడటంలేదా?

కేంద్రంతో ఏ మేరకు రాష్ట్రం సంబంధాలు కొనసాగించాలో ఆ మేరకే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంబంధాలు కొనసాగిస్తోందని, బీజేపీని గుడ్డిగా సీఎం జగన్ నమ్మలేదని శ్రీనివాసులు చెప్పారు. సీఎం జగన్ యువతకు ఉద్యోగాలు కల్పించలేదని పీకే చేసిన కామెంట్స్‌ను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని పేర్కొన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగాలు.. ఇలా ఏ ముఖ్యమంత్రీ, ఏ రాష్ట్ర చరిత్రలో ఇవ్వలేనన్ని లక్షలాది ఉద్యోగాలు సీఎం జగన్ కల్పించారని తెలిపారు. ఇవన్నీ చూడటానికి ఆయనకు కళ్లు, చెవులు, మెదడు పని చేస్తున్నట్లు లేదని మండిపడ్డారు.

ఇద్దరు 'పీకే'లు ఓటమిపాలే..

దత్తపుత్రుడు పీకే (పవన్ కళ్యాణ్), షర్మిల వల్ల కావడం లేదనే చంద్రబాబు మరో పీకే (ప్రశాంత్ కిశోర్)ను తెచ్చుకున్నారని శ్రీనివాసులు విమర్శించారు. బిహార్‌లో ప్రశాంత్ కిశోర్, రాష్ట్రంలో బాబు–పవన్ జోడీ చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. చంద్రబాబే గెలుస్తాడనుకుంటే మేనిఫెస్టోలో సంక్షేమం గురించి ఎడాపెడా హామీలు ఇచ్చేయాలని ఆయనకు ఎందుకు సలహా ఇచ్చారని ప్రశాంత్ కిశోర్‌ను ప్రశ్నించారు. తానో మాంత్రికుడినని భావిస్తున్న ప్రశాంత్ కిషోర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి ప్రస్తుతం రాజకీయ భిక్షగాడిగా మారాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, ప్రశాంత్ కిషోర్ పన్నాగాలను ఎన్నికల్లో తిప్పికొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ మరోసారి అఖండ విజయం సాధిస్తుందని సామాన్యులు సైతం చెబుతున్నారని చెప్పారు. సామాన్యులు చెప్పేది గెలుస్తుందా? చెల్లని రూపాయి ప్రశాంత్ కిశోర్ చెప్పేది గెలుస్తుందా? అనేది త్వరలో చూస్తారన్నారు. ఏపీలో టీడీపీకే గడ్డు పరిస్థితులు ఉన్నాయని ప్రశాంత్ కిశోర్‌కి తెలుసునన్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌లో షర్మిల ప్రత్యేక హోదా గురించి మాట్లాడుతూ కంటతడి పెట్టడం చూస్తే.. 'మేము మరీ అంత ఎదవల్లా కనపడుతున్నామా? ఓ.. మాదిరిగా కూడా కనపడట్లేదా?' అన్నట్లు ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏతప్పు చేయలేదని, శక్తికి మించి ప్రజలకు సేవ చేసి వారి గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని చెప్పారు. 175 అసెంబ్లీ స్థానాల్లో, 25 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయ సాధించటం ఖాయమని ఆయన చెప్పారు.

నాదెండ్ల మనోహర్‌పై నీళ్ల బాటిల్‌తో దాడి

- ఆలపాటి రాజా వర్గమే దాడిచేసిందని ఆరోపణ
- తెనాలిలో జనసేన, టీడీపీ అభ్యర్థుల పాదయాత్రలో ఘటన
- టీడీపీ–జనసేన మధ్య విభేదాలు బట్టబయలు



మనోహర్ తలకు తగిలిన నీళ్ల బాటిల్

తెనాలి: పొత్తు పెట్టుకున్నప్పటికీ తెనాలిలో టీడీపీ–జనసేన నేతల మధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న తీవ్ర విభేదాలు గురువారం బట్టబయలయ్యాయి. జనసేన సీనియర్ నేత, తెనాలి అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌పై టీడీపీ వర్గీయులు నీళ్ల బాటిల్‌తో దాడి చేశారు. ఈ బాటిల్ ఆయన తలకు తగిలింది. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, జనసేన అసెంబ్లీ అభ్యర్థి నాదెండ్ల మనోహర్ గురువారం సాయంత్రం తెనాలిలో జనచైతన్య పాదయాత్ర ప్రారంభించారు. బోసు రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర వీనస్ టాకీస్ దగ్గరకు చేరుకుంది. అక్కడ టీడీపీ మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ (రాజా) వచ్చి కలిశారు. ఆ వెంటనే రాజాకు మద్దతుగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. పోటీగా జనసేన కార్యకర్తలు నాదెండ్ల మనోహర్ జిందాబాద్.. అంటూ నినాదాలు ప్రారంభించారు. దీంతో అక్కడ తోపులాట జరిగింది. ఈ తోపులాటలో టీడీపీ మహిళా కార్యకర్త ఒకరు ఇరుక్కుపోయారు. ఈ సమయంలో ఎవరో నీళ్ల బాటిల్‌ను నాదెండ్ల మనోహర్‌పైకి బలంగా విసిరారు. ఆయన తప్పుకోవాలని ప్రయత్నించినప్పటికీ తలకు తగిలింది. ఈ ఘటనతో అందరూ కంగుతిన్నారు. ఆలపాటి రాజా వర్గమే అక్కసుతో ఈ దాడికి పాల్పడిందని జనసేన వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఆలపాటి రాజా టీడీపీ నుంచి తెనాలి టికెట్ ఆశించారని, ఆయనకు కాకుండా పొత్తుల్లో భాగంగా జనసేన నేత నాదెండ్ల మనోహర్‌కు ఇవ్వడంవల్లే ఈ దాడి చేశారని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలతో పాదయాత్రకు వచ్చిన అనేక మంది యాత్ర పూర్తికాకుండానే వెళ్లిపోయారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శుక్రవారం ॥ 8-3-2024





వివిధ రంగాలలో విజయపథంలో దూసుకుపోతూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న మహిళలు

ప్రతి రంగంలో ప్రతిభ

వినీతసింగ్ (కాస్మెటిక్స్)

వినీతసింగ్‌కు తండ్రి తేజ్‌సింగ్ స్ఫూర్తిప్రదాత. ఆయన శాస్త్రవేత్త. ఏడాదిలో 365 రోజులూ పనిచేసేవాడు. తండ్రి ఇచ్చిన స్ఫూర్తితో డిజిటల్-ఫస్ట్ కాస్మటిక్ బ్రాండ్ 'సుగర్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయకేతనం ఎగరేసింది వినీత. ఐఐటీ-మద్రాస్, ఐఐఎం-అహ్మదాబాద్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వినీత ఒక ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులో అధిక వేతనంతో కూడిన జాబ్ ఆఫర్‌ను వదులుకొని వ్యాపారరంగంలోకి అడుగు పెట్టింది. మొదటి స్టార్టప్ 'క్వెట్జాల్' ఘోరంగా విఫలమైంది. 2012లో మన దేశంలో ఇ-కామర్స్ ఊపందుకుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని మహిళలకు ప్రతి నెలా వివిధ రకాల బ్యూటీ ప్రాడక్ట్స్ తక్కువ ధరకు అందించే 'ఫ్యాబ్ బ్యాగ్' అనే సబ్‌స్క్రిప్షన్స్ వ్యాపారాన్ని ప్రారంభించింది. ఈ వ్యాపారం హిట్ అయింది. అయితే ఈ మేకప్ బ్రాండ్లు మన భారతీయ స్కిన్‌టోన్, జీవన విధానానికి అనుగుణంగా లేవని గ్రహించింది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని 2015లో కాస్మటిక్ 'సుగర్'ను స్టార్ట్ చేసి తిరుగులేని విజయం సాధించింది.

నేహా సతక్ (ఆస్ట్రోమ్ టెక్నాలజీ)



టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీ, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ చేసింది నేహా సతక్. 'ఆస్ట్రోమ్ టెక్నాలజీ'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా తన సత్తా చాటింది. 'నన్ను నేను ఒక ఇన్నోవేటర్‌గా భావిస్తాను' అంటుంది 'ఆస్ట్రోమ్ టెక్నాలజీ' కో-ఫౌండర్, సీయీవో నేహా సతక్. 'ఇన్నోవేటివ్ హై-బ్యాండ్‌విడ్త్ టెక్నాలజీని అభివృద్ధి చేయడానికి, ఇంటర్నెట్ సేవలను ప్రపంచవ్యాప్తంగా అందుబాటు ధరలోకి తీసుకురావడానికి, మారుమూల ప్రాంతాలకు కూడా ఇంటర్నెట్ అందుబాటులో ఉండాలనే ఆలోచనలో ఆస్ట్రోమ్ టెక్నాలజీ మొదలు పెట్టాం. ఆస్ట్రోమ్ గిగామెష్ డివైజ్ చుట్టుపక్కల ఉన్న నాలుగు డివైజ్‌లను కనెక్ట్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఒక పరికరాన్ని మాత్రమే కనెక్ట్ చేయగలదు' అంటుంది నేహా సతక్.

హర్దిక షా (ఫిన్‌టెక్)



ముంబైలోని మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది హర్దిక షా. చిన్నపాటి వ్యాపారం నిర్వహించడానికి తల్లి పడే కష్టాలను దగ్గరి నుంచి చూసిన షా యూఎస్‌లో కంప్యూటర్ సైన్స్ చేసింది. కొలంబియా బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ పూర్తయిన తరువాత టాప్ సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొంది. మన దేశంలో చిన్న వ్యాపారాలు చేస్తున్నవారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి నిపుణులతో మాట్లాడి ఎన్నో విషయాలు తెలుసుకుంది. ఆ తరువాత బెంగళూరు కేంద్రంగా 'కినార క్యాపిటల్' అనే ఫిన్‌టెక్‌ను ప్రారంభించింది. ఈ ఫిన్‌టెక్‌కు ఆరు రాష్ట్రాల్లో 110 శాఖలు ఉన్నాయి. 'గ్యారెంటీ లేని బిజినెస్. చాలా రిస్క్' అన్నారు హర్దిక షా ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టినప్పుడు. అయితే ఆ మాటలేవీ ఆమెపై ప్రభావం చూపలేదు. తొలి అడుగుల్లోనే కస్టమర్‌లు, ఇన్వెస్టర్‌ల విశ్వాసాన్ని గెలుచుకుంది. 'ఫిన్ టెక్ ఫీల్డ్‌లో విజయకేతనం ఎగరేసింది.

డా. ప్రియా అబ్రహం, వైరాలజిస్ట్



మన దేశంలోని ప్రసిద్ధ వైరాలజిస్ట్‌లలో డా. ప్రియా అబ్రహం ఒకరు. కేరళలోని కొట్టాయం జిల్లాలో పుట్టిన ప్రియ క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ వెల్లూరు(సీఎంసీ)లో బయాలజీలో పీహెచ్‌డీ చేసింది. సీఎంసీ 'క్లినికల్ వైరాలజీ సెక్షన్' హెడ్‌గా పనిచేసింది. వైరల్ ఇన్‌ఫెక్షన్‌లకు సంబంధించిన ఎన్నో కమిటీల్లో, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ సైంటిఫిక్ అడ్వైజరీ కమిటీలో పనిచేసింది. నేషనల్ వైరల్ ఇన్‌ఫెక్షన్ సర్వైలెన్స్ రిసెర్చ్‌లో భాగం అయింది. కోవిడ్-19కి జస్ట్ రెండు నెలల ముందు పుణెలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ హెడ్‌గా బాధ్యతలు చేపట్టింది. 'ఆ టైమ్‌లో ఎన్నో నిద్ర లేని రాత్రులు గడిపాను' అని కరోనా కాలాన్ని గుర్తు తెచ్చుకుంటుంది ప్రియ. టెస్టింగ్ కిట్‌లను వివిధ టెస్టింగ్ ల్యాబ్‌లకు పంపే లాజిస్టిక్స్‌ను నిర్వహించడం నుంచి కొత్తగా పుడుతున్న వేరియెంట్లను నిశితంగా పరిశీలించడం వరకు వైరస్ వ్యాప్తిని అరికట్టే విషయంలో ప్రియ ఆమె బృందం ఎంతో కృషి చేసింది. లాజిస్టిక్స్ నిర్వహణకు మాత్రమే పరిమితం కాకుండా మన దేశంలో జరిగిన అన్ని వ్యాక్సిన్ ట్రయల్స్ పర్యవేక్షణలోనూ కీలక పాత్ర పోషించింది. 'గుర్తింపు, విజయం రావాలని ఆశగా పరుగెత్తినంత మాత్రాన రావు. మనం చేసిన కృషిని బట్టి వెదుక్కుంటూ మన దగ్గరికే వస్తాయి' అంటుంది ప్రియా అబ్రహం.

రిమ్‌జిమ్ అగర్వాల్ (న్యూరో-ఇన్‌ఫర్‌మేటిక్స్)



లైనా ఇమాన్యుయేల్‌తో కలిసి న్యూరో-ఇన్‌ఫర్‌మేటిక్స్ ప్లాట్‌ఫామ్ 'బ్రెయిన్‌సైట్'ను ప్రారంభించింది రిమ్‌జిమ్ అగర్వాల్. బ్రెయిన్‌సైట్ ఏఐ సాఫ్ట్‌వేర్ మెంటల్ హెల్త్ ప్రాక్టిషనర్స్‌కు, న్యూరోసర్జన్స్ బాగా ఉపయోగపడుతుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్‌లో పీహెచ్‌డీ చేసిన అగర్వాల్ మెంటల్ హెల్త్‌కు సంబంధించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) అప్లికేషన్‌లను స్టడీ చేసింది. 'గూగుల్ మ్యాప్ ఆఫ్ ది బ్రెయిన్'గా 'బ్రెయిన్‌సైట్' ప్లాట్‌ఫామ్ గుర్తింపు పొందింది. ఈ ప్లాట్‌ఫామ్‌ను నాలుగు రకాల టెక్నాలజీలతో రూపొందించారు. స్కిజోఫ్రెనియా, బైపోలార్ డిజార్డర్‌లాంటి మానసిక వ్యాధులకు సంబంధించి ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది.

మెదడులో ఏం జరుగుతుందో అనేదానిపై 'బ్రెయిన్‌సైట్' సాంకేతికత దృష్టి సారిస్తుంది. స్థూలంగా చెప్పాలంటే మానసిక సమస్యతో బాధపడుతున్న వారి గురించి సమగ్రంగా అర్థం చేసుకోవడానికి ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. 'మా పరిశోధనలను ఎక్కువమందికి చేరువ చేయాలనే లక్ష్యంతో ఎంటర్‌ప్రెన్యూర్‌గా మారాను. ఫంక్షనల్ అంశాలకు కృత్రిమ మేధస్సును వర్తింప చేస్తున్న ప్రపంచంలోని అతి కొద్ది కంపెనీలలో మా కంపెనీ ఒకటి' అంటుంది అగర్వాల్.

అశ్వినీ అశోకన్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)



అమెరికాలోని కార్నెగీ మెలన్ యూనివర్శిటీలో ఇంటరాక్షన్ డిజైన్ కోర్సు చదువుతున్న రోజుల నుంచి అశ్వినీ అశోకన్‌కు కంప్యూటర్‌కు సంబంధించి విషయాలపై ఆసక్తి ఉండేది. 'ఇంటెల్'లో దశాబ్దం పాటు వివిధ రకాల ఇంటర్నెట్ ఆధారిత ఉత్పత్తులకు సంబంధించిన విభాగాల్లో పనిచేసింది. ఈ అనుభవ జ్ఞానంతో 'మ్యాడ్‌స్ట్రీట్ డెన్'ను ప్రారంభించింది. డిజిటల్, ఏఐ ట్రాన్స్‌ఫర్‌మేషన్‌కు సంబంధించి కంపెనీల జర్నీలో 'మ్యాడ్‌స్ట్రీట్' ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది. 2020-2021లో కంపెనీలో రకరకాల పరిశ్రమలలోకి విస్తరించింది. వ్యాపార విజయాలకు మాత్రమే కాదు ఉద్యోగాలలో జెండర్ ఈక్వాలిటీకి కూడా ప్రాధాన్యత ఇస్తోంది అశ్విని. కోవిడ్ సమయంలో ఉద్యోగాలు మానేసిన ఎంతోమందిని తిరిగి పనిలో చేరేలా కృషి చేసింది.

'అన్ని రకాల కంపెనీలను నడిపించడంలో మహిళలు ముందుండాలి' అని కోరుకుంటున్న అశ్వినీ అశోకన్ ఈ భూగోళంలో ప్రతి ఉద్యోగి, ప్రతి వ్యక్తిని ఏఐ నేటివ్‌గా చూడాలనుకుంటుంది.

అపర్ణ పురోహిత్ (వినోద రంగం)



మాస్ కమ్యూనికేషన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన అపర్ణ పురోహిత్ ఎన్నో కలలతో ఢిల్లీ నుంచి ముంబైలోకి అడుగు పెట్టింది. ముంబైకి వచ్చిన ఐదేళ్ల తరువాత ఇండిపెండెంట్ డైరెక్టర్-ప్రొడ్యూసర్ కావాలనే తన కలను సాకారం చేసుకుంది. కథలు చెప్పాలనే కలతో ముంబైకి వచ్చిన అపర్ణ 'అమెజాన్ ప్రైమ్ వీడియో ఇండియా ఒరిజినల్స్' హెడ్‌గా కొత్త ప్రయాణం ప్రారంభించింది.

చిన్నాపెద్దా అనే తేడా లేకుండా ఎన్నో ప్రాజెక్ట్‌లలో పనిచేసింది. 'ఇది నా పని కాదు' అని ఎప్పుడూ అనుకోలేదు. ట్యాప్షన్ చెప్పడం నుంచి వాయిస్ ఓవర్ వరకు ఎన్నో పనులు చేసింది. 'అమెజాన్ ప్రైమ్‌వీడియో-ఇండియా' హెడ్ హోదాలో పాతాళ్ లోక్, మీర్జాపూర్ మేడ్ ఇన్ హెవెన్, ది ఫర్‌గెటన్ ఆర్మీలాంటి ఒరిజినల్ ఇండియన్ బ్లాక్‌బస్టర్ కంటెంట్‌తో మంచి పేరు తెచ్చుకుంది.

'సూపర్‌మెన్‌లాగా సూపర్ ఉమెన్ అనే మాట ఎందుకు వినిపించదు' అనే మాటకు అపర్ణ పురోహిత్ ఇచ్చిన జవాబు...

'తమ దైనందిన జీవితంలో మహిళలు ఎప్పుడూ సూపరే'



సురేఖ, ఉపాసన, అంజనాదేవి

ఆహారంలోనే ఆరోగ్యం

మూడుతరాల కోడళ్ల ముచ్చట్లు

ఒక మహిళ శక్తిమంతురాలు... అని చెప్పడానికి ఒక నిదర్శనం ఆమె కుటుంబాన్ని నిర్వహించే తీరు. శక్తిమంతురాలైన మహిళ తన ఇంట్లో వ్యక్తుల మధ్య ఉండాల్సిన కుటుంబ బంధాలను చక్కగా నిర్వహించగలుగుతుంది. ఏ ఇంట్లో అయినా బంధాలు, బాంధవ్యాల నిర్వహణ బాధ్యత మహిళ భుజాల మీదనే ఉంటుంది. మగవాళ్లు పని ఒత్తిడిలో క్షణికావేశానికి లోనైనప్పుడు ఆ పరిస్థితిని చక్కదిద్దగలిగింది మహిళ మాత్రమే. ఆ మహిళ ఆ మగవ్యక్తికి తల్లి కావచ్చు, భార్య కావచ్చు, ఇంటి కోడలు కావచ్చు. ఒక ఇంట్లో తల్లి, కోడలు, కొత్తతరం కోడలు అందరూ అనుబంధాలకు విలువ ఇచ్చేవారైతే ఆ కుటుంబం ఎంత ఆనందంగా ఉంటుందో ఈ ఫొటో చెప్తోంది. ఉపాసన, సురేఖ, అంజనాదేవి... కొణిదెల ఇంటి మూడు తరాల కోడళ్లు. తమ ఇంటి రుచుల అనుబంధాలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి'తో పంచుకున్నారు.

పిల్లలు తింటేనే నాకు బలం

నాకు వంట చేయడం చాలా ఇష్టం. అయితే పెద్దగా ఓపిక లేదిప్పుడు. పిల్లలు ఫోన్ చేసినప్పుడు 'ఏమైనా వండి పంపించమంటావా' అని అడుగుతాను. మొన్నొక రోజు చరణ్ 'నాయనమ్మా రొయ్యల పలావు చేస్తావా' అన్నాడు. రేపు ఎలా ఉంటుందో, చేయగలనా లేదా అని ఆ రోజు రాత్రి నిద్రపట్టలేదు. రొయ్యల పలావు వండి, చరణ్ తిని బాగుందన్న తర్వాత నెమ్మదించాను. ప్రతిదీ రుచిగా ఉండాలనుకుంటాను. హైదరాబాద్‌కి వచ్చిన తర్వాత కూడా మంచి కాఫీ కోసం నెల్లూరు, నిర్మలా కేఫ్ నుంచి కాఫీ పొడి తెప్పించుకునేదాన్ని. పిల్లలందరికీ చక్కగా వండి పెట్టడమే నాకు సంతోషం, అదే నా బలం.

- అంజనాదేవి

మా కోడలు నన్ను మార్చేసింది

గత ఏడాది మహిళాదినోత్సవానికి – ఈ మహిళా దినోత్సవానికి మధ్య నా జీవితం ఓ కీలకమైన మలుపు తీసుకుంది. గృహిణిగా ఉన్న నన్ను ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది ఉపాసన. 'అత్తమ్మాస్ కిచెన్' ప్రారంభానికి మూలం కోసం నాలుగు దశాబ్దాల వెనక్కి వెళ్లాలి. మా పెళ్లయిన కొత్తలో చిరంజీవి షూటింగ్ కోసం పారిస్ వెళ్లినప్పుడు నేనూ వెళ్లాను. 47 రోజులు అక్కడ ఆయన మీట్, సాస్‌లు తినలేక ఇబ్బంది పడ్డారు. బయటి దేశాలకు వెళ్లినప్పుడు ఇంటి భోజనాన్ని ఎంజాయ్ చేయడం కోసం నేను కనుక్కున్న ఫార్ములానే ఈ ప్రీ కుక్‌డ్ ఫుడ్. అలాగే ఉపాసన ఆస్కార్ అవార్డు వేడుకలకు వెళ్లినప్పుడు తను ప్రెగ్నెంట్. భోజనం సరిగా తింటుందో లేదోనని ఇదే ఫార్ములా ఇన్‌స్టంట్ మిక్స్‌లు చేసిచ్చాను. తను చాలా సంతోషపడింది. ఇండియా వచ్చిన తరవాత తన ఆలోచన నాతో చెప్పింది. ఎంటర్‌ప్రెన్యూర్ అనే మాటే అప్పుడు నాకు అర్థం కాని విషయం. అయితే వంట వరకు నా పర్యవేక్షణలో జరుగుతుంది. ప్రభుత్వ అనుమతులు, మార్కెటింగ్ వంటివన్నీ ఉపాసన చూసుకుంటుంది. ఈ సందర్భంగా అరవై దాటిన మహిళలకు నేను చెప్పే మాట ఒక్కటే. యాభై దాటే వరకు మన ఆరోగ్యం గురించి పెద్దగా పట్టించుకున్నా పట్టించుకోకపోయినా గడిచిపోతుంది. అరవైలలోకి వస్తున్నారంటే దేహం మీద దృష్టి పెట్టాలి. రోజుకో గంట సమయం వ్యాయామం కోసం కేటాయించాలి. ఎన్నాళ్లు బతుకుతామనేది కాదు, బతికినన్నాళ్లూ ఆరోగ్యంగా ఉండాలి. అలాగే మా ఉపాసన మాటలను విన్న తర్వాత నాకు తెలిసిందేమిటంటే... ఈ తరం మహిళలు ముఖ్యంగా గృహిణులు తమకంటూ ఓ గుర్తింపును కోరుకుంటారు. అలాగని అందరికీ పెద్ద పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించే వెసులుబాటు ఉండదు. ఆర్థిక సౌలభ్యం లేదని దిగులు చెందవద్దు. ఇంట్లోనే చేయగలిగే పచ్చళ్లు, హోమ్ ఫుడ్‌తో చిన్నస్థాయిలో మొదలుపెట్టండి. మీ కృషితో మీ కుటీర పరిశ్రమను విస్తరించండి. మీకంటూ గుర్తింపు దానంతట అదే వస్తుంది.

- సురేఖ

అత్తమ్మ నా రోల్‌మోడల్

మీకు తెలుసా... అత్తమ్మ వెయిట్ లిఫ్టర్! రోజూ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా వెయిట్ లిఫ్ట్ చేస్తారు. ఆమె ప్రతి విషయంలో ఎంత నిదానంగా, ఎంత జాగ్రత్తగా ఉంటారో, మాట్లాడే ముందు ఎంత ఆలోచిస్తారో... అన్నీ నాకు గొప్పగా అనిపిస్తాయి. ప్రీ కుక్‌డ్ ఫుడ్ ఫార్ములా తెలిసి ఎంత ఎగ్జయిట్ అయ్యానో చెప్పలేను. ట్రావెల్ చేసే వాళ్లకు ఎంత బాగా ఉపయోగపడుతుందో కదా, దీనిని అందరికీ పంచుదామన్నాను. ఇప్పటికే మార్కెట్‌లో ఉప్మా, పులిహోర వంటి మిక్స్‌లు ఉన్నప్పటికీ వాటిలో ప్రిజర్వేటివ్స్ కూడా ఉంటాయి. అలా కృత్రిమ ప్రిజర్వేటివ్స్ ఏమీ లేకుండా చేసిన మా అత్తమ్మ రెసిపీలను విస్తృతంగా ప్రాచుర్యంలోకి తీసుకురావాలనేదే నా ప్రయత్నం. ఇప్పుడు ఉప్మా, పులిహోర, రసం, పొంగల్ నాలుగు ఉత్పత్తులతో మార్కెట్‌లోకి వచ్చాం. మరో మూడు ప్రయోగాల దశ పూర్తి చేసుకుని సిద్ధంగా ఉన్నాయి. ఇప్పుడు మా పాపకు అందిస్తున్న చిరుధాన్యాలు, పప్పులతో ఇన్‌స్టంట్ ఫుడ్ పౌడర్‌ను కూడా మార్కెట్‌లోకి తీసుకువస్తాం. ఈ ఐడియాకి అత్తమ్మ గారింట్లో ఆశ్చర్యపోయారు. కానీ మా పుట్టింట్లో మహిళలందరూ ఎంటర్‌ప్రెన్యూర్‌లే కావడంతో వాళ్లు విన్న వెంటనే సంతోషంగా స్వాగతించారు. హెల్త్ ఇండస్ట్రీ నుంచి వచ్చిన అమ్మాయిని ఫుడ్ ఇండస్ట్రీలోకి రావడంలో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. ఆహారంలోనే ఆరోగ్యం ఉంది.

- ఉపాసన

ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి; ఫోటో: నోముల రాజేశ్‌రెడ్డి

* స్త్రీ శక్తి



ప్రతీకాత్మక చిత్రం

'మహిళలను గౌరవిద్దాం' అనే మాట తరచూ వింటుంటాం. మహిళ గురించి మాట్లాడే ఉన్నతమైన పదాలు మహిళా దినోత్సవం వరకే పరిమితం అవడం కూడా చూస్తుంటాం. 'సమాజంలో వస్తున్న మార్పులను ఆహ్వానించే క్రమంలో స్త్రీ గౌరవానికి, రక్షణకు వెన్నుదన్నుగా నిలిచేది కూడా మొదట మహిళే అయి ఉండాలి' అంటూ వివిధ రంగాలలోని మహిళలు తమ మాటల ద్వారా ఇలా వినిపిస్తున్నారు. మహిళా దినోత్సవ స్ఫూర్తితో ఆ మాటలను ఆచరణలోనూ పెట్టి మంచి ఫలితాలను చూద్దాం.

– నిర్మలారెడ్డి

మనల్ని మనం గౌరవించుకుందాం..

ప్రయత్నించడం మానకూడదు



మగవారితో పోల్చితే ఇంట్లో, ఆఫీసులోనూ స్త్రీల పాత్ర ఎక్కువే. రెండుచోట్లా నిబద్ధతతో పని చేస్తుంటారు. కానీ, రెండు చోట్లా అర్థం చేసుకునేవారుండరు. విసుగు అనిపిస్తుంటుంది. అలాగని, మన ప్రయత్నాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదలకూడదు. ముప్పై ఏళ్ల క్రితం నేను పీజీ విద్యార్థిగా ఉన్నప్పుడు క్లాసులో అమ్మాయిలు ఐదు శాతం కన్నా తక్కువే ఉండేవారు. ఇప్పుడు.. పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్టూడెంట్స్‌లో 60 నుంచి 70 శాతం మంది అమ్మాయిలు ఉంటున్నారు. బాయ్స్ హాస్టల్స్‌లో కొన్నింటిని గర్ల్స్ హాస్టల్‌గా మార్చేద్దామని కూడా చూస్తున్నాం. పీహెచ్‌డి చేసే అమ్మాయిల సంఖ్యా పెరిగింది. పోరాడి సీట్లు, పదవులు దక్కించుకుంటున్నాం. అయితే, ఎంత పెద్ద చదువులు చదివినా, ఏ హోదాలో ఉన్న ముందు ఎవరిని వారు గౌరవించుకోవాలి. చదువులో, హోదాలో సమానత్వం కోసం పాటుపడాలనే కాదు మన ఆత్మగౌరవాన్ని కోల్పోకుండా ఆత్మస్థైర్యంతో ఎదగాలనుకోవాలి. కుటుంబంలో ఏ కష్టం వచ్చినా ఆ కుటుంబాన్ని కాపాడుకోగలమనే ధైర్యం ఉండాలి. రక్షించడానికి ఎవరో ఒక మగవాడైనా ఉండాలి అనే ఆలోచనను దూరం పెట్టాలి. అప్పుడే మన శక్తి ఏంటో మనకు తెలుస్తుంది. అందుకు తగిన సత్తాను సంపాదించుకోవడం మన లక్ష్యం అవ్వాలి. ఆత్మరక్షణ, కుటుంబ రక్షణ సమాజంలో మనల్ని ఉన్నతంగా చూపుతుంది.

– ప్రొఫెసర్ సి.వి. రంజని,
హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్, ఓయూ

వ్యక్తిత్వాన్ని పోస్ట్‌మార్టం చేస్తున్నారు



స్లోగన్స్ చెబుతున్నారు. కానీ, పాటించడం లేదు. మగవారితో సమానంగా కష్టపడుతున్నారు. కానీ, మగవారు స్త్రీని శారీరకంగా బలహీనులుగానే చూస్తారు. ఆమె శక్తి తెలిస్తే మగవారిలో ఆ ఆలోచనే రాదు. ఎక్కడైనా లైంగిక వేధింపులకు గురైన మహిళ ఎవరైనా ఉంటే ఆ సంఘటనను, సదరు వ్యక్తులను కాకుండా ముందు ఆమె వ్యక్తిత్వాన్ని పోస్ట్‌మార్టం చేస్తుంటారు. ఇంటి దగ్గర నుంచి పని ప్రదేశంలోకి ఒక మహిళ రావాలంటే ఎన్నో అడ్డంకులను దాటాల్సి ఉంటుంది. అక్కడా వేధింపులు తప్పవు. ప్రేమించి పెళ్లి చేసుకుని ఇంటి నుంచి బయటకు వచ్చిన అమ్మాయిలు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. పెళ్లి చేసుకున్న అబ్బాయి వదిలేసి వెళ్లిపోతే, పుట్టింటి సహకారం అందక ఆ అమ్మాయి బతుకుదెరువులో చాలా వేధింపులను ఎదుర్కొంటున్నది. ఆమె జీవనం గురించి తప్పుగా మాట్లాడే మగవాళ్లు ఉన్నారు. సమస్యను ఎదుర్కోవడంలో గొడవ తప్పక జరుగుతుంది. కానీ, సింగిల్ ఉమెన్ గొడవ పడితే ఆమె వ్యక్తిత్వాన్ని కించపరుస్తుంటారు. తల్లి తన కూతురుకి ఒంటరిగా ఎలా జీవించాలో చెబుతూనే సమాజాన్ని ఎదుర్కొనే ధైర్యం ఇవ్వాలి. సోషల్ మీడియాలో 'ఆమె'గౌరవానికి సంబంధించిన దారుణమైన వీడియోలు చూస్తున్నాం. ఏదైనా అమ్మాయికి సంబంధించిన సంఘటన జరిగినప్పుడు 'అమ్మాయి ఎలాంటిది?' అని ఆమెను నెగిటివ్‌గా ప్రాజెక్ట్ చేస్తున్నారు. స్వలాభం కోసం చేసే ఇలాంటి ఎన్నో పనులు 'ఆమె' గౌరవాన్ని తీసేస్తూ బతికేస్తున్నారు.

– డాక్టర్ జయశ్రీ కిరణ్, కాకతీయ ఫౌండేషన్, హైదరాబాద్

మన మీద మనకు నమ్మకం



మగవారితో పోల్చుకుంటే టైమ్ మేనేజ్ చేయగల శక్తి స్వతహాగా స్త్రీకి ఉంటుంది. ఒక గోల్ రీచ్ అవ్వాలని కష్టపడితే అది ఎంత దూరంలో ఉన్నా మనకు దగ్గర కావల్సిందే. మనం ఏదైనా చేయాలనుకున్నప్పుడు ఆరోగ్యం బాగా లేదనో, సరైన చదువు లేదనో, కుటుంబ బాధ్యతలు ఉన్నాయనో.. ఇలా వెనకడుగు వేయాల్సిన అవసరం లేదు. ఎంత కష్టమైన పరిస్థితులు ఎదురైనా మన కలలను మనమే డిజైన్ చేసుకోవచ్చు. ఇంట్లో ఉండి కూడా మనల్ని మనం బాగు చేసుకోవచ్చు. నాకు స్కూల్ వయసులో పెళ్లి అయింది. ఇద్దరు పిల్లలు. అయినా యోగా ట్రైనర్‌గా, బ్యూటీషియన్‌గా మేకప్ అకాడమీ నడుపుతున్నాను. పిల్లలిద్దరూ సెటిల్ అయ్యారు. ఇంటిని చక్కదిద్దుకుంటూనే నా పనులు చేసుకుంటూ వచ్చాను. సమస్యలు ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఉంటాయి. నా కెందుకు ఈ సమస్య వచ్చింది అని ఏడ్చుకుంటూ కూర్చుంటే ఎప్పటికీ పరిష్కారం అవ్వదు. సానుభూతి తప్ప బయటి నుంచి గౌరవం కూడా లభించదు. మనమీద మనకున్న నమ్మకమే మనకు గౌరవాన్ని తెచ్చిపెడుతుంది.

– రూప, యోగా టీచర్ అండ్ బ్యూటీషియన్

భయం బిడియంతో శక్తి తగ్గుతుంది



స్త్రీలను గౌరవించండి అనే మాట చాలా చోట్ల వింటూనే ఉంటాం. ఆ మాట వినటమే మన దౌర్భాగ్యం. ఎందుకంటే స్త్రీని గౌరవించాలి అని చెబితే గాని తెలియని సమాజంలో మనం జీవనం సాగిస్తున్నాం. ఉమ్మడి కుటుంబాలలో ఉన్నప్పుడు స్త్రీకి మాట్లాడే అవకాశం కూడా ఉండేది కాదు. ఇంటి పనుల్లో వంట పనుల్లో మునిగిపోయే వాళ్ళు. ప్రస్తుత పరిస్థితులు అలా లేవు. మారుతున్న టెక్నాలజీతో పాటు మనలో కూడా మార్పు రావాలి. భయం, బిడియం అనే భావాలతో స్త్రీ తన శక్తిని గుర్తించటం లేదు. ఒక తల్లి యవ్వనంలో ఉన్న తన కూతురుతోనో కొడుకుతోనో తన చిన్నప్పటి కబుర్లు, నెరవేరని కలలు, రక్తసంబంధాలు, స్నేహితుల గురించి, జీవితంలో అనుభవించిన కష్టాలు వాటిని ఎదుర్కొనే నేర్పరితనం... చర్చించడం లేదనిపిస్తోంది. నాటి పరిస్థితులు వేరు, ఇప్పటి పరిస్థితులు వేరు అనుకుంటారు. కానీ, ఏ కాలమైనా స్త్రీ ఎప్పుడూ మెలకువతో తనను తాను కాపాడుకోవాలనే స్పృహతో ఉండాలి. పాలకులు కూడా స్త్రీని అన్ని రంగాల్లో పైకి తెస్తున్నాం అని చెబుతుంటారు. కానీ, అమ్మాయిలపై అఘాయిత్యాలను మాత్రం అడ్డుకోలేకపోతున్నారు. స్వతంత్ర దేశం కోసం ఎందరో స్త్రీలు తమ ప్రాణాలర్పించారు. వారి ప్రాణత్యాగాన్ని స్మరణ చేసుకున్నా మహిళగా ఈ సమాజంలో ఎలా ఉండాలి అనేది తెలుస్తుంది. మనలో మనకు ఐకమత్యం ఉండాలి. ఏ కారణం వల్ల ఒంటరిగా ఉంటున్న స్త్రీని సాటి స్త్రీ అర్థం చేసుకొని, ఆమెకు మద్దతునివ్వగలిగితే చాలు ధైర్యం పెరుగుతుంది. స్త్రీలు ఒకరికి ఒకరుగా నిలవాలి. పనిమనిషి పనిని కూడా గౌరవించడం కుటుంబంలో వారికే అర్థమయ్యేలా తెలపాలి. పారిశుద్ధ్య కార్మికురాలి, పనిమనిషి, రోజువారీ పనుల్లో తారసపడే ప్రతి స్త్రీని గౌరవించాలని పిల్లలకు చెప్పాలి. రేపటి తరంలో వచ్చే మార్పు కూడా సమాజానికి మేలు కలుగజేస్తుంది.

– వి. ప్రతిభ, బిజినెస్ ఉమెన్

నవంబర్‌లో ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ: సీఎస్

సాక్షి, అమరావతి: వచ్చే నవంబర్‌లో గుంటూరు ఆర్మీ రిక్రూట్మెంట్ ఆఫీసు(ఎఆర్‌ఓ) పరిధిలోని కృష్ణా నది కుడివైపున గల గుంటూరు జిల్లా మొదలు రాయలసీమ జిల్లాలు కలిపి 13 జిల్లాల్లో ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన సచివాలయం నుంచి గుంటూరు ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి కల్నల్ పునీత్‌కుమార్, మేజర్ అమ్మీర్ దీప్‌కుమార్‌లతో కలసి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ విశాఖ, గుంటూరుల్లో రెండు ఆర్మీ రిక్రూట్మెంట్ ఆఫీసులున్నాయని, గుంటూరు ఆర్మీ రిక్రూట్మెంట్ ఆఫీసుకు సంబంధించి నవంబర్‌లో ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల్లో ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీలు నిర్వహించాలని ప్రతిపాదించారని తెలిపారు. అలాగే గుంటూరు ఏఆర్‌ఓ పరిధిలోని జిల్లాల్లో ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీపై గ్రామస్థాయి వరకు ప్రచారం నిర్వహించాలన్నారు. గుంటూరు ఆర్మీ రిక్రూట్మెంట్ ఆఫీసు అధికారి కల్నల్ పునీత్‌కుమార్ మాట్లాడుతూ 2024–25 ఆర్మీ రిక్రూట్మెంట్‌కు సంబంధించి మార్చి 22 వరకు ఆర్మీ అధికారిక వెబ్‌సైట్ www.joinindianarmy.nic.in లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, అప్లికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

13న 'ఔట్ రీచ్ ప్రోగ్రామ్'

ఈ నెల 13వ తేదీన ఔట్ రీచ్ ప్రోగ్రామ్‌లో భాగంగా వివిధ పథకాల (ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ, ఎన్‌బీసీఎఫ్‌డీసీ, నమస్తే స్కీం) కింద కొత్తగా రుణాలు తీసుకున్న వారితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా మాట్లాడనున్నారని సీఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు.

16 ఏళ్ల డిమాండ్‌ను 16 రోజుల్లోనే పరిష్కరించారు

- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు
- రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పోలీసుల సంక్షేమం, సర్వీసు నిబంధనలకు సంబంధించిన దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన సీఎం జగన్‌కు రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. సచివాలయంలో రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జనకుల శ్రీనివాస్ గురువారం మీడియా తో మాట్లాడారు. పోలీసుల సరెండర్ లీవుల డబ్బులను అతిత్వరలో ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, రిజర్వ్ పోలీసులకు యూనిఫామ్‌లో మార్పులకు సంబంధించి 16 ఏళ్లుగా ప్రస్తావిస్తున్న డిమాండ్‌ను సీఎం దృష్టికి తీసుకువెళ్లగా 16రోజుల్లోనే పరిష్కరించడంపై హర్షం వ్యక్తం చేశారు. యూనిఫామ్ మారుస్తూ జీవో జారీ చేశారని తెలిపారు. పోలీసుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కమిటీ వేసి 16రోజుల్లోనే పరిష్కరించారని చెప్పారు. అందుకు సహకరించిన డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఇతర పోలీసు ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

4 రోజుల్లో 850 ఎకరాలా!

సాక్షి, హైదరాబాద్: ఐఎంజీ అకాడెమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎంజీబీపీఎల్) కంపెనీ ఏర్పాటైన 4 రోజుల్లోనే 850 ఎకరాలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్న 2003 నాటి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు తీవ్రస్థాయిలో తప్పుబట్టింది. కనీస విచారణ లేకుండా, అంతర్జాతీయ కంపెనీతో సంబంధాలు ఉన్నాయో లేదో తెలుసుకోకుండా, అత్యంత ఖరీదైన ప్రాంతంలో వేల కోట్ల విలువైన భూములను కారు చౌకగా ధారాదత్తం చేసేందుకు ఒప్పందం కుదుర్చుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. స్పోర్ట్స్ అకాడెమీ నిర్వహణ కోసం అంటూ ఏటా కోట్లాది రూపాయలు ముట్టజెప్పేందుకు, విద్యుత్, నీటి, సీవేజ్, డ్రైనేజీ సౌకర్యాలు 100 శాతం ఉచితంగా కల్పించేందుకు అంగీకరించడం గతంలో ఎప్పుడూ, ఎక్కడా చూడలేదంటూ విస్మయం వ్యక్తం చేసింది. గతంలో ఏ కంపెనీకీ అది ఏర్పాటైన 4 రోజుల్లో వందల ఎకరాలు అప్పగించినట్టుగా, నిర్వహణ ఖర్చులు, బిల్లుల మాఫీకి అంగీకరించినట్టుగా లేదని అభిప్రాయపడింది. 2007లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం విస్తృత ప్రజా ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకునే సదరు భూమిని వెనక్కు తీసుకుంటూ చట్టం చేసిందని స్పష్టం చేసింది. రాజ్యాంగంలో ఉన్న అధికారాల మేరకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్తి (పరిరక్షణ, రక్షణ, పునఃప్రారంభం) చట్టాన్ని తీసుకొచ్చిందని.. ఇది ఎంతమాత్రం ఆక్షేపణీయం కాదని తేల్చిచెప్పింది. ఐఎంజీ భారత్ (పిటిషనర్) పేర్కొంటున్నట్లుగా ఆర్టికల్ 14 ఉల్లంఘన ఎక్కడా జరగలేదని స్పష్టం చేస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ కనిపించలేదని, ఆ ఒప్పందాన్ని ఏ విధంగానూ సమర్థించలేమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటిల ధర్మాసనం 18 ఏళ్ల సుదీర్ఘ విచారణ తర్వాత గురువారం తీర్పు ఇచ్చింది. దీనిపై మీరు సీబీఐ విచారణ జరిపిస్తారా? లేక మమ్మల్నే ఆదేశించమంటారా? అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ అంశంపైనే దాఖలైన ఓ పిల్ విచారణ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై వారం రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పింది.

యువతను క్రీడల్లో తీర్చిదిద్దడం కోసం అంటూ..

ఐఎంజీ అకాడెమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎంజీబీపీఎల్) 2003, ఆగస్టు 5న ఏర్పాటైంది. కంపెనీ ఏర్పాటైన 4 రోజులకే అంటే ఆగస్టు 9నే చంద్రబాబు నేతృత్వంలోని నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐఎంజీ భారత్‌తో ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది.



క్రీడల్లో రాష్ట్ర యువతను చాంపియన్లుగా తీర్చిదిద్దడం కోసం అంటూ ఈ ఎంవోయూ చేసుకుంది. ఇందులో భాగంగా స్పోర్ట్స్ అకాడెమీలను నిర్మించడం, అభివృద్ధి చేయడం, నిర్వహించడం కోసం అంటూ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి సర్వే నంబర్ 25లో 400 ఎకరాలు ఇచ్చేందుకు అంగీకరించింది. అలాగే రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం మామిడిపల్లి సర్వే నంబర్ 99/1లోని మరో 450 ఎకరాలు అప్పగించేందుకు కూడా ఒప్పందం చేసుకుంది. అంతేకాకుండా ఐఎంజీ భారత్ అంతర్జాతీయ స్థాయిలో ప్రధాన కార్యాలయాన్ని నిర్మించుకునేందుకు బంజారాహిల్స్ నుంచి మాదాపూర్ వెళ్లే మార్గంలో ఎకరం నుంచి 5 ఎకరాలు కూడా ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు 2004, ఫిబ్రవరిలో గచ్చిబౌలిలో ఎంతో విలువైన 400 ఎకరాలను స్వల్ప మొత్తానికి అంటే కేవలం రూ.2 కోట్లకే ఐఎంజీ భారత్‌కు అప్పగించింది (సేల్ డీడ్ చేసింది). అయితే 2006లో ప్రభుత్వ ఆస్తులను కాపాడే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చింది. 2007లో దీన్ని చట్టబద్ధం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్తి (పరిరక్షణ, రక్షణ, పునఃప్రారంభం) చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్ట ప్రకారం ఐఎంజీ భారత్‌తో అంతకుముందు ప్రభుత్వం చేసుకున్న ఎంఓయూ, ఆ మేరకు సేల్‌డీడ్ కూడా రద్దయ్యాయి. ఈ క్రమంలో 2007 చట్టంలోని సెక్షన్ 2 ప్రకారం సంబంధిత లావాదేవీలు రద్దు చేయడమే కాకుండా ఐఎంజీ చెల్లించిన మొత్తాన్ని ఏడాదికి 12 శాతం వడ్డీతో తిరిగి ఇచ్చేయడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. అయితే ప్రభుత్వ చట్టాన్ని సవాల్ చేస్తూ ఐఎంజీ భారత్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

పూర్తి కేబినెట్ ఆమోదం లేదు: ఏజీ

'పూర్తి కేబినెట్ ఆమోదం లేకుండా నాటి ప్రభుత్వం ఎంఓయూపై సంతకాలు చేసింది. ఆ సమయంలో భూమి విలువ ఎకరం రూ.13 లక్షలు ఉండగా, పిటిషనర్‌కు రూ.50 వేల స్వల్ప మొత్తానికే సరైన ఎలాంటి కారణం లేకుండా విక్రయించారు. ఐఎంజీ భారత్‌కు అమెరికన్ కంపెనీ అయిన ఐఎంజీతో ఎలాంటి సంబంధం లేదు. కానీ దానికి అనుబంధ సంస్థ అంటూ మోసగించారు. అందుకే తదుపరి ప్రభుత్వం ఎంవోయూను రద్దు చేసింది. పరిహారం ఇవ్వాలని కూడా నిర్ణయించింది. 2007లో ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ఒక్క ఐఎంజీ కోసమే కాదు. ఇది ఇతర భూ లావాదేవీలకు కూడా వర్తిస్తుంది. ఇలా చట్టం తీసుకొచ్చే అధికారం రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ ప్రకారం శాసనసభకు ఉంది. రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత 2007లో చేసిన చట్టం అమల్లోకి వచ్చింది..' అంటూ అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కాగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ.'ఒక ఐఎంజీ భారత్ కోసమే చట్టాన్ని తేవడం సమర్థనీయం కాదు. ఎంవోయూను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి లేదు..' అంటూ వాదించారు.

ప్రజా ఆస్తుల పరిరక్షణకే వైఎస్ సర్కార్ చట్టం..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ప్రభుత్వం ఉల్లంఘించిందన్న వాదన కూడా సరికాదు. ప్రజల ఆస్తులను కాపాడటం కోసమే 2007లో వైఎస్ సర్కార్ చట్టం తీసుకొచ్చింది. అది ఎవరి వ్యక్తిగత అవసరాల కోసం కాదన్న విషయం గ్రహించాలి. కంపెనీ ఏర్పాటు చేసిన నాలుగు రోజుల్లో వేల కోట్ల భూములు గతంలో మరే ఇతర కంపెనీకి ప్రభుత్వం కేటాయించినట్లుగా ఐఎంజీ నిరూపించలేకపోయింది. అలాగే ప్రభుత్వం చేసిన చట్టం చెల్లుబాటును అడ్డుకునేందుకు ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు కూడా జరగలేదు. సేల్ డీడ్‌ను రద్దు చేయకూడదనే వాదన ఆమోదానికి అర్హమైనది కాదు. ఎంఓయూనే రద్దయినప్పుడు సేల్‌డీడ్ అమల్లో ఉండటం సాధ్యం కాదు..' అంటూ ధర్మాసనం తన తీర్పులో వ్యాఖ్యానించింది.

ప్రభుత్వం రద్దయ్యాక 400 ఎకరాలకు సేల్‌డీడ్!

2003, నవంబర్ 14నే చంద్రబాబు ప్రభుత్వం రద్దయ్యింది. తర్వాత ఆపద్ధర్మ ప్రభుత్వంగా మాత్రమే కొనసాగింది. ఈ ఆపద్ధర్మ ప్రభుత్వ హయాంలోనే 400 ఎకరాలను నామమాత్రపు ధరకు ఐఎంజీ భారత్‌కు అప్పగిస్తూ సేల్‌డీడ్ చేసింది. అయితే 2007లో భూములపై రాష్ట్ర శాసనసభకు ఉన్న అధికారాలతోనే ప్రభుత్వం చట్టాన్ని రూపొందించింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సరైన కారణాలు ఉన్నప్పుడు రాజ్యాంగం ప్రభుత్వానికి ఈ అధికారం కల్పించింది. జాగ్రత్తగా గమనిస్తే.. కంపెనీ ఏర్పాటైన కేవలం 4 రోజుల్లోనే వేల కోట్ల విలువచేసే వందల ఎకరాల భూములు అప్పగించారు. మరే ఇతర కంపెనీకి రాష్ట్రంలో అంత స్వల్ప సమయంలో ఇలా భూములు ధారాదత్తం చేయలేదు. పిటిషనర్‌కు పరిహారం కోరే హక్కు ఉంది. అయితే 2007లో తీసుకొచ్చిన చట్టాన్ని తన ఒక్క కంపెనీ కోసమే అంటూ సవాల్ చేయలేరు.

ఎలాంటి విచారణ చేయకుండానే ఆమోదం: ధర్మాసనం

'2003 ఆగస్టు 5న ఐఎంజీ భారత్ ఏర్పాటైన తర్వాతి రోజే, ఎలాంటి విచారణ చేసుకోకుండానే 6న నాటి యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, కల్చరల్ డిపార్ట్‌మెంట్ కంపెనీకి ఆమోదం తెలుపుతూ సర్క్యులర్ జారీ చేసింది. అదే రోజు నలుగురు మంత్రులతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దీనికి ఆగమేఘాలపై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆ తర్వాత 9వ తేదీన ఎంవోయూ కుదుర్చుకున్నారు. స్పోర్ట్స్ అకాడెమీ, స్టేడియాల నిర్వహణకయ్యే ఖర్చు ఏడాదికి రూ.2.5 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ అయితే ఆ మొత్తాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తుందని ఒప్పందంలో పేర్కొన్నారు. తొలి మూడేళ్లపాటు విద్యుత్, నీటి, సీవేజ్, డ్రైనేజీ బిల్లులనూ 100 శాతం తిరిగి చెల్లిస్తామని చెప్పారు. ఆ తర్వాత క్రమంగా దీన్ని తగ్గిస్తామని తెలిపారు. ముఖ్యంగా పిటిషనర్‌కు అంతర్జాతీయ క్రీడా సంస్థ (ఐఎంజీ, అమెరికా)తో సంబంధం గానీ, గతంలో క్రీడా రంగంలో అనుభవం గానీ లేవు. ఉన్నట్లుగా ఐఎంజీ ఎలాంటి పత్రాలను ప్రభుత్వానికి సమర్పించలేదు.

సీబీఐ విచారణకు లేఖ రాశామన్నారుగా..

'ఐఎంజీ భారత్‌కు భూముల అప్పగింత్‌పై సీబీఐ విచారణ కోరుతూ గతంలో లేఖ రాశాం అన్నారు.. ఎంత వరకు వచ్చింది? మీరు విచారణ కోరతారా? లేక మమ్మల్నే సీబీఐకి అప్పగిస్తూ ఆదేశాలు ఇవ్వమంటారా?' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణలోగా ఏదో ఒకటి చెప్పాలని ఆదేశిస్తూ, విచారణను వారం పాటు వాయిదా వేసింది. ఐఎంజీ భారత్‌కు భూముల కేటాయింపు, ఎంవోయూ, సేల్‌డీడ్.. ఇలా అన్ని అంశాలపై కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ)తో విచారణ జరిపించాలని కోరుతూ టి.శ్రీరంగారావుతో పాటు మరొకరు 2012లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ ఒప్పందం వెనుక పెద్ద ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం చేసే ప్రయత్నం జరిగిందని, దీని వెనుక ఉన్న కుట్రదారులెవరో తేల్చాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పిటిషన్లను గురువారం మరోసారి సీజే ధర్మాసనం విచారించింది. సీబీఐకి అప్పగించే విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ అభిప్రాయం ధర్మాసనం కోరింది. ఆయన తమకు కొంత సమయం కావాలనడాన్ని, ప్రభుత్వాన్ని సంప్రదించిన తర్వాత తెలియజేస్తాననడాన్ని తప్పుబట్టింది. ఇంకా ఎంతకాలం ఆగాలని, వారంలోగా ఏదో ఒకటి తేల్చిచెప్పాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది. కాగా గతంలో ఇదే పిల్‌పై విచారణ సందర్భంగా ప్రభుత్వం కోరితే దర్యాప్తు చేయడానికి సిద్ధంగా ఉన్నామని న్యాయస్థానానికి సీబీఐ తెలియజేయడం గమనార్హం.

సినిమా

సినిమా చూడాలనే ఆసక్తి కలుగుతోంది - అడివి శేష్



● విశ్వక్ సేన్, విక్రమ్, అడివి శేష్

''గామి' ట్రైలర్ చూసిన తర్వాత సినిమా చూడాలనే ఆసక్తి కలుగుతోంది. అలాగే అందరూ ఈ సినిమా హిట్ కావాలని కోరుకునేలా ఉంది. డైరెక్టర్ విద్యాధర్ ప్యాషన్‌కి హ్యాట్సాఫ్. విశ్వక్ సేన్ ప్రతిభ, నిజాయితీ ఉన్న నటుడు. తన నిజాయితీ గల మనసు కోసమే ఈ వేడుకకి వచ్చాను'' అని హీరో అడివి శేష్ అన్నారు. విశ్వక్ సేన్, చాందినీ చౌదరి జంటగా విద్యాధర్ కాగిత దర్శకత్వం వహించిన చిత్రం 'గామి'. వి సెల్యులాయిడ్ సమర్పణలో కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ మూవీ నేడు రిలీజవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా అడివి శేష్ పాల్గొన్నారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''గామి' సినిమా రషెస్ చూసినప్పుడు నా మనసు బరువెక్కింది. కొత్త రకం సినిమా చూడాలనుకునే ప్రేక్షకులకు 'గామి' సంతృప్తి ఇస్తుంది'' అన్నారు. ''ఇంటెన్స్ ఎమోషనల్ ఫిల్మ్ 'గామి'' అన్నారు విద్యాధర్ కాగిత.

భావోద్వేగాల దరువెయ్ - సాయిరామ్ శంకర్



● సాయిరామ్ శంకర్

''నాకు సినిమాలంటే చాలా ఇష్టం. అందుకే హరీష్, మాలాశ్రీ నటించిన 'ప్రేమ ఖైదీ' చిత్రం ఆడిషన్స్‌కి వెళ్లా. ఒక సినిమా హిట్టయితే ఎన్నో కుటుంబాల్లో సంతోషం నిండుతుంది. 'వెయ్ దరువెయ్' సినిమా పెద్ద విజయం సాధించాలి'' అని కామారెడ్డి ఎమ్మెల్యే కేవీ రమణా రెడ్డి అన్నారు. సాయిరామ్ శంకర్, యషా శివకుమార్, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నవీన్ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వెయ్ దరువెయ్'. లక్ష్మీనారాయణ పొత్తూరు సమర్పణలో దేవరాజు పొత్తూరు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి ఎమ్మెల్యే కేవీ రమణా రెడ్డి, దర్శకుడు హరీష్ శంకర్ అతిథులుగా హాజరయ్యారు. సాయిరామ్ శంకర్ మాట్లాడుతూ– ''బంపర్ ఆఫర్', అమ్మానాన్న ఓ తమిళమ్మాయి' లాంటి భావోద్వేగాలతో 'వెయ్ దరువెయ్' ఉంటుంది'' అన్నారు. ''మా చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు దేవరాజ్, నవీన్ రెడ్డి.

ఏపీ ఫైబర్‌నెట్‌లో శపథం



● రామ్‌గోపాల్ వర్మ

డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన చిత్రం 'వ్యూహం'. ఈ మూవీకి సీక్వెల్‌గా 'శపథం' రూపొందింది. అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో నటించారు. దాసరి కిరణ్ కుమార్ నిర్మించిన 'వ్యూహం' ఈ నెల 2న విడుదలైంది. 'శపథం' థియేటర్స్‌లో విడుదల కావాల్సి ఉంది. కాగా 'శపథం' వెబ్ సిరీస్‌ని ఏపీ ఫైబర్ నెట్ యాప్ ద్వారా పే ఫర్ వ్యూలో చూసే వెసులుబాటు కల్పిస్తున్నట్లు రామ్‌గోపాల్ వర్మ ప్రకటించారు. 'శపథం ఆరంభం చాప్టర్ 1'ని గురువారం రాత్రి 8 గంటలకు రిలీజ్ చేయగా, 'శపథం అంతం చాప్టర్ 2'ని నేటి రాత్రి 8 గంటలకు విడుదల చేయనున్నారు. ప్రస్తుతం ఏపీ ఫైబర్ నెట్ యాప్‌లో విడుదలవుతున్న 'శపథం' సిరీస్‌లను అంచెలంచెలుగా అన్ని ఓటీటీల్లోకి తీసుకు రానున్నట్లు వర్మ ప్రకటించారు.

కామెడీ... ఎమోషన్

''నేను మొదట్నుంచి కంటెంట్‌ను నమ్మి సినిమాలు చేస్తూ వచ్చాను. ప్రేక్షకులు కూడా ఆదరించారు. కథను నమ్మి ఎమోషనల్‌గా ఫీల్ అయి చేసిన సినిమా 'రోటి కపడా రొమాన్స్'. ఏప్రిల్ 12న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. ఈ మూవీ ప్రేక్షకాదరణ పొందుతుందనే నమ్మకం ఉంది'' అని నిర్మాత బెక్కెం వేణుగోపాల్ అన్నారు. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘా లేఖ, ఖుష్బూ చౌదరి ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మించారు. ఈ చిత్రం విలేకరుల సమావేశంలో విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ– ''డైరెక్టర్ కావాలన్న నా 15 ఏళ్ల కల ఈ సినిమాతో తీరుతోంది. చాన్స్ ఇచ్చిన బెక్కెంగారికి థ్యాంక్స్. ఈ మూవీలో కేవలం వినోదమే కాదు.. అన్ని రకాల భావోద్వేగాలున్నాయి'' అన్నారు. ''ఇది యూత్‌ఫుల్ సినిమానే కాదు.. అన్ని వర్గాల వారికి నచ్చేలా ఉంటుంది'' అన్నారు హర్ష నర్రా.



● సుప్రజ్, హర్ష, ఖుష్బూ, మేఘ, సోను, తరుణ్

కొత్త తరం ప్రేమకథ



● ఆశిష్

''ఆర్య' సినిమాతో సుకుమార్‌ను దర్శకునిగా పరిచయం చేశాం. 'ఆర్య' కథ విన్నప్పుడు ఎలాంటి అనుభూతి కలిగిందో 'లవ్ మీ' విన్నప్పుడు కూడా అలాంటి అనుభూతే కలిగింది. ఇదొక కొత్త తరం ప్రేమకథ. ఇలాంటి కథతో ఇప్పటి వరకూ సినిమా రాలేదు'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. ఆశిష్, వైష్ణవీ చైతన్య జంటగా అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించిన చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' అన్నది ఉపశీర్షిక. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. ఈ సినిమా ఏప్రిల్ 27న విడుదల కానుంది. ఈ మూవీ టీజర్‌ను గురువారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా 'దిల్'రాజు మాట్లాడుతూ– ''పీసీ శ్రీరామ్‌గారి విజువల్స్, కీరవాణిగారి సంగీతం ఈ సినిమాకు హైలెట్‌గా నిలుస్తాయి'' అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్ భీమవరపు, ఆశిష్ రెడ్డి, వైష్ణవీ చైతన్య మాట్లాడారు.

హీరోయిన్ యాక్షన్

డ్యాన్స్ మాత్రమే వచ్చా? అలా అంటారేంటీ.. ఫైట్స్ కూడా చేస్తారు. కాక పోతే ఆ ఒక్క చాన్స్ రావాలి. ఆ చాన్స్ వచ్చినప్పుడు హీరోయిన్లు యాక్షన్‌లోకి దిగుతారు. అలా కొందరు కథానాయికలు లేడీ ఓరియంటెడ్ చిత్రాలు చేస్తూ బిజీ బిజీగా ఉన్నారు. ఒకప్పటితో పోల్చితే ఇప్పుడు ఉమెన్ సెంట్రిక్ సినిమాలు పెరిగాయి. ఈ మహిళా దినోత్సవానికి కథానాయికల పరంగా ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. ఇక సినిమాలో సమస్యలపై పోరాడుతున్న హీరోయిన్ 'యాక్షన్' గురించి తెలుసుకుందాం.



● అనుష్క ● శ్రుతీహాసన్ ● కీర్తీ సురేష్ ● కాజల్



● రష్మిక ● అంజలి ● అనుపమా పరమేశ్వరన్

యువతి పోరాటం

'అరుంధతి', 'రుద్రమదేవి', 'భాగమతి'.. ఇలా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో అనుష్కా శెట్టి సూపర్ హిట్. తాజాగా ఆమె మరో లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ సైన్ చేశారు. వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాకు క్రిష్ దర్శకుడు. ఆంధ్రా – ఒడిస్సా సరిహద్దు లొకేషన్స్‌లో ఇటీవల షూటింగ్ జరిపారు. ఓ యువతి పోరాటంతో సాగే ఈ సినిమాకు 'శీలవతి' టైటిల్‌ను అనుకుంటున్నారట.

సత్యభామ

పోలీసాఫీసర్ సత్యభామగా కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం 'సత్యభామ'. ఓ అమ్మాయి హత్య కేసులో నిజమైన దోషులను పోలీస్ ఆఫీసర్ సత్యభామ ఏ విధంగా పట్టుకుంది? అనే అంశంతో ఈ సినిమా సాగుతుంది. సుమన్ చిక్కాల దర్శకత్వంలో బాబీ తిక్క, శ్రీనివాసరావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అలాగే హిందీలో కాజల్ అగర్వాల్ టైటిల్ రోల్ చేసిన 'ఉమ' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది.

డిటెక్టివ్ అను

ఓ కొత్త చిత్రం కోసం చెన్నైలో డిటెక్టివ్ ఏజెన్సీ ఆరంభించనున్నారు శ్రుతీహాసన్. ఈ సినిమాకు ఫిలిప్ జాన్ దర్శకుడు. ఇందులో డిటెక్టివ్ అను పాత్రలో కనిపిస్తారు శ్రుతీహాసన్. ఈ సినిమాకు 'ది చెన్నై స్టోరీ' అనే టైటిల్ అనుకుంటున్నారట. తన నాన్న ఆచూకీ తెలుసుకోవాల్సిందిగా ఓ ఇంగ్లిష్ కుర్రాడు చెన్నైకి వచ్చి, డిటెక్టివ్ అనుని కలిశాక ఏం జరిగింది? అనే అంశం చుట్టూ ఈ సినిమా ఉంటుంది. అలాగే శ్రుతీహాసన్ నటించిన ఇంగ్లిష్ చిత్రం 'ది ఐ'. చనిపోయిన భర్త అస్తికలను సముద్రంలో కలిపేందుకు మరో చోటుకు వెళ్లిన ఓ మహిళ ఎలాంటి నిజాలు తెలుసుకుంది? ఎవరెవర్ని హత్య చేయాలనుకుంటుంది? అనే కోణంలో ఈ సినిమా సాగుతుందట.

కాలేజ్ స్టూడెంట్

రష్మికా మందన్నా తొలిసారి రెండు లేడీ ఓరియంటెడ్ సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'చిలసౌ' (2018)తో దర్శకుడిగా హిట్టైన నటుడు రాహుల్ రవీంద్రన్ ఇటీవల 'ది గాళ్ ఫ్రెండ్' కోసం మళ్లీ మెగాఫోన్ పట్టారు. ఈ సినిమాలో రష్మికా మందన్నా లీడ్ రోల్ చేస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, ధీరజ్ మొగిలినేని నిర్మిస్తున్నారు. ఇందులో రష్మిక కాలేజ్ స్టూడెంట్ రోల్ చేస్తున్నారని తెలిసింది. ఓ కాలేజ్ స్టూడెంట్ ప్రేమ, సంఘర్షణ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందన్నట్లుగా తెలుస్తోంది. రష్మిక నటిస్తున్న మరో ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'రెయిన్ బో'. ఈ సినిమాకు శాంతరూబన్ దర్శకుడు. ఓ మనిషి తన జీవితంలో ఎదుర్కొనే వివిధ దశల పరిస్థితులను 'రెయిన్ బో'లో చెబుతున్నారట.

హక్కుల కోసం పోరాటం

'మహానటి' (2018) సినిమాతో నటిగా తనలో ఎంత ప్రతిభ ఉందో నిరూపించుకున్నారు కీర్తీ సురేష్. ప్రస్తుతం ఈ బ్యూటీ చేతిలో 'రఘు తాతా', 'రివాల్వర్ రీటా', 'కన్నె వెడి' వంటి మూడు ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్ ఉన్నాయి. 'రఘు తాతా'కు సుమన్‌కుమార్ దర్శకుడు. బలవంతంగా హిందీ భాష నేర్చుకోవాలన్నప్పుడు ఓ యువతి ఏ విధంగా పోరాటం చేసింది? అనే కోణంలో ఈ సినిమా ఉంటుందట. అలాగే కీర్తి మరో ఫిల్మ్ 'రివాల్వర్ రీటా' కూడా పోరాటం నేపథ్యంలో సాగే సినిమాయే. 'కన్నె వెడి' సినిమాకు గణేశ్ రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇక హీరోయిన్‌గా 'బేబీ జాన్' చిత్రంతో హిందీకి పరిచయం అవుతున్నారు కీర్తి.

గీతాంజలి మళ్లీ వచ్చింది

తెలుగు హీరోయిన్ అంజలి నటించిన తొలి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'గీతాంజలి'. 2014లో విడుదలైన ఈ హారర్ కామెడీ ఫిల్మ్ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ సినిమాకు సీక్వెల్‌గా 'గీతాంజలి మళ్లీ వచ్చింది' వస్తోంది. అంజలి మెయిన్ లీడ్ రోల్ చేశారు. ఏప్రిల్ 11న విడుదల కానుంది. శివ తుర్లపాటి దర్శకత్వంలో ఎంవీవీ సత్యనారాయణ, కోన వెంకట్ నిర్మించిన 'గీతాంజలి 2' అంజలి కెరీర్‌లో 50వ చిత్రం కావడం విశేషం. ఓ ఇంట్లో చోటు చేసుకునే హారర్ ఎలిమెంట్స్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది.

రోడ్ ట్రిప్

హీరోయిన్లు అనుపమా పరమేశ్వరన్, దర్శనా రాజేంద్రన్, సంగీత కలిసి రోడ్ ట్రిప్‌కు వెళ్లారు. వెకేషన్ కోసం కాదు.. సినిమా కోసమే. రోడ్ ట్రిప్ నేపథ్యంలో 'సినిమా బండి' ఫేమ్ దర్శకుడు ప్రవీణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్, దర్శన, సంగీత లీడ్ రోల్స్ చేస్తున్నారు.

సెల్ఫ్ డిఫెన్స్

వరుసగా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్ చేస్తున్నారు హన్సిక. గత ఏడాది హన్సిక మెయిన్ లీడ్ రోల్ చేసిన 'మై నేమ్ ఈజ్ శ్రుతి', '105 మినిట్స్' చిత్రాలు రిలీజ్ అయ్యాయి. ఈ ఏడాది మరో రెండు రిలీజ్‌కు సిద్ధం అవుతున్నాయి. తమిళ 'గార్డియన్' చిత్రం నేడు విడుదల అవుతోంది. కాగా హన్సిక సైన్ చేసిన 'రౌడీ బేబి' చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. జేఎమ్ రాజ శరవణన్ ఈ మూవీకి దర్శకుడు. ఇవి కాకుండా హన్సిక చేతిలో మరో రెండో ఉమెన్ సెంట్రిక్ చిత్రాలు ఉన్నాయి.

ఇలా మరికొందరు హీరోయిన్లు ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌కి సై అన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
8-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	33	74,119
నిఫ్టీ ▲	20	22,494

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్డాక్	16,253	▲ 222
డోజోన్స్	38,760	▲ 99
ఎఫ్టీఎస్ఈ 100	7,692	▲ 13
డాక్స్	17,843	▲ 126
షాంఘై	3,027	▼ 13
నికాయ్	39,599	▼ 492

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	64,955	▲ 462
బంగారం (99.5 స్వచ్ఛత)	64,695	▲ 460
వెండి (కిలో)	72,265	▲ 555

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	82.42	83.44
£	బ్రిటన్ పౌండ్	[illegible]	104.30	106.85
€	యూరో	[illegible]	89.21	91.56
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	55.14	56.39
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	55.49	53.57
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.87	64.10
SAR	సౌదీ రియాల్	[illegible]	21.17	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.65	23.43
¥	చైనా యువాన్	[illegible]	10.37	12.37

బంగారం మెరుపులు



న్యూఢిల్లీ: బంగారం నేషనల్ క్యాపిటల్లో కొత్త రికార్డులను చూసింది. 10 గ్రాములు పూర్తి స్వచ్ఛత పసిడి ధర న్యూఢిల్లీలో రూ.500 పెరిగి కొత్త గరిష్ట స్థాయి రూ. 65,650కి ఎగసింది. అంతర్జాతీయ మార్కెట్లో పసిడి పరుగు దీనికి కారణం. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ధర ఔన్స్ (31.1 గ్రాములు) భారీ స్థాయిల్లో ట్రేడవుతోంది. ఆసియా ట్రేడింగ్ సమయంలో ఒక దశలో బంగారం ధర 2,161.50 డాలర్లను తాకింది. ఫెడరల్ రిజర్వ్ చైర్ జెరోమ్ పావెల్ అమెరికా సెంట్రల్ బ్యాంక్ను ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ సంవత్సరం వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందని పునరుద్ఘాటించిన నేపథ్యం తాజా పసిడి పరుగుకు కారణంగా మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

2023-24లో 8% వృద్ధి: శక్తికాంతదాస్



న్యూఢిల్లీ: భారత్ మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 8 శాతం వరకూ ఆర్థిక వృద్ధిని నమోదుచేసుకునే అవకాశం ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంతదాస్ పేర్కొన్నారు. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన మూడవ త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్) చక్కటి వృద్ధి అవకాశాలకు భరోసా ఇస్తున్నట్లు ఒక ఇంటర్వ్యూలో ఇస్తున్నట్లు పేర్కొన్నారు. భారత్ ఎకానమీ మూలాలు పటిష్టంగా ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ధరల కట్టడి ఆర్బీఐ ప్రధాన ప్రాధాన్యతగా పేర్కొన్నారు. భారత్ జీడీపీ అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో అంచనా (దాదాపు 7 శాతం)లను మించి 8.4 శాతంగా నమోదయ్యింది. అంతకుముందు రెండు త్రైమాసికాలకు సంబంధించి (ఏప్రిల్-సెప్టెంబర్) తొలి వృద్ధి అంకెలు వరుసగా 7.8 శాతం (క్యూ1), 7.6 శాతాలుగా (క్యూ2)నమోదయ్యాయి. అయితే ఈ అంకెలను ఎగువముఖంగా 8.2 శాతం, 8.1 శాతాలుగా జాతీయ గణాంకాల కార్యాలయం సవరించింది. దీనితో 2023 ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య ఎకానమీ 8.2 శాతం పురోగమించినట్లు కేంద్ర గణాంకాల కార్యాలయం పేర్కొంది. గత ఏడాది ఇదే కాలంలో ఈ వృద్ధి 7.3 శాతం.

8 శాతానికి వృద్ధి అంచనా పెంపు: మూడీస్



న్యూఢిల్లీ: భారత్ 2023-24 ఆర్థిక సంవత్సరం తొలి (2023 నవంబర్ నాటి) వృద్ధి అంచనాలను 6.6% నుంచి 8 శాతానికి పెంచుతున్నట్లు రేటింగ్ దిగ్గజం మూడీస్ తన తాజా నివేదికలో పేర్కొంది. పటిష్ట దేశీయ వినియోగం, మూలధన వ్యయాలు తమ అంచనాల పెంపునకు కారణంగా పేర్కొంది. జీ20 దేశాల్లో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నట్లు వివరించింది.

వచ్చే ఏడాది 6.8 శాతమే: క్రిసిల్

కాగా, ఏప్రిల్తో ప్రారంభమయ్యే రానున్న ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధి 6.8 శాతంగా ఉంటుందని క్రిసిల్ రేటింగ్స్ అంచనావేసింది. అధిక వడ్డీరేట్లు, ద్రవ్యలోటు కట్టడికి చర్యలు వంటి అంశాలు వృద్ధి స్పీడ్కు బ్రేకులు వేస్తాయని విశ్లేషించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటును క్రిసిల్ 7.6 శాతంగా అంచనావేస్తోంది.

ఒడిదుడుకులున్నా... కొత్త గరిష్టాలకు

స్వల్పలాభాలతో ముగింపు



ముంబై: రికార్డు గరిష్టాలకు చేరిన తర్వాత అధిక వెయిటేజీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో గురువారం స్టాక్ సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. ట్రేడింగ్లో 324 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 33 పాయింట్ల లాభంతో 74,119 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 159 పాయింట్లు పెరిగి 74,245 వద్ద సరికొత్త రికార్డు నమోదు చేసింది. నిఫ్టీ 96 పాయింట్ల రేంజ్లో 22,525 వద్ద ఆల్టైం గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 20 పాయింట్లు పెరిగి 22,494 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ట్రేడింగ్ ప్రారంభంలో రికార్డు స్థాయిల అందుకున్నాయి. అయితే ఎంఅండ్ఎం(- 3.50%), రిలయన్స్(- 1.50%)తో పాటు ప్రైవేట్ రంగ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. దీంతో సూచీలు రోజంతా లాభ, నష్టాల మధ్య పరిమిత శ్రేణిలో తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి. మెటల్, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీ, ఎఫ్ఎంసీజీ, టెలికం, పారిశ్రామిక రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆటో, బ్యాంకులు, ఆయిల్అండ్ గ్యాస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

- ముక్క ప్రోటీన్స్ లిస్టింగ్ మెప్పించింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.28)తో పోలిస్తే 57% ప్రీమియంతో రూ.57 వద్ద లిస్టయ్యింది. మార్కెట్ భారీ ఊగిసలాట కారణంగా స్తబ్దుగా ట్రేడైంది. చివరికి 51% లాభంతో రూ.42.26 వద్ద ముగిసింది. కంపెనీ క్యాపిటలైజేషన్ రూ.1,268 కోట్లుగా నమోదైంది.
- రెండు రోజుల వరుస పతనం నుంచి ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కోలుకుంది. కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో ఇంట్రాడేలో 10% ఎగసి రూ.421 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది. చివరికి 9.82% లాభంతో రూ.420 వద్ద ముగిసింది.

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఎక్స్ఛేంజీలు పనిచేయవు. సాయంత్రం సెషన్లో మాత్రం కమోడిటీ మార్కెట్లలో ట్రేడింగ్ జరుగుతుంది.

టాటా వాణిజ్య వాహనాలు ప్రియం




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాణిజ్య వాహనాల ధరలను 2 శాతం వరకు పెంచుతున్నట్టు టాటా మోటార్స్ గురువారం ప్రకటించింది. సవరించిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయని కంపెనీ వెల్లడించింది. ముడిసరుకు ఖర్చుల ప్రభావాన్ని భర్తీ చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. అన్ని రకాల వాణిజ్య వాహనాల ధరలను అధికం చేస్తున్నామని, మోడల్, వేరియంట్నుబట్టి ఇది మారుతుందని వివరించింది. ట్రక్స్, బస్లు, తేలికపాటి వాణిజ్య వాహనాలను టాటా మోటార్స్ తయారు చేస్తోంది.

భారత్, ఇండొనేసియా మధ్య స్థానిక కరెన్సీలోనే వాణిజ్యం

ఆర్బీఐ, బ్యాంక్ ఇండోనేసియా ఒప్పందం



ముంబై: ద్వైపాక్షిక వాణిజ్య లావాదేవీలను స్థానిక కరెన్సీలోనే నిర్వహించుకోవడంపై భారత్, ఇండొనేసియా దృష్టి పెట్టాయి. ఇందుకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఇండోనేసియా ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్, బ్యాంక్ ఇండోనేసియా గవర్నర్ పెర్రీ వార్జియో దీనిపై సంతకాలు చేశారు. సీమాంతర లావాదేవీలను భారతీయ రూపాయి (ఐఎన్ఆర్), ఇండొనేషియా రూపియా (ఐడీఆర్) మారకంలో నిర్వహించడాన్ని ప్రోత్సహించే దిశగా ఫ్రేమ్ వర్క్ను రూపొందించడానికి ఇది ఉపయోగపడనుంది.



టాప్గేర్లో వాహనాల స్పీడు

- ఫిబ్రవరిలో 13 శాతం వృద్ధి
- 20,29,541 యూనిట్ల విక్రయం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా అన్ని విభాగాల్లో కలిపి ఈ ఏడాది ఫిబ్రవరిలో 20,29,541 యూనిట్ల వాహనాలు రోడ్డెక్కాయి. 2023 ఫిబ్రవరిలో ఈ సంఖ్య 17,94,866 యూనిట్లు నమోదైంది. రిటైల్ విక్రయాలు గత నెలలో 13 శాతం పెరిగాయని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఎఫ్ఏడీఏ) గురువారం తెలిపింది. 'భారత్లో ఫిబ్రవరిలో ప్యాసింజర్ వాహన అమ్మకాలు రిటైల్లో 12 శాతం దూసుకెళ్లి 3,30,107 యూనిట్లు నమోదైంది. ద్విచక్ర వాహనాలు 13 శాతం ఎగసి 14,39,523 యూనిట్లు, వాణిజ్య వాహనాలు 5 శాతం అధికమై 88,367 యూనిట్లు, త్రీవీలర్లు ఏకంగా 24 శాతం పెరిగి 94,918 యూనిట్లను తాకాయి. ట్రాక్టర్ల విక్రయాలు 11 శాతం ఎగసి 76,626 యూనిట్లుగా ఉంది. ప్యాసింజర్ వాహనాలు 2024 ఫిబ్రవరి నెలలో గరిష్ట విక్రయాలను నమోదు చేశాయి' అని ఎఫ్ఏడీఏ వివరించింది. 'కొత్త ఉత్పత్తుల వ్యూహాత్మక పరిచయం, మెరుగైన వాహన లభ్యత ప్యాసింజర్ వాహనాల అమ్మకాల జోరుకు కారణమైంది. టూవీలర్ల విషయంలో గ్రామీణ మార్కెట్లు, ప్రీమియం మోడళ్లకు డిమాండ్, విస్తృత ఉత్పత్తి లభ్యత, వెల్లువెత్తిన ఆఫర్లు వృద్ధిని నడిపించాయి.

ఎయిర్టెల్లో సింగ్టెల్ వాటా విక్రయం

విలువ రూ. 5,849 కోట్లు

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్టెల్లో తాజాగా సింగపూర్ సంస్థ సింగ్టెల్ 0.86 శాతం వాటాను విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 1,193.70 సగటు ధరలో 4.9 కోట్ల షేర్లను అమ్మివేసింది. వీటి విలువ రూ. 5,849 కోట్లుకాగా.. షేర్లను జీక్యూజీ పార్ట్నర్స్, అబుదాబి ఇన్వెస్ట్మెంట్, జీఎస్ఎఫ్2 గోల్డ్మన్ శాక్స్ తదితర సంస్థలు కొనుగోలు చేశాయి. ఎన్ఎస్ఈలో బ్లాక్ డీల్స్ ద్వారా అనుబంధ సంస్థ పాస్టెల్ లిమిటెడ్ ఈ వాటాను విక్రయించింది. పాస్టెల్, విరిడియన్ ద్వారా ఎయిర్టెల్లో సహ ప్రమోటర్గా సింగ్టెల్ వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఎయిర్టెల్లో 2023 డిసెంబర్కల్లా సింగ్టెల్ 10.43 శాతం వాటాను కలిగి ఉంది. భారతీ టెలికంకు 39.57 శాతం వాటా ఉంది.

ఎయిర్టెల్ షేరు గురువారం ఎన్ఎస్ఈలో 1 శాతం బలపడి రూ. 1,205 వద్ద ముగిసింది.

7సీస్కు ఫిక్కీ-బీఏఎఫ్ అవార్డు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గేమింగ్ కంపెనీ 7సీస్ ఎంటర్టైన్మెంట్ తాజాగా ఫిక్కీ నుంచి బెస్ట్ యానిమేటెడ్ ఫ్రేమ్స్ (బీఏఎఫ్) అవార్డు అందుకుంది. ఉత్తమ భారతీయ గేమ్స్ విభాగంలో కంపెనీ అభివృద్ధి చేసిన రోలర్ కోస్టర్ సిమ్యులేటర్ గేమ్ ఈ గౌరవాన్ని దక్కించుకుంది. ముంబైలో జరిగిన కార్యక్రమంలో 7సీస్ ఎండీ ఎల్.మారుతీ శంకర్ అవార్డును స్వీకరించారు. రోలర్ కోస్టర్ సిమ్యులేటర్ గేమ్ ఇప్పటికే ఆన్డ్రాయిడ్ ప్లాట్ఫామ్పై దాదాపు 20 లక్షల డౌన్లోడ్స్ నమోదు చేసింది.

లీడ్ మేనేజరుగా ఉండొద్దు..



జేఎం ఫైనాన్షియల్పై సెబీ ఆంక్షలు

న్యూఢిల్లీ: అనుచిత వ్యాపార విధానాలు పాటించినందుకు గాను ఆర్బీఐ చర్యల నేపథ్యంలో జేఎం ఫైనాన్షియల్పై సెబీ కీలక చర్య తీసుకుంది. ఇకపై కొత్తగా వచ్చే డెట్ సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూలకు లీడ్ మేనేజరుగా వ్యవహరించకుండా ఆంక్షలు విధించింది. కాగా, ఇప్పటికే చేపట్టిన ఇష్యూలకు 60 రోజుల వరకు యథావిధిగా కొనసాగవచ్చని మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది.

పాప్యులర్ వెహికల్స్ @ రూ. 280-295

ముంబై: ఆటోమోటివ్ డీలర్షిప్లు, సర్వీసుల సంస్థ పాప్యులర్ వెహికల్స్ అండ్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 12న ప్రారంభం కానుంది. ఇందుకు షేరుకి రూ. 280-295 ధరల శ్రేణిని కంపెనీ తాజాగా ప్రకటించింది. తద్వారా కంపెనీ మొత్తం రూ. 602 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది.

కోడిగుడ్లు (హోల్సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-3-2024	
విశాఖ	475-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	463-00
విజయవాడ	463-00
రిటైల్ ధర (డజను)	72.00
7-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	469-00
వరంగల్	471-00
రిటైల్ ధర	5.30

సాక్షి స్పోర్ట్స్

రన్నరప్ రాజా రిత్విక్



జాతీయ చెస్ చాంపియన్షిప్లో తెలంగాణ గ్రాండ్మాస్టర్ రాజా రిత్విక్ రెండో పతకాన్ని సాధించాడు. ర్యాపిడ్ ఫార్మాట్లో కాంస్య పతకం నెగ్గిన రిత్విక్ గురువారం నాసిక్లో జరిగిన బ్లిట్జ్ ఫార్మాట్లో రన్నరప్గా నిలిచి రజత పతకం సాధించాడు. నిర్ణీత 11 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో రిత్విక్ 9 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచాడు. రిత్విక్ మొత్తం 11 గేముల్లో ఏడింటిలో గెలిచి, నాలుగింటిని 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచాడు. 9.5 పాయింట్లతో దీప్తాయన్ ఘోష్ (రైల్వేస్) చాంపియన్గా నిలిచాడు.

సంజీత్ కూడా తొలి రౌండ్లోనే పరాజయం

పారిస్ ఒలింపిక్స్ బాక్సింగ్ వరల్డ్ క్వాలిఫయింగ్ తొలి టోర్నమెంట్లో భారత బాక్సర్ల పరాజయాల పరంపర కొనసాగుతోంది. ఇటలీలో జరుగుతున్న ఈ టోర్నీలో సంజీత్ (92 కేజీలు) రూపంలో భారత్ నుంచి ఏడో బాక్సర్ తొలి రౌండ్లోనే నిష్క్రమించాడు. తొలి రౌండ్లో సంజీత్ 0-5తో ఆసియా చాంపియన్ ఐబెక్ ఒరల్బె (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు.



కుల్దీప్ యాదవ్ 5/72

కుల్దీప్ ఫటాఫట్... ఓపెనింగ్ ధనాధన్!

ఐదో టెస్టులో ఇంగ్లండ్ 218 ఆలౌట్ • కుల్దీప్ యాదవ్కు 5 వికెట్లు

4 వికెట్లు తీసిన అశ్విన్ • తొలి ఇన్నింగ్స్లో భారత్ 135/1

ధర్మశాలలో తొలి రోజే వాతావరణం భారత్కు అనుకూలంగా మారిపోయింది. గిర్రున తిరుగుతున్న బంతులను ఎదుర్కోలేక తలవంచిన ఇంగ్లండ్ అరవై ఓవర్ల లోపే పది వికెట్లనూ స్పిన్నర్లకే అప్పగించింది. టాస్ గెలిచిన సానుకూలత, శుభారంభం తర్వాత ఒక దశలో 175/3తో మెరుగైన స్థితిలో నిలిచిన పర్యాటక జట్టు పేలవ ప్రదర్శనతో 43 పరుగులకే మిగిలిన 7 వికెట్లు చేజార్చుకుంది. ఎడంచేతి మణికట్టుతో కుల్దీప్ ఐదు వికెట్లు తన ఖాతాలో వేసుకోగా, తన వందో టెస్టు మ్యాచ్లో నాలుగు వికెట్లతో అశ్విన్ అండగా నిలిచాడు. మరోమారు యశస్వి జైస్వాల్ దూకుడైన బ్యాటింగ్, రోహిత్ సహకారం వెరసి సిరీస్లో భారత్కు తొలిసారి ఓపెనింగ్లో సెంచరీ భాగస్వామ్యం... ఆట ముగిసేసరికి కేవలం 83 పరుగుల లోటుతో ముగించిన టీమిండియా భారీ స్కోరుపై కన్నేసింది. ఇదే జోరు కొనసాగితే శుక్రవారమే చివరి టెస్టు పూర్తిగా భారత్ చేతుల్లోకి రావడం ఖాయం.

ధర్మశాల: ఇంగ్లండ్తో గురువారం ప్రారంభమైన ఐదో టెస్టులో భారత్కు అన్ని విధాలా సరైన ఆరంభం లభించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్లో 57.4 ఓవర్లలో 218 పరుగులకే కుప్పకూలింది. క్రాలీ (108 బంతుల్లో 79; 11 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా... మిగతా వారంతా విఫలమయ్యారు. కుల్దీప్ యాదవ్ (5/72) ఐదు వికెట్ల ప్రదర్శనతో చెలరేగగా, అశ్విన్కు 4 వికెట్లు దక్కాయి. అనంతరం ఆట ముగిసే సమయానికి భారత్ 30 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 135 పరుగులు చేసి మరో 83 పరుగులు మాత్రమే వెనుకబడి ఉంది. యశస్వి జైస్వాల్ (58 బంతుల్లో 57; 5 ఫోర్లు, 3 సిక్స్లు), రోహిత్ శర్మ (52 బ్యాటింగ్; 6 ఫోర్లు, 2 సిక్స్లు) అర్ధసెంచరీలు సాధించగా... రోహిత్తో పాటు శుబ్మన్ గిల్ (26 బ్యాటింగ్; 2 ఫోర్లు, 2 సిక్స్లు) క్రీజ్లో ఉన్నాడు. ఆడిన మూడు టెస్టుల్లో విఫలమైన రజత్ పటిదార్ స్థానంలో భారత్ దేవ్దత్ పడిక్కల్ను తొలిసారి తుది జట్టులోకి ఎంపిక చేసింది. మరోవైపు 100వ టెస్టు ఆడుతున్న రవిచంద్రన్ అశ్విన్కు కోచ్ రాహుల్ ద్రవిడ్ చేతుల మీదుగా బీసీసీఐ ప్రత్యేక జ్ఞాపిక అందించింది.



యశస్వి

టపటపా...

ఓపెనర్లు క్రాలీ, డకెట్ (27) ఇంగ్లండ్కు మరోసారి శుభారంభం అందించారు. అయితే కుల్దీప్ రాకతో పరిస్థితి మారిపోయింది. గిల్ అద్భుత క్యాచ్తో తన తొలి ఓవర్లోనే డకెట్ను వెనక్కి పంపిన కుల్దీప్... కొద్ది సేపటికే పోప్ (11)ను కూడా అవుట్ చేశాడు. లంచ్ సమయానికి ఇంగ్లండ్ స్కోరు 100/2 కాగా, క్రాలీ కొన్ని చక్కటి షాట్లతో క్రీజ్లో పట్టుదలగా నిలబడ్డాడు. అయితే రెండో సెషన్లో భారత స్పిన్నర్లు మరింతగా చెలరేగిపోగా... ఇంగ్లండ్ బ్యాటర్లు పూర్తిగా చేతులెత్తేశారు. కుల్దీప్ బౌలింగ్లో అనూహ్యంగా టర్న్ అయిన బంతి క్రాలీ వికెట్లను ఎగరగొట్టగా, 100వ టెస్టు ఆడుతున్న బెయిర్స్టో (29) వికెట్ కూడా కుల్దీప్ ఖాతాలోనే చేరింది. ఆ తర్వాత ఇంగ్లండ్ పతనం వేగంగా సాగింది.

శుభారంభం...

భారత ఓపెనర్లు యశస్వి, రోహిత్ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. 20 పరుగుల వద్ద రోహిత్ను అంపైర్ ఎల్బీగా ప్రకటించినా... రివ్యూలో అతను నాటౌట్గా తేలడం కలిసొచ్చింది. తొలి 27 బంతుల్లో 6 పరుగులే చేసి ఓపిక ప్రదర్శించిన యశస్వి స్పిన్నర్ల రాకతో చెలరేగిపోయాడు. బషీర్ వేసిన తొలి ఓవర్లో అతను 3 సిక్సర్లు బాదాడు. అయితే బషీర్ ఓవర్లోనే వరుసగా రెండు ఫోర్లతో అర్ధ సెంచరీని దాటిన యశస్వి అదే ఊపులో మూడో బంతికి ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌటయ్యాడు. అనంతరం 77 బంతుల్లో రోహిత్ హాఫ్ సెంచరీ పూర్తి కాగా, మరోవైపు గిల్ కూడా దూకుడుగా ఆడాడు.

పడిక్కల్ @ 314



ఈ మ్యాచ్తో కర్ణాటకకు చెందిన దేవ్దత్ పడిక్కల్ టెస్టు క్రికెట్లో అరంగేట్రం చేశాడు. భారత్ తరఫున ఇప్పటికే 2 టి20లు ఆడిన పడిక్కల్... టెస్టులు ఆడిన 314వ భారత ఆటగాడిగా నిలిచాడు.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలీ (బి) కుల్దీప్ 79; డకెట్ (సి) గిల్ (బి) కుల్దీప్ 27; పోప్ (స్టంప్డ్) జురేల్ (బి) కుల్దీప్ 11; రూట్ (ఎల్బీ) (బి) జడేజా 26; బెయిర్స్టో (సి) జురేల్ (బి) కుల్దీప్ 29; స్టోక్స్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 0; ఫోక్స్ (బి) అశ్విన్ 24; హార్ట్లీ (సి) పడిక్కల్ (బి) అశ్విన్ 6; వుడ్ (సి) రోహిత్ (బి) అశ్విన్ 0; బషీర్ (నాటౌట్) 11; అండర్సన్ (సి) పడిక్కల్ (బి) అశ్విన్ 0; ఎక్స్ట్రాలు 5; మొత్తం (57.4 ఓవర్లలో ఆలౌట్) 218. వికెట్ల పతనం: 1-64, 2-100, 3-137, 4-175, 5-175, 6-175, 7-183, 8-183, 9-218, 10-218. బౌలింగ్: బుమ్రా 13-2-51-0, సిరాజ్ 8-1-24-0, అశ్విన్ 11.4-1-51-4, కుల్దీప్ 15-1-72-5, జడేజా 10-2-17-1.

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (స్టంప్డ్) ఫోక్స్ (బి) బషీర్ 57; రోహిత్ (బ్యాటింగ్) 52; గిల్ (బ్యాటింగ్) 26; ఎక్స్ట్రాలు 0; మొత్తం (30 ఓవర్లలో వికెట్ నష్టానికి) 135. వికెట్ల పతనం: 1-104. బౌలింగ్: అండర్సన్ 4-1-4-0, మార్క్ వుడ్ 3-0-21-0, హార్ట్లీ 12-0-46-0, షోయబ్ బషీర్ 11-2-64-1.



ఫ్యామిలీతో అశ్విన్

14

భారత్ తరఫున 100 టెస్టులు పూర్తి చేసుకున్న 14వ ప్లేయర్గా అశ్విన్ ఘనత సాధించాడు. ఈ జాబితాలో సచిన్ (200), ద్రవిడ్ (163), లక్ష్మణ్ (134), కుంబ్లే (132), కపిల్దేవ్ (131), గావస్కర్ (125), వెంగ్సర్కార్ (116), గంగూలీ (113), కోహ్లి (113), ఇషాంత్ శర్మ (105), సెహ్వాగ్ (103), హర్భజన్ (103), పుజారా (103) ఉన్నారు.

17

ఇంగ్లండ్ తరఫున 100 టెస్టులు ఆడిన 17వ ప్లేయర్గా బెయిర్స్టో గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో అండర్సన్ (187), స్టువర్ట్ బ్రాడ్ (168), కుక్ (161), జో రూట్ (140), స్టివార్ట్ (133), బెల్ (118), గూచ్ (118), గోవర్ (117), అథర్టన్ (115), కొలిన్ కౌడ్రే (114), బాయ్కాట్ (108), పీటర్సన్ (104), బోథమ్ (102), స్టోక్స్ (102), స్ట్రాస్ (100), థోర్ప్ (100) ఉన్నారు.



ఫ్యామిలీతో బెయిర్స్టో

ముంబై ఘనవిజయం

42 పరుగులతో యూపీ వారియర్స్పై గెలుపు • రాణించిన బ్రంట్, అమెలియా, సైకా



నటాలీ సీవర్ బ్రంట్

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్లో ముంబై ఇండియన్స్ నాలుగో విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన ఈ పోరులో ముంబై 42 పరుగుల తేడాతో యూపీ వారియర్స్పై ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్కు దిగిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. ఓపెనర్లు యస్తిక భాటియా (9), హేలీ మాథ్యూస్ (4) నిరాశ పరిచినప్పటికీ తర్వాత వచ్చిన టాపార్డర్ బ్యాటర్ నటాలీ సీవర్ బ్రంట్ (31 బంతుల్లో 45; 8 ఫోర్లు) ధాటిగా ఆడింది. కెప్టెన్ హర్మన్ప్రీత్ కౌర్ (30 బంతుల్లో 33; 3 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి మూడో వికెట్కు 59 పరుగులు జోడించి ఇన్నింగ్స్ను చక్కబెట్టింది. అనంతరం అమెలియా కెర్ (23 బంతుల్లో 39; 6 ఫోర్లు), సజీవన్ సజన (14 బంతుల్లో 22 నాటౌట్; 4 ఫోర్లు) స్కోరు వేగాన్ని పెంచారు. చమరి ఆటపట్టు 2 వికెట్లు తీసింది. తర్వాత 161 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూపీ వారియర్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 118 పరుగులకే పరిమితమైంది. ముంబై బౌలింగ్కు యూపీ ఏ దశలోనూ ఎదురునిలువలేకపోయింది. ఆరంభంలోనే టాపార్డర్ వికెట్లను 15 పరుగుల స్కోరు వద్దే కోల్పోయింది. కెప్టెన్ అలీసా హీలీ (3), కిరణ్ నవ్గిరే (7), చమరి ఆటపట్టు (3) నిరాశపరిచారు. క్రీజులోకి వచ్చిన 11 మందిలో గ్రేస్ హారిస్ (15), శ్వేత సెహ్రావత్ (17) మినహా ఏకంగా 8 మంది సింగిల్ డిజిట్ స్కోర్లకే వెనుదిరిగారు. దీంతో దీప్తి శర్మ (36 బంతుల్లో 53 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్లు) చేసిన ఒంటరి పోరాటం సరిపోలేదు. ముంబై బౌలర్లలో సైకా ఇషాక్ (3/27) యూపీని దెబ్బ తీయగా, నాట్ సీవర్ 2 వికెట్లు పడగొట్టింది. నేడు జరిగే మ్యాచ్లో యూపీ వారియర్స్తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడుతుంది.

క్వార్టర్స్లో సింధు

డబుల్స్లో గాయత్రి జోడీ సంచలనం



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్లోకి వెళ్లింది. ప్రపంచ 10వ ర్యాంకర్ బీవెన్ జాంగ్ (అమెరికా)తో జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధు 13-21, 21-10, 21-14తో గెలిచింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో పుల్లెల గాయత్రి-ట్రిసా జాలీ (భారత్) ద్వయం 21-18, 21-13తో ప్రపంచ 7వ ర్యాంక్ జంట యూకీ ఫకుషిమా-సయాక హిరోటా (జపాన్)ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్ చేరింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత స్టార్ కిడాంబి శ్రీకాంత్ 78 నిమిషాల్లో 21-19, 12-21, 20-22తో గ్వాంగ్ జు (చైనా) చేతిలో ఓడిపోయాడు.

అర్జున్కు మూడో స్థానం



సాక్షి, హైదరాబాద్: షెన్జెన్ లాంగాంగ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. చైనా వేదికగా ఎనిమిది మంది మేటి గ్రాండ్మాస్టర్ల మధ్య నిర్ణీత ఏడు రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో జియాంగ్జి బు (చైనా), యాంగీ యు (చైనా), అర్జున్ 4.5 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంక్ను వర్గీకరించగా... జియాంగ్జి టైటిల్ గెల్చుకోగా... యాంగీ యు రన్నరప్గా నిలిచాడు. అర్జున్కు మూడో స్థానం ఖరారైంది. ఏడు గేమ్లు ఆడిన అర్జున్ మూడు గేముల్లో గెలిచి, మూడు గేమ్లను 'డ్రా' చేసుకొని, ఒక గేమ్లో ఓడిపోయాడు.

గజవాహనంపై శ్రీశైల మల్లన్న విహారం

రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పణ



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం భ్రమరాంబా సమేతుడైన మల్లన్న గజవాహనంపై విహరించారు. ఉత్సవమూర్తులను గజవాహనంపై ఆశీనులను చేసి ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, పండితులు వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక అర్చన, హారతి ఇచ్చారు. గజవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను ఆలయ ప్రదక్షిణ చేయించి క్షేత్ర ప్రధాన వీధుల్లోకి తోడ్కొని వచ్చి గ్రామోత్సవానికి తరలించారు. కళాకారుల ప్రదర్శనల మధ్య గ్రామోత్సవం వైభవంగా సాగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి తదితరులు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. కాగా, శుక్రవారం రాత్రి నందివాహనసేవ, పాగాలంకరణ సేవ, లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు స్వామిఅమ్మవార్లకు కల్యాణోత్సవం జరగనుంది.

అగ్రిగోల్డ్ బూచి... ప్రత్తిపాటి భూముల లాలూచీ

- సెటిల్‌మెంట్ కింద 6.19 ఎకరాలు హస్తగతం
- ఆ భూముల అటాచ్‌మెంట్‌కు ప్రభుత్వ నిర్ణయం
- సీఐడీకి అనుమతినిచ్చిన హోమ్ శాఖ



సాక్షి, అమరావతి: సామాన్య డిపాజిటర్లను నిండా ముంచేసిన అగ్రిగోల్డ్ కుంభకోణం మాటున టీడీపీ పెద్దలు కొల్లగొట్టిన భూములపై ప్రభుత్వం కొరఢా ఝుళిపించింది. అందులో మొదటి అడుగుగా టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా చేసిన ప్రత్తిపాటి పుల్లారావు కుటుంబం అగ్రిగోల్డ్ నుంచి కొల్లగొట్టిన భూములను అటాచ్ చేయాలని నిర్ణయించింది. పుల్లారావు కుటుంబానికి చెందిన 6.19 ఎకరాలను అటాచ్ చేసేందుకు సీఐడీకి అనుమతిస్తూ హోమ్ శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అగ్రిగోల్డ్ కుంభకోణాన్ని ఆసరాగా చేసుకొని టీడీపీ నేతలు ఆ సంస్థకు చెందిన భూములను కొల్లగొట్టారు. ప్రత్తిపాటి పుల్లారావు కుటుంబం కూడా ఆ భూ దోపిడీలో అడ్డగోలుగా లబ్ధి పొందింది. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం (అప్పటి ప్రకాశం జిల్లా) గురిజేపల్లిలోని సర్వే నంబర్లు 104/1, 104/3, 104/4, 104/5, 104/6, 103/2లో ఉన్న 6.19 ఎకరాలను హస్తగతం చేసుకుంది. అప్పటికే అగ్రిగోల్డ్ కంపెనీపై కేసు నమోదైంది. ఆ కేసు పేరుతో భయపెట్టి సెటిల్‌మెంట్ కింద ఆ భూమి తమ పరం చేసేలా డీల్ కుదుర్చుకున్నారు. అగ్రిగోల్డ్ డైరెక్టర్‌గా వ్యవహరించిన కనుకొల్లు ఉదయ్ దినకర్ పేరిట ఉన్న ఆ 6.19 ఎకరాలను పుల్లారావు భార్య తేనే వెంకాయమ్మ పేరిట బదిలీ చేశారు. ఈమేరకు గుంటూరు జిల్లా చిలకలూరిపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2015లో రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం గుట్టు చప్పుడు కాకుండా ఆ భూములను కామేపల్లి లక్ష్మీ ప్రసాద్, చెరుకూరి కోటేశ్వరరావు, కామేపల్లి గ్రానైట్స్ పేరిట బదిలీ చేసేశారు. ఈ విధంగా అగ్రిగోల్డ్ భూములను హస్తగతం చేసుకున్నారు.

అటాచ్‌మెంట్‌కు అనుమతి

ఈ కేసు దర్యాప్తును సీఐడీ అధికారులు వేగవంతం చేశారు. డిపాజిటర్ల నిధులతో అగ్రిగోల్డ్ కంపెనీ కొనుగోలు చేసిన భూములను ప్రత్తిపాటి పుల్లారావు కుటుంబం దక్కించుకుందని గుర్తించారు. దాంతో ఆ భూములను అటాచ్ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సీఐడీ పంపిన ప్రతిపాదనలను హోమ్ శాఖ ఆమోదించి అటాచ్‌మెంట్‌కు అనుమతి జారీ చేసింది.

ప్రొఫెసర్ సాయిబాబా బాల్యమంతా కోనసీమలోనే..

- సొంతూరు జనుపల్లె, అమ్మమ్మ ఊరు సన్నవిల్లిలో పాఠశాల విద్య
- ఇంటర్, డిగ్రీ అమలాపురంలో పూర్తి



అమలాపురం టౌన్: మావోయిస్టులతో సంబంధాల కేసులో బాంబే హైకోర్టు తీర్పుతో జైలు నుంచి విడుదల అయిన ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ గోకరకొండ సాయిబాబా ప్రస్థానం కోనసీమ నుంచి మొదలైంది. ఆయన సొంతూరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం పట్టణం సమీపంలోని జనుపల్లె గ్రామం. సాయిబాబా తల్లిదండ్రులు సత్యనారాయణ, సూర్యావతికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సాయిబాబా, రెండో కుమారుడు రామ్‌దేవ్. సాయిబాబాకు ఏడో ఏటే పోలియో సోకి రెండు కాళ్లూ చచ్చుపడిపోయాయి. సాయిబాబా తండ్రి సత్యనారాయణ ఓ సాధారణ రైతు. కొంతకాలం జనుపల్లెలో ఉన్న ఆ కుటుంబం తర్వాత సాయిబాబా అమ్మమ్మ ఊరు అయిన ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లికి వెళ్లింది. అక్కడి నుంచి అమలాపురం వచ్చి కొన్నాళ్లు అద్దె ఇంట్లో జీవించారు. సాయిబాబా ప్రాథమిక పాఠశాల విద్య జనుపల్లె, సన్నవిల్లిలలో జరిగింది. తర్వాత అమలాపురం సెయింట్ జాన్స్ హైస్కూలులోనూ, ఇంటర్మీడియెట్, డిగ్రీ అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఆయన చదివారు. తర్వాత ఆ కుటుంబం హైదరాబాద్‌కు వలస వెళ్లిపోయింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చదివిన సాయిబాబా అక్కడే ప్రొఫెసర్ అయ్యారు. అక్కడే తల్లిదండ్రులు చనిపోయారు. తమ్ముడు రామ్‌దేవ్ హైదరాబాద్‌లోనే ఉద్యోగం చేస్తున్నారు. సాయిబాబాకు వసంత కుమారితో వివాహమైంది. ప్రస్తుతం సాయిబాబా కుటుంబానికి సంబంధించి ఆయన చిన్నాన్న నాగభూషణం కుమారుడు ఆదినారాయణ కుటుంబం, అలాగే సాయిబాబాకు వరసకు సోదరుడైన విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి గోకరకొండ గంగాచలం కుటుంబం జనుపల్లెలో నివసిస్తోంది.

చేయని తప్పుకు జైలు శిక్ష అనుభవించాడు

సాయిబాబా చిన్నతనంలో చదువులో చాలా చురుకుగా ఉండేవాడు. చదువుపరంగా ఉన్నత స్థానానికి వెళతాడని అప్పుడే అనుకునేవాళ్లం. బాంబే హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా పేర్కొంటూ తీర్పు ఇవ్వడం మాకు ఆనందం అనిపించింది. చేయని తప్పుకు పదేళ్లు జైలు శిక్ష అనుభవించాడని బాధపడుతున్నాం.

– గోకరకొండ గంగాచలం, జనుపల్లె, అమలాపురం రూరల్ మండలం

ఉమ్మడి రాజధానిని మరో పదేళ్లు కొనసాగించాలి

- సుప్రీంకోర్టులో పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను మరో పదేళ్లు కొనసాగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ గుంటూరు జిల్లాకు చెందిన మస్తాన్‌వలీ సుప్రీంకోర్టును కోరారు. ఈ మేరకు మస్తాన్‌వలీ తరఫున అభిజిత్ సేన్‌గుప్తా గురువారం రిట్ పిటిషన్ దాఖలు చేశారు. విభజన వల్ల నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకా విభజన హామీలు అమలు కాలేదని.. ప్రత్యేక హోదా ఇవ్వలేదని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన కార్యాలయాలకు చెందిన ఆస్తుల్లో 93.9 శాతం, పదో షెడ్యూల్‌లోని సంస్థల ఆస్తుల్లోనూ 88 శాతం తెలంగాణలోనే ఉన్నాయన్నారు. విభజన హామీలు అమలు కాకపోవడం వల్ల ఏపీ ప్రజలు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలన వైఫల్యం వల్ల రాజధాని ఏర్పాటు కాలేదని, దీంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

అదేమీ కోర్టు ధిక్కరణ కాదు

సాక్షి, న్యూఢిల్లీ: సీఎం వైఎస్ జగన్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖను మీడియా ముందు బహిర్గతం చేయడం కోర్టు ధిక్కరణ కాదని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. సీఎం జగన్ లేఖను మీడియాకు వెల్లడించడం సరికాదంటూ సునీల్ కుమార్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. ఈ సందర్భంగా ప్రైవేటు వ్యక్తిపై ఆదేశాలు ఎలా ఇస్తామని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆ విధంగా వివరాలు బహిర్గతం చేయడం కోర్టు ధిక్కరణ కాదని పేర్కొంది. రిట్ పిటిషన్ ఎలా వేస్తారని పిటిషనర్ న్యాయవాదిని ప్రశ్నించింది. ఇది ప్రజా ప్రయోజన వ్యాజ్యమని, ప్రజలకు హాని కలిగించే వ్యవహారమని పిటిషనర్ న్యాయవాది తెలిపారు. దీనికి స్పందించిన ధర్మాసనం.. ఆర్టికల్ 32 ప్రకారం ఏ పరిస్థితుల్లో ఆదేశాలు జారీ చేయడానికి అవకాశముందో బ్రీఫ్ నోట్ ఇచ్చి కోర్టుకు సహకరించాలని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ఆదేశించింది.

అడ్డగోలు అప్పులు దాచేసి ముష్టి లెక్కలు!

అమరావతి బాండ్లంటూ చంద్రబాబు అలవోకగా చేసిన అప్పు రూ.5,000 కోట్లు

- ఆ బాబు చేసిన అప్పు రూ.ఐదు వేల కోట్లయితే వడ్డీలకే రూ.4,900 కోట్లు కట్టాలి
- ఇప్పటిదాకా కట్టిన వడ్డీలు రూ.1,400 కోట్లు.. తప్పనిసరి గుదిబండపై 'కాగ్' ఆందోళన
- ఇప్పుడు పరిమితంగానే అప్పులు.. మానవ వనరులపై పెట్టుబడికి ప్రాధాన్యం
- విద్య, వైద్యం, పారిశ్రామిక పురోగతిపై నిధులను వెచ్చిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- నాడు-నేడు అప్పుల గణాంకాలతో అసెంబ్లీలో సీఎం జగన్ ప్రజెంటేషన్
- ఏపీ అప్పులు అట్టడుగునే ఉన్నాయని పలు దఫాలు ప్రకటించిన కేంద్రం, ఆర్బీఐ
- రామోజీ సొంత లెక్కలతో రాష్ట్ర ప్రభుత్వంపై పదేపదే దుష్ప్రచారం
- కేంద్రం, ఆర్బీఐ, కాగ్ గణాంకాలు, వివరణలు తనకు పట్టవంటూ లెక్కలేనితనం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అప్పులకు సంబంధించి స్వయంగా కేంద్రం ప్రభుత్వం లెక్కలేనన్ని సార్లు కీలక ప్రకటనలు చేసింది. పార్లమెంట్ సాక్షిగా వివరణలూ ఇచ్చింది. అప్పుల్లో తమిళనాడు మొదటి స్థానంలో ఉండగా ఏపీ అట్టడుగునే ఉందనీ చెప్పింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సులు, నిబంధనలకు లోబడే ఆంధ్రప్రదేశ్ అప్పులున్నట్లు తేల్చి చెప్పింది. రాష్ట్ర అప్పులపై ఇటీవల ముగిసిన అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి జగన్ కూడా చాలా వివరంగా చెప్పారు. టీడీపీ హయాంలో అప్పుల పెరుగుదల – వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పుల గురించి ప్రజెంటేషన్ ద్వారా స్పష్టంగా తెలియచేశారు. ఏపీ రుణాల గురించి నేరుగా కేంద్రం, ఆర్బీఐ చెబుతున్నా తలకెక్కదా? చట్టసభల్లో ప్రభుత్వాలు వెల్లడించిన గణాంకాలను కాదని తనకు తోచిన లెక్కలతో రామోజీ తప్పుడు రాతలు ఎలా రాస్తారు? రూ.పది లక్షల కోట్ల అప్పులంటూ కాకి లెక్కలతో డప్పు కొట్టే గురివిందను ఏమనుకోవాలి? అసలు ఏ ప్రభుత్వాలకైనా తీసుకునే అప్పులను రహస్యంగా ఉంచడం సాధ్యం కాదనే ఇంగితం లేదా? పరిమితికి లోబడి తీసుకునే అప్పులను గ్రాఫిక్స్ ఆర్భాటాల కోసం కాకుండా వనరులను సృష్టించేందుకే రాష్ట్ర ప్రభుత్వం వినియోగిస్తోంది.



ది. మన విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి చదువులను చక్కదిద్దేందుకు వైఎస్సార్ సీపీ ఐదేళ్లలో చేసిన ఖర్చు రూ.73 వేల కోట్లకు పైచిలుకే! మానవ వనరులపై పెట్టుబడి పెట్టడం పెత్తందారుల దృష్టిలో వృథానేనా? ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు, పెద్ద ఎత్తున సదుపాయాల కల్పన అనవసరమా? సుదూర తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామికంగా రాష్ట్రం ఎదిగేందుకు ప్రతి 50 కి.మీ.కి ఒక పోర్టు లేదా ఫిషింగ్ హార్బర్ల ఏర్పాటు చేయడం వృథానా?

రాజధాని గుదిబండ రూ.5 వేల కోట్లు!

అమరావతి పేరుతో చంద్రబాబు సర్కారు చేసిన అప్పులు భవిష్యత్‌లో తప్పనిసరి ఆర్థిక బాధ్యతలుగా పరిణమించాయని కాగ్ స్పష్టం చేసింది. అమరావతి బాండ్ల పేరుతో గత సర్కారు ఏకంగా 10 సంవత్సరాల కాలానికి అత్యధిక వడ్డీతో అప్పు చేసినట్లు పేర్కొంది. మార్కెట్ రుణాల ద్వారా రూ.5,013.60 కోట్లు సమీకరించగా వడ్డీలకే ఏకంగా రూ.4,827.14 కోట్లు చెల్లించాల్సి ఉందని కాగ్ నివేదిక వెల్లడించింది. ఇప్పటికే 1,399.02 కోట్లు వడ్డీల కింద చెల్లించగా భవిష్యత్‌లో మరో రూ.3,428.12 కోట్లు వడ్డీలు చెల్లించాల్సి ఉందని పేర్కొంది. ప్రపంచ స్థాయి రాజధాని నిజం కాలేదు గానీ తప్పనిసరి ఆర్థిక బాధ్యతలు మాత్రం మోయాల్సి వస్తోందని కాగ్ వ్యాఖ్యానించింది. 2014–15 నుంచి 2018–19 వరకు టీడీపీ సర్కారు పేలవమైన ఆర్థిక నిబద్ధత చూపిందని తప్పుబట్టింది.

2022-23లో ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల మేరకు జీఎస్‌డీపీలో లక్ష్యాలు, సాధన ఇలా

వివరం	అకౌంట్స్	లక్ష్యం	వాస్తవ సాధన
రెవెన్యూ లోటు	రూ.43,487 కోట్లు	3.3 శాతం	3.3 శాతం
ద్రవ్య లోటు	రూ.52,508 కోట్లు	4.5 శాతం	3.9 శాతం
అప్పులు, ఇతర బాధ్యతలు	రూ.4,29,526 కోట్లు	36.3 శాతం	32.60 శాతం

➤ ఇటీవల ముగిసిన అసెంబ్లీ సమావేశాల్లో 2022–23కి సంబంధించి కాగ్ అకౌంట్స్ సమర్పించింది. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు లోబడే ద్రవ్య లోటు, రెవెన్యూ లోటు, జీఎస్‌డీపీలో అప్పులు ఉన్నాయని అందులో స్పష్టం చేసింది. సొంత లెక్కలు కాకుండా కాగ్ అకౌంట్స్‌ను పరిశీలిస్తే రామోజీకి ఆ విషయాలు తెలుస్తాయి.

➤ అప్పుల కోసం సచివాలయం, ఇంకా కనిపించినవన్నీ తాకట్టు పెడుతున్నారంటూ రామోజీ పచ్చి అవాస్తవాలను కుమ్మరించారు. వాస్తవానికి రాజధాని అంటూ అమరావతి భూములను తాకట్టు పెట్టి బాండ్ల పేరుతో అత్యధిక వడ్డీలకు అప్పులు చేసింది చంద్రబాబు సర్కారే. కాగ్ నివేదికే ఆ విషయాన్ని ఎండగట్టింది. గ్రాఫిక్స్ బండారాన్ని బయట పెట్టింది. రాజధాని పేరుతో చంద్రబాబు సర్కారు అప్పుల నిర్వాకంతో ఇప్పుడు వడ్డీల చెల్లింపులు భారంగా మారాయి. అత్యధిక వడ్డీలకు అప్పులు చేయడంతో అప్పు తెచ్చిన పరిమాణానికి దాదాపు సమానంగా వడ్డీ కూడా ఉండటాన్ని కాగ్ నివేదిక తప్పుబట్టింది.

➤ నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బాగు చేసేందుకు రూ.16 వేల కోట్లు వెచ్చించి ఉత్తమ మానవ వనరుల ద్వారా ఆస్తుల కల్పన చేయటాన్ని చూసి రామోజీ తట్టుకోలేకపోతున్నారు. ప్రభుత్వ వైద్య రంగంలో ఏకంగా 17 కొత్త మెడికల్ కాలేజీలను రూ.16 వేల కోట్లతో నిర్మిస్తుంటే మంచం పట్టారు! రూ.24,000 కోట్లతో నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణమూ ఆయనకు మింగుడు పడటం లేదు! ఎందుకంటే తాను ద్వేషించే వ్యక్తి ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టే అనుకోవాలేమో!

➤ గత ఎన్నికల ముందు చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టులను తాకట్టు పెట్టి, గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ నుంచి అప్పులు తెచ్చి పసుపు-కుంకుమ పేరుతో ఓటర్లను మభ్యపుచ్చేందుకు ప్రయత్నిస్తే రామోజీ కిక్కురుమనలేదెందుకో?

➤ రాష్ట్ర అప్పులు బడ్జెట్ లోపల, బయట కలిపి ఏకంగా రూ.10.21 లక్షల కోట్లకు చేరాయంటూ పచ్చి అబద్ధాలను రామోజీ తన కరపత్రంలో గుమ్మరించారు. 2022–23 నాటికి కాగ్ అసెంబ్లీకి సమర్పించిన అకౌంట్స్ ప్రకారం బడ్జెట్ లోపల, బడ్జెట్ బయట రాష్ట్రం అప్పులు రూ.5.68 లక్షల కోట్లు మాత్రమేనని వెల్లడించింది. బడ్జెట్ లోపల అప్పులు రూ.4,29,526 కోట్లు కాగా బడ్జెట్ బయట అప్పులు రూ.1,38,875 కోట్లు ఉన్నట్లు పేర్కొంది. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల ప్రకారం బడ్జెట్ లోపల, బడ్జెట్ బయట చేసిన అప్పులను శాసనసభకు సమర్పించాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ద్రవ్య జవాబుదారీ పత్రం ద్వారా అందచేస్తూ ఎక్కడా దాపరికం లేకుండా ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకంగా వ్యవహరిస్తోంది. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల కన్నా తక్కువగానే అప్పులున్నట్లు 2022–23 కాగ్ అకౌంట్స్ స్పష్టం చేశాయి.

టీడీపీ సర్కారు రుణ భారం ఇలా

సంస్థ	అసలు (రూ.కోట్లు)	వడ్డీ (శాతం)	వ్యవధి	2020 ఆగస్టుకి అసలు చెల్లింపు (రూ.కోట్లు)	2020 ఆగస్టుకు వడ్డీ చెల్లింపు (రూ.కోట్లు)	భవిష్యత్‌లో చెల్లించాల్సిన వడ్డీ రూ.కోట్లలో
హడ్కో	1,151.60	10.45	15 ఏళ్లు	90.52	392.97	926.91
బ్యాంకులు	1,862.00	8.75	14 ఏళ్లు	0	386.89	1,598.96
బాండ్లు	2,000.00	10.32	10 ఏళ్లు	0	619.16	902.25
మొత్తం	5,013.60	--	--	90.52	1,399.02	3,428.12

'ప్రసాద్' పనులకు శంకుస్థాపన

- శ్రీనగర్ నుంచి వర్చువల్‌గా ప్రధాని మోదీ శంకుస్థాపన
- రూ.20.06 కోట్లతో అన్నవరం దేవస్థానంలో నిర్మాణాలు

సింహాచలం: విశాఖ జిల్లాలోని సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో రూ.54.04 కోట్లతో కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం ప్రధాని మోదీ జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర టూరిజం అధికారులు సింహగిరిపై ఘనంగా నిర్వహించారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, ఏపీ టూరిజం చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఇతర అధికారులు పాల్గొన్నారు.



సింహాచలంలో వర్చువల్ కార్యక్రమాన్ని తిలకిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి, టూరిజం, దేవదాయశాఖ అధికారులు



అన్నవరంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కాకినాడ ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ తదితరులు

రత్నగిరిపై...

అన్నవరం: ప్రసాద్ స్కీం కింద కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో రూ.20.06 కోట్లతో చేపట్టనున్న నిర్మాణాలకు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా భూమి పూజ చేశారు. రూ.11.50 కోట్లతో అన్నదాన భవనం, రూ.5.95 కోట్లతో క్యూ కాంప్లెక్స్, రూ.61.85 లక్షలతో టాయిలెట్స్ బ్లాక్, రూ.1.02 కోట్లతో నాలుగు ఎలక్ట్రికల్ కార్లు, రెండు రీచార్జ్ స్టేషన్లు నిర్మించనున్నట్లు ఏపీటీడీసీ ఎండీ లక్ష్మీ మల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ ఆవిష్కరించారు.

హంస వాహనంపై భవుడు



రేణిగుంట (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతోన్న మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ముక్కంటీశుడు హంస వాహనంపై, జ్ఞానప్రసూనాంబ దేవి అమ్మవారు శుక వాహనంపై విహరించారు. రాత్రి స్వామివారు శేషవాహనంపై, అమ్మవారు యాళి వాహనంపై మాడ వీధుల్లో ఊరేగారు. అలంకార మండపంలో స్వామి,అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక ఆకృతుల్లో పుష్పాలంకరణ చేశారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ ఈవో నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయం నుంచి ఉత్సవమూర్తుల ఊరేగింపు ఉత్సవం ఘనంగా జరిగింది. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాన్ని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు.

అభివృద్ధిని చూడలేని ప్రతిపక్షాలు

ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్



కర్నూలు (సెంట్రల్): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని కళ్లున్నా చూడలేని కబోదుల్లా ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయని ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోజూ ఓ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును, సంస్థలను జాతికి అంకితం చేస్తున్నా సహించలేని స్థితిలో ప్రతిపక్షాలున్నాయన్నారు. ఆధునీకరించిన కర్నూలు కలెక్టరేట్ కార్యాలయాన్ని గురువారం ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రారంభించారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన కలెక్టరేట్ పాతబడడంతో ఉద్యోగులు, సిబ్బంది విధులు నిర్వహించడానికి నానా ఇబ్బందులకు గురయ్యేవారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.8.08 కోట్లతో కలెక్టరేట్‌ను ఆధునీకరించింది. ప్రారంభోత్సవం అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో విద్య, వైద్యం, శాశ్వత అభివృద్ధి పనులకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఏ గ్రామానికి వెళ్లి చూసినా బాగుపడిన పాఠశాలలు, కొత్తగా నిర్మించిన ఆర్‌బీకేలు, సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రేరీలు దర్శనమిస్తున్నాయని చెప్పారు. చంద్రబాబు పాలనలో నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులను చాలెంజ్‌గా తీసుకుని పూర్తి చేస్తూ వస్తున్న విషయం ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కరోనాలాంటి విపత్తుతో రెండేళ్లపాటు ఇంటి నుంచి కాలు బయటకు పెట్టలేని పరిస్థితులు నెలకొన్నా.. ఎంతో అభివృద్ధి చేశామని వివరించారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య పాల్గొన్నారు.

ఆవగింజ సైజులో శివలింగం



ఆవగింజ పక్కన శివలింగం

మండపేటకు చెందిన అండలూరి వీరవెంకట సత్యనారాయణ ఆవగింజ సైజులో జాతి పచ్చరాయితో శివలింగాన్ని రూపొందించారు. తన సూక్ష్మకళా నైపుణ్యంతో రూపొందించిన శివలింగాన్ని శుక్రవారం ప్రదర్శించారు. శివలింగాన్ని ఆవిష్కరించడానికి 3 గంటలు సమయం పట్టిందని సత్యనారాయణ తెలిపారు.

– కపిలేశ్వరపురం (మండపేట)

కోటప్పకొండ సర్వం సిద్ధం

లక్షలాదిగా తరలిరానున్న భక్తులు





కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి ఆలయం

నరసరావుపేట రూరల్: తిరునాళ్ల జాతరకు కోటప్పకొండ సిద్ధమైంది. మహాశివరాత్రి పర్వదినాన త్రికోటేశ్వరుడ్ని దర్శించుకునేందుకు వచ్చే లక్షలాది మంది కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆలయాన్ని పూలతో, విద్యుత్ దీపాలతో ఆలయాధికారులు అలంకరించారు. ఉచిత, ప్రత్యేక, శీఘ్ర, వీఐపీ, అభిషేక దర్శనాల కోసం ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాట్లు చేశారు. ప్రసాదాల కొరత లేకుండా 2.5 లక్షల లడ్డూలు, 1.5 లక్షల అరిసెలను అందుబాటులో ఉంచారు. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, మజ్జిగ, పాలు, బిస్కెట్లు అందజేయనున్నారు. సాయంత్రం కొండ దిగువన జాతర ప్రారంభమవుతుంది. జాగరణ చేసేందుకు భక్తులు లక్షలాదిగా రానున్న నేపథ్యంలో ప్రధాన రోడ్ల వెంట బారికేడ్లు ఏర్పాటు చేశారు. 2.5 లక్షల మంచినీటి ప్యాకెట్లను సిద్ధంగా ఉంచారు. తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యే విధంగా విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. నూతనంగా 20 ట్రాన్స్‌ఫార్మర్స్‌ను ఏర్పాటు చేసింది. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 3వేల మందితో పోలీస్ శాఖ బందోబస్తు నిర్వహిస్తుంది. తిరునాళ్ల కోసం భక్తులను కోటప్పకొండకు చేరవేసేందుకు ఏపీఎస్ఆర్టీసీ నరసరావుపేట నుంచి 185, చిలకలూరిపేట నుంచి 100 బస్సులను కొండకు నడపనుంది. కొండ దిగువ నుంచి పైభాగానికి ఘాట్‌రోడ్డులో నడిపేందుకు 180 టీటీడీ బస్సులను వినియోగించనున్నారు. కోటప్పకొండ తిరునాళ్లలో భారీ విద్యుత్ ప్రభలే ప్రత్యేకత. ప్రభల పండుగగా పిలిచే ఈ తిరునాళ్లలో ఈ ఏడాది 20 భారీ విద్యుత్ ప్రభలు కొలువుదీరనున్నాయి.

నకిలీ ఎస్‌ఐల ఘరానా మోసం

- పోలీసు శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ విశాఖలో నిరుద్యోగులకు వల
- నిందితులను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్





ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): ఎస్సైల వేషమేసి, పోలీసు శాఖలో ఉన్నత ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ విశాఖలో నిరుద్యోగులను మోసం చేసిన వ్యవహారం బయటపడింది. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు, ఘరానా మోసగాడైన హనుమంతు రమేష్, అతని ప్రియురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరూ మరికొంత మందితో కలిసి నిరుద్యోగుల నుంచి దాదాపు రూ.3 కోట్లు వసూలు చేసినట్లు అంచనా. బాధితుల కథనం ప్రకారం.. మోసాలతోనే బతికే హనుమంతు రమేష్ (47) అడవివరంలోని ఆర్‌ఆర్ టవర్స్‌లో ఉంటున్నాడు. అతనికి ఇద్దరు భార్యలు (అక్కచెల్లెళ్లు) ఉండగా ఇటీవల మరో ప్రియురాలితో ఉంటున్నాడు. గత కొంతకాలంగా ప్రియురాలు, మరికొందరితో కలిసి రాష్ట్ర పోలీసు శాఖలో ఉన్నత ఉద్యోగాలు ఇప్పిస్తామని యువకులకు ఆశ చూపించారు. వీరికి పలువురు మధ్యవర్తులు సహకరించారు. హనుమంతు, ప్రియురాలు, మిగతా వారు పోలీసు ఎస్సైల గెటప్‌లో రావడంతో వారంతా నమ్మేశారు. దాదాపు 30 మంది నుంచి రూ.3 కోట్ల వరకు దండుకొని మాయమయ్యారు.

హైదరాబాద్‌లో అదుపులోకి..

బాధితుల ఫిర్యాదు మేరకు ఇటీవల నగర పోలీసులు రంగంలోకి దిగారు. నిందితులు హైదరాబాద్‌లో ఉన్నట్లు పోలీసు విచారణలో తేలింది. పోలీసు కమిషనర్ సూచనలతో టాస్క్‌ఫోర్స్ బృందాలు హైదరాబాద్ వెళ్లి హనుమంతు రమేష్‌ను, అతడి ప్రియురాలిని అదుపులోకి తీసుకున్నాయి. వీరిద్దరినీ గురువారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తీసుకొచ్చారు. అనంతరం నగర పోలీసు కమిషనర్ ఎదుట హాజరుపరిచారు. అనంతరం వారిని రహస్య ప్రాంతానికి తరలించి విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

దుర్గమ్మ సేవలో ఇస్రో చైర్మన్ దంపతులు



సోమనాథ్ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చైర్మన్ ఎస్.సోమనాథ్ దంపతులు గురువారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. దర్శనానికి విచ్చేసిన సోమనాథ్ దంపతులను ఆలయ ఈవో కేఎస్ రామారావు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు. ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

జాతీయ విపత్తుగా పరిగణించాలి



వినతిపత్రాన్ని సమర్పిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో 2023–24వ సంవత్సరంలో నెలకొన్న కరువును కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేఆర్ఎస్ డిమాండ్ చేసింది. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద వినతిపత్రాన్ని సమర్పించిన అనంతరం జిల్లా సంచాలకుడు వీరేష్ మాట్లాడారు. కరువు సహాయక పనులు చేపట్టాలని, నరేగ పనులకు ప్రాధాన్యత కల్పించాలని, పశువులకు పశుగ్రాసం, తాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రాన్ని సమర్పించారు.

రైలు కింద పడి ఉద్యోగి ఆత్మహత్య



మృతి చెందిన వెంకప్పనాయక్

రాయచూరు రూరల్: నగరంలో గురువారం ఓ ప్రభుత్వ ఉద్యోగి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడిని నగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న వెంకప్పనాయక్(60)గా గుర్తించామని, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని, మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం రిమ్స్ కళాశాలకు తరలించినట్లు తెలిపారు.

సిరిధాన్యాలతో ఆరోగ్యం

కంప్లి: పోషకాలు అధికంగా ఉన్న సిరిధాన్యాలను వాడటం వల్ల ఆరోగ్యం అభివృద్ధి చెందుతుందని ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ క్షేత్ర యోజనాధికారి ఎంఏ హాలప్ప తెలిపారు. తాలూకాలోని రామసాగర గ్రామంలో ఏర్పాటు చేసిన సిరిధాన్యాల వినియోగంతో లబ్ధిపై శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు.

కేవైసీ అప్‌డేట్ సాకుతో రూ.4.40 లక్షల వంచన

హుబ్లీ: కేవైసీ అప్‌డేట్ సాకుతో ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకొని రూ.4.40 లక్షలను బదలాయించుకొని వంచించిన ఘటన గురువారం వెలుగు చూసింది. ధార్వాడ విద్యాగిరి రంగారావు దేశాయి బాధితుడు. కేవైసీ అప్‌డేట్ చేయక పోతే మీ బ్యాంక్ ఖాతా బంద్ అవుతుందని గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ చేసి ఆ మేరకు ఖాతా వివరాలు సేకరించి ఓటీపీ తీసుకొని రూ.4.40 లక్షలను తమ ఖాతాలోకి బదలాయించుకొని మోసగించినట్లు బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు తెలిపారు.

మోదీ ప్రధాని కావాలని బైక్ యాత్ర



యాత్ర చేపట్టిన సాధ్వి మాతా రాజ్యలక్ష్మి

రాయచూరు రూరల్: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మూడోసారి కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి పదవిని అలంకరించాలంటూ తమిళనాడుకు చెందిన సాధ్వి మాతా రాజ్యలక్ష్మి బులెట్ యాత్రను చేపట్టారు. గురువారం నగరంలో ఎమ్మెల్యే, జిల్లా బీజేపీ అధ్యక్షుడు శివరాజ్ పాటిల్ స్వాగతం పలికి ఆమెను సన్మానించారు. దేశ వ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో 21 వేల కి.మీ. ప్రయాణించి ప్రచారం చేపట్టారు. ఆమె యాత్ర సురక్షితంగా సాగాలని ఆకాంక్షించారు.

పోకిరీల దాడిలో యువకుడికి గాయాలు



యువకుడిపై దాడి చేస్తున్న పోకిరీలు

హుబ్లీ: వాణిజ్య నగరి హుబ్లీలో పోకిరీల బెడద మళ్లీ మొదలైంది. చిన్న కారణానికి ప్రజలతో ఘర్షణ పడి గొడవ పడటం ఇటీవల సాధారణమైంది. అలాంటి ఓ ఘటన బుధవారం అర్ధరాత్రి వేళ చోటు చేసుకుంది. స్థానిక మంటూరు రోడ్డు గాంధీ ఏకతా కాలనీలో ఓ యువకుడిని పోకిరీల గుంపు రాయితో కొట్టి దాడి చేసి పరారైంది. ఘటనలో గైబుఖాన్ అకిమ్ అనే యువకుడు గాయపడ్డాడు. మణికంఠ, సాహిల్, మరొకరు కలిసి గంజాయి తాగిన మైకంలో గైబుఖాన్‌తో అకారణంగా గొడవకు దిగారు. యువకుడిపై రాయితో దాడి చేసినట్లు బాధితుడు బెడ్డిగేరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడికి కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఈ దాడి దృశ్యాలను స్థానికుడు తన మొబైల్‌లో రికార్డు చేయడంతో వైరల్ అయ్యాయి.

హరోం హర..శంభో శంకర

- శివరాత్రికి శివాలయాలు ముస్తాబు
- తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరణ



అలంకరణలో కోటమల్లేశ్వరుడు



కాగె పార్క్‌లోని బోళాశంకరుని విగ్రహం



హరిహరలోని హరిహరేశ్వర ఆలయం

సాక్షి,బళ్లారి: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం నగరంలో శివాలయాలను ముస్తాబు చేస్తున్నారు. శివరాత్రి అంటేనే శివాలయాల్లో అభిషేకాలు, అర్చనలతో పాటు భక్తులు జాగరణ చేసేందుకు శివాలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. శివరాత్రికి శివాలయాల్లో ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణతో పాటు పచ్చని తోరణాలతో శివాలయాలను తీర్చిదిద్దుతున్నారు. ప్రధానంగా నగరంలోని కోటమల్లేశ్వర స్వామి ఆలయం, నగరేశ్వర స్వామి ఆలయం, కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, సంగమేశ్వర స్వామి ఆలయం, నీలకంఠేశ్వర స్వామి ఆలయం, శనీశ్వర స్వామి ఆలయం తదితర శివాలయాల్లో శివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి బళ్లారి జిల్లాలోని ప్రపంచ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న హంపీలో మహిమాన్వితమైన, సాక్షాత్తు శివుడు లింగ రూపంలో అవతరించారని ప్రతీతి పొందిన విరుపాక్షేశ్వర స్వామి ఆలయంలో కూడా శివరాత్రి జాగరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు కూడా హంపీకి పెద్ద సంఖ్యలో ప్రతి ఏటా విచ్చేస్తున్న తరుణంలో ఈ ఏడాది కూడా శివరాత్రికి హంపీకి విచ్చేస్తారని అంచనా ఉండటంతో ఆ దిశగా ఆలయాన్ని ముస్తాబు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. శివరాత్రి సందర్భంగా చాలా మంది భక్తులు ఉపవాసం ఉంటుండటంతో పలు శివాలయాల్లో రాత్రికి ప్రసాద వినియోగం కూడా ఏర్పాటు చేస్తున్నారు. పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజు శివరాత్రి కావడంతో శివరాత్రి రోజు శివోహం...శివోహం..ఓం నమఃశివాయ అనే నామం మార్మోగేలా భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

హరిహరుల పవిత్ర పుణ్యక్షేత్రమే హరిహర

సాక్షాత్తు పరమ శివుడు, విష్ణువు స్వయంభువుగా అవతరించి భక్తులకు కొంగు బంగారంగా నిలుస్తూ వందల సంవత్సరాలైనా నేటికీ హరిహరలోని హరిహరేశ్వరుని ఆలయం భక్తులను ఆకర్షిస్తోంది. ప్రముఖంగా ఈ ఆలయ నిర్మాణం శిల్పుల ప్రతిభను చాటిచెబుతోంది. ఈ ఊరిలో హరి, హరుడు ఇద్దరు కొలువుదీరడంతో ఈ గ్రామానికి హరిహరగా పేరు వచ్చిందని ప్రతీతి. దావణగెరె జిల్లాలోని హరిహర పురాతన ఊరుగా, ప్రముఖ యాత్రా స్థలంగా వెలుగొందుతోంది. ఈ ఊరును హరీషపుర, గుహరణ్య క్షేత్రం, కూడలూరు, కూదూరు అని శాసనంలో రకరకాలుగా పిలుచుకుంటుంటారు. హరిహరులు ఒక్కటిగా గుహాసుర అనే రాక్షసున్ని సంహరించి పాతాళానికి పంపించిన పుణ్యక్షేత్రమిదే. ఇక్కడ పారే తుంగభద్ర నదికి సమీపంలో మరొక చిన్న పాయ హరిద్రా నది కలవడంతో కూడలూరుగా పేరు వచ్చింది. ఈ ఊరుకు సుమారు 1500 ఏళ్లకు పైగా ఘనమైన చరిత్ర ఉంది. ఆలయంలో బయట, హరిహర చుట్టుపక్కల గ్రామాల్లో 50కి పైగా శాసనాలు లభించాయి. ఈ శాసనాల్లో కొన్ని ప్రసిద్ధంగా వాడుకలో ఉంటూ చాళుక్యుల కాలం నుంచి విజయనగర రాజుల కాలం వరకు వ్యాపించాయి.

సాక్షాత్తు స్వయంభువుగా శివుడు

సాక్షాత్తు శివుడు స్వయంభువుగా, హరిహరేశ్వర మూర్తిగా అవతరించాడని క్రీస్తు శకం 694లో హిమ్మడి పులకేశి మనవడు వినయాదిత్య శాసనం చాటుతోంది. హరిహరేశ్వర ఆలయాన్ని భారీ ఆకారంలో వందలాది బంగారు కలశాలతో నిర్మించారు. గర్భగుడిలో హరిహరేశ్వర స్వామి భిన్నమైన విగ్రహం ఉంది. ఇటీవల త్రిమూర్తికి వజ్రలేపనం చేయించి తిరిగి పూజలకు అవకాశం కల్పించారు. ఈ ఆలయానికి రెండువైపుల ఉత్తర, దక్షిణ దిక్కుల్లో రెండు ద్వారాలున్నాయి. దేవస్థాన రంగమంటపంలో 68 స్తంభాల వరుసలు ఉన్నాయి. ఈ స్తంభాలు ఎంతో నునుపుగా, సౌందర్యంగా ఉన్నాయి. ఆధునిక యంత్రాలు లేని రోజుల్లోను ఇలాంటి స్తంభాలను నిర్మించడంలో శిల్పకారుల అద్భుత ప్రతిభను కనిపిస్తోంది. హొయ్సళుల వాస్తు, శిల్ప సౌందర్య కళకు ఆదర్శంగా నిలుస్తోన్న ఈ ఆలయాన్ని నిర్మించి 800 ఏళ్లు గడిచిపోయాయని చరిత్ర ద్వారా తెలుస్తోంది.

శివరాత్రికి హరిహరకు భక్తుల తాకిడి

శత్రురాజులు, విదేశీయుల దాడులకు గురై అక్కడక్కడ ఆలయం బయట ఉన్న శిల్పాలు దెబ్బతిన్నా కూడా మొత్తం మీద ఆలయం భక్తులు పాలిట సౌందర్యగని. భావితరాలకు ఈ ఆలయ నిర్మాణమై వేల సంవత్సరాలైనా కూడా అద్భుత సౌందర్యానికి ప్రతీకగా చెప్పవచ్చు. హొయ్సళుల వాస్తు శిల్ప కళా సౌందర్యానికి ప్రతీకగా అరుదైన విన్యాసాలతో నిర్మించారు. ఆలయంలోని రంగమంటంలోని ఎంతో సొగసైన రమణీయమైన 68 స్తంభాల వరస కనువిందు చేస్తోంది. శివరాత్రికి శివాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారు. అందులో సాక్షాత్తు శివుడు, విష్ణువు స్వయంభువుగా అవతరించిన పుణ్యక్షేత్రాలకు భక్తులు మరింత పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయాలను సందర్శించి పునీతులవుతుంటారు. శివరాత్రి వచ్చిందంటే హరిహరకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి హరిహరేశ్వరులను దర్శించుకుంటారు.

శివరాత్రికి మల్లికార్జున ఆలయం సిద్ధం

రాయచూరు రూరల్: జిల్లా కేంద్రానికి ఐదు కి.మీ.ల దూరంలో ఉన్న బోళమానుదొడ్డిలోని పురాతన మల్లికార్జున భ్రమరాంబిక ఆలయాన్ని విజయ నగర రాజుల పాలనా కాలంలో నిర్మించారని చరిత్ర చెబుతోంది. శ్రీశైలంలో మాదిరిగా మల్లికార్జున విగ్రహం, గణపతి దేవుడు, భ్రమరాంబిక విగ్రహం, అక్కమహాదేవి విగ్రహాలు చూడముచ్చటగా ఉన్నాయి. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు మౌనవ్రతం పాటించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీశైలం వెళ్లలేని వారు బోళమానుదొడ్డి మల్లికార్జున, భ్రమరాంబిక ఆలయాన్ని దర్శించుకుంటారు.

మట్టి తరలింపు అరికట్టాలని డిమాండ్



అధికారికి వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

గంగావతి: తాలూకాలోని సంగాపుర గ్రామ సమీపంలోని లక్ష్మీనారాయణ చెరువులో నుంచి అక్రమంగా సారవంతమైన మట్టిని తరలించడాన్ని అరికట్టాలనే డిమాండ్‌తో ప్రజా సంక్షేమ సమితి నేత బసవరాజ్ మేగళమని ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీనారాయణ చెరువులో ఏర్పడిన పూడికలో సారవంతమైన మట్టిని అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులు జిల్లా, ఇతర జిల్లాల వారు ఇప్పటికే వేలాది ట్రిప్పులు తీసుకెళ్లారన్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లినా వారు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇలాంటి మట్టిని తహసీల్దార్ నేతృత్వంలో రెవెన్యూ శాఖ వారు కాపాడి టెండర్ ద్వారా మట్టిని ఆ ప్రాంత రైతులకే అందజేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


పథకాలపై ప్రచారం అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

గంగావతి: ప్రధాని మోదీ అమలు చేసిన పథకాల గురించి త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మహిళలకు విస్తృత ప్రచారం చేపట్టాలని లోక్‌సభ సభ్యుడి కోడలు మంజుల అమరేష్ కరడి అన్నారు. ఆమె గురువారం కొప్పళ నగరంలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మంటపంలో ప్రధాని మోదీ పాల్గొన్న కార్యక్రమాన్ని టీవీల్లో వీక్షించేందుకు ఏర్పాట్లు చేసిన సందర్భంగా మాట్లాడారు. మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర తన పదేళ్ల అధికార అవధిలో పలు పథకాలను అమలు చేశారన్నారు. కట్టెల పొయ్యాలతో కళ్లు పోగొట్టుకొని అనారోగ్యం పాలవుతున్న మహిళలను కాపాడేందుకు అనిల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్, సిలిండర్ ప్రతి పేద ఇంటికీ అందజేశారని ఆమె తెలిపారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం పలు రకాల సహాయధన పథకాలను అమలు చేశారన్నారు. అందువల్ల మరో సారి నరేంద్ర మోదీని ప్రధానిని చేయాలన్న సంకల్పంతో ప్రతి మహిళా ఓటు వేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

హంపీ ప్రాజెక్టుకు శంకుస్థాపన భేష్



మాట్లాడుతున్న ఎంపీ దేవేంద్రప్ప

హొసపేటె: కేంద్ర ప్రభుత్వ అవార్డు పొందిన స్వదేశ్ దర్శన్ 2.0 ప్రాజెక్టు లాంచ్ హంపీ పరిసరాల్లో ఘనంగా జరిగింది. హంపీలోని విరుపాక్షేశ్వర ఆలయం ఎదురుగా గురువారం ప్రత్యేక ప్రసార కార్యక్రమం జరిగింది. బళ్లారి ఎంపీ వై.దేవేంద్రప్ప, కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ హంపీకి మౌలిక వసతులు కల్పించడం తమ ప్రాధాన్యత అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం హంపీ అభివృద్ధికి సహకరిస్తుందన్నారు. ఇప్పటికే హంపీకి రవాణా సౌకర్యం ఏర్పాటు చేశారు. దీంతో పాటు మౌలిక వసతుల కల్పన ప్రణాళిక రూపొందిస్తున్నారు. వీధి వ్యాపారాలకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లాకు విధేయులైన అధికారులు రావడంతో పనులన్నీ సాఫీగా సాగుతాయన్నారు. జిల్లాధికారి దివాకర్, జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు, అసిస్టెంట్ కమిషనర్ మహమ్మద్ అలీ అక్రం షా, పర్యాటక శాఖ డీడీ ప్రభులింగ తాళికేరి పాల్గొన్నారు.

కరువు నివారణలో సర్కార్ విఫలం



మాట్లాడుతున్న రవికుమార్

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి సిద్దరామయ్య కరువు సహాయక పనులు చేపట్టడంలో పూర్తిగా విఫలం అయ్యారని విధాన పరిషత్ చీఫ్ విప్ రవికుమార్ ఆరోపించారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కరువు నివారణకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగ పరచుకోవడంలో విఫలమైందన్నారు. 7408 గ్రామాలు, 1115 వార్డులు, 90 తాలూకాల్లో నీటి ఎద్దడి నెలకొందని, ఇందుకోసం రూ.68 కోట్లు విడుదల చేసినా ప్రభుత్వం సద్వినియోగం చేసుకోలేదన్నారు. పైగా నిధుల కోసం కేంద్రం వైపు వేలెత్తి చూపడం తగదన్నారు. సీఎం, మంత్రివర్గ సహచరులు తమ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు.

చెత్త సేకరణ కేంద్రానికి శ్రీకారం

శ్రీనివాసపురం: పట్టణంలో తిరిగి ఉపయోగించగలిగే చెత్తను వేయడం కోసం పురసభ ఆధ్వర్యంలో చెత్త సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పురసభ ముఖ్యాధికారి సత్యనారాయణ్ తెలిపారు. గురువారం చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పౌర కార్మికులు వచ్చినప్పుడు పురసభ చెత్త సేకరణ వాహనంలోనే వేయాలన్నారు. నగరాన్ని స్వచ్ఛంగా ఉంచడమే పురసభ ముఖ్య ఉద్దేశం అని, స్వచ్ఛతతో ప్రజలను రోగాల బారిన పడకుండా కాపాడవచ్చన్నారు. పురసభ హెల్త్ ఇన్‌స్పెక్టర్ రమేష్ మాట్లాడుతూ చెత్త సేకరణలో ప్రాధాన్యత మేరకు తిరిగి ఉపయోగించ గలిగే చెత్తను వేరు చేసి రీసైక్లింగ్ చేస్తారన్నారు. పట్టణాన్ని శుభ్రతగా ఉంచడంలో పురసభతో ప్రజలు సహకరించాలని కోరారు.


సమస్యలు పరిష్కరించాలని గని కంపెనీ కార్మికుల వినతి



గోడు వినిపిస్తున్న కార్మికులు

రాయచూరు రూరల్: జిల్లాలోని హట్టి బంగారు గని కంపెనీలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని హట్టి బంగారు గనుల కంపెనీ అధ్యక్షుడు జె.టి.పాటిల్‌ను ఒత్తిడి చేశారు. బుధవారం సాయంత్రం హట్టి బంగారు గని కంపెనీ కార్యాలయంలో ఆయనను కలిసిన కార్మికులు తమ గోడును వినిపించారు. వేతన ఒప్పందం, కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాల విషయంలోని లోపాలను సవరించాలన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, కంపెనీ అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

ఆల్మట్టి డ్యాం నుంచి నీరు విడుదల



ఆల్మట్టి నుంచి నీరు విడుదల చేసిన దృశ్యం

రాయచూరు రూరల్: రాష్ట్రంలో సరైన వర్షాలు కురువక పోవడంతో ఉత్తర కర్ణాటకలో జల క్షామంతో పాటు తాగునీటి ఎద్దడి, విద్యుత్ కొరత నివారణకు ఆల్మట్టి డ్యాం నుంచి 4 టీఎంసీల నీటిని విడుదల చేశారు. బెళగావి ప్రాంతీయ కార్యదర్శి ఆదేశాల మేరకు బుధవారం డ్యాం నీటి విడుదలకు శ్రీకారం చుట్టినట్లు ఇంజినీర్ బసవరాజ్ తెలిపారు. రాయచూరు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం(ఆర్టీపీఎస్), యరమరస్ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం(వైటీపీఎస్)ల నుంచి రాష్ట్రానికి 45 శాతం మేర విద్యుత్‌ను సరఫరా చేసే యూనిట్లలో ఉత్పత్తి సామర్థ్యం పెంపు కోసం ఈ నీటిని విడుదల చేశామన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంజునాథ్

కోలారు: తాలూకాలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ సూచించారు. గురువారం నగరంలోని టీపీ సభాంగణంలో నిర్వహించిన టాస్క్‌ఫోర్సు సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో తీవ్ర సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. అధికారులు కార్యాలయాలు వీడి గ్రామాలకు వెళ్లి తాగునీటి సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకోవాలన్నారు. పశువులకు మేత సమస్య ఎదురుకాకుండా చూడాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే తహసీల్దార్, టీపీ ఈఓలను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. ప్రతి గ్రామంలోను తాగునీటి సమస్యల గురించి అధికారులు సమీక్షించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు ఇవ్వడంతో పాటు ప్రాధాన్యత మేరకు అవసరమైన చోట్ల కొత్తగా బోరుబావులు తవ్వించాలన్నారు. తహసీల్దార్ హర్షవర్ధన్ మాట్లాడుతూ ప్రస్తుతానికి 13 వారాలకు సరిపడా 34 వేల టన్నుల పశువుల మేత నిల్వ ఉందన్నారు. గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి మూడు నెలలకోసారి శుభ్రం చేయాలని సూచించారు. రక్షిత తాగునీటి యూనిట్లు లేని గ్రామాల్లో కూడా యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నగరసభ కమిషనర్ శివానంద తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాల్లో పండ్ల దుకాణాల తొలగింపు



తొలగింపులో పాల్గొన్న ట్రాఫిక్ పోలీసులు

హొసపేటె: నగరంలోని వివిధ సర్కిళ్లలో పార్కింగ్ స్థలాల్లోని పండ్ల దుకాణాలను పోలీసులు తొలగించారు. వీధి పక్కన పండ్ల దుకాణాలతో వ్యాపారం చేస్తుండగా పార్కింగ్ సమస్య ఏర్పడింది. పార్కింగ్ స్థలాలు మినహా ఇతర ప్రాంతాల్లో వ్యాపారం చేయాలని పోలీసులు ఆదేశించారు. హొసపేటెలోని వివిధ సర్కిళ్లలో వాహనాల మళ్లింపు పాయింట్ల వద్ద దుకాణాలు 50 అడుగులు వదిలేయాలని ఆదేశించారు. మరో రోడ్డు పక్కన పండ్లు విక్రయించడంతో ట్రాఫిక్ సమస్య నెలకొంది. రెండు రోజుల సమయం ఇచ్చినా పోలీసులు ఇప్పుడు ఖాళీ చేశారు. సోగ మార్కెట్, రామ టాకీస్ సర్కిల్, సాయిబాబా సర్కిల్, బ్రహ్మకుమారి సర్కిళ్లతో పాటు వివిధ ప్రాంతాల్లో ఖాళీ చేయించారు. సంచార పోలీస్ స్టేషన్ ఎస్ఐలు మునిరత్నం శివకుమార్, ఏఎస్‌లు గడిమళియప్ప, కోరిక్రిష్ణయ్య, రఫీక్, దుర్గప్ప, గార్డు హులియప్ప, ప్రభురెడ్డి దగ్గర ఉండి చర్యలు చేపట్టారు.

ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో నా గెలుపు ఖాయం



మాట్లాడుతున్న నారా ప్రతాప్‌రెడ్డి

హొసపేటె: ఈ సారి ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను గెలుపొందడం ఖాయమని స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఈశాన్య పట్టభద్రుల ఎన్నికల్లో తాను జేడీఎస్ నుంచి పోటీ చేశానన్నారు. ఈసారి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలబడతానన్నారు. హైదరాబాద్ కర్ణాటక ప్రాంతంలో జేడీఎస్ పార్టీకి అంతగా బలం లేదన్నారు. అందుకే గత ఎన్నికల్లో తాను మూడో స్థానంలో నిలిచానన్నారు. ఈ సారి బళ్లారి, విజయనగర అఖండ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు కొత్త ఓటర్ల నమోదు సంఖ్య పెరిగిందన్నారు. తాను ఈ ఎన్నికల్లో గెలుపొందితే ముఖ్యంగా ప్రతి ప్రభుత్వ పాఠశాల రూపు మారుస్తానన్నారు. మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లతో పాటు అన్ని విధాలుగా మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. అనంతరం ఆప్ రాష్ట్ర నేత ముఖ్యమంత్రి చంద్రు వచ్చే ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాప్‌రెడ్డికి మద్దతు అందిస్తోందన్నారు. రాష్ట్రంలో తప్పనిసరిగా 60 శాతం వరకు కన్నడ భాష, 40 శాతం వరకు మాత్రమే ఇంగ్లిష్ భాష వాడుకలో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం



మాట్లాడుతున్న జేడీఎస్ నాయకులు

కేజీఎఫ్: జేడీఎస్, బీజేపీ మైత్రిపై పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని, ఇరు పార్టీల ఉమ్మడి అభ్యర్థి విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని జేడీఎస్ నాయకులు తెలిపారు. గురువారం జేడీఎస్ నాయకుడు సురేష్‌కుమార్ నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ తాలూకా అధ్యక్షుడు దయానంద్ మాట్లాడుతూ కేజీఎఫ్ శాసనసభ పరిధిలో లోక్‌సభ ఉమ్మడి అభ్యర్థికి అత్యధిక ఓట్లు వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఇప్పటికే నగర, గ్రామీణ ప్రాంతాల్లో కార్యకర్తల అభిప్రాయాలను సేకరించారు. కార్యకర్తలందరూ ఉమ్మడి అభ్యర్థి విజయానికి కట్టుబడి ఉన్నారన్నారు. తాలూకాలో జేడీఎస్ పార్టీని మరింత బలపరుస్తామన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని గ్రామీణ స్థాయి నుంచి పటిష్టం చేస్తామన్నారు. నగరంలో జేడీఎస్‌కు పూర్వవైభవం తేవడానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ఫిర్కా స్థాయిలో సమావేశాలు నిర్వహించి పార్టీ కేడర్‌లో శక్తిని నింపుతామన్నారు. జేడీఎస్ నాయకులు పరంధామన్, జీపీకే శ్రీనివాస్, ఎస్.శేఖర్, కాణికరాజ్, దండపాణి, జగన్నాథన్ పాల్గొన్నారు.

చాక్లెట్లనుకొని మాత్రలు మింగి బాలుడి మృతి

సాక్షి,బళ్లారి: చాక్లెట్లు అనుకొని ఓ బాలుడు మాత్రలు మింగి మృతి చెందిన ఘటన చిత్రదుర్గ జిల్లాలో చోటు చేసుకుంది. కడబనహట్టి గ్రామానికి చెందిన హృత్విక్(4) అనే బాలుడు నాలుగు రోజులుగా ఇంట్లో ఆటలాడుకుంటూ మాత్రలు మింగారు. ఇటీవల బాలుడి తల్లికి శస్త్రచికిత్స జరగడంతో ఆమెకు వైద్యులు మాత్రలను ఇచ్చారు. ఆమె వాటిని మింగేందుకు తన పక్కనే పెట్టుకుంది. అయితే ఆమె పని మీద ఉండగా, బాలుడు ఆ మాత్రలను చాక్లెట్‌లుగా భావించి మింగడంతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్థానిక ఆస్పత్రిలో చేర్పించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరు విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం బాలుడు మృతి చెందాడు. ఈ ఘటనతో బాలుడి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇంట్లో చిన్న పిల్లలు ఉన్నప్పుడు తల్లిదండ్రులు మాత్రలను ఎక్కడబడితే అక్కడ పెట్టకూడదని పలువురు వైద్యులు సూచిస్తున్నారు. ఏ మాత్ర అయినా మోతాదు కన్నా ఎక్కువగా తీసుకుంటే ప్రమాదకరమని సూచిస్తున్నారు.

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కరెమ్మ, బీఈఓ తదితరులు

రాయచూరు రూరల్: జిల్లాలోని దేవదుర్గ తాలూకాలో ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఎమ్మెల్యే కరెమ్మ నాయక్, తాలూకా విద్యాశాఖాధికారి సుఖదేవ్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ముఖ్యంగా తాలూకాలోని కరిగుడ్డ, ముర్కిదొడ్డి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసి ఆయా పాఠశాలల్లోని వంటశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పర్యవేక్షించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కంప్లి: హడగలి నియోజకవర్గం పరిధిలో మొత్తం రూ.81 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కృష్ణానాయక్ గురువారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాలూకాలోని జెడ్పీ స్థానాలైన హొళలు, హిరేహడగలి, సోగి, ఇటిగి తదితర పట్టణాల్లో అభివృద్ధి పనులు జరిపినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు చిల్లిగవ్వ కూడా నిధులు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయకుండా ఎందుకింత తారతమ్యం చూపుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి చేయడం ప్రభుత్వ బాధ్యత అయినా ఇలా తారతమ్యం చేయడం తగదన్నారు.

నేటి నుంచి గ్రామీణ క్రీడా పోటీలు

గంగావతి: ఆనెగుంది ఉత్సవంలో భాగంగా శుక్రవారం నుంచి పలు రకాల గ్రామీణ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు కన్నడ సంస్కృతి శాఖ అధికారి తెలియజేశారు. కబడ్డీ, ఖోఖో, కుస్తీ లాంటి పలు రకాల గ్రామీణ క్రీడా పోటీల్లో పాల్గొనే వారు తక్షణమే తమ శాఖ సిబ్బందిని కాని, ఉత్సవ నిర్వాహకులను కాని సంప్రదించాలని తెలిపారు.

వేడుకగా కుంభోత్సవం



ఉడుసలమ్మ దేవి ఆలయం

కంప్లి: బాదనహట్టి గ్రామంలో కన్యను తీసుకొచ్చిన వారు కన్యను ఇచ్చిన వారు కుటుంబ సమేతంగా విచ్చేసి దేవికి కుంభం సమర్పించడం ఆనవాయితీ. కుంభోత్సవం ఆకర్షణీయంగా సాగింది. అన్నం, ఓళిగలు కలిపి 101 కేజీ తూకం ఉన్న మేటి కుంభాన్ని తలపై ఎత్తుకొని దేవరకు నాయక ప్రజలు తీసుకొచ్చారు. ఉడుసలమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది.



కుంభాలను తీసుకొస్తున్న దృశ్యం